www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI


ఆత్మీయ ఆహ్వానం
తెలంగాణ ప్రియతమ ముఖ్యమంత్రి
శ్రీ ఎనుముల రేవంత్ రెడ్డి గారి
అభినందన సభ
శ్రీ అల్లూరి సీతారామరాజు గారు
క్షత్రియ సేవా సమితి (తెలంగాణ & ఆంధ్రప్రదేశ్)

ఆదివారం | 18-8-2024 | పేజీలు: 16 +28 పేజీల ఆదివారం అనుబంధం | వెల (Price) : Rs. 8.00 | సంపుటి (Volume) : 65 సంచిక (Issue) : 124 | శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, వర్షరుతువు, శ్రావణమాసం, శుక్లపక్షం; తిథి: చతుర్దశి తె. 3.05 తదుపరి పౌర్ణమి; నక్షత్రం: ఉత్తరాషాఢ ఉ. 10.15 తదుపరి శ్రవణం వర్జ్యం: మ. 1.54-3.21, దుర్ముహూర్తం: సా. 4.54-5.44, అమృతఘడియలు: రా. 10.40-12.07, రాహుకాలం: సా. 4.30-6.00, సూర్యోదయం: 6.02, సూర్యాస్తమయం: 6.35 | హైదరాబాద్ సిటీ*

Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru



ఆత్మీయ ఆహ్వానం

స్వేచ్ఛ వైపు నడిచి ప్రజలను నడిపించిన నాయకుడు
సామాన్యుల కలల నౌక కదిలించిన నావికుడు
ఉద్యమాన ఉసురారిన కుటుంబాలకు అండగ నిలిచిన సైనికుడు
అన్నం పెట్టే రైతన్నకు వెన్నెముకలా నిలిచిన శ్రామికుడు

తెలంగాణ ప్రియతమ ముఖ్యమంత్రి

శ్రీ ఎనుముల రేవంత్ రెడ్డి గారి

అభినందన సభ

విశిష్ట అతిథులు



శ్రీ భూపతిరాజు శ్రీనివాస వర్మ గారు
కేంద్ర భారీ పరిశ్రమలు & ఉక్కు శాఖ సహాయ మంత్రి వర్యులు



శ్రీ నడింపల్లి బోసురాజు గారు
చిన్న నీటిపారుదల మరియు సైన్స్ అండ్ టెక్నాలజీ మంత్రి వర్యులు, కర్ణాటక



శ్రీ అల్లూరి సీతారామరాజు గారు
పారిశ్రామికవేత్త, హైదరాబాద్

ఈ రోజు మ॥ 2.00 గం.లకు, జి ఎం సి బాలయోగి ఇండోర్ స్టేడియం, గచ్చిబౌలి

ఆహ్వానించు వారు

శ్రీ పేరిచర్ల నాగరాజు
అధ్యక్షులు

డా. నడింపల్లి నాని రాజు
ప్రధాన కార్యదర్శి

క్షత్రియ సేవా సమితి (తెలంగాణ & ఆంధ్రప్రదేశ్)

క్షత్రియ టవర్స్, నల్లకుంట, హైదరాబాద్ - 500044 | ఫోన్ నెం: 040 27664358 4359

బిజినెస్

హైదరాబాద్ ● ఆదివారం 18 ఆగస్టు 2024

ఆదిత్య బిర్లా సన్ లైఫ్ నిఫ్టీ డిఫెన్స్ ఇండెక్స్ ఫండ్

ఆదిత్య బిర్లా సన్ లైఫ్ ఏఎంసీ లిమిటెడ్ (ఏబీఎస్ఎల్ఏఎంసీ).. నిఫ్టీ ఇండియా డిఫెన్స్ ఇండెక్స్ ఫండ్ పేరుతో కొత్త ఫండ్‌ను తీసుకువచ్చింది. ఇది ఓపెన్ ఎండెడ్ ఇండెక్స్ ఫండ్. దీనికి నిఫ్టీ ఇండియా డిఫెన్స్ ఇండెక్స్ బెంచ్‌మార్క్‌గా ఉండనుంది. ఇండెక్స్ ఆధారిత పెట్టుబడుల ద్వారా దీర్ఘకాలంలో మెరుగైన రిటర్నులు అందించే విధంగా ఈ ఫండ్‌ను రూపొందించింది. ఏరోస్పేస్, షిప్‌బిల్డింగ్, డిఫెన్స్ ఎలక్ట్రానిక్స్ విభాగాల్లో కార్యకలాపాలు సాగిస్తున్న కంపెనీల్లో ఈ ఫండ్ పెట్టుబడులు పెట్టనుంది. ఈ ఫండ్ ముగింపు తేదీ ఈ నెల 23. కనీస పెట్టుబడి రూ.500.

డీఎస్‌పీ ఎంఎఫ్ ఈటీఎఫ్, ఇండెక్స్ ఫండ్

డీఎస్‌పీ మ్యూచువల్ ఫండ్.. భారత్‌లోనే తొలిసారిగా నిఫ్టీ టాప్ 10 ఈక్వల్ వెయిట్ ఇండెక్స్ ఫండ్, ఈటీఎఫ్ ఫండ్‌ను విడుదల చేసింది. నిఫ్టీ మార్కెట్ క్యాపిటలైజేషన్ ఆధారంగా టాప్ 10 భారతీయ కంపెనీల్లో ఈ ఫండ్స్ సమానంగా ఇన్వెస్ట్ చేస్తాయి. ఈ న్యూ ఫండ్ ముగింపు తేదీ ఈ నెల 30. ఈ ఫండ్‌కు నిఫ్టీ టాప్ 10 ఈక్వల్ వెయిట్ టీఆర్ఐ బెంచ్‌మార్క్‌గా ఉండనుంది. డీఎస్‌పీ నిఫ్టీ టాప్ 10 ఈక్వల్ వెయిట్ ఇండెక్స్ ఫండ్ కనీస పెట్టుబడి రూ.100. కాగా ఈటీఎఫ్ ఫండ్ కనీస పెట్టుబడి రూ.5,000. దీర్ఘకాలంలో లాభాలు ఆర్జించాలనుకునే వారికి ఈ ఫండ్స్ అనుకూలంగా ఉండనున్నాయి.

2030 నాటికి అదనంగా

14.8 కోట్ల ఉద్యోగాలు అవసరం

ఉపాధి కల్పనలో భారత్ వెనుకబడింది.. మరిన్ని కీలక సంస్కరణలు చేపట్టాలి

- విద్యా వ్యవస్థను పునరుద్ధరించాలి..
- ప్రైవేట్ పెట్టుబడులు మరింత పెరగాలి..
- పన్నుల పరిధిని విస్తృతం చేయాలి..
- ఐఎంఎఫ్ డిప్యూటీ ఎండీ గీతా గోపీనాథ్



న్యూఢిల్లీ: ఉద్యోగాల కల్పన విషయంలో భారత్ జీ-20 సభ్య దేశాలన్నింటికంటే వెనకబడిందని అంతర్జాతీయ ద్రవ్య నిధి (ఐఎంఎఫ్) డిప్యూటీ మేనేజింగ్ డైరెక్టర్ గీతా గోపీనాథ్ అన్నారు. దేశ జనాభా వృద్ధి దృష్ట్యా, 2030 నాటికి 14.8 కోట్ల అదనపు ఉద్యోగాలు కల్పించాల్సిన అవసరం ఉందని ఆమె పేర్కొన్నారు. ఢిల్లీ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్‌లో శనివారం నిర్వహించిన డైమండ్ జూబ్లీ ఉత్సవాల కార్యక్రమంలో గీతా గోపీనాథ్ ప్రసంగించారు. ఆ సందర్భంగా ఆమె ప్రస్తావించిన మరిన్ని ముఖ్యాంశాలు..

● 2010తో ప్రారంభమైన దశాబ్దంలో భారత్ సగటున 6.6 శాతం జీడీపీ వృద్ధిని నమోదు చేయగా.. ఈ కాలానికి ఉద్యోగాల కల్పన రేటు మాత్రం 2 శాతానికి పరిమితమైంది. జీ 20లోని ఇతర దేశాలతో పోలిస్తే భారత ఉద్యోగాల కల్పన చాలా తక్కువగా ఉంది.

● జనాభా వృద్ధికి సంబంధించి భారత అంచనాలను బట్టి చూస్తే, 2030 నాటికి అదనంగా 6 కోట్ల నుంచి 14.8 కోట్ల ఉద్యోగాలు సృష్టించాల్సిన అవసరం ఉంది. ప్రస్తుతం 2024 సంవత్సరంలో ఉన్నాం. కాబట్టి, వచ్చే ఆరేళ్లలో భారీ స్థాయిలో ఉద్యోగాల కల్పన జరపాల్సి ఉంది.

● భారీ స్థాయిలో ఉద్యోగాలు సృష్టించేందుకు భూ సంస్కరణలు, కొత్త కార్మిక చట్టాలను అమలు చేయాల్సి ఉంటుంది. దేశంలో ప్రైవేట్ పెట్టుబడులూ ప్రస్తుత 7 శాతం వృద్ధికి అనుగుణంగా లేవు. కాబట్టి, ప్రైవేట్ ఇన్వెస్ట్‌మెంట్లను మరింత పెంచాల్సిన అవసరం ఉంది. ప్రభుత్వం మాత్రం మౌలికాభివృద్ధి కోసం భారీగా పెట్టుబడులు పెడుతోంది.

● దేశ కార్మికశక్తి నైపుణ్యాన్ని మెరుగుపర్చేందుకు విద్యా వ్యవస్థను పునరుద్ధరించాలి. అలాగే, దేశంలో వ్యాపార నిర్వహణను మరింత సులభతరంగా మార్చడంతో పాటు నియంత్రణ వ్యవస్థలను మెరుగుపర్చాలి. పన్నుల పరిధిని విస్తృతం చేయాల్సిన అవసరం ఉంది.

● ప్రస్తుత గరిష్ఠ వృద్ధి పథకంలో నిలకడగా కొనసాగడంతో పాటు కోట్లలో ఉద్యోగాల కల్పనకు మరిన్ని కీలక సంస్కరణలు చేపట్టాల్సిన అవసరం ఉంది. అంతర్జాతీయ సరుకు రవాణా వ్యవస్థలో భారత్ కీలకంగా మారాలంటే దిగుమతి సుంకాలను తగ్గించాల్సి ఉంటుంది.

● పన్ను విషయంలో భారత్ కూడా ఇతర వర్ధమాన దేశాల స్థాయిలోనే ఉంది. ప్రత్యక్ష పన్నుల కంటే పరోక్ష పన్నుల రూపంలోనే ప్రభుత్వానికి అధిక ఆదాయం సమకూరుతోంది. వ్యక్తిగత ఆదాయ పన్ను పరిధిని మరింత విస్తృతం చేయడం ద్వారా ఆదాయం పెంచుకోవచ్చని వర్ధమాన దేశాలకు సూచిస్తున్నాం.

● పన్ను ఆదాయాన్ని పెంచుకునేందుకు జీఎస్‌టీ రేట్లను మరింత హేతుబద్ధీకరించడంతో పాటు నిబంధనలను సరళీకరించాల్సిన అవసరం ఉంది. తద్వారా స్థూల జాతీయోత్పత్తి (జీడీపీ)ని మరో 1.5 శాతం మేర పెంచుకునే అవకాశం ఉంటుంది.

మరిన్ని మార్గాల్లో ఐఎంఎఫ్‌తో భాగస్వామ్యం

సీతారామన్

గీతా గోపీనాథ్ శనివారం సీతారామన్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఐఎంఎఫ్‌తో మరింతగా భాగస్వామ్యమయ్యేందుకు మరిన్ని మార్గాలను అన్వేషించేందుకు భారత్ సిద్ధంగా ఉందని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఈ సందర్భంగా అన్నారు. ఆర్థిక స్థిరీకరణ లక్ష్యాల సాధనకు అనుగుణంగా కేంద్ర ప్రభుత్వం విధానపరమైన చర్యలు కొనసాగిస్తున్నందుకు సీతారామన్‌ను గోపీనాథ్ అభినందించారు.

బ్యాంక్ డిపాజిట్ల మొత్తం సొమ్ములో మహిళా ఖాతాదారుల వాటా 21%

బ్యాంక్ ఖాతాల్లో 36% మహిళలవి: ఎన్ఎస్ఓ

న్యూఢిల్లీ: దేశంలోని మొత్తం బ్యాంక్ ఖాతాల్లో మహిళలవి 36 శాతమని జాతీయ గణాంకాల కార్యాలయం (ఎన్ఎస్ఓ) తాజా నివేదిక వెల్లడించింది. కానీ, దేశంలోని బ్యాంక్ ఖాతాల్లో జమైన మొత్తం డిపాజిట్లలో మహిళా ఖాతాదారుల వాటా 21 శాతమేనని తెలిపింది. ఎన్ఎస్ఓ డేటా ప్రకారం.. 2023 మార్చి నాటికి దేశంలో మొత్తం 252 కోట్ల బ్యాంక్ ఖాతాలుండగా.. అందులో 91.77 కోట్ల ఖాతాలు (36.4 శాతం) ఖాతాలు మహిళలవి. కాగా, మొత్తం బ్యాంక్ అకౌంట్లలోని రూ.187 లక్షల కోట్ల సొమ్ములో మహిళల ఖాతాదారులకు చెందినవి రూ.39 లక్షల కోట్లు. అనగా 20.8 శాతానికి సమానం. మరో ఆసక్తికరమైన విషయమేమిటంటే, మహిళలు, పురుషుల బ్యాంక్ డిపాజిట్ల సొమ్ములో అంతరం గ్రామాల్లో పోలిస్తే, మెట్రో నగరాల్లోనే అధికం. మెట్రో నగరాలకు చెందిన బ్యాంక్ బ్రాంచ్‌ల్లోని మొత్తం డిపాజిట్లలో కేవలం 16.5 శాతం (రూ.1.9 లక్షల కోట్లు) మాత్రమే మహిళవి. కాగా, గ్రామీణ ప్రాంతాల బ్రాంచ్‌ల్లో ఈ వాటా 30 శాతం (రూ.5.91 లక్షల కోట్లు)గా ఉంది. గ్రామాలు, సెమీ-అర్బన్ ప్రాంతాల్లో అధిక శాతం జన్ ధన్ ఖాతాలు మహిళల పేరిట ఉండటం ఇందుకు కారణం కావచ్చని పేర్కొంది. ప్రతి నలుగురు బ్యాంక్ ఉద్యోగుల్లో ఒకరు మహిళని ఎన్ఎస్ఓ నివేదిక వెల్లడించింది. బ్యాంక్‌ల్లోని మహిళా ఉద్యోగుల సంఖ్య 4.41 లక్షలుగా ఉండగా.. 13.2 లక్షల మంది పురుష ఉద్యోగులు పని చేస్తున్నారు. 34,879 మంది మహిళా ఉద్యోగులు సీనియర్ మేనేజ్‌మెంట్ పదవుల్లో ఉండగా.. 1.86 లక్షల మంది పురుష ఉద్యోగులు ఈ పొజిషన్‌లో ఉన్నట్లు ఎన్ఎస్ఓ తెలిపింది.



ఆంధ్రప్రదేశ్, పశ్చిమగోదావరి జిల్లాలోని భీమవరంలో కెనరా బ్యాంక్ రీజినల్ కార్యాలయాన్ని బ్యాంక్ ఎండీ, సీఈఓ కే. సత్యనారాయణ రాజు శనివారం నాడు లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన ఖాతాదారులకు బ్యాంక్ అందిస్తున్న వివిధ పథకాలు, సాధించిన అభివృద్ధి గురించి వివరించారు. బ్యాంకుల విలీనం అనంతరం కెనరా బ్యాంక్ వ్యాపారం రూ.16 లక్షల కోట్ల నుంచి రూ.23 లక్షల కోట్లకు పెరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో బ్యాంక్ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

వస్తు సేవల పన్ను - వడ్డీ కట్టనవసరం లేని సందర్భాలు..

జీఎస్‌టీ చట్టంలో కొన్ని ఉల్లంఘనలకు ముఖ్యంగా చెల్లించాల్సిన పన్ను సకాలంలో చెల్లించకపోయినా లేదా చెల్లించాల్సిన పన్ను కంటే తక్కువ కట్టినా, అర్హత ఉన్న క్రెడిట్ కంటే ఎక్కువ తీసుకున్నా లేదా రివర్స్ చేయాల్సిన మొత్తం కంటే తక్కువ రివర్స్ చేసినా.. ఇలా వివిధ సందర్భాల్లో అసలుతో పాటుగా వడ్డీ కూడా చెల్లించాల్సి ఉంటుంది. అయితే, పన్ను చెల్లింపుదారుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని కొన్ని సందర్భాల్లో వడ్డీ నుంచి మినహాయింపు ఇవ్వటం జరిగింది. ఈ వడ్డీ మినహాయింపు లేదా వెసులుబాటు ఏ సందర్భాల్లో వర్తిస్తుంది? దీనికి గల నియమ నిబంధనలు ఏమిటి? తదితర వివరాలు మీ కోసం..

మొదటిది, పన్ను చెల్లింపునకు సబంధించినది. సాధారణంగా చెల్లిచాల్సిన పన్ను ఆలస్యంగా చెల్లించినప్పుడు, ఆలస్యమైన కాలానికి గాను వడ్డీ చెల్లించాల్సి ఉంటుంది. అయితే ఈ పన్ను మొత్తాన్ని ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ (ఐటీసీ) ద్వారా చెల్లిస్తే ఆ మేర వడ్డీ చెల్లించాల్సిన అవసరం లేదు. ఇక్కడ గుర్తు పెట్టుకోవాల్సిన విషయం ఏమిటంటే, రిటర్న్ ఆలస్యంగా దాఖలు చేసినప్పటికీ సంబంధిత నెలకు సంబంధించిన సరఫరాలు లేదా అమ్మకాలు సరిగ్గా చూపించాలి. అంటే ఒక నెలకు సంబంధించిన అమ్మకాలను వేరే నెల రిటర్న్‌లో చూపితే, సదరు పన్నును ఐటీసీ ద్వారా చెల్లించినప్పటికీ వడ్డీ చెల్లించాల్సి ఉంటుంది. ముఖ్యంగా ఈ మినహాయింపు పొందాలంటే చెల్లించాల్సిన పన్నును డిపార్ట్‌మెంట్ ఏదేనీ చర్య తీసుకోవటానికి ముందే చెల్లించాలి. అలాగే ఇటీవల జరిగిన జీఎస్‌టీ కౌన్సిల్ సమావేశంలో ఈ మినహాయింపు ఐటీసీ ద్వారా చెల్లించిన పన్నుకు మాత్రమే కాకుండా నగదు ద్వారా అంటే క్యాష్ లెడ్జర్ ద్వారా జరిపే చెల్లింపులకు వర్తింప చేయాలని ప్రతిపాదించారు. కాకపోతే, రిటర్న్ దాఖలు చేసే గడువు నాటికి క్యాష్ లెడ్జర్‌లో ఉన్న బ్యాలెన్స్‌కు మాత్రమే ఈ మినహాయింపు లభిస్తుంది. ఉదాహరణకు జూన్ నెల రిటర్న్ దాఖలు చేయటానికి గడువు తేదీ జూలై 20. ఈ జూన్ రిటర్న్ ఆలస్యంగా దాఖలు చేసినప్పటికీ సంబంధిత పన్నును మాత్రం జూలై 20 నాటికి ఉన్న బ్యాలెన్స్ ద్వారా చెల్లించినట్లయితే ఎలాంటి వడ్డీ చెల్లించనవసరం లేదు. అయితే, ఈ క్యాష్‌కు సంబంధించిన వడ్డీ మినహాయింపునకు సంబంధిత నోటిఫికేషన్ జారీ కావాల్సి ఉంది.



రాంబాబు గొండాల

మరొక మినహాయింపు.. ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్‌కు సంబంధించినది. ఒక వ్యక్తి అర్హత లేని క్రెడిట్ తీసుకుని కొంతకాలం తర్వాత రివర్స్ చేశాడనుకుందాం. అలాంటి సందర్భంలో ఆ క్రెడిట్ తీసుకున్న తేదీ నుంచి కాకుండా వాడుకున్న తేదీ నుంచి వడ్డీ లెక్కించాలి. ఉదాహరణకు ఒక వ్యక్తి ఒక రూ.లక్ష మేర ఐటీసీని అర్హత లేకున్నా తీసుకున్నాడనుకుందాం. అలా పొరపాటున తీసుకున్న క్రెడిట్‌ను కొంతకాలం తర్వాత రివర్స్ చేశాడనుకుందాం. కానీ, ఇలా తీసుకున్న రూ.లక్ష క్రెడిట్‌ను ఈ మధ్య కాలంలో (తీసుకున్న దగ్గర నుంచి రివర్స్ చేసే వరకు) పన్ను చెల్లింపునకు గానీ ఇతరత్రా చెల్లింపులకు గానీ వాడలేదనుకుంటే తను ఈ రూ.లక్ష మీద ఎలాంటి వడ్డీ చెల్లించనవసరం లేదు. ఒకవేళ రూ.20,000 మేర వాడుకున్నాడనుకుంటే.. వడ్డీ ఈ రూ.20 వేల మీద మాత్రమే చెల్లిస్తే సరిపోతుంది. అది కూడా క్రెడిట్ తీసుకున్న తేదీ నుంచి కాకుండా వాడుకున్న తేదీ నుంచి మాత్రమే చెల్లిస్తే సరిపోతుంది.

ఇక మూడోది.. ఇటీవలి బడ్జెట్‌లో చేసిన ప్రతిపాదన. ఫ్రాడ్ లాంటి మోసపూరిత ఉల్లంఘనలు కాకుండా, సాధారణ ఉల్లంఘనల్లో పన్ను చెల్లింపునకు సంబంధించి ఒక వ్యక్తికి నోటీస్ లేదా ఆర్డర్ అందినప్పుడు సదరు వ్యక్తి ఆ పన్ను మొత్తాన్ని నిర్ణీత గడువు లోపు చెల్లించినప్పుడు దానికి సంబంధించిన వడ్డీ, పెనాల్టీలు చెల్లించనవసరం లేదు. అంటే సంబంధిత నోటీస్ లేదా ఆర్డర్‌లో పన్నుతో పాటు వడ్డీ, పెనాల్టీ ఉన్నప్పటికీ పన్ను మాత్రమే చెల్లిస్తే సరిపోతుంది. ఇది ఎంతో మందికి ఊరట కలిగించే అంశం. అయితే ఈ మినహాయింపు 2017 జూలై నుంచి 2020 మార్చి మధ్య కాలానికి సంబంధించిన డిమాండ్‌లకు మాత్రమే వర్తిస్తుంది. అయితే దీనికి కూడా సంబంధిత నోటిఫికేషన్ జారీ కావాల్సి ఉంది.

గమనిక: కేవలం అవగాహన కల్పించటం కోసం మాత్రమే ఇందులో కొన్ని ముఖ్య విషయాలను ప్రస్తావించటం జరిగింది. పూర్తి వివరాలకు సంబంధిత చట్టాలను క్షుణ్ణంగా పరిశీలించాలి.



బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	72,770 ▲	66,700 ▲	91,000 ▲
ముంబై	70,604 ▼	64,673 ▼	81,510 ▲

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

18వ తేదీ



హైదరాబాద్	445	విజయవాడ	496
వరంగల్	447	గోదావరి	496
చిత్తూరు	493	విశాఖపట్నం	500
		డజను గుడ్లు రూ.	66

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	100	విజయవాడ	108
వరంగల్	100	గుంటూరు	108
కరీంనగర్	100	ఒంగోలు	108
మహబూబ్‌నగర్	100	చిత్తూరు	111
కర్నూలు	100	నెల్లూరు	111
విశాఖపట్నం	104	అనంతపురం	108
గోదావరి	108		

స్పోర్ట్స్

అన్‌క్యాప్‌డ్ ప్లేయర్‌గా ధోనీ?


ఐపీఎల్‌లో అమల్లోకి రానున్న పాత రూల్!



న్యూఢిల్లీ: మాజీ కెప్టెన్ ఎంఎస్ ధోనీ వచ్చే ఏడాది ఐపీఎల్‌లో ఆడతాడా? లేదా? అనేది భారత క్రికెట్ అభిమానుల మదిని తొలిచే సందేహం. దీన్ని నివృత్తి చేసేలా బీసీసీఐ చర్యలు కనిపిస్తున్నాయి. ఎందుకంటే వచ్చే ఏడాది జరిగే ఐపీఎల్ వేలంలో పాత అన్‌క్యాప్‌డ్ నిబంధనను తిరిగి తీసుకొచ్చే అవకాశం ఉందని సమాచారం. అదే జరిగితే.. ఎంఎస్ అన్‌క్యాప్‌డ్ ప్లేయర్‌గా చెన్నై సూపర్ కింగ్స్ తరఫున బరిలోకి దిగే అవకాశం ఉంటుంది. అంతర్జాతీయ అనుభవం లేని దేశవాళీ ప్లేయర్‌ను అన్‌క్యాప్‌డ్ అని పిలుస్తారు. అలాగే అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలికి ఐదు అంతకన్నా ఎక్కువ సంవత్సరాలు గడిచిన క్రికెటర్ కూడా అన్‌క్యాప్‌డ్ కేటగిరీ కిందికే వస్తాడు. అందుకే ఈ రూల్ అమల్లోకి వస్తే ఎక్కువ లాభపడేది సీఎస్‌కేనే. ధోనీ ప్రస్తుత ధర రూ.12 కోట్లు కాగా, రిటైన్ చేసుకుంటే రూ.4 కోట్లు మాత్రమే ఇవ్వాల్సి ఉంటుంది. మిగిలిన సొమ్మును వేలంలో ఇతర ఆటగాళ్ల కోసం వినియోగించుకోవచ్చు. 2008 నుంచి 2021 వరకు ఈ అన్‌క్యాప్‌డ్ రిటెన్షన్ పాలసీ అమల్లో ఉన్నా ఆ తర్వాత బోర్డు తొలగించింది. మరోవైపు ఈ రూల్‌ను అమలు చేయాలంటూ బీసీసీఐకి తాము విజ్ఞప్తి చేయలేదని సీఎస్‌కే సీఈవో కాశీ విశ్వనాథన్ స్పష్టం చేశాడు. ఆ రూల్ ఉండొచ్చని బీసీసీఐ స్వయంగా తమతో చెప్పిందని, కానీ ప్రకటన చేయలేదని అన్నాడు. అంతేకాకుండా ఈసారి ఇంపాక్ట్ ప్లేయర్ నిబంధనను ఎత్తివేయచ్చనే వార్తలు వినిపిస్తున్నాయి.

పంజాబ్ కింగ్స్‌లో లుకలుకలు

కోర్టుకెక్కిన ప్రీతి జింటా



న్యూఢిల్లీ: ఐపీఎల్ ఫ్రాంచైజీ పంజాబ్ కింగ్స్ యాజమాన్యంలో విభేదాలు నెలకొన్నాయి. సహ యజమాని మోహిత్ బర్మన్ తన వాటాలను మరో పార్టీకి అమ్మకుండా నిరోధించాలని కోరుతూ బాలీవుడ్ నటి ప్రీతి జింటా పంజాబ్ కోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. ఈ ఫ్రాంచైజీలో జింటాకు 23శాతం వాటాలుండగా, మిగతా నలుగురి కంటే ఎక్కువగా బర్మన్‌కు 48శాతం వాటా ఉంది. దీంట్లో నుంచి 11.5 శాతం వాటాను యూఎస్‌కు చెందిన కంపెనీకి బర్మన్ అమ్మాలనుకుంటున్నట్టు జింటా ఆరోపిస్తోంది. ముందస్తు ఒప్పందం ప్రకారం ఎవరు వాటాలను అమ్మాలనుకున్నా ప్రస్తుత ప్రమోటర్లకు ముందుగా ఆఫర్ చేయాల్సి ఉంటుంది. వారు కాదంటేనే థర్డ్ పార్టీని సంప్రదించాలి. మరోవైపు ఈ కేసు విచారణ ఈనెల 20న జరుగనుంది.

మీ ప్రేమాభిమానాలు

వినేశ్ ఫొగట్ భావోద్వేగం

వేయి స్వర్ణాలకన్నా మిన్న

స్వదేశం చేరిన రెజ్లర్

అభిమానుల ఘన స్వాగతం



వినేశ్ కంటతడి

న్యూఢిల్లీ: స్టార్ రెజ్లర్ వినేశ్ ఫొగట్ స్వదేశానికి చేరుకుంది. శనివారం ఉదయం ఇక్కడకు చేరుకున్న ఆమెకు విమానాశ్రయంలో ఘన స్వాగతం లభించింది. ఇతర రెజ్లర్లు బజ్‌రంగ్ పూనియా, సాక్షి మాలిక్, కాంగ్రెస్ ఎంపీ దీపేందర్ హుడా, ఖాప్ పంచాయతీ నాయకులతో పాటు అభిమానులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి వినేశ్‌ను పూలదండలతో ముంచెత్తారు. 'నాకు మద్దతుగా నిలిచిన దేశ ప్రజలందరికీ కృతజ్ఞతలు' అని విమానాశ్రయంలో తనను స్వాగతించిన వారినుద్దేశించి వినేశ్ అంది. అక్కడినుంచి ఓపెన్ టాప్ జీపులో ర్యాలీగా బయలుదేరింది. 100 గ్రాముల అధిక బరువుందనే కారణంతో పారిస్ ఒలింపిక్స్ మహిళల 50 కిలోల ఫైనల్‌నుంచి వినేశ్‌ను అనర్హురాలిగా ప్రకటించిన సంగతి తెలిసిందే. నిర్వాహకుల నిర్ణయాన్ని ఆమె క్రీడా మధ్యవర్తిత్వ న్యాయస్థానంలో సవాలు చేస్తూ తనకు రజత పతకం ప్రకటించాలని కోరింది. దానిపై విచారణ, తీర్పు తదితరాల నేపథ్యంలో పారిస్ నుంచి వినేశ్ రాక ఆలస్యమైంది.

'బంగారా'లు సాటిరావు..

విమానాశ్రయం నుంచి తన అభిమానులు పలు వాహనాల్లో వెంటరాగా హరియాణాలోని స్వస్థలం బలాలీకి వినేశ్ బయలుదేరింది. ఢిల్లీలోని ద్వారకా ప్రాంతంలో గల ఓ ఆలయంలో వినేశ్ పూజలు నిర్వహించింది. మార్గమధ్యంలో పలు ప్రాంతాల్లో తనకోసం వేచివున్న మద్దతుదారులను ఆమె కలుసుకుంది. ఢిల్లీ సమీపంలోని బద్లీ గ్రామ వాసులు వినేశ్‌కు అపూర్వ స్వాగతం పలికారు. అది చూసి తీవ్ర భావోద్వేగానికి లోనైన వినేశ్ కంటతడి పెట్టుకుంది. ఈ సందర్భంగా భర్త సోమ్‌వీర్ వినేశ్‌ను ఓదార్చాడు. 'పారిస్ క్రీడల నిర్వాహకులు నాకు బంగారు పతకం ఇచ్చి ఉండకపోవచ్చు. కానీ మీరు నాపట్ల చూపుతున్న ప్రేమ, అభిమానం వేయి ఒలింపిక్ స్వర్ణ పతకాలకు మించినది' అని ఆమె పేర్కొంది. 'ఒలింపిక్ స్వర్ణ పతకం నెగ్గినప్పటికంటే ఎక్కువ ప్రేమాభిమానాలు వినేశ్‌కు లభిస్తున్నాయి' బజ్‌రంగ్ అన్నాడు. కాంగ్రెస్ నాయకుడు దీపిందర్ హుడా విజయానికి చిహ్నమైన గదను వినేశ్‌కు అందజేశారు. 'మా దృష్టిలో నీవు ఎప్పటికీ విజేతవే. ధైర్యం, పరాక్రమం, పట్టుదలతో కోట్లాదిమంది దేశ ప్రజల హృదయాలను గెలుచుకున్నావు. దేశ యువతకు నీవు స్ఫూర్తిప్రదాతవు' అని హుడా ప్రశంసించారు. 'చాలా కాలం తర్వాత వినేశ్ స్వదేశానికి వచ్చింది. అంతేకాదు..ఆమె తీవ్ర భావోద్వేగంతో ఉంది. కొంతకాలం కుటుంబంతో గడిపడితే వినేశ్ స్థిమితపడుతుంది. ఆమె పతకం గెలవలేకపోవచ్చు. కానీ మాకు ఆమె చాంపియనే' అని రియో ఒలింపిక్స్ కాంస్య పతక విజేత సాక్షి మాలిక్ చెప్పింది. ఇక..పారిస్ క్రీడల్లో భారత బృందం డిప్యూటీ చెఫ్ డి మిషన్‌గా వ్యవహరించిన ఒలింపిక్ పతక విజేత, షూటర్ గగన్ నారంగ్ కూడా వినేశ్‌ను విజేతగా అభివర్ణించాడు. 'చాంపియన్‌గా క్రీడా గ్రామంలో అడుగుపెట్టింది. ఆమె ఎప్పటికీ చాంపియనే' అని వినేశ్‌తోపాటు ఢిల్లీ వచ్చిన నారంగ్ పేర్కొన్నాడు. 'వినేశ్‌ను కలిసేందుకు ఆమె గ్రామ ప్రజలు ఎంతో ఉద్వేగంగా, ఉత్సాహంగా ఎదురుచూశారు' అని ఆమె సోదరుడు హర్విందర్ తెలిపాడు.

దేశంలో ఒలింపిక్ స్థాయి క్రీడా సౌకర్యాలు 10.4 శాతమే!

న్యూఢిల్లీ: 2036 ఒలింపిక్స్‌కు ఆతిథ్యం ఇచ్చేందుకు భారత్ సిద్ధంగా ఉందని ప్రధాని నరేంద్ర మోదీ ఓవైపు విశ్వాసం వ్యక్తం చేస్తుంటే.. మరోవైపు విశ్వక్రీడల ప్రమాణాలను అందుకునే స్థాయిలో క్రీడల మౌలిక వసతులు దేశంలో లేవన్న విషయం వెలుగులోకి రావడం ఆందోళన కలిగిస్తోంది. దేశంలో క్రీడల మౌలిక వసతుల్లో ఒలింపిక్స్ ప్రమాణాలను అందుకొనేవి 10.4 శాతమే అని 'బిజినెస్ స్టాండర్డ్' చేసిన సర్వేలో తేలింది. భవిష్యత్ ప్రాజెక్టులను ఇందులో పరిగణనలోకి తీసుకోలేదు. ఖేలో ఇండియా లెక్కల ప్రకారం దేశ వ్యాప్తంగా 737 జిల్లాల్లో 15,822 క్రీడా మౌలిక నిర్మాణాలు పూర్తికాగా.. 20,832 పూర్తి క్రీడా సౌకర్యాలు ఉన్నాయి. కానీ, వీటిల్లో 1645 క్రీడా మౌలిక నిర్మాణాలు, 2473 పూర్తి క్రీడా సౌకర్యాలు మాత్రమే ఒలింపిక్స్ స్థాయిలో ఉన్నాయని నివేదిక లో బహిర్గతమైంది. ఇవన్నీ వివిధ రాష్ట్రాల్లోని 334 జిల్లాల్లో ఉన్నాయి. అంతర్జాతీయ క్రీడల నిర్వహణ స్థాయిలో బ్యాడ్మింటన్‌కు 314 కోర్టులు, ఫుట్‌బాల్‌కు 301 గ్రౌండ్‌లు, వాలీబాల్‌కు 270 కోర్ట్‌లు, అథ్లెటిక్స్‌కు 221 ట్రాక్‌లు అందుబాటు లో ఉన్నాయి. పూర్తయిన క్రీడా మౌలిక నిర్మాణాల్లో తమిళనాడులో అత్యధికంగా 390 ఉండగా.. 161తో ఢిల్లీ రెండో స్థానంలో నిలిచింది. ఇక, గుజరాత్‌లో 43 క్రీడా మౌలిక సదుపాయాలు, 18 మల్టీ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లు ఉన్నాయి. కాగా, మొతేరాలో సర్దార్ వల్లభాయ్ పటేల్ స్పోర్ట్స్ ఎన్‌క్లేవ్‌తో భారీ ప్రాజెక్టును ఆరంభించనున్నారు. విజన్ ఒలింపిక్స్‌లో భాగంగా 'గుజరాత్ ఒలింపిక్ ప్లానింగ్, మౌలిక వసతుల కార్పొరేషన్'ను గుజరాత్ ప్రభుత్వం ఏర్పాటు చేసింది. 2036 ఒలింపిక్స్ నిర్వహణ కోసం రూ. 6వేల కోట్లతో ఆరు క్రీడా కాంప్లెక్సులు నిర్మించాలనేది ప్రణాళిక. అయితే, ఇదంతా ఒలింపిక్ బిడ్ నెగ్గితేనే!

భారత కోచ్ పదవిపై దిగ్గజ షూటర్ ఆసక్తి



న్యూఢిల్లీ: భారత జట్టు కోచ్‌గా పని చేయడానికి బ్రిటన్‌కు చెందిన డబుల్ ట్రాప్ లెజెండరీ షూటర్ పీటర్ విల్సన్ (37) ఆసక్తి ప్రదర్శిస్తున్నాడు. ఈ మేరకు అతడు తన దరఖాస్తును ఈ-మెయిల్ చేసినట్టు చెప్పాడు. 2028 ఒలింపిక్స్‌ను దృష్టిలో ఉంచుకొని భారత షూటర్లకు శిక్షణ ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నట్టు తెలిపాడు. పారిస్ ఒలింపిక్స్ ట్రాప్ ఈవెంట్‌లో స్వర్ణం సాధించిన నాథన్ హేల్స్‌కు కూడా ఇతడే కోచ్. విల్సన్ 2012 లండన్ ఒలింపిక్స్‌లో పసిడి పతకం సాధించాడు. కాగా, ఎంతో కాలంగా భారత జట్టు విదేశీ ట్రాప్ షూటింగ్ కోచ్ లేకుండానే బరిలోకి దిగుతోంది.



డైమండ్ లీగ్ బరిలో నీరజ్

న్యూఢిల్లీ: గాయంతో ఇబ్బంది పడుతున్నా.. ఈ సీజన్‌ను వీలైనంత మెరుగ్గా ముగించాలని డబుల్ ఒలింపిక్ పతక జావెలిన్ త్రోయర్ నీరజ్ చోప్రా భావిస్తున్నాడు. ఈ నేపథ్యంలో ఈ నెల 22 నుంచి లాసన్నేలో జరిగే డైమండ్ లీగ్‌లో తాను పాల్గొంటున్నట్టు చోప్రా శనివారం ప్రకటించాడు. పారిస్ ఒలింపిక్స్‌లో రజతం సాధించిన తర్వాత.. వైద్యుల సలహా కోసం చోప్రా నేరుగా జర్మనీ వెళ్లాడు. గజ్జల్లో గాయానికి శస్త్రచికిత్స చేయించుకొంటాడనే వార్తలు వచ్చాయి. అయితే, స్విస్‌లో ప్రాక్టీస్ ఆరంభించిన చోప్రా.. డైమండ్ లీగ్‌లో పాల్గొంటున్నట్టు వర్చువల్‌గా జరిగిన మీడియా సమావేశంలో తెలిపాడు. గాయం మరింత తీవ్రం కాకుండా జాగ్రత్తలు తీసుకొంటూనే సాధన చేస్తున్నట్టు చెప్పాడు. వచ్చేనెల 12,13 తేదీల్లో బెల్జియంలో జరిగే సీజన్ చివరి డైమండ్ లీగ్ మీట్‌లో కూడా పాల్గొనాలని భావిస్తున్నాడు. ఇక, 90 మీటర్ల మార్క్‌ను చోప్రా ఇప్పటి వరకు దాటలేక పోవడం పెద్ద చర్చనీయాంశంగా మారింది. కానీ, దాన్ని దేవుడికే వదిలేస్తున్నానన్నాడు.

అల్కారజ్‌కు కోపమొచ్చె.. రాకెట్ విరిగె

సిన్సినాటి: స్పెయిన్ టెన్నిస్ స్టార్, మాజీ వరల్డ్ నెంబర్‌వన్ కార్లోస్ అల్కారజ్‌లో ఆగ్రహం పెల్లుబికింది. దాంతో అతడు తన రాకెట్‌ను నేలకేసి కొట్టాడు. సిన్సినాటి ఓపెన్ టోర్నీలో అతడు ఇలా అనుచితంగా ప్రవర్తించాడు. గేల్ మోన్‌ఫిల్స్‌తో మ్యాచ్‌లో 6-4, 6-7 (7), 4-6తో వరుస సెట్లలో ఓడిన అల్కారజ్ ఆ కోపాన్ని తన రాకెట్‌పై చూపడంతో అదికాస్తా విరిగిపోయింది.



విండీస్ విజయలక్ష్యం 263

దక్షిణాఫ్రికా రెండో ఇన్నింగ్స్ 246.. జేడెన్‌కు 6 వికెట్లు

గయానా: దక్షిణాఫ్రికాతో జరుగుతున్న రెండో టెస్టులో వెస్టిండీస్ విజయం కోసం పోరాడుతోంది. 263 పరుగుల ఛేదన కోసం బరిలోకి దిగిన ఆతిథ్య జట్టు మూడోరోజు శనివారం కడపటివార్తలందేసరికి 29 ఓవర్లలో 3 వికెట్లకు 95 పరుగులతో ఉంది. క్రీజులో హోడ్జ్, అథనజె ఉన్నారు. అంతకుముందు దక్షిణాఫ్రికా రెండో ఇన్నింగ్స్‌లో పేసర్ జేడెన్ సీల్స్ (6/61) ధాటికి 246 రన్స్‌కు ఆలౌటైంది. వెరెనె (59), మార్‌క్రమ్ (51) అర్ధసెంచరీలు చేశారు. రెండోరోజు ఆటలో 19 పరుగుల వ్యవధిలోనే 4 వికెట్లు కోల్పోయిన సఫారీలను శనివారం కూడా విండీస్ బౌలర్లు ఇబ్బందిపెట్టారు. దీంతో 223/5 ఓవర్‌నైట్ స్కోరుతో రెండో ఇన్నింగ్స్ ఆరంభించిన దక్షిణాఫ్రికా మరో 23 పరుగులను జోడించి మిగిలిన వికెట్లన్నీ కోల్పోయింది. సఫారీలు తొలి ఇన్నింగ్స్‌లో 160 పరుగులు చేయగా, విండీస్ 144 పరుగులకే కుప్పకూలింది.

www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI



'స్టాప్‌లాగ్' సక్సెస్!

తుంగభద్ర జలాశయంలో నిలిచిన నీరు 12

విజయవంతంగా ఐదు ఎలిమెంట్ల అమరిక

ఆదివారం | 18-8-2024 | పేజీలు: 14 +28 పేజీల ఆదివారం అనుబంధం | వెల (Price) : Rs. 8.00 | సంపుటి (Volume) : 65 సంచిక (Issue) : 124 | శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, వర్షరుతువు, శ్రావణమాసం, శుక్లపక్షం; తిథి: చతుర్దశి తె. 3.05 తదుపరి పౌర్ణమి; నక్షత్రం: ఉత్తరాషాఢ ఉ. 10.15 తదుపరి శ్రవణం వర్జ్యం: మ. 1.54-3.21; దుర్ముహూర్తం: సా. 4.54-5.44; అమృతఘడియలు: రా. 10.40-12.07; రాహుకాలం: సా. 4.30-6.00; సూర్యోదయం: 6.02; సూర్యాస్తమయం: 6.35 | హైదరాబాద్ సిటీ *

Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

కొత్త పలుకు



కారు.. కమలం కలిసిపోతాయా?

'త్వరలోనే భారతీయ జనతా పార్టీలో భారత రాష్ట్ర సమితి విలీనమవుతుంది. మాజీ సీఎం కేసీఆర్‌కు గవర్నర్ పదవి ఇస్తారు. కవితకు బెయిల్ కూడా వస్తుంది'.. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తాజాగా ఢిల్లీలో చేసిన వ్యాఖ్యలు ఇవి. భారత రాష్ట్ర సమితి నిజంగానే రెండు జాతీయ పార్టీలలో ఏదో ఒక దానిలో విలీనంకాక తప్పదా? బీఆర్ఎస్‌కు ఈ దుస్థితి ఎందుకు వచ్చింది? విలీనం వార్తలను బీఆర్ఎస్ ముఖ్యులు ఎందుకు గట్టిగా ఖండించలేక పోతున్నారు? కేంద్రంలో బీజేపీని గద్దె దించుతానని కొంతకాలం క్రితం వరకు ప్రతిజ్ఞలు చేసిన కేసీఆర్ ఇంత బలహీనంగా ఎందుకు మారిపోయారు?

ఢిల్లీ లిక్కర్ కుంభకోణంలో నిందితురాలిగా ఉన్న కేసీఆర్ కుమార్తె కవిత ప్రస్తుతం తీహార్ జైల్లో ఉన్నారు. తన బిడ్డ నెలల తరబడి జైలులో ఉండాల్సి రావడాన్ని కేసీఆర్ భరించలేక పోతున్నారు. కవితను బెయిల్‌పై విడిపించుకునేందుకు కేసీఆర్ చేయని ప్రయత్నం లేదు. ఈ క్రమంలో ఆయన బీజేపీ సహాయాన్ని అర్థించడం వాస్తవం. కేటీఆర్, హరీశ్‌రావులు రెండు మూడు సార్లు ఢిల్లీ వెళ్లి మంత్రాంగం కూడా నడిపారు.

రాజకీయ వర్గాలలో ప్రచారం జరుగుతున్నట్టుగా వారిరువురూ ఢిల్లీలో ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర మంత్రి అమిత్ షాలను కానీ కలవలేదు. మరెవరిని కలిసుంటారు? బీజేపీతో రాజీ కుదర్చడానికి చొరవ తీసుకున్న ప్రముఖుడు ఎవరు? ఆయనకు ప్రధాని మోదీ వద్ద నిజంగా అంత పలుకుబడి ఉందా? వంటి సందేహాలు సహజంగానే కలుగుతాయి. ఈ మొత్తం వ్యవహారంలో ఒక ప్రముఖ వ్యక్తి కీలక పాత్ర పోషించారు. ఆయన ప్రస్తుతం ఒక రాష్ట్రానికి గవర్నర్‌గా కూడా ఉన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో తెలుగుదేశం-బీజేపీ మధ్య పొత్తు కుదరడంలో కూడా ఆయనే ప్రధాన పాత్ర పోషించారు.

దీనితో రంగంలోకి దిగిన గవర్నర్ బీఆర్ఎస్ ముఖ్యులకు సంకేతాలు పంపారు. మొదటి దఫా చర్చలలో పురోగతి లేకపోయినా... రెండోసారి చర్చలలో మాత్రం ఎవరికి ఏమి కావాలన్న దానిపై స్పష్టత ఏర్పడింది. బీఆర్ఎస్‌కు ఏమి కావాలో తెలిసిందే కనుక తమకు ఏవి కావాలో రెండో దఫా చర్చల సందర్భంగా సదరు గవర్నర్‌తో పాటు ఆరెస్సెస్ నాయకులు స్పష్టం చేశారు. జైలులో ఉన్న కవిత విషయంలో సహాయ సహకారాలు లభించాలంటే బీఆర్ఎస్‌ను బీజేపీలో విలీనం చేయాలని లేదా పొత్తు పెట్టుకుంటున్నట్టు ప్రకటించాలని, ప్రతిగా కేసీఆర్‌కు గవర్నర్ పదవి ఇస్తారని, హరీశ్‌కు కేంద్ర మంత్రి పదవి ఇస్తామని ఆ గవర్నర్‌తో పాటు ఆరెస్సెస్ ప్రతినిధులు ప్రతిపాదించారు. ఆ తర్వాత బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా హరీశ్‌ను నియమిస్తామని కూడా ప్రతిపాదించినట్టు తెలిసింది. కేటీఆర్ భవిష్యత్ విషయమై ఎటువంటి చర్చా జరగలేదని అంటున్నారు. కేసీఆర్ కుటుంబం రాజకీయాల నుంచి నిష్క్రమించాలన్నది బీజేపీ పెద్దల అభిమతంగా ఉన్నట్టు చెబుతున్నారు.

పార్టీని విలీనం చేయాలని కోరవద్దని, పొత్తు పెట్టుకొని ముందుకు వెళదామని బీఆర్ఎస్ ముఖ్యులు ప్రతిపాదించారు. ఈ దశలో చర్చలు అప్పటికి ముగిశాయి. ఢిల్లీ చర్చల వివరాలను కేటీఆర్, హరీశ్‌రావు తమ నాయకుడు కేసీఆర్‌కు వివరించారు. భారతీయ జనతా పార్టీలో తమ పార్టీని విలీనం చేయడం ఆత్మహత్యాసదృశం అవుతుందని భావిస్తున్న కేసీఆర్ అండ్ కో అప్పటి నుంచి మౌనంగా ఉంటున్నారు. కవిత బెయిల్ పిటిషన్ ఈ నెల 28న సుప్రీం కోర్టులో విచారణకు రానుంది. ఆ రోజు కవితకు బెయిల్ లభించవచ్చునని బీఆర్ఎస్ నాయకులు ఆశగా ఉన్నారు. అదే జరిగితే బీజేపీతో తదుపరి చర్చలు ప్రస్తుతానికి ఉండకపోవచ్చు.

కర్మ ఫలాన్ని ఎవరూ తప్పించుకోలేరని అంటారు. కేసీఆర్ పరిస్థితి కూడా ప్రస్తుతం అలాగే ఉంది. అధికారంలో ఉన్నప్పుడు ఓటుకు నోటు కేసులో ప్రస్తుత సీఎం రేవంత్‌ను జైలుకు పంపి ముప్పతిప్పలు పెట్టారు. ఒక్కగానొక్క కుమార్తె వివాహ వేడుకలను కూడా దగ్గరుండి జరిపించుకోలేని పరిస్థితి రేవంత్‌కు కల్పించారు. ఇప్పుడు కేసీఆర్ ప్రతిపక్షంలో కూర్చోవలసిరాగా, రేవంత్ సీఎం స్థానంలో కూర్చున్నారు.

కవిత జైలులో ఉండివుండక పోతే బీజేపీతో సయోధ్యకు ప్రయత్నించాల్సిన అవసరం కేసీఆర్‌కు ఉండేది కాదు. అధికారంలో ఉన్నప్పుడు విర్రవీగిన కేసీఆర్‌లో ఇంత బేలతనం చూస్తామని అనుకున్నామా? అధికారం అనుభవించడానికి అలవాటుపడిన నాయకులలో పోరాట పటిమ పోతున్నందునే ఈ దుస్థితి!

బీఆర్ఎస్‌ను విలీనం చేసుకోవడం వరకు బీజేపీ రాష్ట్ర నేతలకు అభ్యంతరాలు లేవు. పొత్తు ప్రతిపాదనను మాత్రం వ్యతిరేకిస్తున్నారు. అయితే, రాష్ట్ర నాయకులకు కేంద్రంలో పెద్దగా పలుకుబడి లేదు. ప్రధాని మోదీ, హోం మంత్రి అమిత్ షాలను ప్రభావితం చేయగలిగిన శక్తి తెలుగునాట బీజేపీ నాయకులు ఎవరికీ లేదు.



ఖమ్మంలో వైద్యులు, వైద్య విద్యార్థుల నిరసన

వైద్యుల భద్రతపై కమిటీ!

నియమిస్తామని ప్రకటించిన కేంద్రం

దేశవ్యాప్తంగా స్తంభించిన ఓపీ సేవలతో తీవ్ర ఇబ్బందులు పడ్డ రోగులు 2

వరుసగా రెండోరోజు సీబీఐ ఎదుటకు ఆర్జీ కర్ కాలేజీ మాజీ ప్రిన్సిపల్



బీజేపీ రాష్ట్ర ఇన్‌చార్జిగా

అభయ్ పాటిల్!

తెలుగు రాష్ట్రాల్లో సభ్యత్వ నమోదు ఇన్‌చార్జిగా అరవింద్ మీనన్ 11

ఏపీలో పార్టీ అధ్యక్షులూ పురందేశ్వరికి తమిళనాడు, కేరళ, పుదుచ్చేరి బాధ్యతలు

నేతలకు త్వరలో సమన్లు!

కాళేశ్వరం నిర్మాణంలో కీలక పాత్ర పోషించిన అప్పటి ప్రజాప్రతినిధులకు..

జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ నిర్ణయం

అధికారుల అఫిడవిట్లపై క్రాస్ ఎగ్జామినేషన్‌కు ఏర్పాట్లు 11

స్కిల్ వర్సిటీలో దసరా నుంచి

6 కోర్సులు ప్రారంభం

భాగస్వామ్యం కోసం 140 సంస్థల ఆసక్తి

తొలుత స్కూల్ ఆఫ్ ఈ-కామర్స్, లాజిస్టిక్స్ రిటైల్‌లో సర్టిఫికెట్ కోర్సులు

సీఎస్ శాంతికుమారి వెల్లడి 13



'అస్కి' డైరెక్టర్ జనరల్‌గా 13

నిమ్మగడ్డ రమేశ్‌కుమార్

రేపు బాధ్యతల స్వీకరణ

క్రీడల వర్సిటీ!

యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీ పేరిట ఏర్పాటు

హకీంపేట లేదా గచ్చిబౌలిలో స్థల పరిశీలన

ఫ్యూచర్ సిటీలో అంతర్జాతీయ ప్రమాణాలతో 12 అకాడమీలు.. సైన్స్, మెడిసిన్ సెంటర్లు

వెల్లడించిన సీఎం.. ఆనంద్ మహీంద్రా ట్వీట్‌కు జవాబు

త్వరలో దక్షిణ కొరియా స్పోర్ట్స్ వర్సిటీతో ఒప్పందం

నాలుగో నగరికి రయ్.. రయ్!

ప్రపంచంలోనే అతి పెద్ద రెండంతస్తుల ఫ్లైఓవర్ మెట్రో

18 కి.మీ మేర 200 అడుగుల ప్రత్యేక రహదారి నిర్మాణం

కింద 10 వరుసల రోడ్డు.. దానిపై 6 లేదా 8 వరుసలు

వీటిపైన మెట్రో రైల్.. పూలింగ్ విధానంలో భూ సేకరణ

కొత్త హైకోర్టు నుంచి ఫ్యూచర్ సిటీ వరకు మెట్రో రైలు

మంత్రి, ఉన్నతాధికారులతో సమీక్షించిన సీఎం రేవంత్

సీఎం సోదరుడైతే పెట్టుబడులు పెట్టకూడదా?

కేటీఆర్ సోదరుడు, సోదరి వచ్చినా ఆహ్వానిస్తాం

అప్పటి ఒప్పందాల అమల్లో సక్సెస్ రేట్ 30 శాతమే

త్వరలో అమెజాన్, పెప్సీకో పెట్టుబడులు: మంత్రి దుద్దిళ్ల



ఇటీవలి దక్షిణ కొరియా పర్యటన సందర్భంగా.. ఒలింపిక్స్‌లో 3 బంగారు పతకాలు సాధించిన ఆ దేశ అథ్లెట్ హైయోన్‌ను అభినందించిన రేవంత్

హైదరాబాద్, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని యువతలో నైపుణ్యాలు పెంచి.. ప్రైవేటు రంగంలో ఉద్యోగాల సాధన కోసం ఇటీవలే యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీకి శంకుస్థాపన చేసిన ప్రభుత్వం.. క్రీడలపైనా ప్రత్యేకంగా దృష్టి సారించింది. స్కిల్స్ యూనివర్సిటీ తరహాలోనే స్పోర్ట్స్ యూనివర్సిటీ ఏర్పాటు చేస్తామని ప్రకటించింది. దీనికి కూడా యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీగా నామకరణం చేసింది. గచ్చిబౌలి స్పోర్ట్స్ అకాడమీ లేదా హకీంపేట స్పోర్ట్స్ స్కూల్‌లో దీనిని ఏర్పాటుచేసే అవకాశం ఉంది. కాగా, అంతర్జాతీయ ప్రమాణాలతో నిర్మించాలని భావిస్తున్న ఫ్యూచర్ సిటీ (ఫోర్త్‌సిటీ)లోని స్పోర్ట్స్ హబ్‌లో దాదాపు 12 క్రీడల అకాడమీలను నెలకొల్పాలని ప్రభుత్వం భావిస్తోంది. వీటిలో అంతర్జాతీయ స్థాయి అధునాతన సదుపాయాలు ఉంటాయి. ఈ స్పోర్ట్స్ హబ్‌లో స్పోర్ట్స్ సైన్స్ సెంటర్, స్పోర్ట్స్ మెడిసిన్ సెంటర్ కూడా ఉంటాయి. ఈ విషయాన్ని స్వయంగా సీఎం రేవంత్ ప్రకటించారు. ఇటీవల

మిగతా 13వ పేజీలో...

చిక్కుల్లో సిద్దూ!

'ముడా' వివాదం.. కేసు నమోదుకు గవర్నర్ అనుమతి

కర్ణాటక సీఎం భార్యకు చెందిన భూమిలో పార్కు నిర్మాణం

ముడా తీసుకుంది 3.16 ఎకరాల వ్యవసాయ భూమి

పరిహారంగా 14 ప్లాట్లు.. అవి దళితులవి: ప్రతిపక్షాలు

కేంద్రం చేతిలో గవర్నర్ కీలుబొమ్మగా మారారు

ప్రజా ప్రభుత్వాన్ని అస్థిరపరిచేందుకు భారీ కుట్ర

బీజేపీ, జేడీఎస్ రాష్ట్ర నాయకులే సూత్రధారులు

న్యాయపోరాటం చేస్తాం: ముఖ్యమంత్రి సిద్దరామయ్య

తప్పుడు ఫిర్యాదుతో సీఎంను ఇరికించే కుట్ర: డీకే



క్యాబినెట్ భేటీ అనంతరం బయటకు వస్తున్న సిద్దరామయ్య

బెంగళూరు, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): మైసూరు నగరాభివృద్ధి ప్రాధికార(ముడా) కుంభకోణం కీలక మలుపు తిరిగింది. ఈ అంశంలో కర్ణాటక ముఖ్యమంత్రి సిద్దరామయ్యపై క్రిమినల్ కేసు నమోదు చేసేందుకు (ప్రాసిక్యూషన్) గవర్నర్ థావర్‌చంద్ గహ్లోత్ శనివారం అనుమతులు ఇచ్చారు. ఈ నిర్ణయం రాష్ట్ర రాజకీయాలను కుదిపేసింది. ముడాలో 14 ఇంటి స్థలాలను తన సతీమణి పార్వతి పేరిట అక్రమంగా తీసుకున్నారని సిద్దరామయ్య ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. సీఎం ప్రాసిక్యూషన్‌కు గవర్నర్ అనుమతించడంతో ఒక్కసారిగా గందరగోళం నెలకొంది. జిల్లాల పర్యటనలో ఉన్న మంత్రులంతా హుటాహుటిన బెంగళూరుకు బయల్దేరారు. సీఎం సిద్దరామయ్యపై ప్రాసిక్యూషన్‌కు అనుమతులు ఇచ్చిన పత్రాలు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాలిని రజనీశ్, సీఎం కార్యదర్శి, అదనపు ముఖ్య కార్యదర్శి ఎల్‌కే అతీక్‌కు రాజ్‌భవన్ నుంచి అందాయి. కేంద్ర ప్రభుత్వం చేతిలో గవర్నర్ కీలుబొమ్మగా మారారని, ప్రాసిక్యూషన్‌కు అనుమతులు

మిగతా 2వ పేజీలో...

ఇళ్ల స్థలాలకూ పాస్ పుస్తకాలు



10,894 గ్రామాల్లో స్థల యజమానులకు ప్రయోజనం

సాదాబైనామా పరిశీలన.. హక్కుపత్రాల జారీ

ధరణిలో నమోదు కాని అర్జీలకు కూడా..

అధికారం ఆర్డీవోకు దఖలు

పాత పాస్ పుస్తకాల కొనసాగింపు

ధరణిలో జరిగిన తప్పుల సవరణకు అవకాశం

కొత్త ఆర్వోఆర్ అమల్లోకి వస్తే.. తగ్గనున్న వివాదాలు

దేశంలోనే భూధార్ తొలిరాష్ట్రంగా తెలంగాణ!



హైదరాబాద్, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): కొత్త ఆర్వోఆర్ చట్టం అమల్లోకి వస్తే.. గ్రామాల్లో ఉన్న ఇళ్ల స్థలాలకు కూడా ప్రభుత్వం హక్కుపత్రాలను ఇస్తుంది. అంటే.. వ్యవసాయ భూములకు మాదిరిగానే ఇళ్ల స్థలాలకు కూడా పాస్ పుస్తకాలు జారీ అవుతాయి. ఈ నిర్ణయం వల్ల 10,894 గ్రామాల్లోని ఇళ్ల స్థలాల యజమానులకు ప్రయోజనం చేకూరనుంది. అంతేకాదు.. కొత్త ఆర్వోఆర్ చట్టంలో పాత సమస్యలకు పరిష్కారాలను చూపించనున్నారు. ఉదాహరణకు.. 18 లక్షల ఎకరాల భూములు ఇప్పటి వరకు ధరణిలో నమోదు కాలేదు. కొత్త చట్టం ద్వారా ఈ భూముల యజమానులకు కూడా హక్కు పత్రాలను అందజేస్తారు. భూదాన్, ఇతర వివాదాస్పద భూములను మినహాయిస్తే.. 8 లక్షల ఎకరాలకు హక్కుపత్రాలు దక్కవచ్చని అంచనా. కొత్త ఆర్వోఆర్‌తో సాదాబైనామా దరఖాస్తులకూ పరిష్కారం లభించనుంది. వాటిని పరిశీలించి, హక్కు పత్రాలను జారీ చేసే అధికారాలను ఆర్డీవోలకు కట్టబెడతారు. భూములకు విశిష్ట సంఖ్య- భూధార్ కేటాయింపు జరిగితే.. దేశంలోనే ఈ ఘనత సాధించిన రాష్ట్రంగా తెలంగాణ గుర్తింపుపొందుతుంది. అంతేకాదు.. గ్రామస్థాయిలో భూ రికార్డుల నిర్వహణ సాధ్యమవుతుంది.

9.24 లక్షల సాదాబైనామా దరఖాస్తులు

రాష్ట్రంలో 9.24 లక్షల సాదాబైనామా దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. కొత్త ఆర్వోఆర్ ప్రకారం ఈ దరఖాస్తులను పరిగణనలోకి తీసుకుంటారు. వాటిపై క్షేత్రస్థాయిలో విచారణ జరుపుతారు. ఆ భూములు అసైన్డ్, సీలింగ్ చట్టాల పరిధిలో లేకుంటే.. వాటికి హక్కుపత్రాలను జారీ చేస్తారు. ఈ అధికారం ఆర్డీవోకు ఉంటుంది. 1989 నుంచి 2016 వరకు సాదాబైనామా దరఖాస్తులకు తహసీల్దార్లు హక్కుపత్రాలను జారీ చేసేవారు. కొత్త చట్టం ప్రకారం ఆ అధికారాలు ఆర్డీవోలకు దఖలుపడతాయి. ఆర్వోఆర్ ముసాయిదా చట్టంలోని సెక్షన్-6లో సాదాబైనామాలకు హక్కుపత్రాల జారీ వివరాలున్నాయి. పెండింగ్ దరఖాస్తులను మినహాయిస్తే.. కొత్త దరఖాస్తులు కూడా చేసుకునే వెసులుబాటు ఉంది. భూమి మీద 18 రకాలుగా హక్కులు కల్పించేలా

మిగతా 3వ పేజీలో...

దిగజారుడు రాజకీయాలు

రైతులను అయోమయానికి గురిచేస్తున్న ప్రతిపక్షాలు

రూ.2 లక్షల్లోపు రైతు రుణాలన్నీ మాఫీ చేశాం

22,37,848 మందికి రూ.17,933 కోట్లు ఇచ్చాం

రుణమాఫీ కాని వారు ఏఈవోలను కలవాలి

నెల రోజుల్లో రైతుల దరఖాస్తులను పరిష్కరిస్తాం

వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



హైదరాబాద్, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): రైతు రుణమాఫీపై దిగజారుడు రాజకీయాలు చేయొద్దని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కోరారు. రైతాంగాన్ని అయోమయానికి గురిచేసేలా ప్రతిపక్ష నాయకుల ప్రవర్తన ఉండటం దురదృష్టకరమన్నారు. నిజంగా రైతు సంక్షేమాన్ని కోరేవారు ముందుగా వారు గత పదేళ్లలో చెల్లించకుండా వదిలేసిన రుణాల వివరాలను తెప్పించుకొని చెల్లించాలని సూచించారు. ఇచ్చిన మాట ప్రకారం ఆగస్టు 15కల్లా రూ.2 లక్షలలోపు రుణమాఫీ చేశామని తుమ్మల శనివారం ఒక ప్రకటనలో వెల్లడించారు. దేశ చరిత్రలో ఏ రాష్ట్రంలోనూ ఇంత వరకు అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం మొదటి పంట కాలంలోనే రూ.31,000 కోట్ల నిధులను వ్యవసాయ రంగానికి కేటాయించుకొని, రూ.2 లక్షల లోపు రైతు రుణమాఫీని అమలు చేసిన దాఖలాల్లేవని

మిగతా 13వ పేజీలో...

సీఎం రేవంత్ రాజీనామా చేయాలి

54 శాతం మంది రైతులకు రుణమాఫీ కాలేదు

తొండిలో తోపు.. బూతులు తిట్టడంలో టాప్ 11

నా క్యాంపు కార్యాలయంపై దాడి చేయించారు

భౌతిక దాడులూ చేస్తారని అనుమానం ఉంది: హరీశ్

ఎంతమందికి మాఫీ అయిందో తెలుసుకుందాం..

తేదీ, స్థలం చెప్పాలంటూ సీఎం రేవంత్‌కు సవాల్

సిద్దిపేటలో బీఆర్ఎస్ వర్సెస్ కాంగ్రెస్

ఇరువర్గాల ఆందోళన, ఉద్రిక్తత.. పోలీసుల లాఠీచార్జి



బీజేపీలోకి రేవంత్.. ఖాయం!

24న మహిళా కమిషన్‌కు.. రాష్ట్రంలో మహిళలపై దాడుల వివరాలిస్తాం: కేటీఆర్

ఏమిటీ ముడా స్కామ్

(బెంగళూరు-ఆంధ్రజ్యోతి)



టీజే అబ్రహం

మైసూరులో దశాబ్దాల క్రితం సిటీ ఇంప్రూవ్‌మెంట్ ట్రస్టు బోర్డు (సీఐటీబీ) ఉండగా.. దాని స్థానంలో 1987లో మైసూరు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ(ముడా) ఏర్పడింది. సీఎం సిద్దరామయ్య బావమరిది మల్లికార్జునస్వామి కెసరె గ్రామం సర్వే నం.464లో ఉన్న 3.16 ఎకరాల వ్యవసాయ భూమిని 2004లో కొనుగోలు చేశారు. సదరు భూమిని మల్లికార్జునస్వామి మైసూరుకు చెందిన నింగాబింగ్ జౌరా చిన్న కుమారుడు దేవరాజ్ నుంచి కొనుగోలు చేసినట్లు రికార్డులు ఉన్నాయి. అది దేవరాజ్ పిత్రార్జితం. కాగా, మల్లికార్జునస్వామి ఆడపడుచు లాంఛనంగా, సిద్దరామయ్య భార్య పార్వతికి దానవిక్రయం చేశారు. సదరు భూమిని ముడా స్వాధీనం చేసుకుని, పార్కు ఏర్పాటు చేసింది. పరిహారంగా ఆమెకు 14 ఇళ్ల స్థలాలు కేటాయించింది. ముడాలో వేలాది స్థలాలు ఖాళీగా ఉన్నాయి. కానీ, సిద్దరామయ్య అభివృద్ధి చెందిన విజయనగర లే అవుట్‌లో ఇంటి స్థలాలు మంజూరు చేయాలని ఎమ్మెల్యేగా ముడాకు రాసిన సిఫారసు లేఖను జేడీఎస్ ఇటీవలే బహిర్గతం చేసింది. ప్రస్తుతం ఈ ఇంటి స్థలాల విలువ రూ.70 కోట్లకుపైగానే పలుకుతోంది. తమ భూమి స్వాధీనం చేసుకున్నందుకు 50:50 నిష్పత్తిలో ఇంటి స్థలాలు దక్కాయని, ఇందులో ఎక్కడా అవినీతి, అక్రమం లేదని పలు సందర్భాల్లో సిద్దరామయ్య వివరణ ఇచ్చారు. కెసర పరిధిలో ఇప్పటికీ చదరపు అడుగు రూ.2-3 వేలు పలుకుతుండగా, విజయనగర్ లే అవుట్‌లో రూ.10-12 వేల వరకూ ధర పలుకుతున్న ఇంటి స్థలాలను సిద్దరామయ్య పొందారని, సదరు భూములు దళితులకు చెందినవని ప్రతిపక్ష బీజేపీ, జేడీఎస్ ఆరోపిస్తున్నాయి.

గవర్నర్‌కు ఫిర్యాదులతో..

ముడా ఇంటి స్థలాలను అక్రమంగా పొందిన సీఎం సిద్దరామయ్యను ప్రాసిక్యూట్ చేయాలని సామాజిక కార్యకర్త టీజే అబ్రహం, మైసూరుకు చెందిన మరో సామాజిక కార్యకర్త స్నేహమయి కృష్ణ, బెంగళూరు నాగరభావి నివాసి ప్రదీప్ కుమార్ రాజ్‌భవన్‌కు ఫిర్యాదులు చేశారు. జూలై 26న టీజే అబ్రహం సమగ్ర వివరాలతో గవర్నర్‌ను కలిసి ప్రాసిక్యూషన్ కోరారు. ఆ మరుసటి రోజే సీఎం సిద్దరామయ్యకు గవర్నర్ నోటీసులు జారీ చేశారు. కాగా, ముడా ఇంటిస్థలాల అక్రమంలో సీఎం సిద్దరామయ్యను ప్రాసిక్యూట్ చేయాలని గవర్నర్ అనుమతులు ఇవ్వడంతో 2011 నాటి ఘటన పునరావృతమైందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. అప్పటి సీఎం యడియూరప్ప డీ నోటిఫికేషన్‌లో అక్రమాలకు పాల్పడ్డారని న్యాయవాది సిరాజిన్ బాషా గవర్నర్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో నాటి గవర్నర్ హంసరాజ్ భరద్వాజ్ ప్రాసిక్యూషన్‌కు అనుమతి ఇచ్చారు.

చిక్కుల్లో సిద్దూ!

(మొదటి పేజీ తరువాయి)





థావర్‌చంద్ గెహ్లాట్

ఇవ్వడం ప్రజాప్రభుత్వాన్ని అస్థిరపరిచే కుట్ర అని, బీజేపీ, జేడీఎస్‌కు చెందిన రాష్ట్ర నాయకులు కొందరు ఈ కుట్రకు సూత్రధారులని సీఎం సిద్దరామయ్య మండిపడ్డారు. రాజీనామా చేసేంత తప్పు తానేమీ చేయలేదని స్పష్టం చేశారు. శనివారం బెంగళూరులో ఆయన మీడియాతో మాట్లాడారు. ఉత్తరాఖండ్, జార్ఖండ్, ఢిల్లీలో చేసిన తరహాలోనే కర్ణాటకలోనూ కుట్ర పన్నారని ఆరోపించారు. ప్రాథమికంగా తనపై ఎటువంటి ఆరోపణలు లేవన్నారు. గవర్నర్ నిర్ణయం రాజ్యాంగ విరుద్ధమని, చట్ట వ్యతిరేకమని దుయ్యబట్టారు, ప్రాసిక్యూషన్‌కు అనుమతులపై న్యాయ పోరాటం చేస్తానని అన్నారు. ఫిర్యాదు వచ్చిన ఒక్కరోజులోనే షోకాజ్ నోటీసులు ఇచ్చారని, గవర్నర్ నుంచి ఈ విధమైన ప్రక్రియ ఊహించలేదని అన్నారు. రాజకీయ వేధింపుల్లో భాగంగానే ప్రాసిక్యూషన్‌కు గవర్నర్ అనుమతులు ఇచ్చారని అన్నారు. తన రాజీనామా కోరే నైతికత బీజేపీకి లేదన్నారు. కేంద్రమంత్రి కుమారస్వామి, మాజీ మంత్రులు మురుగేశ్ నిరాణి, శశికళ జొల్లె, జనార్దన్‌రెడ్డిపై రాజ్‌భవన్‌కు ఫిర్యాదులు అందినా ఇప్పటివరకు ఎలాంటి చర్యలు లేవని గుర్తు చేశారు. కుమారస్వామి గనుల యజమానులకు అనుకూల అనుమతులు ఇచ్చారని, దీనిపై విచారణ జరిపించాలని లోకాయుక్త సూచించినా ఎటువంటి చర్యలు లేవని సిద్దరామయ్య విమర్శించారు.

అధిష్ఠానం అండగా ఉంటుంది : ఏఐసీసీ

సిద్దరామయ్యకు అధిష్ఠానం అండగా ఉంటుందని ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి, పార్టీ కర్ణాటక వ్యవహారాల ఇన్‌చార్జ్ సుర్జేవాలా అన్నారు. ఢిల్లీ నుంచి సీఎంకు ఫోన్ చేసిన ఆయన.. ఎటువంటి ఆందోళన అవసరం లేదని, పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ మేరకు ఓ లేఖను కూడా పంపారు. కర్ణాటక ప్రజలు ప్రజాస్వామ్యబద్ధంగా ఇచ్చిన తీర్పును కాలరాసే విధంగా పీఎంవో, హోంశాఖ వ్యవహరించాయన్నారు. మరోవైపు, మంత్రులు, న్యాయనిపుణులతో సిద్దరామయ్య సాయంత్రం 5గంటలకు అత్యవసరంగా భేటీ అయ్యారు. సీఎంపై విచారణకు గవర్నర్ ఆదేశాలతో పార్టీ అగ్రనేతలు అప్రమత్తమయ్యారు. సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాదులు కపిల్ సిబల్, అభిషేక్ సింఘ్వీ బెంగళూరుకు రానున్నారు. వారు ఆదివారం బెంగళూరులో సీఎంతో చర్చలు జరపనున్నారు.

రాష్ట్రమంతటా భారీ బందోబస్తు

గవర్నర్ విచారణకు అనుమతులు ఇచ్చిన నేపథ్యంలో రాష్ట్రమంతటా భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. బెంగళూరులో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు 'చలో రాజ్‌భవన్‌'కు సిద్ధం కాగా.. పోలీసులు అడ్డుకున్నారు. మైసూరులో కాంగ్రెస్ కార్యకర్తలు, సిద్దరామయ్య అభిమానులు ద్విచక్రవాహనానికి నిప్పుపెట్టి ఆందోళన చేశారు. ఈ నేపథ్యంలో ముడా కార్యాలయంతో పాటు వివిధ ప్రాంతాల్లో సాయుధ బలగాలతో బందోబస్తు ఏర్పాటు చేశారు.

తప్పుడు ఫిర్యాదుతో కుట్ర: డీకే

రాజ్‌భవన్ వేదికగా తప్పుడు ఫిర్యాదుతో సీఎం సిద్దరామయ్యను ఇరికించాలనే కుట్ర సాగిందని, ముఖ్యమంత్రికి అండగా ఉంటామని ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్ అన్నారు. ముడా ఆరోపణలపై ప్రాసిక్యూషన్‌కు అనుమతులు ఇచ్చిన వెంటనే పలువురు సహచర మంత్రులతో కలసి ఆయన మీడియాతో మాట్లాడారు. సిద్దరామయ్య తమ ముఖ్యమంత్రి అని, ఆయన అదే హోదాలోనే ఉంటారని, ఎవరి ఒత్తిళ్లకు తలొగ్గేది ఉండదని స్పష్టం చేశారు. కాంగ్రెస్ పార్టీ మాత్రమే కాదని, 'ఇండియా' కూటమి మొత్తం ముఖ్యమంత్రికి అండగా ఉంటుందని అన్నారు. రాజ్‌భవన్‌ను బీజేపీ ఆఫీస్‌గా మార్చుకున్నారని, దానిపై పోరాటం చేస్తామని చెప్పారు. బీసీ నేత ఒకరు రెండోసారి ముఖ్యమంత్రి అయ్యారని, ఆయన ఎదుగుదలను ఓర్వలేకనే బీజేపీ భారీ కుట్ర పన్నిందని మండిపడ్డారు. ప్రాథమిక విచారణలు జరపకుండానే ప్రాసిక్యూషన్‌కు అనుమతులు ఇవ్వడం సరికాదన్నారు.

న్యాయపోరాటానికి క్యాబినెట్ నిర్ణయం

సీఎం సిద్దరామయ్య ప్రాసిక్యూషన్‌కు గవర్నర్ అనుమతించిన నేపథ్యంలో శనివారం రాత్రి కర్ణాటక క్యాబినెట్ అత్యవసరంగా సమావేశమైంది. గవర్నర్ ప్రాసిక్యూషన్ అనుమతి నిర్ణయాన్ని క్యాబినెట్ ఖండించింది. సీఎంకు మద్దతుగా ఉండాలని, న్యాయ పోరాటం చేయాలని తీర్మానించింది. గవర్నర్ నిర్ణయం రాజ్యాంగ, చట్ట వ్యతిరేకమని క్యాబినెట్‌లో తీర్మానించినట్లు సిద్దరామయ్య చెప్పారు. గవర్నర్ల ద్వారా ప్రజాస్వామ్య ప్రభుత్వాలను అస్థిరం చేసే కుట్రలు చేయడం కేంద్రానికి సరికాదన్నారు.

ఫిర్యాదుదారు కేవియట్ దాఖలు

సిద్దరామయ్యపై ఫిర్యాదుదారుల్లో ఒకరైన ప్రదీప్ కుమార్ హైకోర్టులో కేవియట్ పిటిషన్ దాఖలు చేశారు. ఈ సందర్భంగా ప్రదీప్ మాట్లాడుతూ గవర్నర్ నేరుగా సీఎం ప్రాసిక్యూషన్‌కు అనుమతులు ఇచ్చారని, దానిపై కోర్టు ద్వారా స్టే పొందే అవకాశం ఉంటుందని అన్నారు. అందుకే ముందుగానే కేవియట్ దాఖలు చేశానని తెలిపారు.

లోకం తీరు



వాట్సాప్ స్టేటస్‌కు లైక్ ఆప్షన్

వాషింగ్టన్, ఆగస్టు 17: ఇన్‌స్టాగ్రామ్ తరహాలో స్టేటస్‌ను లైక్ చేసే ఫీచర్‌ను అందుబాటులోకి తీసుకురానున్నట్లు దిగ్గజ మెసేజింగ్ యాప్ వాట్సాప్ ప్రకటించింది. అంతేకాదు.. తన మాతృసంస్థ 'మెటా'కు చెందిన 'మెటా ఏఐ వాయిస్'తో వాట్సాప్ ఎను అనుసంధానించి, వినియోగదారులు రియల్-టైమ్ వాయిస్ సంభాషణల్లో పాల్గొనేలా వీలు కల్పించనున్నట్లు తెలిపింది. మొదటి ఫీచర్‌ను ప్రస్తుతం పరిమిత సంఖ్యలో 2.24.17.21 బీటా వెర్షన్ వాట్సాప్ యూజర్లకు అందుబాటులోకి తీసుకువచ్చినట్లు.. వీరు స్టేటస్‌లను నేరుగా లైక్ చేసేలా స్క్రీన్ దిగువన 'హార్ట్' ఎమోజీ ఉంటుందని పేర్కొంది. దాన్ని క్లిక్ చేస్తే.. స్టేటస్ లైక్ అవుతుందని, తమ స్టేటస్‌ను ఎవరెవరు లైక్ చేశారనే దాన్ని వినియోగదారులు 'వ్యూస్' ఆప్షన్‌లో చూసుకోవచ్చని వివరించింది. రియల్-టైమ్ వాయిస్ సంభాషణల విషయంలో మెటాతో కలిసి పరిశోధనలు చేస్తున్నట్లు వెల్లడించింది.

వైద్యుల భద్రతా చర్యలపై కమిటీ!

- నియమిస్తామని ప్రకటించిన కేంద్రం
- దేశవ్యాప్తంగా స్తంభించిన ఓపీ సేవలతో తీవ్ర ఇబ్బందులు పడ్డ రోగులు



శ్రీనగర్‌లో నల్లబ్యాడ్జీలతో వైద్యుల నిరసన

న్యూఢిల్లీ, ఆగస్టు 17: డాక్టర్లు, ఇతర ఆరోగ్య సిబ్బంది భద్రతకు తీసుకోవాల్సిన చర్యల కోసం ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేయనున్నట్లు కేంద్ర ఆరోగ్య మంత్రిత్వశాఖ పేర్కొంది. సంబంధిత నిపుణులు, రాష్ట్ర ప్రభుత్వాలు తమ అభిప్రాయాలను కమిటీకి తెలపవచ్చునని వెల్లడించింది. కోల్‌కతాలో జూనియర్ వైద్యురాలిపై హత్యాచారం జరిగిన ఆర్జీ కర్ వైద్యకళాశాల, ఆస్పత్రిపై 40మంది దుండగులు దాడి చేసి.. విధ్వంసం సృష్టించిన నేపథ్యంలో మంత్రిత్వశాఖ ఈ నిర్ణయం తీసుకుంది. హత్యాచార ఘటన, ఆస్పత్రిపై దాడికి నిరసనగా భారత వైద్య మండలి (ఐఎంఏ) పిలుపు మేరకు శనివారం ఉదయం 6 గంటల నుంచి 24 గంటల పాటు దేశవ్యాప్తంగా ఆస్పత్రుల్లో 'నాన్ ఎమర్జెన్సీ' సర్వీసులు నిలిచిపోయాయి. ఫలితంగా ఓపీలు నిలిచిపోవడంతో రోగులు ఇబ్బందులుపడ్డారు. కాగా వైద్యుల భద్రతకు సంబంధించి ఐఎంఏ ఐదు డిమాండ్లు చేస్తోంది. ఎపిడమిక్ డిసీస్ యాక్ట్ 1897ను అనుసరించి 2019లో హాస్పిటల్ ప్రొటెక్షన్ బిల్లులో 2023లో పొందుపర్చిన సవరణలను అమలు చేయాలని, అప్పుడు వైద్యుల భద్రత పటిష్ఠం అవుతుందని ఐఎంఏ అంటోంది. వైద్యుల జీవన స్థితిగతులు, పనివేళలకు సంబంధించి పరిస్థితులను గణనీయంగా మెరుగుపర్చాలని డిమాండ్ చేస్తోంది. ఆర్జీ కర్ ఆస్పత్రిలో హత్యాచారానికి గురైన వైద్యురాలు అప్పటికీ వరుసగా 36 గంటలపాటు విధుల్లో ఉండటం, విశ్రాంతి తీసుకునేందుకు సరైన ఏర్పాట్లేవీ లేకపోవడం.. ఫలితంగానే ఆమె పట్ల ఘోరం జరిగిందని ఓ వైద్యుడు పేర్కొన్నారు. ఏ వైద్యుడైనా 8 గంటలు లేదా 12 గంటల వరకు నిర్విరామంగా పనిచేయగలరు. కానీ.. 36 గంటలపాటు ఎలా పనిచేయగలరు? ఈ స్థాయి పని ఒత్తిళ్లు అటు వైద్యులకు గానీ.. రోగులకు గానీ మంచిది కాదు అని చెప్పారు. ఐఎంఏ మూడో డిమాండ్.. విమానాశ్రయాల్లో అమల్లో ఉన్న భద్రతను ఆస్పత్రుల్లో పెట్టాలని. ఎయిర్‌పోర్టుల్లో మూడంచెల భద్రత ఉంటుందని.. కనీసం పెద్దాస్పత్రుల్లోనైనా ఈ స్థాయి భద్రత కల్పించాలని, సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని, భద్రతా సిబ్బందిని పెట్టాలని ఓ వైద్యుడు పేర్కొన్నారు. బాధిత కుటుంబానికి నేరతీవ్రతకు అనుగుణంగా న్యాయమైన, గౌరవప్రదమైన రీతిలో నష్టపరిహారం లభించాలనీ ఐఎంఏ అంటోంది. హత్యాచార ఘటనకు సంబంధించి దోషులకు, ఆస్పత్రిలో విధ్వంసానికి పాల్పడిన చట్టాలను అనుసరించి కఠిన శిక్ష పడాలని కోరుతోంది. ఇక ఆర్జీ కర్ వైద్య కళాశాల మాజీ ప్రిన్సిపల్ డాక్టర్ సందీప్ ఘోష్ వరుసగా రెండోరోజూ సీబీఐ ఎదుట హాజరయ్యారు.

పీఏసీ చైర్మన్‌గా కేసీ వేణుగోపాల్

న్యూఢిల్లీ, ఆగస్టు 17: పార్లమెంట్‌లో ప్రజాపద్దుల సంఘాన్ని(పీఏసీ) ఏర్పాటు చేస్తూ లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా శుక్రవారం ప్రకటన జారీ చేశారు. కాంగ్రెస్ సీనియర్ నేత కేసీ వేణుగోపాల్ ఈ సంఘానికి నేతృత్వం వహిస్తారు. 2024-25 సంవత్సరానికి గానూ కేంద్ర ప్రభుత్వ వ్యయానికి సంబంధించి ఈ కమిటీ ఆడిట్ నిర్వహిస్తుంది. లోక్‌సభ, రాజ్యసభ నుంచి 29 మంది సభ్యులు ఇందులో ఉంటారు. నలుగురు తెలుగు ఎంపీలకు ఈ కమిటీలో స్థానం లభించింది. లోక్‌సభ నుంచి బీజేపీ ఎంపీ సీఎం రమేశ్, టీడీపీ ఎంపీ మాగుంట శ్రీనివాసులు, జనసేన నుంచి ఎంపీ బాలశౌరి అలాగే రాజ్యసభ నుంచి డా.కె లక్ష్మణ్‌లకు అవకాశం దక్కింది. సాధారణంగా ప్రధాన ప్రతిపక్షానికి చెందిన సీనియర్ ఎంపీ పీఏసీ చైర్మన్‌గా వ్యవహరిస్తారు. అధీర్ రంజన్ చౌధురి గత చైర్మన్‌గా ఉన్నారు.

ఉమ్మడి స్మృతి ఆమోదయోగ్యం కాదు: ఏఐఎంపీఎల్‌బీ

న్యూఢిల్లీ, ఆగస్టు 17: ఉమ్మడి పౌర స్మృతి కోసం జరిగే ప్రయత్నాలేవీ ఆమోదయోగ్యం కాదని ఆల్ ఇండియా ముస్లిం పర్సనల్ లా బోర్డు శనివారం తెలిపింది. మతపరమైన పర్సనల్ చట్టాలు బదులు లౌకికవాద పర్సనల్ చట్టాలు కావాలంటూ ప్రధాని మోదీ చేసిన వ్యాఖ్యలను తప్పుపట్టింది. పర్సనల్ లా చట్టాలను మతపరమైన చట్టాలుగా ప్రధాని పేర్కొనడంపై అభ్యంతరం తెలిపింది. పర్సనల్ లా విషయంలో ముస్లింలు ఎన్నటికీ రాజీపడబోరని పేర్కొంది. తీవ్రమైన పరిణామాలు కలిగించేందుకు జరుగుతున్న వ్యూహాత్మక కుట్రలో భాగంగానే ప్రధాని ఇలాంటి ప్రకటన చేశారని ముస్లిం పర్సనల్ లా బోర్డు ఓ ప్రకటనలో పేర్కొంది. ముస్లింల కుటుంబ చట్టాలు షరియా చట్టాలకు అనుగుణంగానే ఉంటాయని తెలిపింది.

45 కేంద్ర ప్రభుత్వ పోస్టుల్లో నేరుగా నియామకాలు

న్యూఢిల్లీ, ఆగస్టు 17: నేరుగా నియామకాలు (లేటరల్ ఎంట్రీ) విధానం ద్వారా కేంద్ర ప్రభుత్వ మంత్రిత్వ శాఖల్లో ఉద్యోగాలు పొందేందుకు యూపీఎస్సీ దరఖాస్తులు ఆహ్వానించింది. కాంట్రాక్టు/డిప్యుటేషన్ ప్రాతిపదికన 24 శాఖల్లోని 45 పోస్టులు భర్తీ చేయనుంది. వీటిలో 10 జాయింట్ సెక్రటరీ, 35 డైరెక్టర్/డిప్యూటీ సెక్రటరీ పోస్టులు ఉన్నాయి. ప్రయివేటు సంస్థల ఉద్యోగులతో పాటు, రాష్ట్ర ప్రభుత్వం, స్వయం ప్రతిపత్తి సంస్థలు, ప్రభుత్వ రంగ సంస్థలు, బహుళ జాతి కంపెనీలు, విద్యా సంస్థల్లో పనిచేస్తున్నవారు దరఖాస్తు చేసుకోవచ్చు. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు మాత్రం ఈ అవకాశం లేదు. మూడేళ్ల కాంట్రాక్టు/డిప్యూటేషన్ ప్రాతిపదికన ఈ పోస్టులను భర్తీ చేస్తారు.

రాహుల్ పౌరసత్వం రద్దుకు ఢిల్లీ హైకోర్టులో పిల్

న్యూఢిల్లీ, ఆగస్టు 17: కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ పౌరసత్వాన్ని రద్దు చేసేలా కేంద్ర హోం శాఖను ఆదేశించాలని కోరుతూ బీజేపీ నాయకుడు సుబ్రహ్మణ్య స్వామి ఢిల్లీ హైకోర్టులో పిల్ దాఖలు చేశారు. ఆ పిల్ ప్రకారం.. రాహుల్ గాంధీ 2003లో యూకేకు చెందిన బ్యాక్‌ఆప్స్ లిమిటెడ్ అనే కంపెనీకి డైరెక్టర్, కార్యదర్శిగా వ్యవహరించారు. 2005 అక్టోబరు 10, 2006 అక్టోబరు 31న సమర్పించిన రిటర్నుల్లో రాహుల్ జాతీయతను బ్రిటిష్‌గా పేర్కొన్నారు. కంపెనీని రద్దు చేస్తూ 2009 ఫిబ్రవరి 17న సమర్పించిన దరఖాస్తులోనూ రాహుల్ జాతీయతను బ్రిటిష్‌గానే నమోదు చేశారు. ఇది రాజ్యాంగంలోని 9వ అధికరణం, భారత పౌరసత్వ చట్టం-1955కు వ్యతిరేకమని సుబ్రహ్మణ్య స్వామి 'పిల్'లో ఆరోపించారు. 9వ అధికరణం ప్రకారం ఎవరైనా విదేశీ పౌరసత్వాన్ని తీసుకుంటే వారు భారత పౌరసత్వాన్ని కోల్పోతారు.

ఉగ్రవాది రాణాను భారత్‌కు అప్పగించవచ్చు

వాషింగ్టన్, ఆగస్టు 17: ముంబయిపై జరిగిన ఉగ్రవాది దాడికి కీలక సూత్రధారిగా ఉన్న పాక్ జాతీయుడైన కెనడా వ్యాపారి తహవ్వుర్ హుస్సేన్ రాణా(63)ను భారత్‌కు అప్పగించవచ్చని అమెరికాలోని కాలిఫోర్నియాలోని 9వ సర్క్యూట్ అప్పీల్స్ కోర్టు తీర్పునిచ్చింది. నేరస్థుల పరస్పర అప్పగింతకు సంబంధించి భారత్-అమెరికాల మధ్య ఒప్పందం ఉన్నందున దాని ప్రకారం రాణాను విచారణ నిమిత్తం భారత్‌కు అప్పగించవచ్చని తెలిపింది. రాణా ప్రస్తుతం లాస్ ఏంజెల్స్ జైలులో శిక్ష అనుభవిస్తున్నాడు. 26/11 ముంబయి ఉగ్రదాడులకు వ్యూహం పన్నిన లష్కరేకు చెందిన పాకిస్థాన్-అమెరికన్ ఉగ్రవాది డేవిడ్ కోల్‌మెన్ హెడ్లీకి ప్రధాన అనుచరునిగా వ్యవహరించాడు.

కల్లోల బంగ్లాలో తెలుగు పరిమళం!

(గల్ఫ్ నుంచి ఆంధ్రజ్యోతి ప్రతినిధి)

బంగ్లాదేశ్‌లో నెలకొన్న అల్లకల్లోల పరిస్థితుల కారణంగా అక్కడి మైనారిటీలైన హిందువుల భద్రతపై ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. దేశవిభజన సమయంలో ఉన్న ప్రాంతాన్ని వదలి భారత్‌కు రాలేక ఎంతోమంది హిందువులు బంగ్లాదేశ్ (అప్పటి తూర్పు పాకిస్థాన్)లోనే ఉండిపోయారు. ఢాకా, సిలేటు ప్రాంతాల్లో కొన్ని తెలుగు కుటుంబాలూ ఉన్నాయి. ఇప్పుడు అక్కడ తెలుగువారి సంఖ్య వేలల్లోకి చేరింది. వీరిలో ఎక్కువగా ఏపీలోని విశాఖపట్నం, శ్రీకాకుళం ప్రాంతాలకు చెందిన వారే ఉన్నారు. తమ రక్తంలో ఇప్పటికీ తెలుగు సంస్కృతి ఉందని, ఇంట్లోనూ తెలుగులోనే మాట్లాడతామని చెప్పారు. అయితే తాము ముమ్మాటికీ బంగ్లాదేశ్ జాతీయులమేనని, బంగ్లాదేశ్ పౌరులమని చెప్పుకొనేందుకు గర్వపడతామని తెలుగు సంతతికి చెందిన ఏసు రత్నం పేర్కొన్నారు. చివరిసారిగా 2017లో ఏపీని సందర్శించినట్లు ఆయన చెప్పారు. సుందర్బన్ తీరంలోని సిలేటులో ఉంటున్న చొంప నాయుడు అనే మహిళా సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ భారత దౌత్యకార్యాలయంలో నిర్వహించే స్వాతంత్ర్య వేడుకలకు ప్రతి ఏడాది తప్పకుండా హాజరవుతుంటారు. శ్రీ వేంకటేశ్వర స్వామిని ఆరాధించే ఆమె, కొద్దికాలం క్రితమే తిరుమలకు వచ్చి వెళ్లారు. దుబాయిలో డ్రైవర్‌గా పనిచేసే రాజు, సౌదీలో డాక్టర్‌గా పనిచేస్తున్న శశిధర్ తమ తెలుగు సంస్కృతి సంప్రదాయాలకు పెద్దపీట వేస్తూనే తాము బంగ్లాదేశీయులమని చెప్పుకొంటారు. ఇలా దేశ విభజన సమయంలో కొన్ని కుటుంబాలు బంగ్లాదేశ్‌లోనే ఉండిపోగా.. మరికొన్ని హిందూ కుటుంబాలు మాత్రం పాక్ సైన్యం దాష్టీకాలను భరించలేక తెలంగాణ రాష్ట్రంలోని ఆదిలాబాద్ జిల్లా సిర్పూర్‌కు శరణార్థులుగా వచ్చారు. ఆహారపు అలవాట్లు, సంస్కృతి, సంప్రదాయాల పరంగా వీరు బెంగాల్ వారే. ఇప్పుడు వీరు అచ్చమైన భారతీయులు. ప్రతి సంవత్సరం జరిగే వేడుకల్లో స్వాతంత్ర్య వేడుకల్లో పాల్గొంటారు. కాగజ్‌నగర్ మండలంలో ప్రఖ్యాత బెంగాల్ కవి నజ్రూల్ పేరిట ఉన్న నజ్రుల్ నగర్ గ్రామంలో ప్రతి ఏడాది జరిగే దుర్గామాత ఉత్సవాల్లో పాల్గొంటారు. సిర్పూర్-కాగజ్‌నగర్‌లో వీరిది కీలక ఓటు బ్యాంకు కావడం గమనార్హం.

చైనా బీఆర్‌ఐ ప్రమాదకరం

ఆసియా దేశాలను అప్పుల్లో ముంచేస్తోంది.. గ్లోబల్ సౌత్ సదస్సులో మోదీ



న్యూఢిల్లీ, ఆగస్టు 17: ఉగ్రవాదం, తీవ్రవాదం, వేర్పాటువాదం అతి పెద్ద ముప్పుగా పరిణమించాయని, వీటి నుంచి మన సమాజాలను కాపాడుకోవాల్సిన అవసరం ఉందని ప్రధాని మోదీ నొక్కి చెప్పారు. శనివారం జరిగిన 'గ్లోబల్ సౌత్ దేశాల గళం' సదస్సులో వర్చువల్‌గా ఆయన ప్రసంగించారు. గ్లోబల్ సౌత్ దేశాలకు పరస్పర వాణిజ్యం, సమ్మిళిత వృద్ధి, సుస్థిరాభివృద్ధి లక్ష్యాల సాధనలో భారత్ సహకరిస్తుందని తెలిపారు. ఆయా దేశాలు ఐక్యంగా ఉండడం ద్వారా ఆరోగ్య, ఆహార, ఇంధన భద్రత విషయంలో తలెత్తుతున్న సవాళ్లను అధిగమించేందుకు అవకాశం ఉంటుందన్నారు. అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థల్లో భారతదేశ డిజిటల్ పబ్లిక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్(డీపీఐ) వినియోగాన్ని వేగవంతం చేసేందుకు ఏర్పాటు చేసిన సామాజిక ప్రభావ నిధికి ప్రాథమికంగా 25 మిలియన్ డాలర్ల(దాదాపు రూ.200 కోట్లు) సహకారాన్ని ప్రకటించారు. ఇతర దేశాలతో అభివృద్ధి భాగస్వామ్యం పంచుకునేందుకు భారత్ దేశ సొంత అభివృద్ధి, అనుభవాల ఆధారంగా గ్లోబల్ డెవలప్‌మెంట్ కంపాక్ట్(జీడీసీ)ను ప్రధాని ప్రతిపాదించారు. ఇది గ్లోబల్ సౌత్ దేశాలు ప్రతిపాదించిన అభివృద్ధి ప్రాధాన్యాలపైనా దృష్టి పెడుతుందన్నారు. అభివృద్ధి పేరుతో అప్పులు చేస్తున్న దేశాలకు కూడా గ్లోబల్ డెవలప్‌మెంట్ కంపాక్ట్ ఎలాంటి భారం మోపదని తెలిపారు. భాగస్వామ్య దేశాలకు సుస్థిరాభివృద్ధిలో సహకారం అందిస్తుందన్నారు. చైనా ప్రతిపాదిత బెల్ట్ అండ్ రోడ్ ఇనిషియేటివ్(బీఆర్‌ఐ)ని ప్రధాని మోదీ తీవ్రంగా విమర్శించారు. దీనివల్ల నిలకడలేని ప్రాజెక్టులకు వేల కోట్ల రూపాయల రుణాలు ఇవ్వడం ద్వారా ఆసియా, ఆఫ్రికా దేశాలను అప్పుల ఊబిలో కూరుకుపోయేలా చేస్తోందని అన్నారు. బీఆర్‌ఐకి ప్రత్యామ్నాయంగా గ్లోబల్ డెవలప్‌మెంట్ కంపాక్ట్‌ను అందిపుచ్చుకోవాలన్నారు. దీనివల్ల వాణిజ్యం వృద్ధి చెందుతుందని, సుస్థిరాభివృద్ధిలో సామర్థ్య నిర్మాణం పెరుగుతుందని, సాంకేతికతను ఇచ్చిపుచ్చుకోవచ్చని, ప్రాజెక్టుల కోసం రాయితీ రుణాలు, గ్రాంట్లను పొందే అవకాశం ఉంటుందని వివరించారు. వాణిజ్య కార్యకలాపాలను బలోపేతం చేసేందుకు రూ.21కోట్ల (2.5 మిలియన్ డాలర్ల)తో ప్రత్యేక నిధి ప్రారంభిస్తున్నట్టు చెప్పారు. అదేవిధంగా వాణిజ్య విధానాలపై శిక్షణకు రూ.8 కోట్ల(1 మిలియన్ డాలర్ల)తో మరోనిధిని ఏర్పాటు చేస్తున్నామన్నారు.

గ్లోబల్‌కు జనరిక్ ఔషధాలు

గ్లోబల్ సౌత్ దేశాలకు చౌక ధరలకే సమర్థవంతమైన జనరిక్ ఔషధాలను అందుబాటులో ఉంచుతామని ప్రధాని మోదీ తెలిపారు. 'ఆరోగ్య మైత్రి' కింద ఆఫ్రికా, పసిఫిక్ ఐలాండ్ దేశాలకు డయాలిసిస్ మిషన్లను, ప్రాణాధారిత ఔషధాలను అందించామని, అదేవిధంగా ఆసుపత్రులు, జన్ ఔషధి కేంద్రాలను ఏర్పాటు చేశామని వివరించారు. గ్లోబల్ సౌత్ దేశాల్లో తలెత్తిన ఉద్రిక్తతలు, సంఘర్షణలపై ప్రధాని ఆందోళన వ్యక్తం చేశారు. 'ఇది చాలా తీవ్రమైన విషయం' అని వ్యాఖ్యానించారు. సవాళ్లను అధిగమించేందుకు గ్లోబల్ సౌత్ దేశాలు ఐక్యంగా ఉండాలన్నారు.

ఎన్నో సవాళ్లు

"మనం ఇప్పటికే అనేక సవాళ్లను ఎదుర్కొంటున్నాం. వాతావరణ మార్పులు, ఉగ్రవాదం, తీవ్రవాదం, వేర్పాటువాదాలు మన సమాజాలకు తీవ్ర సవాళ్లుగా పరిణమించాయి" అని ప్రధాని మోదీ తెలిపారు. సాంకేతికత కారణంగా తలెత్తుతున్న సామాజిక సవాళ్లు పుట్టుకొస్తున్నాయన్నారు. గత శతాబ్దపు పాలన, సంస్థలు ఈ శతాబ్దపు సవాళ్లతో పోరాడలేక పోతున్నాయని తెలిపారు. 2022లో జీ-20 సదస్సుకు నేతృత్వం వహించిన భారత్.. గ్లోబల్ సౌత్ గళాన్ని వినిపించే వేదికను సృష్టించిందన్నారు.

విస్తరిస్తున్న ఎంపాక్స్

ఆఫ్రికా నుంచి ఇతర దేశాలకు వ్యాప్తి.. డబ్ల్యూహెచ్‌వో హెల్త్ ఎమర్జెన్సీ ప్రకటన

కాంగోలో ఈ ఏడాది 350 మంది మృతి.. వైరస్‌కు మశూచి టీకాతో ఉపశమనం



జెనీవా/న్యూఢిల్లీ, ఆగస్టు17: ఆఫ్రికా దేశాలను వణికిస్తున్న ఎంపాక్స్(కోతుల నుంచి వ్యాపించే అరుదైన వ్యాధి) ఇప్పుడు పాకిస్థాన్‌కూ వ్యాపించింది. ముగ్గురు వ్యక్తుల్లో ఎంపాక్స్ లక్షణాలు ఉన్నట్టు పాక్ వైద్యులు నిర్ధారించారు. వారిని ఐసోలేషన్‌లో ఉంచారు. కొన్నాళ్లుగా ఆఫ్రికా దేశాల్లో ఎంపాక్స్ విస్తరించింది. దీంతో గతంలోనే ఓసారి ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌వో) ఆరోగ్య అత్యయిక స్థితిని ప్రకటించింది. ఇప్పుడు మరోసారి హెల్త్ ఎమర్జెన్సీని ప్రకటించడం గమనార్హం. ఎంపాక్స్ సోకిన వారితో కలివిడిగా ఉండే వ్యక్తులకు ఇది వ్యాపిస్తోందని డబ్ల్యూహెచ్‌వో తెలిపింది. ఎంపాక్స్‌కు అడ్డుకట్ట వేసేందుకు అంతర్జాతీయ సమాజం సహకరించాలని డబ్ల్యూహెచ్‌వో డైరెక్టర్ జనరల్ టెడ్రోస్ అథనామ్ ఘెబ్రెయాసస్ పిలుపునిచ్చారు. ఇప్పటికే కాంగో సహా చుట్టుపక్క దేశాల్లో ఎంపాక్స్ తీవ్రంగా విస్తరించినట్టు తెలిపారు.

- ఆఫ్రికా దేశాలకు వెలుపల తొలి కేసు స్వీడన్‌లో నమోదైనట్టు ఆదేశం ప్రకటించింది. వైరస్ సోకిన వ్యక్తి కొన్ని రోజులు ఆఫ్రికాలో పర్యటించి వచ్చినట్టు స్వీడన్ ఆరోగ్య శాఖ డైరెక్టర్ జనరల్ విగ్‌జెల్ ప్రకటించారు.
- పాకిస్థాన్‌లో ఒకే రోజు 3ఎంపాక్స్ కేసులు నమోదైనట్టు ఖైబర్ పఖ్తున్వా ప్రావిన్స్ ఆరోగ్య విభాగం ప్రకటించింది. యూఏఈ నుంచి వచ్చిన వారు అనారోగ్యంతో ఇబ్బంది పడగా పరీక్షిస్తే లక్షణాలు కనిపించినట్టు తెలిపింది.
- తమ దేశంలోకి వచ్చే విదేశీ పౌరులు, వస్తు సామాగ్రిని వచ్చే 6మాసాల వరకు నిశితంగా పరీక్షించాలని నిర్ణయించుకున్నట్టు చైనా తెలిపింది. ఎంపాక్స్ విస్తరించిన దేశాల నుంచి వచ్చే వారిని స్క్రీనింగ్ చేయనున్నట్టు పేర్కొంది.
- గత ఏడాదే ఎంపాక్స్‌పై చైనా అప్రమత్తమైంది. దీన్ని కేటగిరీ-బీ అంటువ్యాధిగా పేర్కొంటూ కొన్ని ఆదేశాలు జారీచేసింది. దీని ప్రకారం అవసరమైతే పాఠశాలలు, కార్యాలయాలను మూసివేయాలని పేర్కొంది.
- ఆఫ్రికాలో ఈ ఏడాది తొలి 6 మాసాల్లోనే 17 వేల కేసులు నమోదైనట్టు డబ్ల్యూహెచ్‌వో వెల్లడించింది. ఇప్పటి వరకు 500మంది మృతి చెందినట్టు తెలిపింది. ఈ నేపథ్యంలోనే మరోసారి హెల్త్ ఎమర్జెన్సీని ప్రకటించినట్టు పేర్కొంది.
- ఎంపాక్స్ తొలినాళ్లలో ఆఫ్రికాకే పరిమితమైనా 2022 ద్వితీయార్థం నుంచి నైజీరియాకు, అక్కడ నుంచి ఇతర దేశాలకు విస్తరించింది.
- ఆఫ్రికా ఖండంలోని దాదాపు అన్ని దేశాల్లో ఎంపాక్స్ కేసులు నమోదైనట్టు డబ్ల్యూహెచ్‌వో పేర్కొంది. ఎంపాక్స్ లక్షణాలు, తీవ్రతను బట్టి 2 కేటగిరీలుగా విభజించారు. ఆఫ్రికాలో తీవ్రమైన లక్షణాలున్న కేసులను కేటగిరీ-1గా పేర్కొన్నారు. ఇవి మరణాలు పెరగడానికి దారితీస్తున్నట్టు తెలిపింది. స్వల్పలక్షణాలు, విస్తరణ వేగం ఉన్న కేటగిరీ-2 ప్రపంచ దేశాల్లో విస్తరిస్తున్నట్టు పేర్కొంది. ఎంపాక్స్‌గా పేర్కొనే అంటువ్యాధి కోతుల నుంచి ఇతర జీవులకు, మనుషులకు వ్యాపిస్తుంది. ఇది మశూచి తరహా అంటువ్యాధి. గత ఏడాది జనవరి నుంచి కాంగోలో 27 వేల కేసులు నమోదు కాగా 11వందల మంది మృతి చెందిన రాయిటర్స్ వెల్లడించింది. ఈ ఏడాది తొలి 6మాసాల్లో 8వేల కేసులు నమోదు కాగా 350 మంది మృతి చెందారని పేర్కొంది. చిన్నారుల్లో మంకీపాక్స్ కేసులు ఎక్కువగా నమోదవుతున్నాయి. కోతుల నుంచి వ్యాపిస్తున్న వైరస్ కావడంతో తొలినాళ్లలో దీనికి 'మంకీ పాక్స్'గా పేరు పెట్టారు. 2022 నవంబరులో మంకీపాక్స్ పేరును 'ఎంపాక్స్'గా నిర్ధారించారు.

లక్షణాలు ఇవీ..

ఎంపాక్స్ వైరస్ సోకిన వారు జ్వరం, చలి, శారీరక, కండరాల నొప్పులతో ఇబ్బంది పడతారు. అరచేతులు, పాదాలు, ముఖం, జననేంద్రియాలు, నోటిపై కురుపుల వంటి దద్దుర్లు ఏర్పడతాయి. కొన్ని తీవ్ర కేసుల్లో మెదడు ఉబ్బడం, ఊపిరితిత్తుల్లోకి నీరు చేరడం, రక్త ప్రసరణలో ఇన్‌ఫెక్షన్, అంధత్వం వంటివీ కనిపిస్తాయి. వైరస్ సోకిన వారు దాదాపు 2 నుంచి 4 వారాల్లో కోలుకునే అవకాశం ఉంది. ఎంపాక్స్ నుంచి కోలుకునేందుకు ఎంవీఏ-బీఎన్ టీకాను తీసుకోవాల్సి ఉంటుంది. ఇది మశూచి కోసం తయారు చేసిందే అయినా ఎంపాక్స్ మశూచి కుటుంబానికి చెందిన వైరస్ కావడంతో ఈ టీకా ప్రభావవంతంగా పనిచేస్తుందని వైద్యులు చెబుతున్నారు.

ఎలా విస్తరిస్తుంది?

వైరస్ సోకిన జంతువుల, మనుషులను స్పృశించినా, శృంగారం చేసినా, వైరస్ సోకిన జంతువు మాంసాన్ని భుజించినా ఎంపాక్స్ సోకుతుంది. అదేవిధంగా వైరస్ సోకిన జంతువులు కరిచినా, గోటి గీతలు పడినా వైరస్ అంటుకుంటుంది. అమెరికా సహా పలు దేశాల్లోని కుక్కల్లోనూ ఈ వైరస్ కనిపించినట్టు నివేదికలు చెబుతున్నాయి.

దేశంలో మంకీపాక్స్ కేసులు లేవు

న్యూఢిల్లీ, ఆగస్టు 17: మంకీపాక్స్ వ్యాప్తిని హెల్త్ ఎమర్జెన్సీగా డబ్ల్యూహెచ్‌ఓ ఇటీవల ప్రకటించిన నేపథ్యంలో.. దేశంలో పరిస్థితులపై కేంద్ర ఆరోగ్యశాఖమంత్రి జేపీ నడ్డా శనివారం సమీక్ష నిర్వహించారు. దేశంలోని అన్ని విమానాశ్రయాలు, నౌకాశ్రయాలు, సరిహద్దుల వద్ద ఉన్న ఆరోగ్య కేంద్రాలను అప్రమత్తం చేయాలని ఈ సమావేశంలో నిర్ణయించారు. దేశవ్యాప్తంగా పరీక్ష కేంద్రాలను సన్నద్ధం చేయాలని, కేసులు బయటపడితే వ్యాప్తి జరగకుండా రోగిని ఐసోలేషన్‌లో ఉంచి చికిత్స అందించటానికి వీలుగా ఆస్పత్రులను సంసిద్ధం చేయాలని కూడా నిర్ణయం తీసుకున్నారు. ప్రస్తుతం దేశంలో మంకీపాక్స్ కేసులు లేవని కేంద్ర ఆరోగ్య శాఖ ఓ ప్రకటనలో వెల్లడించింది. రానున్న రోజుల్లో మంకీపాక్స్ కేసులు బయటపడ్డా దేశంలో అది ఒక మహమ్మారిలా వ్యాప్తి చెందే అవకాశాలు లేవని అందులో పేర్కొంది. మంకీపాక్స్‌పై డబ్ల్యూహెచ్‌ఓ తొలిసారిగా 2022లో హెల్త్ ఎమర్జెన్సీ హెచ్చరికను జారీ చేసిన విషయాన్ని గుర్తు చేస్తూ.. నాటి నుంచి ఈ ఏడాది మార్చి వరకు దేశంలో 20 కేసులు నమోదయ్యాయని తెలిపింది.

రెసిడెన్సీ సర్టిఫికెట్లతో వెయ్యి మందికి పైగా దరఖాస్తు

- ముగిసిన నీట్ కౌన్సెలింగ్ దరఖాస్తు ప్రక్రియ

హైదరాబాద్, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని మెడికల్ కాలేజీల్లో అడ్మిషన్లకు సంబంధించి 'స్థానికత' ధ్రువీకరణ కోసం రెసిడెన్సీ సర్టిఫికెట్లను కూడా పరిగణలోకి తీసుకోవాలన్న హైకోర్టు ఆదేశాల నేపథ్యంలో వెయ్యి మందికి పైగా అభ్యర్థులు ఈ తరహా సర్టిఫికెట్లతో మెడికల్ కౌన్సెలింగ్ కోసం దరఖాస్తు చేసుకున్నారు. తెలంగాణలో నీట్ కౌన్సెలింగ్ దరఖాస్తు ప్రక్రియ గురువారంతో ముగిసింది. మొత్తం 17,700 దరఖాస్తులు వచ్చాయి. గతేడాది 23వేల పైచిలుకు అప్లికేషన్లు రాగా.. ఈ ఏడాది ఆంధ్రప్రదేశ్‌కు చెందిన విద్యార్థులు దరఖాస్తు చేయకపోవడంతో ఆరు వేల దరఖాస్తులు తగ్గాయి. ప్రస్తుతం తెలంగాణలో 8,715 ఎంబీబీఎస్ సీట్లున్నాయి. ఇందులో బీబీనగర్ ఎయిమ్స్‌కు చెందిన 100సీట్లు, ఈఎస్ఐ సనత్‌నగర్‌లో 150 సీట్లకు చెందిన కౌన్సెలింగ్‌ను కేంద్రమే నిర్వహిస్తుంది. మిగతా సీట్లకు హెల్త్ యూనివర్సిటీ కౌన్సెలింగ్ నిర్వహించి, సీట్లను కేటాయిస్తుంది. ప్రస్తుతం ప్రభుత్వ మెడికల్ కాలేజీల్లో 4,115 సీట్లున్నాయి. ఇందులో 15% అంటే 617 సీట్లు అఖిల భారత కోటాకు వెళ్తాయి. మిగిలిన 3,498 సీట్లను కన్వీనర్ కోటా కింద భర్తీ చేస్తారు. ప్రైవేటులో 4,600 సీట్లుండగా.. అందులో 50% అంటే 2,300 సీట్లను కూడా కన్వీనర్ కోటాలోనే హెల్త్ వర్సిటీ భర్తీ చేస్తుంది. ఇదిలా ఉండగా, కొందరు అభ్యర్థులు అర్హత లేకపోయినప్పటికీ రెసిడెన్సీ సర్టిఫికెట్లు పొంది కౌన్సెలింగ్ కోసం దరఖాస్తు చేసుకున్నట్లు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.

ఇంటి స్థలాలకూ పాస్ పుస్తకాలు

(మొదటి పేజీ తరువాయి)

కొత్త ఆర్వోఆర్ అవకాశం కల్పిస్తోంది. సెక్షన్2(12), 5, 7, 8 సెక్షన్ల ప్రకారం భూమిని మూడు కేటగిరీలుగా విభజించి, హక్కులు కల్పిస్తారు. సెక్షన్-5 ప్రకారం భూమి రిజిస్ట్రేషన్, మ్యుటేషన్‌లో అభ్యంతరాలుంటే.. మ్యుటేషన్‌ను నిలిపివేసే అవకాశాన్ని అధికారులకు కల్పించారు. అయితే.. మ్యుటేషన్‌ను నిలిపివేసే అధికారులు అందుకు తగ్గ కారణాలను లిఖిత పూర్వకంగా స్పష్టంగా పేర్కొనాల్సి ఉంటుంది. తహసీల్దార్ స్థాయిలో మ్యుటేషన్ నిలిచిపోతే.. అప్పీల్‌కు అవకాశం ఉంటుంది. వీలునామాలు, వారసత్వ ఆస్తి పంపకాల విషయంలో క్షేత్రస్థాయిలో విచారణ చేశాకే.. మ్యుటేషన్ ప్రక్రియను పూర్తి చేయాలని కొత్త చట్టం చెబుతోంది. లేనిపక్షంలో మ్యుటేషన్‌కు అవకాశం ఉండదు.

మూడుదశల్లో ధరణి లోపాల సవరణ

ధరణిలో లోపాల కారణంగా రోజుకు సగటున వెయ్యికిపైగా సవరణ దరఖాస్తులు వస్తున్న విషయం తెలిసిందే.! కొత్త ఆర్వోఆర్ ప్రకారం ప్రభుత్వం మూడు దశల్లో ధరణి పోర్టల్‌లో ఉన్న లోపాలను సవరించనుంది. భూ సమస్యలను కూడా మూడంచెల్లో పరిష్కరించనుంది. తొలి దశలో పాస్‌పుస్తకాల్లో ఉన్న తప్పులను సవరిస్తారు. రెండో దశలో తాత్కాలిక భూధార్ కార్డులను అందజేస్తారు. వీటిలో జియోఫెన్సింగ్ వివరాలు, క్యూఆర్ కోడ్ ఉంటాయి. క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేస్తే.. సరిహద్దులతో సహా.. రైతుల భూముల వివరాలు తెలిసిపోతాయి. ఈ విధానం అమల్లోకి వస్తే.. భూధార్ అందజేసిన మొదటి రాష్ట్రంగా తెలంగాణ నిలవనుంది. మూడో దశలో క్షేత్రస్థాయిలో తప్పొప్పులపై సమగ్ర విచారణ జరుపుతారు. ఇలా.. ధరణిలో గుర్తించిన 45 రకాల సమస్యలకు పరిష్కారం లభించనుంది. సగటున ప్రతి గ్రామానికి 200 మంది రైతులు ధరణి సమస్యలతో సతమతమవుతుండగా.. వారందరికీ సాంత్వన లభించనుంది.

ఆర్వోఆర్ ఎలా వచ్చిందంటే..?

ఆర్వోఆర్ అనే వ్యవస్థ పుట్టుక వెనుకాల చాలా చరిత్ర ఉంది. బ్రిటిష్ హయాంలో తొలిసారి ఈ విధానం అమల్లోకి వచ్చింది. అంతకు ముందు దేశంలో ప్రజలకు భూమితో ఎలాంటి సంబంధం ఉండేది కాదు. కాలక్రమంలో సమూహాలుగా భూములను అనుభవిస్తున్న రైతులకు హక్కుపత్రాలు ఇచ్చేందుకు బ్రిటిష్ వారు ఆర్వోఆర్ విధానాన్ని పరిచయం చేశారని భూచట్టాల నిపుణుడు సునీల్ 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు. పన్ను వసూళ్లకు ఈ విధానాన్ని అమలు చేశారని, ఆ తర్వాత చట్టాలుగా ఆర్వోఆర్ రూపాంతరం చెందిందని వివరించారు.



ఆర్వోఆర్ ముసాయిదాను ప్రజల్లోకి తీసుకువెళతాం

- ప్రకటించిన లైసెన్స్ సర్వేయర్లు
- భూ యజమానుల హక్కులు కాపాడాలంటే సమగ్ర చట్టం తేవాలి
- తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం

హైదరాబాద్, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం కొత్తగా తీసుకురానున్న ఆర్వోఆర్-2024 ముసాయిదాను ప్రజల్లోకి తీసుకువెళతామని లైసెన్స్ సర్వేయర్లు వెల్లడించారు. హైదరాబాద్ లక్డీకపూల్‌లో నిర్వహించిన సమావేశంలో ఆర్వోఆర్-2024 ముసాయిదాపై చర్చించారు. సమావేశానికి డిప్యూటీ కలెక్టర్ల అసోసియేషన్ అధ్యక్షుడు లచ్చిరెడ్డి, భూ చట్టాల నిపుణుడు సునీల్ హాజరయ్యారు. లచ్చిరెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం తీసుకొస్తున్న కొత్త ఆర్వోఆర్ ద్వారా భూ సమస్యలకు పరిష్కారం దొరుకుతుందని వివరించారు. సునీల్ మాట్లాడుతూ ప్రతి లైసెన్స్ సర్వేయర్ గ్రామీణ ప్రజలకు ఆర్వోఆర్ చట్టంపై అవగాహన కల్పించాలని సూచించారు. సర్వేయర్లు మాట్లాడుతూ ముసాయిదా చట్టంపై ప్రజలకు అవగాహన కల్పిస్తామని చెప్పారు. భూ యజమానుల హక్కులను పూర్తిస్థాయిలో కాపాడాలంటే ప్రభుత్వం ఆర్వోఆర్-2024చట్టాన్ని సమగ్రంగా తీసుకురావాలని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం అభిప్రాయపడింది. ఆర్వోఆర్-2024 ముసాయిదాపై హైదరాబాద్‌లో శనివారం రౌండ్‌టేబుల్ సమావేశాన్ని ఏర్పాటు చేశారు. రైతులు ఎదుర్కొంటున్న సమస్యలకు చట్టబద్ధమైన రక్షణ కల్పించాలని రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పశ్య పద్మ కోరారు.



ఆంధ్రజ్యోతి తలంబ్రాలు

వరుడు కావలెను



★ రెండవ మ్యారేజ్ /విడో / 45y/Govt. Job/ Own Villa / Rents / Lands / మంచి ఆస్తి, ఆర్థికంగా స్థిరపడిన అందమైన వధువుకు కుల ప్రసక్తి లేని వరుడు కావలెను. ఫోన్ : 9676896226 AJH-002575

★ 55y / రెండవ పెళ్ళి / విడో / ఫెయిర్ / GOVT.JOB./ పిల్లలు లేరు / సొంత ఇల్లు రెంట్స్ / వెల్ సెటిల్డ్ / ఎలాంటి బాదరబందీలేని అందమైన వధువు FC/BC వరుడు కావలెను. ఫోన్ : 7995376608 AJH-4265

★ 59y / రెండవ పెళ్ళి / విడో / ఫెయిర్ / GOVT. ఫ్యామిలీ పెన్షనర్ / పిల్లలు లేరు / సొంత ఇల్లు రెంట్స్ /వెల్ సెటిల్డ్ / ఏలాంటి బాదరబందీలేని ఏకైక వధువుకు వరుడు కావలెను. ఫోన్ : 9030858258 AJH-4265

★ కుల పట్టింపు లేదు / కమ్మ / 42y/5'6"/ విడో / కార్డియాలజీ / మంచి ఆస్తి గల వధువుకి 1వ, 2వ వరుడు కావలెను. send me details వాట్సాప్ : 8501815711 AJH-002508

★ కుల పట్టింపు లేదు / కమ్మ / 2nd మ్యారేజ్ / 43y/5'5"/ డాక్టర్ / రేడియాలజిస్ట్ / మంచి ఆస్తి గల వధువుకు 1వ, 2వ వరుడు కావలెను. వాట్సాప్ : 9542494557 AJH-002508

★ రెడ్డి 2nd, కుల, మత, ఆస్తి పట్టింపు లేదు / Q: డిగ్రీ / ఎత్తు 5.4, బిజినెస్‌లు గల అందమయిన వధువుకి వరుడు కావలెను. 1st/2nd . అన్ని కులాల వారి కి సంబంధాలకై ఫోన్ : 9032596676 AJH-16348

★ రెడ్డి 2nd విడో (కుల/మత/ఆస్తి) ప్రసక్తి లేదు. 30y/ డిగ్రీ / సొంత ఇల్లు & ప్రాపర్టీలు / వెల్‌సెటిల్డ్ అందమైన వధువుకి 1వ/2వ వరుడు కావలెను. అన్ని వయస్సుల వారికి సంబంధాలకై ఫోన్ : 9392332143 AJH-16348

★ రెడ్డి విడో / కుల, ఆస్తి, ప్రసక్తి లేదు / 35y / B.Com / Pvt. Job కలిగిన అందమయిన వధువుకి వరుడు కావలెను. All caste marriage Available. Ph: 8121347478 AJH-16348

★ కమ్మ / Unmarried / 28y/5'4"/Gynecologist / ట్రాన్స్ పోర్ట్ బిజినెస్ / మంచి ప్రాపర్టీ గల అందమైన వధువుకు కుల పట్టింపు లేని వరుడు కావలెను. Ph: 9493443837 AJH-16348

★ వడ్డెర / CA / చార్టెడ్ అకౌంటెంట్ / మంచి జీతం / 5'4" ఎత్తు / 26 సం.ల అందమైన వధువుకు వరుడు కావలెను. ఫోన్ : 9618579861 AJH-16347

★ SC మాల / ఏకైక కుమార్తె / M.Sc / Govt. Food Inspector / Good Salary / 5'3'ఎత్తు / 26 సం.ల అందమైన వధువుకు వరుడు కావలెను. ఫోన్ : 8897389698 AJH-16347

★ 2వ పెళ్ళి / బ్రాహ్మణ / 30y / 5'3' / డిగ్రీ / Pvt. జాబ్ / అందమైన వధువుకు తగిన జాబ్ / బిజినెస్ / పురోహితం వరుడు కావలెను. ఫోన్ : 9701743336 AJH-16347

★ ఆస్తి, కుల పట్టింపులేదు / రెడ్డి, విడో, 30y / 5'3' / డిగ్రీ / మంచి ప్రాపర్టీ కలిగి పిల్లలు లేని వధువుకు వరుడు కావలెను. మీ ఫోటోలు వాట్సాప్‌లో సెండ్ చెయ్యండి. ఫోన్ : 9133640971 AJH-16347

★ బ్రాహ్మణ / 27y/5'4"/ 1st మ్యారేజ్ / Q:10th Class / Own Business / 2nd మ్యారేజ్ also OK, పౌరోహితం also OK, వరుడు కావలెను. ఫోన్ : 9347422789 AJH-002575

★ M, MD, ... AJD:186547

★ కుల, ఆస్తి పట్టింపు లేదు / విడో / 57 Y / Govt. జాబ్ / ఓన్ బిజినెస్ / రెంట్స్ / Lands / మంచి ప్రాపర్టీ, ఎలాంటి బాదరబందీ లేని వధువుకు వరుడు కావలెను. సంప్ర. 86880 47144 AJB-368

★ విశ్వబ్రాహ్మిన్స్.(ఆచారులు) : 27 సం॥రాలు, సొంత ఇల్లు, ఫాదర్ కార్పెంటర్ వర్క్, బ్రదర్ మ్యారీడ్‌గా ఉన్న అమ్మాయికి సాంప్రదాయ వరుడు కావలెను. సెల్ : 91213 29753 AJL_195785

★ చౌదరి : 1st మ్యారేజ్, 27 సం॥రాలు, 5.4 డిగ్రీ, సొంత ఇల్లు, స్థిరాస్తి, ఫాదర్ బిజినెస్ ఉన్న అమ్మాయికి ఏదైనా జాబ్ లేదా బిజినెస్ వరుడు కావలెను. సెల్ : 91213 29753 AJL_195785

★ యాదవ్స్ (పూరి, ఎర్ర, అళ్ల) గొల్లలు : మొదటి సంబంధం, రెండవ సంబంధం, వయస్సు 25 To 40 సం॥రాలు,10 to డిగ్రీ, చదివిన అమ్మాయిలకు వరులు కావలెను. సెల్ : 91213 29753 AJL_195785

★ (పద్మశాలి) దేవాంగులు :1995 B.Tech సొంత ఇల్లు ఉన్న అమ్మాయికి ఏదైనా బిజినెస్ లేదా సాఫ్ట్‌వేర్ అబ్బాయి ఆంధ్ర, తెలంగాణాలలో సాంప్రదాయ కుటుంబ వరుడు కావలెను. సెల్ : 91213 29753 AJL_195785

★ తొగట వీరక్షత్రియ : 1st మ్యారేజ్, 26 సం॥రాలు, సొంత ఇల్లు, డిగ్రీ, స్థిరాస్తి ఉన్న అమ్మాయికి ఏదైనా జాబ్ లేదా బిజినెస్ వరుడు కావలెను. సెల్ : 91213 29753 AJL_195785

★ బలిజ : మొదటి సంబంధం 26సం॥రాలు, డిగ్రీ, ప్రైవేట్ జాబ్, సొంత ఇల్లు, బ్రదర్స్, ఫాదర్ వ్యవసాయం ఉన్న అమ్మాయికి సాంప్రదాయ కుటుంబ వరుడు కావలెను. సెల్ : 91213 29753 AJL_195785

★ వెలమ, తెలగ, కాపు : 1st మ్యారేజ్, 2వ పెళ్లి, 26 To 45 సం॥రాల వారికి, ఆంధ్ర, తెలంగాణాలలో ఏదైనా సంబంధం కావలెను. సెల్ : 91213 29753 AJL_195785

★ రెడ్డి : 27 సం॥రాలు, డిగ్రీ, సొంత ఇల్లు ఫాదర్ వ్యవసాయం, టైలరింగ్ ఉన్న అమ్మాయికి సాంప్రదాయ కుటుంబ వరుడు కావలెను. సెల్ : 91213 29753 AJL_195785

వధువు కావలెను



★ రెడ్డి / 30y / 5'6"/ ప్లాంట్ ఆపరేటర్ / సొంత ఇల్లు / పొలం గల వరునికి తగిన వధువు కావలెను. నో బ్రోకర్స్. డైరెక్ట్ సంప్ర: 6303172635 / 9346867507 AJH-4265

★ డైరెక్ట్ / కుల పట్టింపు లేదు / మున్నూరుకాపు / 32y / 5'8"/Bhmd/ లెక్చరర్ / హైద్రాబాద్ / మంచి జీతం / ఆస్తి గల వరునికి 1వ / 2వ తగిన వధువు కావలెను. ఫోన్ : 9440122661 AJH-4265

★ పద్మశాలి (కుల ప్రసక్తి లేదు) / 44y / 5'8"/SW ENG మంచి జీతం / పెళ్లి కాని వరునికి SW/ పీజీ వధువు కావలెను. డైరెక్ట్ /(నో బ్రోకర్స్)/ Whatsapp 9912252833 AJH-002508

★ SC/ మాల హిందూ / B.TECH,MS 30 / USA H1B వీసా and 140 MNC మంచి జీతం / 6 ఫీట్ ఎత్తు భాగ స్థిరపడిన కుటుంబానికి చెందిన వరుడికి తగిన వధువుకావలెను. 9705960270 AJH-002508

★ SC మాల / B.TECH/ C.Govt. Exq. ఇంజనీర్ / మంచి జీతం / 5'8" ఎత్తు / 31 సం.ల వరుడికి వధువు కావలెను. ఫోన్ : 8897389698 AJH-16347

★ గౌడ / B.TECH/ C.Govt. G.S.T. ఇన్స్‌పెక్టర్ / మంచి జీతము / 5'10" ఎత్తు / 30 సం.ల అందమైన వరుడికి వధువు కావలెను. ఫోన్ : 7032058965 AJH-16347

★ 2వ పెళ్ళి / B.Com/ Govt. ఎంప్లాయి / TSSPDCL / మంచి జీతము / 5'7" ఎత్తు / 35 సం.ల వరుడికి వధువు కావలెను. ఫోన్ : 9963757612 AJH-16347

★ యాదవ / M.Tech/ VLSI / డిజైనింగ్ ఇంజనీర్ / AMD / మంచి జీతము / 5'9" ఎత్తు / 29 సం.ల అందమైన వరుడికి వధువు కావలెను. ఫోన్ : 9963757612 AJH-16347

★ పద్మశాలి / ప్రభుత్వ ఉద్యోగి / M.Sc, B.Ed., 47y/5'5"/ మొదటి వివాహం / కుల పట్టింపు లేదు. వధువు ప్రభుత్వ ఉద్యోగినియై ఉండాలి. రెండవ వివాహమైనా OK. పిల్లలు లేని వారై ఉండాలి. డైరెక్టుగా సంప్రదించండి. ఫోన్ : 9949447956 AJH-002575

★ బలిజ /35 yrs, డిగ్రీ, జాబ్ - కంప్యూటర్ ఆపరేటర్ @ మెడికల్ ఏజెన్సీ, కరీంనగర్లో స్వంత గృహం వున్న అబ్బాయికి తగిన వధువు కావలెను. డైరెక్ట్ కాంటాక్ట్ : 9440378427 JH-002575

★ చేనేత సామాజిక వర్గం / కుల పట్టింపు లేదు / 28y/5'5"/B.Tech(NIT)MNC కంపెనీలో, మంచి జీతం గల వరునికి తగిన వధువు కావలెను. నో బ్రోకర్స్. డైరెక్ట్ సంప్ర: 9553582479 AJH-4265

★ క్యాస్ట్ నో బార్ : 35 సంవత్సరాలు పురోహితం చేస్తున్న బ్రాహ్మణ వరుడుకు నెలకు మంచి ఆదాయం కలిగి & స్థిరాస్తి కలిగి ఉన్న వరునకు మొదటి, రెండవ వధువు కావలెను. ఫోన్ నెంబర్ : 9676036234. AJG-1716

★ డైరెక్ట్ – నోబ్రోకర్ – పద్మశాలి–తిరుపతి 62Y-5.3-విడోవర్ Govt. Retired H.M., Pension, 60,000/- P.M. వెల్‌సెటిల్ – వరునకు తగిన FC/BC వధువు కావలెను. Ph : 83747 47256 AJT - 4198

★ నాయుడు / కాపు కులానికి చెందిన, వ్యాపారంలో స్థిరపడ్డ 37 సం.ల యువకునికి అదే కులానికి చెందిన సాంప్రదాయ వధువు కావలెను. కట్నం ప్రసక్తి లేదు. సంప్రదించండి: 9059682221, 9441069388 AJZ-197524

కళ్యాణ వేదిక

★ AP&TSలో అన్ని కులాలకు సంబంధించి 1వ / 2వ / లేటు / డైవర్స్‌డ్ వివాహముల కొరకు వధూవరులు మమ్ములను సంప్రదించగలరు. 9959004400. వెంకటేశ్వర మ్యారేజ్ లైన్స్, కొత్తగూడెం. AJH-4265

★ Free Registration బ్రాహ్మణ మరియు అన్ని కులాల SWE / Govt / Doctors / MNC / Matches / Late & 2nd Matches కై సంప్ర: Ph: 9704656103 / 9494809254 (Whatsapp) AJH-4265

★ లక్ష్మీ మ్యారేజ్ బ్యూరో / కేవలం చౌదరి కులస్తులకు మాత్రమే. పెళ్ళి సంబంధాలు చూడబడును. ప్రొ. జాస్తి సైదారావు. ఫోన్ : 9182731506/9705588313 AJH-4265

★ సెకండ్ మ్యారేజ్‌లకు మాత్రమే / అన్ని కులాల వారికి వయస్సుతో నిమిత్తం లేకుండా ఫాస్ట్ సెటిల్‌మెంట్ చేయబడును. సంప్ర: 8688006130 / 8555980066 AJH-002576

కమ్మ మ్యారేజ్ బ్యూరో (కమ్మాస్ & చౌదరీస్)

C. PRASHANTHI : 9100999850

ప్రొఫైల్స్ : డాక్టర్స్ / సాఫ్ట్‌వేర్స్ / బిజినెస్ / గవర్నమెంట్ / B.Tech / M. Tech / MBA / MCA / MS / USA / UK / Australia / Canada / Singapore / Newzealand / Germany / BDS / MDS / MBBS / MD / MS / DM / MCH ఇండియా & అబ్రాడ్ 1వ, 2వ లేట్ సంబంధాలు కలవు.

వధువు కావలెను

★ కమ్మ: 1989 / 6feet / B.E. / Own Business / 50 Cr Share Property గల వరుడికి Well Settled & సాఫ్ట్‌వేర్ వధువు కావలెను. Ph: 9100999850

★ కమ్మ: 1996 / 5.10 / MS (UK) / 80 Cr Share Property గల వరుడికి India (or) UK లో ఉన్న Good Looking వధువు కావలెను. Ph: 9100999850

★ కమ్మ: 1995 / 6 feet / MBA / Pilot / 50 Cr Share Property గల వరుడికి Well Settled & Good Looking సాఫ్ట్‌వేర్ (or) డాక్టర్ వధువు కావలెను. Ph: 9100999850

★ కమ్మ డాక్టర్: 1991 / 5.10 / DM Oncology / 200 Cr Share Property Well Settled Family గల వరుడికి డాక్టర్ (or) సాఫ్ట్‌వేర్ వధువు కావలెను. Ph: 9100999850

★ కమ్మ డాక్టర్: 1994 / 6 feet / MS General Surgery / 10 Crs Property గల వరుడికి డాక్టర్ వధువు కావలెను. Ph: 9100999850

★ కమ్మ IPS: 1991 / 5.10 / B.E. MSC BITS Pilani / 100 Cr Share Property గల వరుడికి సాఫ్ట్‌వేర్ (or) డాక్టర్ Good Looking వధువు కావలెను. Ph: 9100999850

★ కమ్మ డాక్టర్: 1995/ 5.9 / MS Ortho / 20 Cr Share Property గల వరుడికి డాక్టర్ వధువు కావలెను. Ph: 9100999850

★ కమ్మ డాక్టర్: 1994/ 5.10 / MS General Surgery/Own Hospital / 100 Cr Share Property గల వరుడికి డాక్టర్ (or) సాఫ్ట్‌వేర్ వధువు కావలెను. Ph: 9100999850

★ కమ్మ USA: 1995/ 5.10 / B.Tech MS (USA) / 50 Crs Share Property గల వరుడికి ఇండియా (or) USA లో ఉన్న వధువు కావలెను. Ph: 9100999850

★ కమ్మ UK: 1996/ 5.7 / MBBS UK / UK Citizen / 40 Crs Share Property గల వరుడికి ఇండియా (or) UK లో ఉన్న డాక్టర్ / Software వధువు కావలెను. Ph: 9100999850

వరుడు కావలెను

★ కమ్మ డాక్టర్ : 1995 / 5.1 / MD Radiology / 60 Cr Share Property గల వధువుకి Well Settled బిజినెస్ (or) డాక్టర్ వరుడు కావలెను Ph: 9100999850

★ కమ్మ డాక్టర్ : 1994 / 5.5 / MD Anaesthesia / 50 Cr Property / Only Daughter / Well Settled Family గల వధువుకి డాక్టర్ వరుడు కావలెను. Ph: 9100999850

★ కమ్మ : 1993 / 5.7 / B.Arch / 75 Cr Share Property గల వధువుకి సాఫ్ట్‌వేర్ (or) బిజినెస్ (or) డాక్టర్ వరుడు కావలెను Ph: 9100999850

★ కమ్మ : 1999 / 5.7 / MS (UK) / 25 Cr Share Property గల వధువుకి ఇండియాలో ఉన్న సాఫ్ట్‌వేర్ వరుడు కావలెను Ph: 9100999850

★ కమ్మ డాక్టర్: 1996 / 5.7 / MD Anaesthesia / 10 Cr Share Property గల వధువుకి బిజినెస్ (or) డాక్టర్ వరుడు కావలెను Ph: 9100999850

★ కమ్మ : 1994 / 5.6 / MBA / 12 Cr Share Property గల వధువుకి సాఫ్ట్‌వేర్ (or) బిజినెస్ వరుడు కావలెను Ph: 9100999850

★ కమ్మ డాక్టర్: 1993 / 5.4 / DM Gastro / 30 Cr Share Property గల వధువుకి Well Settled డాక్టర్ వరుడు కావలెను Ph: 9100999850

★ కమ్మ డాక్టర్ : 1995 / 5.7 / DM Neurology / 5 Cr Share Property గల వధువుకి Good Looking డాక్టర్ వరుడు కావలెను Ph: 9100999850

★ కమ్మ డాక్టర్: 1992 / 5.7 / MCH Plastic Surgery / 20 Cr Share Property గల వధువుకి డాక్టర్ (or) బిజినెస్ వరుడు కావలెను. Ph: 9100999850

★ కమ్మ USA : 1995 / 5.7 / B.Tech MS (USA) / 10 Cr Share Property గల వధువుకి India (or) USA లో ఉన్న డాక్టర్ (or) సాఫ్ట్‌వేర్ వరుడు కావలెను. Ph: 9100999850

శారద వివాహ వేదిక

Mail: saradamatrimony1@gmail.com, website: www.saradaram.com

EXCLUSIVE CHOWDARY COMMUNITY Hyderabad. Phone: 9849413031

కమ్మ ప్రత్యేకం

వధువు కావలెను

★ కమ్మ ప్రత్యేకం : 40 B.Tech 15 Cr / 43 MSc 50 Cr / 10 Cr B.Tech 24L PA 39 / 15 Cr B.Tech MS 35 / 20 Cr B.Tech MS 33 / 50 Cr B.Tech 30 / 5 Cr B.Tech 29 / 20 Cr B.Tech MBA 25 వరులకు వధువు కావలెను. సంప్ర: శారద 9849413031

★ కమ్మ ప్రత్యేకం : USA Citizens 30 Cr B.Tech MS 29 / 50 Cr. B.Tech MS 27 / 15 Cr. B.Tech MS 40 / 100 Cr. USA Doctor 34 వరులకు వధువు కావలెను. సంప్ర: శారద 9849413031

★ కమ్మ ప్రత్యేకం : 500 Cr. MBBS MD 34 / 100 Cr MBBS MD 25 / 50 Cr MBBS MD Pediatrics / 20 Cr MBBS MD 30 / 15 Cr MBBS MD GS 31 / 20 Cr MBBS MD Pediatrics 29 / 10 Cr MBBS MD GM 35 / 20 Cr MBBS MD Ortho 34 / వరులకు వధువు కావలెను. సంప్ర: శారద 9849413031

★ కమ్మ ప్రత్యేకం :రెండో పెళ్ళి: 31 B.Tech IIT MS Business Hyderabad 20 Cr / 37 B.Tech 30 Cr Hyd / 40 B.Tech 15 Cr 38L PA Hyderabad / 50 Cr Business 40 Hyderabad / 15 Cr B.Tech 40 Hyderabad రెండో పెళ్ళి వరులకు వధువు కావలెను. సంప్ర: శారద 9849413031

★ కమ్మ ప్రత్యేకం :(USA‌రెండో పెళ్ళి): 50 Cr USA Doctor 35 / 15 Cr USA Green Card 40 / B.Tech MS 40 Cr / 15 Cr Doctor Canada / 35 B.Tech MS / 45 B.Tech MS USA / 48 B.Tech MS / 38 B.Tech MS / 32 B.Tech MS వరులకు వధువు కావలెను. సంప్ర: శారద 9849413031

★ కమ్మ ప్రత్యేకం : 15 Cr B.Tech 40 India / 15 Cr B.Tech MS USA Citizen / 30 Cr B.Tech MS 38 వరులకు వధువు కావలెను. సంప్ర: శారద 9849413031

★ కమ్మ ప్రత్యేకం : 1 Cr to 500 Cr 24 to 45 B.Tech / M.Tech / MS / CA / PG Doctors India / USA /ఆస్ట్రేలియా U.K. వరులకు వధువు కావలెను. సంప్ర: శారద 9849413031

★ కమ్మ ప్రత్యేకం : 30 Cr B.Tech 28 / 20 Cr B.Tech IIT 29 / 10 Cr B.Tech 35 / 50 Cr Business 32 / 40 Cr B.Tech MS 31 / 20 Cr B.Tech 25 వరులకు వధువు కావలెను. సంప్ర: శారద 9849413031

★ కమ్మ ప్రత్యేకం : 70 Cr MBA 29 Business / 50 Cr B.Tech 30 Business / 100 Cr B.Tech MS 29 Business / 50 Cr B.Tech 27 / 20 Cr B.Tech Business వరులకు వధువు కావలెను. సంప్ర: శారద 9849413031

★ కమ్మ ప్రత్యేకం Australia: 20 Cr B.Tech MS 29 PR / 5 Cr B.Tech MS 28 / 2 Cr B.Tech MS 32 / 3 Cr B.Tech MS 30 వరులకు వధువు కావలెను. సంప్ర: శారద 9849413031

వరుడు కావలెను

★ కమ్మ ప్రత్యేకం : 15Cr B.Tech 26 / 70Cr Architecture 30 / 50Cr B.Tech MS 25 / 20 Cr B.Tech 25 వధువులకు తగిన వరులు కావలెను. సంప్ర: శారద 9849413031

★ కమ్మ ప్రత్యేకం : డాక్టర్స్ India 20Cr MS General 31/15Cr Dermatology 35 / 10Cr Radiology & Gynic & Skin Doctor and ENT Dental డాక్టర్స్ వధువులకు తగిన వరులు కావలెను. సంప్ర: శారద 9849413031

★ కమ్మ ప్రత్యేకం : 50 Cr B Tech MS 29/30Cr B.Tech MS 27/100Cr B.Tech MS 29/20Cr B.Tech MS 28/40 Cr B.Tech MS 25 వధువులకు తగిన వరులు కావలెను. సంప్ర: శారద 9849413031

★ కమ్మ ప్రత్యేకం : రెండవ పెళ్ళి, 40 B.Tech MS Business in India / 20 Cr. 35 B.Tech Hyderabad / 25 Cr. 35 PG Doctor వధువులకు తగిన వరులు కావలెను. సంప్ర: శారద 9849413031

★ కమ్మ ప్రత్యేకం : 25 B.Tech MS / 27 B.Tech MS / 29 B.Tech MS / 31 B.Tech MS / 33 B.Tech MS / 35 B.Tech MS వధువులకు తగిన వరులు కావలెను. సంప్ర: శారద 9849413031

★ కమ్మ ప్రత్యేకం : 30Cr B.Tech 28 / 20Cr B.Tech MBA 32 / 20Cr B.Tech 25 / 50Cr MBBS PG Doctor Hyderabad వధువులకు తగిన వరులు కావలెను. సంప్ర: శారద 9849413031

★ కమ్మ ప్రత్యేకం : రెండో పెళ్ళి 29 B.Tech MS USA / 42 B.Tech MS / 35 B.Tech MS India / 32 B.Tech MS USA వధువులకు తగిన వరులు కావలెను. సంప్ర: శారద 9849413031

★ కమ్మ ప్రత్యేకం : 10 Cr 25. B.arch, MS. UK. US/10Cr. BBA 28/ 29.BTech / MS / Amazon, 300k USA. అందమైన యూఎస్. UK. India. Well settled వధువులకి వరులు కావలెను. సంప్ర: శారద 9849413031

★ కమ్మ ప్రత్యేకం : 27 B.Tech Irland / 26 B.Tech MS UK / 27 CA India వధువుకి 25 to 45 USA వధువులకు తగిన వరులు కావలెను. సంప్ర: శారద 9849413031

★ కమ్మ ప్రత్యేకం. రెండో పెళ్ళి : 40 B.Tech MS Business in India. 20 Cr. / 35 B.Tech Hyderabad. 25 Cr. / 35 PG Doctor. అందమైన వధువులకి తగిన వరులు కావలెను. సంప్ర: శారద 9849413031

గమనిక

ఆంధ్రజ్యోతి తలంబ్రాలు ఒక వివాహ వేదిక మాత్రమే. ప్రకటనదారులకు సంబంధించి ఎట్టి హామీలకు పత్రిక సాక్ష్యం కాదు. ఈ వేదికలో వచ్చే ప్రకటనల సాధ్యాసాధ్యాలు, వధూవరుల వివరాలను పెండ్లి పెద్దలు స్వయంగా వెళ్ళి పరిశీలించిన తరువాత నిర్ణయాలు తీసుకోవాలి. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. మీరు జరిపే లావాదేవీలకు ఆంధ్రజ్యోతి పత్రిక బాధ్యత వహించదు. కావున పాఠకులు ఈ విషయాన్ని గమనించి మీకు తగిన సంబంధాన్ని నిర్ణయించుకోండి.

తలంబ్రాలు ప్రకటనల కొరకు ఈ క్రింది నంబర్లను సంప్రదించగలరు.
9985921380, 9703618806, 9985921386

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

■ఆర్కే RK



కొత్తపలుకు

కారు.. కమలం 'కలిసి' పోతాయా?

'త్వ'రలోనే భారతీయ జనతా పార్టీలో భారత రాష్ట్ర సమితి విలీనమవుతుంది. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌కు గవర్నర్ పదవి ఇస్తారు. కవితకు బెయిల్ కూడా వస్తుంది'... తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తాజాగా ఢిల్లీలో చేసిన వ్యాఖ్యలు ఇవి. "అదేమీ కాదు! కాంగ్రెస్ పార్టీలోనే బీఆర్ఎస్ విలీన మవుతుంది. కేసీఆర్‌కు ఏఐసీసీ పదవి, కేటీఆర్‌కు పీసీసీ అధ్యక్ష పదవి, హరీశ్‌కు రాష్ట్రంలో మంత్రి పదవి లభిస్తాయి'... ఇవి కేంద్ర మంత్రి బండి సంజయ్ చేసిన వ్యాఖ్యలు. తెలంగాణ రాష్ట్ర సాధనలో ప్రధాన పాత్ర పోషించిన ఒకప్పటి తెలంగాణ రాష్ట్ర సమితి, ప్రస్తుత భారత రాష్ట్ర సమితి నిజంగానే రెండు జాతీయ పార్టీలలో ఏదో ఒక దానిలో విలీనంకాక తప్పదా? తొమ్మిది న్నరేళ్లు అధికారంలో ఉండిన బీఆర్ఎస్‌కు అలాంటి పరిస్థితి ఏర్పడిందా? తెలంగాణ రాజకీయాల్లో అసలేం జరగబోతోంది? ప్రస్తుతం ప్రధాన ప్రతిపక్షంగా ఉన్న బీఆర్ఎస్‌కు ఈ దుస్థితి ఎందుకు వచ్చింది? విలీనం వార్తలను బీఆర్ఎస్ ముఖ్యులు

> ఇప్పటివరకు చాలా మందికి తెలియని ఒక విషయం చెప్పాలి. మే 13న ఎన్నికలు పూర్తయిన తర్వాత విశ్రాంతి కోసం కుటుంబంతో పాటు ఇటలీ వెళ్లాలని చంద్రబాబు నిర్ణయించుకున్నారు. లుక్ ఔట్ నోటీసు లేకపోయినా సీఐడీ అధికారుల సూచనలతో ఆయనను శంషాబాద్ విమానాశ్రయంలో ఇమ్మిగ్రేషన్ అధికారులు ఆపేశారు. అప్పుడు ఎన్నికల కోడ్ అమలులో ఉంది. విషయం తెలుసుకున్న ఏపీకి చెందిన సీనియర్ అధికారులు కల్పించుకొని విదేశాలకు వెళ్లడానికి చంద్రబాబును అనుమతించారు. అనుమతి రావడంలో అరగంట ఆలస్యం జరిగి ఉన్నా చంద్రబాబు విదేశీ పర్యటన నిలిచిపోయి ఉండేది. అధికార దుర్వినియోగం అంటే ఇదీ! జగన్ రెడ్డి విదేశాలకు వెళ్లాలంటే కోర్టు అనుమతి కావాలి. చంద్రబాబుకు బెయిల్ మంజూరు చేసినప్పుడు న్యాయస్థానం అలాంటి షరతులేవీ విధించలేదు. అయినా అధికారం ఉందికదా అని చంద్రబాబును విదేశాలకు వెళ్లకుండా అడ్డుకొనే ప్రయత్నం చేశారు. చంద్రబాబు విషయంలో నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించిన అధికారులను శిక్షించాలా? వద్దా?

ఎందుకు గట్టిగా ఖండించలేకపోతున్నారు? కేసీఆర్ మనసులో ఏముంది? వంటి ప్రశ్నలు ప్రస్తుతం చర్చనీయాంశంగా ఉన్నాయి. జాతీయ రాజకీయాలలో చక్రం తిప్పాలని, కేంద్రంలో బీజేపీని గద్దె దించుతానని కొంతకాలం క్రితం వరకు ప్రతిజ్ఞలు చేసిన కేసీఆర్ ఇంత బలహీనంగా ఎందుకు మారిపోయారు? కేసీఆర్ బలహీనతను అడ్డుపెట్టుకొని బీఆర్ఎస్‌ను మింగేయ డానికి భారతీయ జనతా పార్టీ ప్రయత్నిస్తున్నట్టు వస్తున్న వార్తలలో వాస్తవం ఉందా? విలీనం వార్తలలో ఎంత నిజముంది? నిజమే అయితే తెర వెనుక ఏమి జరిగింది? అన్నది ఇప్పుడు తెలుసుకొనే ప్రయత్నం చేద్దాం! ఢిల్లీ లిక్కర్ కుంభకోణంలో నిందితురాలుగా ఉన్న కేసీఆర్ కుమార్తె కవిత ప్రస్తుతం తీహార్ జైల్లో ఉన్నారు. తన బిడ్డ నెలల తరబడి జైలులో ఉండాల్సి రావడాన్ని కేసీఆర్ భరించలేక పోతున్నారు. గుండెల్లో అగ్నిపర్వతం పెట్టుకొని బయటకు గంభీరంగా ఉంటున్నానని ఆ మధ్య కేసీఆర్ వ్యాఖ్యా నించారు కూడా! ఈ నేపథ్యంలో తన బిడ్డ కవితను బెయిల్‌పై విడిపించుకునేందుకు కేసీఆర్ చేయని ప్రయత్నం లేదు. ఈ క్రమంలో ఆయన బీజేపీ సహాయాన్ని అర్థించడం వాస్తవం. కేటీఆర్, హరీశ్ రావులు రెండు మూడు సార్లు ఢిల్లీ వెళ్లి మంత్రాంగం కూడా నడిపారు. రాజకీయ వర్గాలలో ప్రచారం జరుగు తున్నట్టుగా వారిరువురూ ఢిల్లీలో ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర మంత్రి అమిత్ షాలను కలవలేదు. మరెవరిని కలిసుంటారు? బీజేపీతో రాజీ కుదర్చడానికి చొరవ తీసుకున్న ప్రముఖుడు ఎవరు? ఆయనకు ప్రధాని మోదీ వద్ద నిజంగా అంత పలుకుబడి ఉందా? వంటి సందేహాలు సహజంగానే కలుగుతాయి. ఈ మొత్తం వ్యవహారంలో ఒక ప్రముఖ వ్యక్తి కీలక పాత్ర పోషించారు. ఆయన ప్రస్తుతం ఒక రాష్ట్రానికి గవర్నర్‌గా కూడా ఉన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో తెలుగుదేశం–బీజేపీ మధ్య పొత్తు కుదరడంలో కూడా ఆయనే ప్రధాన పాత్ర పోషించారు. సదరు గవర్నర్‌పై ప్రధాని మోదీకి గురి ఉంది. అదే సమయంలో ఆరెస్సెస్ ప్రముఖులతో ఆయనకు సన్నిహిత సంబంధాలు ఉన్నాయి. దీంతో ఆరెస్సెస్ ప్రోద్బలంతో ఆ గవర్నర్ తెలుగుదేశం పార్టీతో మాట కలిపారు. చంద్రబాబు పొడగిట్టని ప్రధాని మోదీకి అదే సమయంలో నచ్చజెప్పారు. ఫలితంగా సదరు గవర్నర్‌కు, చంద్రబాబుకు మధ్య చర్చలు జరిగాయి. ఈ చర్చలలో స్థూలంగా ఏకాభిప్రాయం కుదరడంతో చంద్రబాబు ఢిల్లీ వెళ్లి హోం మంత్రి అమిత్ షాను కలిశారు. ఆ తర్వాత ఏం జరిగిందో అందరికీ తెలిసిందే.

ఇదీ జరిగింది...

ఆంధ్రప్రదేశ్‌లో తెలుగుదేశం పార్టీతో పొత్తు పెట్టుకోవడం లాభించినందున తెలంగాణలో కూడా మంత్రాంగం నడపవల సిందిగా సదరు గవర్నర్‌ను ప్రధాని నరేంద్ర మోదీ ఆదేశించినట్టు తెలిసింది. అప్పటికే ఆరెస్సెస్ సీనియర్ నాయకులు కూడా ఆయనకు ఆ బాధ్యత అప్పగించారు. దీంతో రంగంలోకి దిగిన గవర్నర్ భారత రాష్ట్ర సమితి ముఖ్యులకు సంకేతాలు పంపారు. అప్పటికే మద్యం కేసులో అరెస్టయి కవిత జైలులో ఉన్నారు. దీంతో మానసికంగా కుంగిపోయిన కేసీఆర్ తన పార్టీ తరఫున మంతనాలు జరపడానికి కేటీఆర్, హరీశ్ రావును పురమాయించారు. మొదటి దఫా చర్చలలో పెద్దగా పురోగతి లేకపోయినా... రెండో పర్యాయం జరిపిన చర్చలలో మాత్రం ఎవరికి ఏమి కావాలన్న దానిపై స్పష్టత ఏర్పడింది. భారత రాష్ట్ర సమితికి ఏమి కావాలో తెలిసిందే కనుక తమకు ఏమి కావాలో రెండో దఫా చర్చల సందర్భంగా సదరు గవర్నర్‌తో పాటు ఆరెస్సెస్ నాయకులు స్పష్టం చేశారు. జైలులో ఉన్న కవిత విషయంలో సహాయ సహకారాలు లభించాలంటే భారత రాష్ట్ర సమితిని భారతీయ జనతా పార్టీలో విలీనం చేయాలని లేదా పొత్తు పెట్టు కుంటున్నట్టు ప్రకటించాలని, ప్రతిగా కేసీఆర్‌కు గవర్నర్ పదవి ఇస్తారని, హరీశ్ రావుకు కేంద్ర మంత్రి పదవి ఇస్తామని ఆ గవర్నర్‌తో పాటు ఆరెస్సెస్ ప్రతినిధులు ప్రతిపాదించారు. ఆ తర్వాత దశలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా హరీశ్ రావును నియ మిస్తామని కూడా ప్రతిపాదించినట్టు తెలిసింది. కేటీఆర్ భవిష్యత్ విషయమై ఎటువంటి చర్చా జరగలేదని అంటున్నారు. కేసీఆర్ కుటుంబం రాజకీయాల నుంచి నిష్క్రమించాలన్నది బీజేపీ పెద్దల అభిమతంగా ఉన్నట్టు చెబుతున్నారు. అయితే చర్చలు ఏక పక్షంగా ఉండటం, తమకు షరతులు విధించడాన్ని బీఆర్ఎస్ ముఖ్యులు జీర్ణించుకోలేకపోతున్నారు. పార్టీని విలీనం చేయాలని కోరవద్దని, పొత్తు పెట్టుకొని ముందుకు వెళదామని బీఆర్ఎస్ ముఖ్యులు ప్రతిపాదించారు. ఈ దశలో చర్చలు అప్పటికి ముగి శాయి. ఢిల్లీ చర్చల వివరాలను కేటీఆర్, హరీశ్‌రావు తమ నాయ కుడు కేసీఆర్‌కు వివరించారు. భారతీయ జనతా పార్టీలో తమ పార్టీని విలీనం చేయడం ఆత్మహత్యాసదృశం అవుతుందని భావి స్తున్న కేసీఆర్ అండ్ కో అప్పటి నుంచి మౌనంగా ఉంటున్నారు.

అస్తిత్వం కోల్పోయేందుకు సిద్ధమా?

కవిత బెయిల్ పిటిషన్ ఈ నెల 28న సుప్రీం కోర్టులో విచార ణకు రానుంది. ఆ రోజు కవితకు బెయిల్ లభించవచ్చునని బీఆర్ఎస్ నాయకులు ఆశగా ఉన్నారు. అదే జరిగితే బీజేపీతో తదుపరి చర్చలు ప్రస్తుతానికి ఉండకపోవచ్చు. లిక్కర్ కేసులో కవితకు ఉపశమనం లభించాలంటే ఆమె అప్రూవర్‌గా మారాలన్న షరతు కూడా బీజేపీ ప్రముఖులు విధించినట్టు తెలిసింది. ఈ నెల 28న కవితకు బెయిల్ లభిస్తే బీజేపీకి లొంగిపోవాల్సిన అవసరం కేసీఆర్‌కు ఉండదు. అయితే, కేంద్రంలో బీజేపీ అధి కారంలో ఉన్నందున కేసీఆర్ లేదా కేటీఆర్‌కు ముప్పు లేకపోలేదు. దీంతో బీఆర్ఎస్ ముఖ్యులు ప్రస్తుతానికి గుంభనంగా ఉంటు న్నారు. తెలంగాణలో శాసనసభ, లోక్‌సభ ఎన్నికలు కూడా ఇటీవలే జరిగినందున బీఆర్ఎస్‌తో ఇప్పుడే పొత్తు పెట్టుకొని ప్రయోజనం ఏమిటన్నది బీజేపీ ముఖ్యుల అభిప్రాయంగా ఉంది. యూటర్న్ తీసుకోవడంలో కేసీఆర్‌కు ట్రాక్ రికార్డు ఉన్నం దున ఆయనను నమ్మి ఇప్పుడే పొత్తు ప్రకటించి ప్రయోజనం ఉండదని కమలనాథులు భావిస్తున్నారు. రాష్ట్ర విభజన సమయంలో అప్పటి టీఆర్ఎస్‌ను కాంగ్రెస్‌లో విలీనం చేస్తానని కాంగ్రెస్ పెద్దల్ని నమ్మించి కేసీఆర్ యూటర్న్ తీసుకోవడాన్ని బీజేపీ ముఖ్యులు గుర్తు చేస్తున్నారు. ఈ కారణంగా విలీనం ప్రతిపాదననే ముందుకు తీసుకు వెళ్లాలని వారు భావిస్తున్నారు. అయితే, కేవలం కవితకు ఉపశమనం లభించేందుకు తెలంగాణ రాజకీయాల్లో కీలకంగా ఉన్న బీఆర్ఎస్‌ను బీజేపీలో విలీనం చేసి అస్తిత్వం కోల్పోవడానికి కేసీఆర్ అండ్ కో సుముఖంగా లేరు. అలాగని భారతీయ జనతా పార్టీతో సంబంధాలను చెడగొట్టు కోవడానికి కూడా వారు సిద్ధంగా లేరు. ఈ కారణంగానే విలీనం వార్తలపై కేసీఆర్ అండ్ కో ఘాటుగా స్పందించడం లేదు.



కర్మఫలం...

కర్మ ఫలాన్ని ఎవరూ తప్పించుకోలేరని అంటారు. కేసీఆర్ పరిస్థితి కూడా ప్రస్తుతం అలాగే ఉంది. అధికారంలో ఉన్నప్పుడు ఓటుకు నోటు కేసులో ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని జైలుకు పంపి ముప్పుతిప్పలు పెట్టారు. ఒక్కగానొక్క కుమార్తె వివాహ వేడుకలను కూడా దగ్గరుండి జరిపించుకోలేని పరిస్థితి రేవంత్ రెడ్డికి కల్పించారు. ఇప్పుడు కేసీఆర్ ప్రతిపక్షంలో కూర్చో వలసిరాగా, రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి స్థానంలో కూర్చున్నారు. లిక్కర్ కేసులో చిక్కుకున్న కవిత జైలు పాలయ్యారు. దీంతో కేసీఆర్ జుట్టు బీజేపీ చేతికి చిక్కింది. ఎమ్మెల్యేల కొనుగోలుకు

> కేంద్ర ప్రభుత్వ సహకారం లేకుండానే కవితకు బెయిల్ లభించినా భారతీయ జనతా పార్టీపై ఇదివరకటిలా కత్తులు దూసే పరిస్థితిలో కేసీఆర్ అండ్ కో ఉండలేరు. కేసీఆర్ కుటుంబం రాజకీయాల్లో ఉండకూడదని బీజేపీ పెద్దలు కోరుకుంటున్నట్టు చెబుతున్నారు. ప్రాంతీయ పార్టీలపై ప్రధాని మోదీకి వ్యతిరేక భావం ఉన్న విషయం తెలిసిందే. ప్రస్తుతానికి తెలంగాణలో బీజేపీ సేఫ్ జోన్‌లో ఉంది. కాంగ్రెస్ రాష్ట్రంలో అధికారంలో ఉండగా, బీజేపీ కేంద్రంలో అధికారంలో ఉంది. దీంతో బీఆర్ఎస్ పరిస్థితి చెంపదెబ్బ, గోడదెబ్బ చందంగా ఉంది. రాష్ట్రంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వేటాడుతున్నారు. కేసీఆర్ అండ్ కో తమ జుట్టును బీజేపీ చేతికి అందించారు. ఈ రెండు పార్టీలనూ ఎదుర్కొంటూ బీఆర్ఎస్‌ను బతికించుకోగల స్థితిలో కేసీఆర్ ఉన్నారా? తనలో పోరాట పటిమ సన్నగిల్లిందని గుర్తించి, అంగీకరించి తన పార్టీని బీజేపీకి అప్పగించి విశ్రాంతి తీసుకుంటారా? అదే జరిగితే కేటీఆర్, హరీశ్ రావుల భవితవ్యం ఏమిటి? వారిద్దరే కాదు, పార్టీని నమ్ముకొని ఉన్న అనేక మంది నాయకులు ఉన్నారు. వారి పరిస్థితి ఏమిటి? మున్ముందు కేసీఆర్ వేయబోయే అడుగులను బట్టి ఈ ప్రశ్నలకు సమాధానం లభిస్తుంది.

ప్రయత్నించారని ఆరెస్సెస్ ముఖ్యుడు బీఎల్ సంతోష్‌ను కూడా అరెస్టు చేయాలని అధికారంలో ఉన్నప్పుడు కేసీఆర్ ప్రయత్నిం చారు. ఇప్పుడు పరిస్థితులు తారుమారయ్యాయి. కర్మ మనల్ని వదలదని అనడానికి ఇంతకంటే నిదర్శనం ఏమి కావాలి? ప్రగల్భా లకు పోవడం రాజకీయ నాయకులకు అలవాటే. మామీద కేసులు పెట్టి జైలుకు పంపుతారా? దమ్ముంటే ఆ పని చెయ్యండి! అని సవాళ్లు విసురుతారు. నిజంగా అదే జరిగితే మాత్రం తట్టు కోలేరు. ఆంధ్రప్రదేశ్‌లో జగన్మోహన్ రెడ్డి అధికారంలో ఉన్నప్పుడు స్కిల్ కేసులో ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబును జైలుకు పంపారు. ఆ పరిణామం చంద్రబాబును బాగా కుంగదీసింది. అయితే ప్రజల నుంచి అనూహ్యమైన మద్దతు రావడంతో చంద్ర బాబు వెంటనే కోలుకున్నారు. తెలంగాణను కనుసైగలతో పాలిం చిన కేసీఆర్ ఇప్పుడు తన బిడ్డ జైలులో ఉండటాన్ని జీర్ణించుకోలేక పోతున్నారు. ఈ పరిణామం తనను మానసికంగా కుంగదీస్తోం దని ఆయనే చెప్పుకొంటున్నారు. ఈ కారణంగానే తెలంగాణ రాజకీయాలను శాసించాలనుకున్న కేసీఆర్ బీజేపీతో రాజీకి తలవొంచాల్సిన పరిస్థితి. కవిత జైలులో ఉండివుండకపోతే బీజేపీతో సయోధ్యకు ప్రయత్నించాల్సిన అవసరం కేసీఆర్‌కు ఉండేది కాదు. అధికారంలో ఉన్నప్పుడు విర్రవీగిన కేసీఆర్‌లో ఇంత బేలతనం చూస్తామని అనుకున్నామా? అధికారం అనుభ వించడానికి అలవాటుపడిన నాయకులలో పోరాట పటిమ పోతున్నందునే ఈ దుస్థితి! కవితకు ఇవాళ కాకపోతే రేపు బెయిలు లభిస్తుంది. అయితే బిడ్డపై ఉన్న మమకారంతో ఆయన రాజీ బేరాలకు దిగజారారు. తెర వెనుక ఏం జరిగిందో ఇప్పుడు తెలిసి పోయింది కనుక విలీనం లేదా పొత్తు ప్రతిపాదనలు ముందుకు వెళతాయా? లేదా? అన్నవి ప్రస్తుత ప్రశ్నలు. బీఆర్ఎస్‌ను విలీనం చేసుకోవడం వరకు బీజేపీ రాష్ట్ర నాయకులకు అభ్యంతరాలు లేవు. పొత్తు పెట్టుకోవాలన్న ప్రతిపాదనను మాత్రం వ్యతిరేకిస్తు న్నారు. అయితే, రాష్ట్ర నాయకులకు కేంద్రంలో పెద్దగా పలుకుబడి లేదు. ప్రధాని మోదీ, హోం మంత్రి అమిత్ షాలను ప్రభావితం చేయగలిగిన శక్తి తెలుగునాట బీజేపీ నాయకులు ఎవరికీ లేదు. ఆంధ్రప్రదేశ్‌లో తెలుగుదేశం పార్టీతో పొత్తు పెట్టుకోవాలని రాష్ట్ర నాయకులు ఎంత మంది వాదించినా పట్టించుకోని బీజేపీ కేంద్ర పెద్దలు... చివరికి సొంత సమాచారం ఆధారంగానే పొత్తుకు సుముఖత వ్యక్తం చేశారు. అప్పట్లో పొత్తు కుదర్చడంలో కీలక పాత్ర పోషించిన సదరు గవర్నర్ వల్లనే ఆంధ్రప్రదేశ్‌లో బీజేపీకి ఆరు లోక్‌సభ స్థానాలు కేటాయించారు. అందులో మూడు స్థానాలను ఆ పార్టీ గెలుచుకుంది. తెలంగాణ విషయంలో కూడా బీజేపీ కేంద్ర పెద్దలు ఏమనుకుంటారో అదే జరుగుతుంది. ఈటల రాజేందర్, బండి సంజయ్ వంటి వారి మాటలను పెద్దగా పట్టిం చుకోరు. ఈ నేపథ్యంలో బీఆర్ఎస్ భవిష్యత్తు ఏమిటి? ప్రచారంలో ఉన్నట్టుగా విలీన ప్రక్రియ పూర్తవుతుందా? పరిస్థితులు అను కూలంగా మారే వరకు కొంత తలొగ్గుతూ ఉన్నప్పటికీ ఆ తర్వాత కేసీఆర్ యూటర్న్ తీసుకుంటారా? అన్న ప్రశ్నలకు సమాధానం లభించాలంటే వేచివుండక తప్పదు. తెర వెనుక ఏమి జరుగుతు న్నదో తెలుసు కనుకే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శుక్రవారం నాడు ఢిల్లీలో తాజా వ్యాఖ్యలు చేశారు. అందులో కొన్ని అతిశయోక్తులు ఉన్నప్పటికీ విలీనం లేదా పొత్తుకు సంబంధించిన చర్చలు జరి గాయి కనుక చివరకు ఏం జరుగుతుందో స్పష్టం కావాలంటే ఇంకొంత కాలం ఆగాల్సిందే. కేంద్ర ప్రభుత్వ సహకారం లేకుం డానే కవితకు బెయిల్ లభించినా భారతీయ జనతా పార్టీపై ఇది వరకటిలా కత్తులు దూసే పరిస్థితిలో కేసీఆర్ అండ్ కో ఉండ లేరు. కేసీఆర్ కుటుంబం రాజకీయాల్లో ఉండకూడదని బీజేపీ పెద్దలు కోరుకుంటున్నట్టు చెబుతున్నారు. ప్రాంతీయ పార్టీలపై ప్రధాని మోదీకి వ్యతిరేక భావం ఉన్న విషయం తెలిసిందే. ప్రస్తు తానికి తెలంగాణలో బీజేపీ సేఫ్ జోన్‌లో ఉంది. కాంగ్రెస్ రాష్ట్రంలో అధికారంలో ఉండగా, బీజేపీ కేంద్రంలో అధికారంలో ఉంది. దీంతో బీఆర్ఎస్ పరిస్థితి చెంపదెబ్బ, గోడదెబ్బ చందంగా ఉంది. రాష్ట్రంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వేటాడుతున్నారు. కేసీఆర్ అండ్ కో తమ జుట్టును బీజేపీ చేతికి అందించారు. ఈ రెండు పార్టీలనూ ఎదుర్కొంటూ బీఆర్ఎస్‌ను బతికించుకోగల స్థితిలో కేసీఆర్ ఉన్నారా? తనలో పోరాట పటిమ సన్నగిల్లిందని గుర్తించి, అంగీకరించి తన పార్టీని బీజేపీకి అప్పగించి విశ్రాంతి తీసుకుం టారా? అదే జరిగితే కేటీఆర్, హరీశ్ రావుల భవితవ్యం ఏమిటి? వారిద్దరే కాదు, పార్టీని నమ్ముకొని అనేక మంది నాయకులు ఉన్నారు. వారి పరిస్థితి ఏమిటి? మున్ముందు కేసీఆర్ వేయ బోయే అడుగులను బట్టి ఈ ప్రశ్నలకు సమాధానం లభిస్తుంది.

> బీఎస్పీ ఎన్నికల చిహ్నం ఏనుగును ఎక్కి దొరల గడీలను బద్దలు కొడతానన్న ఇదే ప్రవీణ్ కుమార్ ఇప్పుడు అదే దొర పంచన చేరారు. మొత్తానికి ప్రవీణ్ కుమార్ రాజకీయాల్లోకి వచ్చి తన విశ్వసనీయతను తానే దెబ్బతీసుకున్నారు.

గురివింద చందం..

తెలంగాణ రాజకీయాలను కాసేపు పక్కన పెట్టి, ఇప్పుడు ఆంధ్రప్రదేశ్‌లో చోటు చేసుకుంటున్న పరిణామాల విషయానికి వద్దాం. జగన్మోహన్ రెడ్డి అధికారంలో ఉన్నప్పుడు హద్దులు మీరి ప్రవర్తించిన పదహారు మంది ఐపీఎస్ అధికారులను రాష్ట్ర ప్రభుత్వం వెయిటింగ్‌లో ఉంచడంతో పాటు ప్రతిరోజూ డీజీపీ ఆఫీస్‌కు వచ్చి రిపోర్ట్ చేసి సాయంత్రం వరకు కూర్చోవాలని ఆదే శించింది. దీనిపై జగన్ రెడ్డి రోత మీడియా గురివింద సామెతను తలపిస్తూ గుండెలు బాదుకుంటోంది. గతంలో జగన్ రెడ్డి ఎంత మంది అఖిల భారత సర్వీసు అధికారులను వేధించారో మరచి పోయారు. ఇప్పుడు వెయిటింగ్‌లో ఉన్న అధికారులను అప్పట్లో కిరాయి సైనికులుగా మార్చుకొని చేయించిన అరాచకాలను మరచిపోయారు. పీఎస్సార్ ఆంజనేయులు ద్వారా మాజీ స్పీకర్ కోడెల శివప్రసాదరావును ఆత్మహత్య చేసుకొనే వరకు వేధించ లేదా? సొంత ఎంపీ రఘురామ కృష్ణరాజును అరెస్టు చేయించి అరికాళ్లు పగిలేలా కొట్టడంలో పీవీ సునీల్ కుమార్ పాత్ర లేదా? ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబు అవినీతికి పాల్పడ్డారంటూ ఢిల్లీ, హైదరాబాద్‌లో విలేఖరుల సమావేశాలు పెట్టి నిబంధనలు ఉల్లం ఘించిన సంజయ్‌కు ఏమి శిక్ష విధించాలి? రాష్ట్రంలో అధికార మార్పిడి జరిగిన తర్వాత కొల్లి రఘురామి రెడ్డి, రిషాంత్ రెడ్డి ముఖ్యమంత్రి చంద్రబాబును మర్యాదపూర్వకంగా కలవడానికి కూడా ప్రయత్నించకపోవడం సమర్థనీయమా? అఖిల భారత సర్వీసు అధికారులకు రాజకీయ అనుబంధాలు అవసరమా? అంతెందుకూ, స్కిల్ కేసులో విశ్రాంత ఐఏఎస్ అధికారి డాక్టర్ లక్ష్మీనారాయణ ఇంటికి వచ్చిన సీఐడీ అధికారులకు విచారణ సాఫీగా జరగడానికి సహకరించిన నాపై విధులకు ఆటంకం కలి గించానని కేసు పెట్టించింది కొల్లి రఘురామిరెడ్డి కాదా? ఆరోజు లక్ష్మీనారాయణ ఇంటికి వచ్చిన విచారణ అధికారులకు రఘు రామిరెడ్డి ఎన్ని పర్యాయాలు ఫోన్ చేశారో కాల్ డేటా చూస్తే తెలుస్తుంది కదా? ఇలాంటి అధికారులకు జగన్ రోత మీడియాతో పాటు తెలంగాణకు చెందిన మాజీ ఐపీఎస్ అధికారి, ప్రస్తుత బీఆర్ఎస్ నాయకుడు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ వత్తాసు పలకడం వింతగా ఉంది. సదరు అధికారులు జగన్ హయాంలో అరాచ కంగా ప్రవర్తించినప్పుడు ఇదే ప్రవీణ్ కుమార్‌కు తప్పు అని చెప్ప డానికి నోరు రాలేదు. పరిటాల రవి హత్య జరిగినప్పుడు ఇదే ప్రవీణ్ కుమార్ అనంతపురం జిల్లా ఎస్పీగా పనిచేశారన్న విషయం మరచిపోకూడదు. బీఎస్పీ ఎన్నికల చిహ్నం ఏనుగును ఎక్కి దొరల గడీలను బద్దలు కొడతానన్న ఇదే ప్రవీణ్ కుమార్ ఇప్పుడు అదే దొర పంచన చేరారు. మొత్తానికి ప్రవీణ్ కుమార్ రాజకీయాల్లోకి వచ్చి తన విశ్వసనీయతను తానే దెబ్బతీసు కున్నారు. ఆంధ్రప్రదేశ్‌లో నాడు జరిగింది ఒప్పు అయితే ఇప్పుడు జరుగుతున్నది కూడా ఒప్పే.

జగన్‌కు, చంద్రబాబుకు తేడా ఇది..

వాస్తవానికి చంద్రబాబు నాయుడు తొందరపడకుండా ఒక పద్ధతి ప్రకారం వ్యవహరిస్తున్నారు. నిర్దిష్టమైన ఆధారాలు లేకుండా ఎవరిపైనా చర్యలు తీసుకోవడంలేదు. అగ్రిగోల్డ్ భూముల కొనుగోలు వ్యవహారంలో మాజీ మంత్రి జోగి రమేశ్ కుమారుడు రాజీవ్‌ను అరెస్టు చేసిన తీరే ఇందుకు నిదర్శనం. అగ్రిగోల్డ్ వ్యవ హారంలో ఉభయ రాష్ట్రాలకు చెందిన సామాన్య మదుపరులు నష్టపోయారు. ఈ సంస్థ ఆస్తులను సీఐడీ అధికారులు జప్తు చేశారు. అలాంటి ఆస్తులలో ఒకదాని సర్వే నంబర్ మార్పించి మరీ జోగి రమేశ్ కుటుంబం సొంతం చేసుకుంది. ఇది నేరం మాత్రమే కాదు– పాపం కూడా. పైపెచ్చు అందరూ ఎలా కొన్నారో నేనూ అలాగే కొన్నానని జోగి రమేశ్ చెప్పడం వింతగా ఉంది. అంటే అగ్రిగోల్డ్ భూములను వైసీపీకి చెందిన చాలా మంది సొంతం చేసుకునే ప్రయత్నం చేశారన్న మాట. 2014 తర్వాత ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఇదే అగ్రిగోల్డ్‌కు చెందిన హాయ్ లాండ్ భూమిని ప్రస్తుత మంత్రి లోకేశ్ సొంతం చేసుకున్నారని జగన్ రెడ్డి ఆరో పించడం నిజం కాదా? ఐదేళ్లు అధికారంలో ఉండి కూడా ఆ విష యంలో తప్పు జరిగినట్టు తేల్చలేదు. ఇప్పుడు అలా కాదే! పక్కా ఆధారాలతో చంద్రబాబు ప్రభుత్వం చర్యలు తీసుకుంది. ప్రతి పక్షంలో ఉన్నప్పుడు తన ఇంటిపై దాడి చేయబోయిన జోగి రమేశ్‌ను పద్ధతి ప్రకారం విచారించడానికి చంద్రబాబు చర్యలు తీసుకున్నారు. ఆనాటి దౌర్జన్యం నిజం కాదని చెప్పగలరా? తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయాన్ని ధ్వంసం చేసిన వారిపై కూడా చట్ట ప్రకారమే చర్యలు తీసుకుంటున్నారు. అదే జగన్ రెడ్డి అయితే, ముందు నిందితులు అందరినీ జైల్లో వేయండి, విచారణ సంగతి తర్వాత చూద్దాం అనేవారు. తెలుగుదేశం పార్టీ కార్యా లయంపై దాడి కేసులో నిందితుడైన దేవినేని అవినాశ్‌పై లుక్ ఔట్ నోటీసులు ఉన్నప్పటికీ దుబాయ్ వెళ్లే ప్రయత్నం చేయగా శంషాబాద్ విమానాశ్రయంలో ఇమ్మిగ్రేషన్ అధికారులు ఆపేశారు. ఇక్కడ నిబంధనల అతిక్రమణ జరగలేదు. ఇప్పటివరకు చాలా మందికి తెలియని ఒక విషయం చెప్పాలి. మే 13న ఎన్నికలు పూర్తయిన తర్వాత విశ్రాంతి కోసం కుటుంబంతో పాటు ఇటలీ వెళ్లాలని చంద్రబాబు నిర్ణయించుకున్నారు. లుక్ ఔట్ నోటీసు

> తెలంగాణలో శాసనసభ, లోక్‌సభ ఎన్నికలు కూడా ఇటీవలే జరిగినందున బీఆర్ఎస్‌తో ఇప్పుడే పొత్తు పెట్టుకొని ప్రయోజనం ఏమిటన్నది బీజేపీ ముఖ్యుల అభిప్రాయంగా ఉంది. యూటర్న్ తీసుకోవడంలో కేసీఆర్‌కు ట్రాక్ రికార్డు ఉన్నందున ఆయనను నమ్మి ఇప్పుడే పొత్తు ప్రకటించి ప్రయోజనం ఉండదని కమలనాథులు భావిస్తున్నారు. రాష్ట్ర విభజన సమయంలో అప్పటి టీఆర్ఎస్‌ను కాంగ్రెస్‌లో విలీనం చేస్తానని కాంగ్రెస్ పెద్దల్ని నమ్మించి కేసీఆర్ యూటర్న్ తీసుకోవడాన్ని బీజేపీ ముఖ్యులు గుర్తు చేస్తున్నారు. ఈ కారణంగా విలీనం ప్రతిపాదననే ముందుకు తీసుకు వెళ్లాలని వారు భావిస్తున్నారు. అయితే, కేవలం కవితకు ఉపశమనం లభించేందుకు తెలంగాణ రాజకీయాల్లో కీలకంగా ఉన్న బీఆర్ఎస్‌ను బీజేపీలో విలీనం చేసి అస్తిత్వం కోల్పోవడానికి కేసీఆర్ అండ్ కో సుముఖంగా లేరు. అలాగని భారతీయ జనతా పార్టీతో సంబంధాలను చెడగొట్టుకోవడానికి కూడా వారు సిద్ధంగా లేరు. ఈ కారణంగానే విలీనం వార్తలపై కేసీఆర్ అండ్ కో ఘాటుగా స్పందించడం లేదు.

లేకపోయినా సీఐడీ అధికారుల సూచనలతో ఆయనను శంషాబాద్ విమానాశ్రయంలో ఇమ్మిగ్రేషన్ అధికారులు ఆపేశారు. అప్పుడు ఎన్నికల కోడ్ అమలులో ఉంది. విషయం తెలుసుకున్న ఏపీకి చెందిన సీనియర్ అధికారులు కల్పించుకొని విదేశాలకు వెళ్ల డానికి చంద్రబాబును అనుమతించారు. అనుమతి రావడంలో అరగంట ఆలస్యం జరిగి ఉన్నా చంద్రబాబు విదేశీ పర్యటన నిలిచిపోయి ఉండేది. అధికార దుర్వినియోగం అంటే ఇదీ! జగన్ రెడ్డి విదేశాలకు వెళ్లాలంటే కోర్టు అనుమతి కావాలి. చంద్రబాబుకు బెయిల్ మంజూరు చేసినప్పుడు న్యాయస్థానం అలాంటి షరతు లేవీ విధించలేదు. అయినా అధికారం ఉందికదా అని చంద్ర బాబును విదేశాలకు వెళ్లకుండా అడ్డుకొనే ప్రయత్నం చేశారు. చంద్రబాబు విషయంలో నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిం చిన అధికారులను శిక్షించాలా? వద్దా? వెయిటింగ్‌లో ఉన్న పదహారు మంది ఐపీఎస్ అధికారులపై ప్రభుత్వం ఏయే కేసులు పెట్టబోతున్నదో తెలియదు. నిజంగానే వారిలో హద్దులు మీరి వ్యవహరించిన వారు ఉంటే శిక్ష తప్పదు. జగన్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన కొత్తలో ఈ పదహారు మందిలో ఒక అధికారి అధికారిక సమావేశంలో మాట్లాడుతూ "ఎన్నికల్లో ఒక అద్భుతం జరిగింది. జీసస్ కృపతో మెరుపులా మీరు ముఖ్యమంత్రిగా ఆవిర్భవించారు" అని పొగడ్తల వర్షం కురిపించారు. ఒక ఐపీఎస్ అధికారి ముఖ్యమంత్రిని ఇలా ప్రశంసించడం సమర్థనీయమా? అఖిల భారత సర్వీసు అధికారులను ఈ దుష్ట సంస్కృతి నుంచి బయటపడేయాలి. ప్రవీణ్ కుమార్ వంటి వారు ఆ దిశగా కృషి చేస్తే మంచిది. చెడును సమర్థిస్తే మనకు కూడా ఆ మకిలి అంటుకుంటుంది!

సంపద పెంచటం ఎలా?

> సంక్షేమ చర్యలు ఆర్థికంగా ఆచరణసాధ్యంగా ఉండాలి. వచ్చే తరానికి ఆస్తుల్ని నిర్మించకుండా, తాత్కాలిక పథకాల కోసం ఎడాపెడా అప్పులు చేయలేం. ఆర్థిక ప్రగతిని వేగవంతం చేయాలి. ఆర్థిక క్రమశిక్షణ, మౌలిక వసతులు, పెట్టుబడులకు ప్రోత్సాహం, నియంత్రణల తొలగింపు కోసం తదేకంగా కృషి చేయాలి.



డెబ్బయ్యో దశకం తొలినాళ్లలో మన గరిష్ఠ ఆదాయ పన్ను రేటు 97.75%. రూ.2,00,000 వార్షిక ఆదాయం దాటినవారంతా అంత పన్నూ (85% ఆదాయ పన్ను, 15% పన్నుపై సర్‌ఛార్జి) చెల్లించాల్సి వచ్చేది. 1985 వరకు మనకు వారసత్వ పన్ను ఉండేది. 2015 వరకు సంపద పన్ను ఉంది. ఈ రెండు పన్నుల ఆదాయం అంతంతమాత్రం కాగా, వాటి వసూలు ఖర్చు మాత్రం ఆదాయాన్ని మించి పోయేది! దీంతోపాటు, అధిక పన్నుల జమానా అధికారులకు అక్రమార్జన అవకాశమైంది. ఆదాయాన్ని దాచిపెట్టి లాభపడటానికి, నల్లడబ్బు ఆర్థిక వ్యవస్థకి దారితీసింది.

తమ శ్రమకు, నైపుణ్యానికి తగ్గ ఫలితాల్ని ఒక వ్యక్తి అనుభవించలేకపోతే కష్టపడటానికి ప్రోత్సాహకం ఉండదు. వ్యవస్థాపక చొరవ ఆవిరైపోతుంది. పని చేసే ఆసక్తి అంతరించిపోతుంది. కొత్త పెట్టుబడులు, ఆవిష్కరణలు, అభివృద్ధి మంద గిస్తాయి. పేదరికం కొనసాగుతుంటుంది. ఆదాయాన్ని, సంపదను ఎలా దాచి పెట్టాలి, ఆస్తుల్ని తర్వాతి తరానికి అనధికారికంగా ఎలా బదిలీ చేయాలి లాంటి అంశాల మీద శక్తియుక్తుల్ని అనుత్పాదకంగా వెచ్చించటం ఎక్కువవుతుంది. ఒక విజయవంతమైన ఎంటర్‌ప్రెన్యూరో, ఆవిష్కర్తో, సంపద సృష్టికర్తో అలాంటి తిరో గమన ధోరణుల్ని భరించాల్సిన అవసరం ఈవేళ లేదు. వ్యాపారానికి ఎక్కడ ఎక్కువ సానుకూలతలుంటే అక్కడికి తరలిపోతారు. వారిని ఏదీ ఆపలేదు. కాబట్టి వారసత్వ పన్నునో, సంపద పన్నునో, ఇష్టారాజ్యంగా అధిక పన్నులనో విధించటం వల్ల ఆదాయాలు రావు సరికదా, అభివృద్ధికి గండిపడుతుంది. వెనిజువెలా, ఉత్తర కొరియా, తూర్పు జర్మనీ, డెంగ్ జియావో పింగ్ ముందుకాలంనాటి చైనా, సోవియట్ యూనియన్, ఇంకా పలు దేశాలు సంపద పంపిణీ ప్రయోగాన్ని భారీ స్థాయిలో చేశాయి. ఆర్థిక ఫలితాల్లో బలవంతపు సమానత్వాన్ని సాధించేందుకు ప్రయత్నించాయి. ఏం జరిగిందో చూశాం.

1991 నుండి ఈ మూడు దశాబ్దాలలో, భారత్‌లో దిగువనున్న 50 శాతం జనాభా ఆదాయాలు నాలుగు రెట్లు పెరిగాయి. అంతకుముందు కంటే ఎక్కువ ఆదాయాలు, మెరుగైన రహదారులు, విద్యుత్, మొబైల్ ఫోన్లు, టెలివిజన్, ఇంటర్‌నెట్, డిజిటల్ బదిలీలు ఎరగని కుటుంబం భారత్‌లో దాదాపు లేదు. కానీ నిజమైన పేదరికం ఇంకా కొనసాగుతోంది. కోట్ల మంది ఇప్పటికీ రెక్కాడితేగానీ డొక్కాడని స్థితిలో, రేపేంటి అనే అభద్రతలోనే ఉన్నారు. అటువంటి వాతావరణంలో, తాత్కాలిక వ్యక్తిగత పథకాలకు బలమైన ఆదరణ ఉంటుంది. అయితే సంక్షేమ చర్యలు ఆర్థికంగా ఆచరణసాధ్యంగా ఉండాలి. వచ్చే తరానికి ఆస్తుల్ని నిర్మించకుండా, తాత్కాలిక పథకాల కోసం ఎడాపెడా అప్పులు చేయలేం. సంక్షేమమే పరిపాలన కాకుండా, మౌలిక వసతులు, పెట్టుబడుల ప్రోత్సాహం, పోటీ, అధిక ఆర్థికాభివృద్ధిని జోడించాలి. అప్పుడు మాత్రమే పేదలకు శాశ్వత ప్రాతిపదికన ఆదాయాలు పెరుగు తాయి. పేదరికం తొలగుతుంది. అన్ని వర్గాల ప్రజల జీవన నాణ్యత మెరుగవు తుంది. కాబట్టి, అసలైన సవాలు "పంచటం ఎలా" కాదు; "పేదల ఉత్పాదకతను పెంచటం ఎలా, వారికి నిజమైన అవకాశాన్ని అందించటమెలా". పేదల్లో అత్య ధికులు సంపద సృష్టిలో భాగమయ్యామని భావించనంత వరకూ, అభివృద్ధి నుంచి తమకు అర్థమయ్యే రీతిలో లాభం పొందనంత వరకూ, మన రాజకీయాలు అభివృద్ధికి వ్యతిరేకంగానే సాగుతుంటాయి. ప్రజల్లో ఎక్కువ శాతానికి ఎదిగే అవ కాశాలు స్పష్టంగా అందుబాటులోకి వచ్చినప్పుడు మాత్రమే ఆర్థికాభివృద్ధికి మెజారిటీ ఓట్లు పడతాయి. కాబట్టి వచ్చే 10–15 సంవత్సరాలు మన ప్రజా స్వామ్యానికి, మన ఆర్థిక వ్యవస్థకి అత్యంత కీలకం.

ఆర్థిక ప్రగతిని వేగవంతం చేయటానికి వీలైన ప్రతిదీ మనం చేయాలి. అభివృద్ధి ఒక్కటే సరిపోదు. ఇప్పటికీ చాలామంది జీవనప్రమాణాలని నిర్ణయించటంలో తలసరి ఆదాయం అత్యంత కీలకమైనది. అధిక అభివృద్ధిని కొనసాగించాలంటే, ఆర్థిక క్రమశిక్షణ, మౌలిక వసతులు, పెట్టుబడులకు ప్రోత్సాహం, నియంత్రణ అడ్డుగోడల తొలగింపు కోసం మనం తదేకంగా కృషి చేయాలి. అభివృద్ధిని వేగవంతం చేసేం దుకు, అందులో పేదలకు మరింత సమాన భాగస్వామ్య అవకాశాలు అందించేం దుకు నాలుగు కీలక విభాగాల మీద మనం దృష్టి సారించాలి. మొదటిది– ఉత్పత్తిలో కీలక పాత్ర వహించే భూమి, కార్మిక చట్టాల సంకెళ్లను తొలగించాలి. మరిన్ని పెట్టుబడులు ప్రవహించేలా, మరింత ఉపాధిని సృష్టించేలా చేయాలి. అభి వృద్ధికి దన్నుగా నిలిచే కనీస స్థాయి చట్టబద్ధపాలన పరిస్థితుల్ని నెలకొల్పాలి. ఒప్పందాలు సరిగా అమలయ్యేలా చేయటం, వివాదాల్ని వేగంగా పరిష్కరించటం జరగాలి. రెండోది– మన ప్రజల ఉత్పాదకత, సంపాదనా సామర్థ్యాన్ని పెంచేందుకు జాతీయ స్థాయిలో విద్యారంగంలో ఓ బృహత్తర ప్రయత్నం కావాలి. పిల్లల నమోదు, మౌలిక వసతులు చాలవు, నాణ్యమైన పాఠశాల విద్యాప్రమాణాలు మన మంత్రం కావాలి. ప్రజలకు జేబుఖర్చు లేకుండా నాణ్యమైన ఆరోగ్యం, ముఖ్యంగా ప్రాథమిక స్థాయిలో, ప్రభుత్వ–ప్రైవేటు భాగస్వామ్యంతో అందుబాటులో ఉండాలి. మూడోది– అభివృద్ధి, ఉపాధి అవకాశాలకు చోదక శక్తులయ్యే 3000 చిన్న పట్టణాల సహజ అభివృద్ధిని ప్రోత్సహించాలి. గ్రామాల మధ్య అటువంటి పట్టణీకరణ వల్ల తక్కువ నైపుణ్యాలున్న కోట్లాది మంది కార్మికులు ఎక్కడో దూరంగా ఉన్న పెద్ద నగరాలకు వలస పోవాల్సిన, దుర్భర పరిస్థితుల మధ్య బిక్కుబిక్కుమంటూ బతకాల్సిన అవసరం లేకుండా ఉపాధి లభిస్తుంది. గ్రామీణ–పట్టణ ప్రాంతాల మధ్య అగాధం తొలగాలి, అనుసంధానం పెరగాలి. ప్రభుత్వాలు ఒక్కసారి మౌలిక వసతుల్ని నిర్మించి, పట్టణ ప్రణాళికను నిర్దేశిస్తే చాలు, ఇళ్ల నిర్మాణం, వాణిజ్యం, పరిశ్రమలు వంటివి ప్రైవేటు రంగం చూసుకుంటుంది. చివరిగా– రైతుకి, వినియోగదారునికి మధ్య అడుగడు గునా దళారులు లేకుండా మార్కెట్ గొలుసును కుదించాలి. రిటైల్ చెయిన్లు, పంట ఉత్పత్తుల నిల్వ, ప్రాసెసింగ్, కాంట్రాక్ట్ వ్యవసాయం, ఎగుమతులను ప్రోత్సహిం చటం ద్వారా వ్యవసాయాన్ని ఆధునీకరించాలి. సమ్మిళిత అభివృద్ధిని ప్రోత్సహించ టానికి, అభివృద్ధిని, ప్రగతిని కోరుకునే మెజారిటీని సృష్టించటానికి ఇవన్నీ అవసరం.

■ డాక్టర్ జయప్రకాష్ నారాయణ్
లోక్‌సత్తా వ్యవస్థాపకులు



ధర్నాలో మాట్లాడుతున్న ఎంపీ ఈటల రాజేందర్

ఉరితీసినా తప్పులేదు

● ఎంపీ ఈటల

కవాడిగూడ, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): డాక్టర్లపై దాడులు జరగకుండా పటిష్ఠమైన చట్టాలు తీసుకురావాలని పలువురు వక్తలు డిమాండ్ చేశారు. కోల్‌కతాలో జూనియర్ మహిళా డాక్టర్‌పై హత్యాచార ఘటనకు నిరసనగా ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఎ)తెలంగాణా రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో శనివారం పెద్దఎత్తున నిరసన, ర్యాలీలు నిర్వహించారు. ఇందిరాపార్కు వద్ద ధర్నా చేపట్టారు. నగర వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రుల్లో పనిచేసే డాక్టర్లు, జూనియర్ డాక్టర్లు వందలాది మంది నల్లబ్యాడ్జీలు ధరించి ర్యాలీగా ధర్నా చౌక్‌కు వచ్చి నిరసన తెలిపారు. వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య, మల్కాజిరి ఎంపీ ఈటల రాజేందర్, పీఓడబ్ల్యూ అధ్యక్షురాలు వి.సంధ్య, పీడబ్ల్యూ అధ్యక్షురాలు ఝాన్సీ, ఐఎఫ్‌టీయూ నాయకురాలు అరుణ తదితరులు హాజరై వైద్యులకు మద్దతు తెలిపారు. ఎంపీ ఈటల రాజేందర్ మాట్లాడుతూ చట్టాలను సవరించి అయినా మహిళలపై అత్యాచారాలకు పాల్పడుతున్న వారిని బహిరంగంగా ఉరితీసినా తప్పులేదన్నారు. ఇండియన్ మెడికల్ అసోసియేషన్ తెలంగాణ రాష్ట్ర కమిటీ అధ్యక్షుడు డాక్టర్ పి.కాళీప్రసాదరావు, ప్రధానకార్యదర్శి డాక్టర్ విజయారావు. ఫైనాన్స్ సెక్రటరీ డాక్టర్ ఆర్‌కే యాదవ్, జాయింట్ సెక్రటరీ డాక్టర్ దయాళ్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.


రోగులు లేక ఖాళీగా ఉన్న గాంధీ ఆస్పత్రి ఓపీ విభాగం

కోల్‌కతా ఘటనపై

కదంతొక్కిన వైద్యులు

నిరసన ప్రదర్శనలు, ప్లకార్డులతో నినాదాలు

- ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రుల్లో స్తంభించిన సేవలు
- రోగుల అవస్థలు.. గంటల తరబడి పడిగాపులు
- ఓపీకి తీవ్ర అంతరాయం.. ఎమర్జెన్సీ యథాతథం
- వైద్యుల ధర్నాకు మద్దతు తెలిపిన ఎంపీలు ఈటల, కడియం కావ్య, ప్రజాసంఘాలు
- పలుచోట్ల కొవ్వొత్తులతో శాంతి ర్యాలీలు

కోల్‌కతాలో జూనియర్ డాక్టర్‌పై హత్యాచారాన్ని నిరసిస్తూ ప్రభుత్వ, ప్రైవేటు వైద్యులు నగర వీధుల్లో కదం తొక్కారు. అత్యవసర సేవలు మినహా మిగతా వైద్యసేవలు అన్నీ నిలిపివేసి ప్లకార్డులు ప్రదర్శిస్తూ నిరసనను తెలిపారు. ప్రధాన రహదారులపై ర్యాలీలు తీస్తూ ఇందిరాపార్క్ వద్ద ధర్నా నిర్వహించారు. పలు పార్టీలు, ప్రజా సంఘాల నేతలు తమ మద్దతు ప్రకటించారు. హంతకులను కఠినంగా శిక్షించాలని ముక్త కంఠంతో నినదించారు. వైద్యుల ఆందోళనలతో పలుచోట్ల రోగులు ఇబ్బందులకు గురయ్యారు. ఓపీ సేవలందక నిరాశతో వెనుదిరిగారు.


గోల్కొండ కోట ముందు నిరసన వ్యక్తం చేస్తున్న డాక్టర్లు, నర్సులు, సిబ్బంది

హైదరాబాద్ సిటీ/బర్కత్‌పుర/అడ్డగుట్ట/ఎర్రగడ్డ/సనత్‌నగర్, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): కోల్‌కతాలో జూనియర్ డాక్టర్ హత్యాచారానికి నిరసనగా ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) పిలుపు మేరకు శనివారం నగరంలో ప్రభుత్వ ప్రైవేటు ఆస్పత్రుల వైద్యులు, సిబ్బంది పెద్దఎత్తున ఆందోళన నిర్వహించారు. విధులను బహిష్కరించి నిరసన వ్యక్తం చేశారు. ప్లకార్డుల తో ప్రదర్శన చేపట్టి నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. వైద్యుల నిరసనతో అన్ని ఆస్పత్రుల్లో వైద్య సేవలకు తీవ్ర అంతరాయం కలిగింది. అత్యవసర సేవలను కొనసాగించగా, అవుట్ పేషెంట్ (ఓపీ) సేవలను బహిష్కరించడంతో వివిధ అనారోగ్య సమస్యలతో వచ్చిన వారు ఇబ్బందులకు గురయ్యారు. ఉస్మానియా, గాంధీ, నిలోఫర్, ప్రభుత్వ ప్రసూతి ఆస్పత్రులు, కోఠి ఈఎన్‌టీ, నిమ్స్, చెస్ట్, ఆయుర్వేద, ఈఎస్‌ఐసీలో వైద్యులు నిరసన చేపట్టారు. గాంధీ ఆస్పత్రి ఆవరణలో డాక్టర్లు ధర్నా నిర్వహించారు. అనంతరం ఆస్పత్రి నుంచి నేరుగా ఇందిరాపార్కు ధర్నా చౌక్‌కు తరలివెళ్లారు. చెస్ట్, మానసిక ఆస్పత్రుల్లో

మిగతా 8వ పేజీలో..



నిమ్స్ ఆస్పత్రి వద్ద భారీ ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యులు

కార్పొరేట్, ప్రైవేట్ ఆస్పత్రుల్లో..

హైదరాబాద్ సిటీ : గ్రేటర్‌వ్యాప్తంగా కార్పొరేట్, ప్రైవేట్ ఆస్పత్రుల్లో వైద్యులు ఓపీ, ఎలక్టివ్ సేవలను బహిష్కరించి నిరసన వ్యక్తం చేశారు. జూబ్లీహిల్స్ అపోలో ఆస్పత్రిలో వైద్యులు నిరసన వ్యక్తం చేస్తూ ప్ల కార్డులు ప్రదర్శించారు. ఈ చర్యకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వైద్యులు తమ జీవితాలను ఇతరులకు సేవ చేయడానికి అంకితం చేస్తారని, అలాంటి సమయంలో వారి రక్షణకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యం కల్పించాలని వైద్యులు డిమాండ్ చేశారు. యశోద ఆస్పత్రుల్లో ఓపీ సేవలు పూర్తిగా నిలిచిపోయాయి. ఆస్పత్రి మెడికల్ డైరెక్టర్, డాక్టర్ లింగయ్య మాట్లాడుతూ కోల్‌కత్తా ఘటన తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసిందన్నారు. మెడికవర్ ఆస్పత్రుల్లో ఓపీ సేవలను బహిష్కరించి నిరసన వ్యక్తం చేశారు. అమానవీయ ఘటనతో దేశం విస్తుపోయిందని, కారకులను కఠినంగా శిక్షించాలని మెడికవర్ ఆస్పత్రి అధినేత, చైర్మన్ డాక్టర్ అనిల్‌కృష్ణ డిమాండ్ చేశారు. కిమ్స్ ఆస్పత్రుల్లో చైర్మన్ డాక్టర్ భాస్కర్ రావు ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. బంజారాహిల్స్, నానక్‌రాంగూడ స్టార్ ఆస్పత్రుల వైద్యులు పెద్దఎత్తున మార్చ్ నిర్వహించారు. నిందితులకు కఠిన శిక్ష పడాలని స్టార్ ఆస్పత్రి ఎండీ డాక్టర్ గోపీచంద్ కోరారు. బసవతారకం కేన్సర్ ఆస్పత్రి, ఏఐజీ ఆస్పత్రి, రెయిన్‌బో చిల్డ్రన్ ఆస్పత్రి, కేర్, మల్లారెడ్డి, నారాయణ మల్టీస్పెషాల్టీ ఆస్పత్రుల్లో వైద్యులు ఆందోళన నిర్వహించారు.



గాంధీలో ప్లకార్డులతో నిరసన వ్యక్తం చేస్తున్న వైద్యులు

వైద్య విద్యార్థుల కొవ్వొత్తుల ప్రదర్శన

కవాడిగూడ, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): కోల్‌కతాలో జూనియర్ డాక్టర్‌ను హత్యచేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ నేషనల్ మెడికోస్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో శనివారం రాత్రి ట్యాంక్‌బండ్‌పై ఉన్న స్వామి వివేకానంద విగ్రహం వద్ద కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించారు. డాక్టర్లపై జరుగుతున్న దాడులను అరికట్టేందుకు కేంద్రరాష్ట్ర ప్రభుత్వాలు పటిష్ఠమైన చట్టాలు తీసుకురావాలని ఆర్గనైజేషన్ అధ్యక్ష కార్యదర్శులు డాక్టర్ శంకర్, సురేంద్ర డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కార్యనిర్వాహక కార్యదర్శి డాక్టర్ గుండు శ్రీనివాస్, ఉపాధ్యక్షురాలు డాక్టర్ రష్మి, డాక్టర్ లక్ష్మీ ప్రసన్నలతో పాటు మహిళా, జూనియర్ డాక్టర్లు పెద్ద సంఖ్యలో పాల్గొని కొవ్వొత్తులు వెలిగించి శాంతియుతంగా నిరసన నిర్వహించారు.


అపోలో ఆస్పత్రి ఆధ్వర్యంలో ప్లకార్డులతో నిరసన వ్యక్తం చేస్తున్న డాక్టర్లు

సివరేజీ పునరుద్ధరణకు రూ.223 కోట్లు

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): పాతనగరంలో ఇప్పటికీ నిజాం కాలం నాటి మురుగునీటి వ్యవస్థ ఉండడంతో దాన్ని మెరుగుపర్చేందుకు వాటర్‌బోర్డు చర్యలు ప్రారంభించింది. జోన్-2లోని చాంద్రాయణగుట్ట పరిధిలో రూ.223 కోట్లతో పనులు చేపట్టేందుకు బోర్డు సంకల్పించింది. ఇందుకు అవసరమైన టెండర్లను కూడా ఆహ్వానించింది. వచ్చే నెలలో పనులు ప్రారంభించేందుకు అవసరమైన కార్యాచరణను సిద్ధం చేసింది. పనుల్లో భాగంగా దాదాపు 156 కిలోమీటర్ల పొడవుతో పాత పైపులైన్ల స్థానంలో కొత్త వాటిని ఏర్పాటు చేయనున్నారు. ప్రధాన మురుగు కాల్వను నిర్మించి దాన్ని సివరేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ (ఎస్టీపీ)కు అనుసంధానం చేయనున్నారు. అలాగే మలక్‌పేట నియోజకవర్గ పరిధిలో కూడా సివరేజీ పునరుద్ధరణకు నిధులను కేటాయించడంతో వాటర్‌బోర్డు ప్రణాళికలు రూపొందిస్తోంది.

గణేశ్ ఉత్సవాలకు ఏర్పాట్లు చేయండి

మంత్రి పొన్నం ప్రభాకర్


సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి పొన్నం ప్రభాకర్, అధికారులు

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): నగరవాసులు గణేశ్ ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో జరుపుకొనేలా అన్ని ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమశాఖల మంత్రి పొన్నం ప్రభాకర్ అధికారులను ఆదేశించారు. శనివారం బంజారాహిల్స్‌లోని ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్(ఐసీసీసీ)లో అన్ని శాఖల అధికారులతో ఏర్పాటు చేసిన 'గణేశ్ పండుగ-2024' ఉన్నతస్థాయి సమీక్ష సమావేశానికి మంత్రి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సెప్టెంబర్ 7నుంచి 17 వరకు గణేశ్ ఉత్సవాలు, నిమజ్జన కార్యక్రమాలు జరుగుతాయని అన్నారు. ఉత్సవాలకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా ఉండడానికి ఆయా శాఖలు సమన్వయం చేసుకోవాలని, గతంలో జరిగిన లోటుపాట్లు పునరావృతం కాకుండా చూసుకోవాలన్నారు. విగ్రహాల తయారీ ప్రాంతం నుంచి జిల్లాలకు, నగరంలో వివిధ ప్రాంతాలకు వెళ్లే విగ్రహాలకు సంబంధించిన వాహనాలకు రోడ్లపై ఇబ్బందులు లేకుండా చూడాలని అన్ని శాఖల అధికారులకు సూచించారు. గణేశ్ ఉత్సవాలతో హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్‌ను

మిగతా 6వ పేజీలో..

మట్టి విగ్రహాల పంపిణీలో భాగస్వాములు కావాలి

మట్టి విగ్రహాల పంపిణీలో స్వచ్ఛంద సంస్థలు, ప్రభుత్వ వలంటీర్ ఆర్గనైజేషన్, పర్యావరణాన్ని కాపాడే ఎన్జీవో సంస్థలు భాగస్వాములు కావాలని మంత్రి పొన్నం కోరారు. విగ్రహ నిమజ్జనం త్వరగా జరిగేలా నిర్వాహకులు పోలీసులకు సహకరించాలన్నారు.

ఇద్దరు పిల్లలతో సహా చెరువులో దూకి

తల్లి ఆత్మహత్య



భానుప్రియ, దీక్ష, వేదాన్ష్ ఆనంద్(ఫైల్)

మూడుచింతలపల్లి, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): ఇద్దరు పిల్లలతో సహా తల్లి చెరువులో దూకి ఆత్మహత్యకు పాల్పడింది. ఈ విషాద ఘటన మేడ్చల్ జిల్లా శామీర్‌పేట పీఎస్ పరిధిలో శనివారం సాయంత్రం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సిద్దిపేట జిల్లా ములుగుకు చెందిన మర్కంటి భానుప్రియ(28) ఈనెల 15న రాత్రి తన భర్త మర్కంటి స్వామితో గొడవపడి కుమారుడు దేవాన్ష్‌ఆనంద్(5), కుమార్తె దీక్ష(4)తో కలిసి బయటకు వెళ్లింది. రాత్రి వెతికినా వారి ఆచూకీ లభ్యం కాకపోవడంతో స్వామి మరుసటిరోజు ములుగు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. శనివారం సాయంత్రం ఓ మహిళ, ఇద్దరు పిల్లలతో కలిసి శామీర్‌పేట పెద్దచెరువులో దూకి ఆత్మహత్యకు పాల్పడిందని గమనించిన స్థానికులు మహిళ, చిన్నారి మృతదేహాలను వెలికితీసి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు వారి మృతదేహాలను పరిశీలించి మర్కంటి భానుప్రియ, చిన్నారి దీక్షగా గుర్తించారు. కుమారుడు దేవాన్ష్ కోసం గాలింపుచర్యలు చేపట్టారు.

హుస్సేన్‌సాగర్

గేట్ ఎత్తివేత

నీటిని కిందకి వదిలిన అధికారులు



హైదరాబాద్ సిటీ, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): నగరంలో రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలతో హుస్సేన్‌సాగర్‌లోకి వరద నీటి ప్రవాహం పెరిగింది. పూర్తిస్థాయి నీటిమట్టం 513.41 అడుగులు కాగా.. శనివారం ఉదయం వరకు 513.53 వరకు పెరగడంతో తూము గేట్‌ను 2 ఫీట్ల పైకి ఎత్తి నీటిని నాలా ద్వారా దిగువకు వదిలారు. హుస్సేన్‌సాగర్‌లోకి పైనుంచి వస్తున్న వరద ఉధృతిని ఇంజనీరింగ్ అధికారులు ఎప్పటికప్పుడు అంచనా వేస్తూ పర్యవేక్షిస్తున్నారు. ఇన్ ఫ్లో 2,075 క్యూసెక్కులు కాగా.. 1,538 క్యూసెక్కుల నీటిని దిగువకు వదిలారు.

గ్రామీణ మహిళలకు చేయూతనందించాలి


రూరల్ ఉమెన్స్ లీడర్‌షిప్ ప్రోగ్రామ్‌ను ప్రారంభిస్తున్న మంత్రి సీతక్క, మాజీ మంత్రి గీతారెడ్డి, సినీనటి రెజీనా

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): 'ప్రజాస్వామ్యంలో ప్రతి ఒక్కరికీ స్వేచ్ఛ ఉంటుంది. భారత రాజ్యాంగం మనకు కల్పించిన మంచి అవకాశం. పౌరులకు ప్రభుత్వాన్ని ప్రశ్నించే హక్కు ఉంది' అని మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క అన్నారు. మాదాపూర్‌లో డెమోక్రటిక్ సంఘ ఆధ్వర్యంలో 'రూరల్ ఉమెన్స్ లీడర్‌షిప్ ప్రోగ్రామ్'ను శనివారం ఆమె ప్రారంభించి మాట్లాడారు. చాలా ఎన్జీవోలు లేదా వ్యక్తులకు సేవ చేయాలని ఉంటుందని..ఏది, ఎక్కడ అవసరమో గుర్తించి చేసినప్పుడే లక్ష్యం చేరుకుంటామని, ఈ విషయంలో డెమోక్రటిక్ సంఘ విజయవంతమైందని తాను భావిస్తున్నట్లు చెప్పారు. గ్రామీణ మహిళలు లేకుండా ఈ సమాజంలో ఆహార భద్రత, ఆర్థిక భద్రత ఉండదని, వారి కష్టాలు తెలుసుకొని చేయూతనందించాలని సూచించారు. డెమోక్రటిక్ సంఘ సహ వ్యవస్థాపకులు చైతన్య, రెజీనా మాట్లాడుతూ మానవహక్కులు, చట్టాల అమలు, మహిళల భాగస్వామ్యం, పౌర విద్య, సామాజిక, ఎన్నికల సంస్కరణలు, ప్రజాస్వామ్య సూత్రాలను ప్రచారం చేయడానికి 'డెమోక్రటిక్ సంఘ' ప్రారంభించినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో మాజీమంత్రి గీతారెడ్డి, సుధారెడ్డి, కరీంనగర్ జిల్లా నుంచి ఉమెన్స్ కలెక్టివ్ సభ్యులు పాల్గొన్నారు.

My GHMC

పెంపుడు జంతువుల వ్యాక్సినేషన్‌కు

మై జీహెచ్‌ఎంసీ యాప్

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ పరిధిలో పెంపుడు కుక్కలు, ఇతర జంతువుల సంరక్షణకు జీహెచ్‌ఎంసీ చర్యలు చేపడుతున్నది. ఈ మేరకు షెడ్యూల్ వారీగా ఆయా జంతువులకు వ్యాక్సినేషన్, డీవార్మింగ్ లాంటి సమాచారాన్ని మై జీహెచ్‌ఎంసీ యాప్‌లో తెలియజేయనున్నారు. పెంపుడు జంతువుల యజమానులు వాటి వివరాలను యాప్‌లో నమోదు చేయాలని, తద్వారా వాటి పరిరక్షణ కోసం తీసుకోవాల్సిన చర్యలను సూచిస్తూ ఎంటమాలజీ అధికారులు అప్రమత్తం చేయనున్నారు. గ్రేటర్‌లో వంద శాతం నమోదు ప్రక్రియను పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటున్నారు. ఇతర వివరాలకు ఎల్బీనగర్ జోన్‌లో డాక్టర్ రాణజిత్, చార్మినార్‌లో డాక్టర్ శ్రీనివాస్, ఖైరతాబాద్‌లో డాక్టర్ చక్రపాణి, శేరిలింగంపల్లిలో డాక్టర్ జేడీ విల్సన్, కూకట్‌పల్లిలో డాక్టర్ సుకునందన్‌రెడ్డి, సికింద్రాబాద్‌లో డాక్టర్ సద్గుణలను సంప్రదించాలని అధికారులు సూచించారు.

ర్యాగింగ్ భూతాన్ని తరిమేద్దాం

డ్రగ్స్, ర్యాగింగ్‌ను అరికట్టేందుకు కలిసి రావాలి ● విద్యార్థులకు డీజీపీ జితేందర్ పిలుపు



సే నో టూ డ్రగ్స్ పోస్టర్‌ను విడుదల చేస్తున్న డీజీపీ జితేందర్, బుర్రా వెంకటేశం, సీపీ శ్రీనివాస్‌రెడ్డి తదితరులు

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): విద్యాసంస్థల్లో కొత్తగా ప్రవేశించిన విద్యార్థులను సీనియర్లు కలుపుకొని వెళ్లాలని డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (డీజీపీ) జితేందర్ సూచించారు. జూనియర్లను పరిచయం చేసుకునేందుకు ఆహ్లాదకరమైన పద్ధతులను అవలంబించాలని, తద్వారా ర్యాగింగ్‌కు చరమగీతం పాడాలని సీనియర్లకు పిలుపునిచ్చారు. రాష్ట్ర ఉన్నత విద్యామండలి ఆధ్వర్యంలో 'డ్రగ్ అబ్యూజ్ అండ్ యాంటీ ర్యాగింగ్' అంశంపై శనివారం మాసబ్‌ట్యాంక్‌లోని ఆర్కిటెక్చర్ యూనివర్సిటీ ఆడిటోరియంలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన డీజీపీ జితేందర్ మాట్లాడుతూ ర్యాగింగ్ చేయడమనేది చట్ట విరుద్ధమైన చర్య అని, ఇందుకు పాల్పడిన విద్యార్థులపై యాంటీ

మిగతా 6వ పేజీలో..

సంపూర్ణ ఆరోగ్యానికి
కోడిగుడ్డు ఉత్తమ ఔషధం 8

ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు
డ్రోన్లు వాడండి 8
● రద్దీ సమయాల్లో ట్రాఫిక్ సిబ్బంది రోడ్లపై ఉండాల్సిందే
● ట్రాఫిక్ రద్దీపై డీజీపీ సమీక్ష
● గురుకులాల్లో ప్రవేశం పొందిన విద్యార్థులకు అభినందన

మాదాపూర్‌లో బోర్డు తిప్పేసిన
మరో ఐటీ సంస్థ 8

గణేశ్ ఉత్సవాలకు ఏర్పాట్లు చేయండి

(5వ పేజీ తరువాయి)

మరింత పెంచేలా చూస్తామని మంత్రి అన్నారు. నిమజ్జనం అంశంపై కోర్టు ఆదేశాల ప్రకారమే ముందుకు సాగుతామన్నారు. సీపీ శ్రీనివాస్‌రెడ్డి, అదనపు కమిషనర్ విక్రమ్‌సింగ్ మాన్, హెచ్ఎండీఏ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్, కలెక్టర్ అనుదీప్, జీహెచ్ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి, జలమండలి ఎండీ అశోక్ రెడ్డి, ట్రాఫిక్ అడిషనల్ కమిషనర్ విశ్వప్రసాద్, ఆర్టీసీ, రెవెన్యూ, ఆర్అండ్‌బీ, ఎలక్ట్రిసిటీ, ట్రాన్స్‌పోర్టు, హెల్త్‌శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

ర్యాగింగ్ భూతాన్ని తరిమేద్దాం

(5వ పేజీ తరువాయి)

ర్యాగింగ్ యాక్ట్ ప్రకారం జరిమానా, క్రిమినల్ కేసులు, విద్యాసంస్థల నుంచి సస్పెన్షన్ లేదా బహిష్కరణ వంటి చర్యలు ఉంటాయన్నారు. ఈ చర్యల ఫలితంగా సదరు విద్యార్థులు తమ కెరియర్‌ను పూర్తిగా నష్టపోతారన్నారు. తెలంగాణను డ్రగ్స్ రహిత రాష్ట్రంగా మార్చేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. డ్రగ్స్ తీసుకుంటున్న వారి, సరఫరా చేస్తున్న వారి వివరాలను పోలీసులకు తెలియజేయాలని డీజీపీ విజ్ఞప్తి చేశారు. ఇందుకోసం త్వరలో టోల్‌ఫ్రీ నంబరును ప్రకటిస్తామని, సమాచారం ఇచ్చిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని తెలిపారు. రాష్ట్రంలోని విద్యాసంస్థల్లో ర్యాగింగ్‌కు స్థానం లేకుండా చేయాలని విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి బుర్రా వెంకటేశం పిలుపునిచ్చారు. పాఠశాలల్లో మాదిరిగానే కళాశాలల్లోనూ విద్యార్థుల రక్షణ కోసం 'ప్రహరీ క్లబ్'ల ఏర్పాటుకు అవసరమైన జీవోను త్వరలోనే జారీచేస్తామన్నారు. అనంతరం 'ర్యాగింగ్‌ను అరికడదాం.. డ్రగ్స్‌రహిత సమాజాన్ని నిర్మిద్దాం..' అంటూ ఆయన అందరితో ప్రమాణం చేయించారు. అంతకుముందు నగర పోలీస్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. నార్కొటిక్ బ్యూరో డైరెక్టర్ సందీప్‌కుమార్ శాండిల్య, సాంకేతిక విద్యాశాఖ కమిషనర్ దేవసేన, ఉన్నత విద్యామండలి ఛైర్మన్ లింబాద్రి, వైస్‌ఛైర్మన్లు వెంకటరమణ, మహమూద్, కార్యదర్శి శ్రీరాం వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.


నియామక పత్రం అందజేస్తున్న రాఘవరెడ్డి

బహదూర్‌పురా గణేష్ ఉత్సవ సమితి అధ్యక్షుడిగా ఉదయ్ కిరణ్‌రెడ్డి

చాంద్రాయణగుట్ట, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): బహదూర్‌పురా నియోజకవర్గం గణేశ్ ఉత్సవ సమితి అధ్యక్షుడిగా ఆలియాబాద్‌కు చెందిన ఎం.ఉదయ్‌కిరణ్‌రెడ్డి నియమితులయ్యారు. శనివారం అధ్యక్షుడు రాఘవరెడ్డి ఆయనకు నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఉదయ్‌కిరణ్‌రెడ్డి మాట్లాడుతూ పాతనగరంలో గణేష్ నవరాత్రిఉత్సవాలకు ఓ ప్రత్యేక స్థానముందన్నారు. తనకు అప్పగించిన బాధ్యతలను సక్రమంగా నిర్వర్తిస్తానన్నారు.

టౌన్‌ప్లానింగ్ ఇన్‌చార్జి ఏసీపీగా బాధ్యతలు స్వీకరించిన శ్రీధర్


బాధ్యతలు స్వీకరిస్తున్న శ్రీధర్

రాజేంద్రనగర్, ఆగస్టు17(ఆంధ్ర జ్యోతి): రాజేంద్రనగర్ సర్కిల్ -11 టౌన్ ప్లానింగ్ ఇన్‌చార్జి ఏసీపీగా సి. శ్రీధర్ బాధ్యతలు స్వీకరించారు. వికారాబాద్‌లో పనిచేస్తున్న ఆయనను ఉన్నతాధికారులు రాజేంద్రనగర్ టౌన్‌ప్లానింగ్ విభాగానికి బదిలీ చేశారు. శనివారం రాజేంద్రనగర్ కార్యాలయానికి వచ్చి డిప్యూటీ కమిషనర్ రవికుమార్ సమక్షంలో బాధ్యతలను స్వీకరించారు.


వెంకటేశ్‌యాదవ్‌కు నియామకపత్రం అందజేస్తున్న చైర్మన్ నందకిశోర్ యాదవ్

గ్రేటర్ హైదరాబాద్ యాదవ సంఘం అధ్యక్షుడిగా వెంకటేశ్‌యాదవ్

అఫ్జల్‌గంజ్, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ హైదరాబాద్ యాదవ సంఘం(జాంబాగ్) అధ్యక్షుడిగా బోయిని వెంకటేశ్ యాదవ్ నియమితులయ్యారు. శనివారం జాంబాగ్‌లోని సంఘం భవనంలో గ్రేటర్ హైదరాబాద్ చైర్మన్ చిట్ట బోయిన నంద కిశోర్‌యాదవ్ ఆయనకు నియమాక పత్రాన్ని అందజేసి సన్మానించారు. ఈ సందర్భంగా బోయిని వెంకటేశ్ యాదవ్ మాట్లాడుతూ.. గ్రేటర్ హైదరాబాద్‌లో ఉన్న యాదవులందరిని ఏకతాటిపైకి తీసుకొచ్చి సంఘం అభివృద్ధి కోసం పాటుపడుతానన్నారు.

గుర్రపుడెక్క తొలగింపు పనుల ప్రారంభం

రాజేంద్రనగర్, ఆగస్టు17(ఆంధ్రజ్యోతి): అత్తాపూర్ మూసీలో పేరుకుపోయిన గుర్రపు డెక్క తొలగింపు పనులను శనివారం కార్పొరేటర్ మోండ్ర సంగీత గౌరీశంకర్ ప్రారంభించారు. గుర్రపుడెక్క కారణంగా మూసీలో దోమలు వృద్ధి చెందుతున్నాయని స్థానికుల ఫిర్యాదు మేరకు పనులు ప్రారంభించినట్టు కార్పొరేటర్ తెలిపారు. కొద్ది నెలలుగా మూసీలో గుర్రపు డెక్క ఏపుగా పెరగడంతో దోమలు వృద్ధి చెంది స్థానికంగా ఉంటున్న ప్రజలు విష జ్వరాల బారిన పడుతున్నారన్నారు.

జల్‌పల్లిలో సీసీ రోడ్డు పనులు..

పహడీషరీఫ్ ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి అభివృద్ధి పనులు వేగంగా సాగుతున్నాయని జల్‌పల్లి మున్సిపాలిటీ 16వ వార్డు కౌన్సిలర్ బుడమల యాదగిరి పేర్కొన్నారు. జల్‌పల్లి బస్టాండ్ నుంచి మున్సిపల్ కార్యాలయానికి వెళ్లే వాటర్ ట్యాంక్ వరకు రూ. 20 లక్షలతో చేపట్టిన సీసీ రోడ్డు పనులను శనివారం కౌన్సిలర్ ప్రారంభించారు.

జగదాంబిక మహాకాళి ఆలయం పేరిట రూ. 10 లక్షలు ఫిక్స్‌డ్ డిపాజిట్

కార్వాన్, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): చారిత్రకమైన గోల్కొండ కోట శ్రీ జగదాంబిక మహంకాళి అమ్మవారి పేరిట లంగర్‌హౌజ్ యూనియన్ బ్యాంకులో రూ. 10 లక్షలు శనివారం ఫిక్స్‌డ్ డిపాజిట్ చేశారు. ఆలయ చైర్మన్ కాంతా అరవింద్ మహేశ్ కుమార్ మాట్లాడుతూ ఎన్నడూ లేనివిధంగా ఈ ఏడాది పలువురు భారీగా విరాళాలు ఇచ్చారని తెలిపారు. కార్యక్రమంలో ఆలయం ఈవో శ్రీనివాస్ రాజు, దేవాలయ వృత్తి పనివారు సంఘం అధ్యక్షుడు శివశంకర్, మాజీ అధ్యక్షుడు బొమ్మల సాయిబాబా తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన పాత నాణేలు, కరెన్సీ ఎగ్జిబిషన్

చార్మినార్ ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): మొఘల్‌పురా ఉర్దుఘర్‌లో నిర్వహిస్తున్న పాతనాణేల ఎగ్జిబిషన్ ముగిసింది. ఆల్ ఇండియా చార్మినార్ ఎగ్జిబిషన్ ఆఫ్ కాయిన్స్ అండ్ కరెన్సీ ఇన్ హైదరాబాద్ పేరుతో ఈ నెల 15న ప్రారంభమైన ప్రదర్శన శనివారం ముగిసింది. ప్రపంచ వ్యాప్తంగా 60 దేశాలకు సంబంధించిన పురాతన నాణేలు, నోట్లు అందుబాటులో ఉంచారు. పలువురు సందర్శకులు పాత నాణేలను కొనుగోలు చేశారు. నిజాం కరెన్సీతో పాటు బ్రిటిష్ కరెన్సీకి ఇప్పటికీ డిమాండ్ ఉందని నిర్వాహకులు తెలిపారు.


నిత్యవసరాలను పంపిణీ చేస్తున్న రమణాచారి

పేద బ్రాహ్మణ మహిళలకు కేవీఆర్ కిట్ల పంపిణీ

రవీంద్రభారతి, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): సమాజంలో ప్రతి ఒక్కరికీ సామాజిక స్పృహ ఉండాల్సిన అవసరముందని రిటైర్డ్ ఐఏఎస్ డా.కేవీ.రమణాచారి అన్నారు. వరలక్ష్మి వ్రతం సందర్భంగా రమణాచారి క్యాంప్ ఆఫీస్‌లో బ్రాహ్మణ సేవా వాహిని మహిళా విభాగం ఆధ్వర్యంలో మహిళలకు కేవీఆర్ కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రమణాచారి మాట్లాడుతూ బ్రాహ్మణుల్లో పేదలు చాలామంది ఉన్నారని వారికి కావాల్సిన సహాయం అందజేయాల్సిన అవసరముందని అన్నారు. బ్రాహ్మణ సేవ వాహిని సంస్థ ఆధ్వర్యంలో కేవీఆర్ కిట్‌లను రూపొందించి పేదలకు అందజేయడం సంతోషకరమ న్నారు. సేవా కార్యక్రమాల్లో యువత పాల్గొనాలని పిలుపునిచ్చారు.


రంగారెడ్డి జిల్లా డీఎంహెచ్‌వో కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న వైద్యులు


హైదర్‌గూడ జాయ్ ఆస్పత్రి వద్ద నిరసన వ్యక్తం వైద్యులు, సిబ్బంది

హత్యాచార నిందితులను

బహిరంగంగా ఉరితీయాలి

- నగరంలో వెల్లువెత్తిన నిరసనలు
- విధులు బహిష్కరించి వైద్యుల ఆందోళన

రాజేంద్రనగర్ / చార్మినార్/మంగళ్‌హాట్ / అఫ్జల్‌గంజ్ / హైదరాబాద్ సిటీ, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): కోల్‌కత్తాలో వైద్యురాలి అత్యాచారం హత్య ఘటనపై నగరంలోని పలు ప్రాంతాల్లో నిరసనలు వెల్లువెత్తాయి. మహిళా వైద్యురాలుపై అత్యాచారం చేసి, హత్య చేసిన వారిని తక్షణమే అరెస్ట్ కఠినంగా శిక్షించాలని వైద్యులు డిమాండ్ చేశారు. శనివారం శివరాంపల్లిలో గల రంగారెడ్డి జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయం వద్ద, హైదర్‌గూడ జాయ్ ఆస్పత్రి, పేట్లబురుజు ఆస్పత్రి, చార్మినార్ యూనాని వైద్యులు, ఆబిడ్స్‌లోని ఉదయ ఓమినీ ఆస్పత్రి, మైలార్‌దేవుపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు, నర్సులు, వైద్య సిబ్బంది నల్లబ్యాడ్జీలు ధరించి ఆందోళనలు, నిరసన కార్యక్రమాలు చేపట్టారు. మృతిరాలి ఆత్మకుశాంతి చేకూరాలని చార్మినార్ యూనాని వైద్యులు విధులు బహిష్కరించి కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు వైద్యులు, నర్సులు మాట్లాడుతూ కోల్‌కత్తాలో మహిళా డాక్టర్‌ను హత్య చేసిన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. హత్యకు గురైన వైద్య విద్యార్థిని కుటుంబానికి న్యాయం జరిగే వరకు పోరాటం ఆగదని స్పష్టం చేశారు. పాలకులు స్పందించకుంటే పోరాటం మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఉదయ్ ఓమినీ డైరెక్టర్లు డాక్టర్ రాఘవ దత్తు, డాక్టర్ ఉదయ్ ప్రకాశ్ మాట్లాడుతూ... రాఖీ పండుగరోజు రాఖీలు కట్టడమే కాదు... మహిళలకు పురుషులు రక్షణ ఉండాలన్నారు. ఈ విషయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణమే జోక్యం చేసుకొని ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

ఎస్ఎఫ్ఐ, పీడీఎస్ఎఫ్ ఆధ్వర్యంలో....

కోల్‌కతాలో ట్రైనీ డాక్టర్‌పై హత్యాచార సంఘటనను బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి నాగరాజు, పీడీఎస్ఎఫ్ అధ్యక్ష, కార్యదర్శులు ఆవుల నాగరాజు, కుమార్ డిమాండ్ చేశారు. భారత విద్యార్థి ఫెడరేషన్(ఎస్ఎఫ్ఐ) హైదరాబాద్ కమిటీ ఆధ్వర్యంలో వైఎంసీఏ చౌరస్తాలో కొవ్వొత్తులతో నిరసన వ్యక్తం చేశారు. కేపీహెచ్‌బీ ఇండీస్ వన్‌సిటీ గేటెడ్ కమ్యూనిటీ ఆధ్వర్యంలో శనివారం రాత్రి కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. డా. రవి కిషోర్, వన్‌సిటీ డైరెక్టర్లు నర్సింహారావులు మాట్లాడుతూ ఈ ఘటనలో బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ర్యాలీలో రవి శంకర్, ఎన్ఆర్ రాణి, వికాష్, పట్టాభి, రాంకుమార్, పలువురు డాక్టర్లు పాల్గొన్నారు. మెజార్టీ ఘటనల్లో ప్రభుత్వాలు, పాలక పార్టీలు, రాజకీయ వ్యవస్థ, పోలీసులు నిందితులు, దోషులకు అండగా ఉంటున్నాయన్నారు.

జాంబాగ్ చౌరస్తాలో మమతాబెనర్జీ ఫొటో దహనం



సీఎం చిత్రపటాన్ని దహనం చేస్తున్న కార్పొరేటర్ రాకేశ్ జైశ్వాల్

పశ్చిమ బెంగాల్‌లో యువ వైద్యురాలిని హత్య చేసిన నిందితులకు ఉరి శిక్ష విధించాలని కార్పొరేటర్ రాకేశ్ జైశ్వాల్ డిమాండ్ చేశారు. వైద్యురాలిపై జరిగిన ఘటనను నిరసిస్తూ జాంబాగ్ చౌరస్తాలో పశ్చిమ బెంగాల్ సీఎం దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా రాకేశ్ జైశ్వాల్ మాట్లాడుతూ... దోషులను అరెస్ట్ కఠినంగా శిక్షించేలా మమతా బెనర్జీ చర్యలు తీసుకోవాలన్నిరు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు రవికాంత్, రామకృష్ణ, నర్సింగ్, రమాకాంత్, కార్యకర్తలు పాల్గొన్నారు.


ఉస్మానియా ఆస్పత్రిలో నిరసన వ్యక్తం చేస్తున్న వైద్యులు


బాధిత వైద్యురాలికి కొవ్వొత్తులతో నివాళులర్పిస్తున్న ఇండియన్ మెడికల్ అసోసియేషన్ వైద్యులు

26న కలెక్టర్ కార్యాలయాల ముట్టడి

సెప్టెంబర్ 6న లక్షలాది మందితో కులగణన మార్చ్.. హైదరాబాద్ దిగ్బంధం


మాట్లాడుతున్న బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్

బర్కత్‌పుర, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో సమగ్ర కులగణన చేపట్టడంలో కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరి అవలంబిస్తుందని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ ఆరోపించారు. కులగణనపై జీవోను జారీ చేసి నిధులు కేటాయించి రాష్ట్ర ప్రభుత్వం చేతులు దులుపుకుందని ధ్వజమెత్తారు. కులగణనపై దశల వారిగా ఉద్యమాలు చేపట్టిన ప్రభుత్వం తమకు ఏమీ పట్టనట్లు వ్యవహరిస్తుందని ఆరోపించారు. సమగ్ర కులగణన చేపట్టాలని డిమాండ్ చేస్తూ సెప్టెంబర్ 6న మిలియన్ మార్చ్ తరహాలో కులగణన మార్చ్ నిర్వహించి లక్షలాది మందితో హైదరాబాద్‌ను దిగ్బంధం చేస్తామని ఆయన హెచ్చరించారు. శనివారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన బీసీ సంఘాల సమావేశంలో బీసీ కుల సంఘాల జేఏసీ చైర్మన్ కుందారం గణేషాచారి, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కన్వీనర్ బాలగోని బాల్‌రాజ్‌గౌడ్, వడ్డెర సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు వేముల వెంకటేష్‌లతో కలిసి ఆయన మాట్లాడారు. ఈ నెల 22న అఖిలపక్ష పార్టీలు, బీసీ కుల, ప్రజా సంఘాల నేతలతో హైదరాబాద్‌లో సమావేశం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ నెల 26న రాష్ట్రవ్యాప్తంగా 33 జిల్లా కలెక్టర్ కార్యాలయాల ముట్టడి కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. అప్పటికీ ప్రభుత్వం స్పందించకపోతే రాష్ట్ర బంద్‌కు పిలుపునిస్తామని హెచ్చరించారు. ఏఐసీసీ అగ్రనేత రాహుల్‌గాంధీ దేశవ్యాప్తంగా కులగణన చేపట్టాలని డిమాండ్ చేస్తుండగా రాష్ట్ర ప్రభుత్వం అందుకు విరుద్ధంగా వ్యవహరిస్తుందని విమర్శించారు. కులగణన చేపట్టి బీసీ రిజర్వేషన్లను 42 శాతం పెంచిన తర్వాతనే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలన్నారు.

ఘనంగా తెలంగాణ ఐకాన్ అవార్డుల ప్రదానోత్సవం

రవీంద్రభారతి, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉద్యోగిగా పనిచేస్తూ మరోవైపు సేవా కార్యక్రమాలు చేస్తున్న గైక్వాడ్ తులసీదాస్ మాంగ్‌కు తెలంగాణ ఐకాన్ అవార్డు లభించింది. తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో తెలంగాణ వాయిస్ స్టూడియో, తెలంగాణ థియేటర్, మీడియా రిపర్టరీ ఆధ్వర్యంలో ఐకాన్ అవార్డుల ప్రదానోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి, భాషా సాంస్కృతిక శాఖ సంచాలకుడు మామిడి హరికృష్ణ అతిథులుగా హాజరై పురస్కారగ్రహీతల్ని సత్కరించి అభినందించారు. తెలంగాణ రాష్ట్ర అత్యున్నత పరిపాలనా కేంద్రం సచివాలయంలో అధికారిగా పనిచేయడంతో పాటు మాంగ్ సమాజ్ తెలంగాణ సంఘాన్ని స్థాపించి కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని అతిథులు అన్నారు. తులసీదాస్ సేవలు గుర్తించి గౌరవించడం ఆనందకరమన్నారు. కార్యక్రమంలో పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.


పురస్కారగ్రహీతను సత్కరిస్తున్న అతిథులు

శాస్త్రీయ కళలు మన సంస్కృతికి నిదర్శనం


కళాకారులను సత్కరిస్తున్న అతిథులు

రవీంద్రభారతి, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): శాస్త్రీయ కళలు మన సంస్కృతీ, సంప్రదాయాలకు నిదర్శనమని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కె.లక్ష్మణ్ అన్నారు. శుక్రవారం రాత్రి తెలుగు వర్సిటీలోని ఆడిటోరియంలో నృత్యకిన్నెర ఆధ్వర్యంలో పోణంగి శ్రీరామ అప్పారావు శతజయంతి ముగింపు వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా హైమావతి ఓలేటి, సంజన సిరిపూరపులచే కూచిపూడి నృత్య ప్రదర్శన నిర్వహించారు. చక్కటి నాట్యంతో కళాకారులు అలరించారు. ఆకట్టుకునే హావభావాలతో నర్తకులు ప్రేక్షకుల్ని రంజింపజేశారు. ముఖ్య అతిథిగా హాజరైన జస్టిస్ కె.లక్ష్మణ్ కళాకారులను సత్కరించి అభినందించారు. పోణంగి శ్రీరామ అప్పారావు చేసిన సాహిత్య సేవలను ఆయన కొనియాడారు. ఆయన జయంతి సందర్భంగా శాస్త్రీయ నృత్య ప్రదర్శనలు ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. నర్తకీమణులు హైమావతి, సంజన కనులవిందుగా నర్తించారని ప్రశంసించారు. ప్రముఖ సాహితీవేత్త ఓలేటి పార్వతీశం, అరుణా భిక్షు, యశోద ఠాకూర్, పోణంగి భాస్కర్ తదితరులు కళాకారులను సత్కరించారు.

ఘనంగా ఎస్వీ సత్యనారాయణ సప్తతి ఉత్సవం


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న అతిథులు

రవీంద్రభారతి, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): సమాజాన్ని సంపూర్ణంగా మార్చగలిగే సాహిత్యం రాయగలగడం గొప్ప విషయమని సీపీఐ నేత నారాయణ అన్నారు. తెలుగు విశ్వవిద్యాలయం మాజీ వీసీ, అభ్యుదయ కవి ఎస్వీ సత్యనారాయణ సప్తతి ఉత్సవం ఘనంగా జరిగింది. తెలంగాణ అభ్యుదయ రచయితల సంఘం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎస్వీ సత్యనారాయణ రచించిన మూడు గ్రంథాలు 'ఉద్యమమే ఉద్యమం, జీవితం ఒక ఉద్య మం', 'పాలపిట్ట', 'నేటి నిజం' ప్రత్యేక సంచికలను ఆవిష్కరించారు. ముఖ్యఅతిథిగా హాజరైన నారాయణ మాట్లాడుతూ ఎస్వీ సత్యనారాయణ రచనలు సమాజాన్ని కదిలించేవిగా ఉంటాయన్నారు. ఎస్వీ సత్యనారాయణ మాట్లాడుతూ 1969 ప్రత్యేక తెలంగాణ ఉద్యమ ప్రభావంతో తెలుగు సాహిత్య రంగంలోకి అడుగు పెట్టానని, భవిష్యత్‌లో మరిన్ని రచనలు తీసుకొచ్చే ప్రయత్నం చేస్తానని ఆయన అన్నారు.

పెండింగ్ సమస్యలను పరిష్కరించండి


కోదండరాంను సన్మానిస్తున్న ఐఎన్‌టీయూసీ అధ్యక్షుడు ఆదిల్ షరీఫ్

గోషామహల్, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): కార్మికుల పెండింగ్ సమస్యలను పరిష్కరించడానికి కృషి చేయాలని ఐఎన్‌టీయూసీ అధ్యక్షుడు ఆదిల్ షరీఫ్ కోరారు. ఎమ్మెల్సీగా బాధ్యతలు చేపట్టిన ప్రొఫెసర్ కోదండరాంను శనివారం ఆయన కార్యాలయంలో కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శాలువా కప్పి సన్మానించారు. జీహెచ్ఎంసీ విభాగంలో పనిచేస్తున్న కార్మికులకు సంబంధించి నాలుగు ప్రధాన డిమాండ్లు చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్నాయని, వాటి పరిష్కారానికి కృషి చేయాలని కోదండరామ్‌ను కోరారు. డీఏ, పీఆర్సీ హెల్త్ కార్డు, ప్రైవేటు కాంట్రాక్టర్‌లను రెగ్యూలరైజ్ చేయడం వంటి సమస్యలను పెండింగ్‌లో ఉన్నాయని ఎమ్మెల్సీ కోదండరామ్‌కు వివరించారు.

గెస్ట్ లెక్చరర్ల నియామకానికి దరఖాస్తుల ఆహ్వానం

హైదరాబాద్‌సిటీ, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): మాసబ్‌ట్యాంక్‌లోని ప్రభుత్వ ఉన్నత అధ్యయన సంస్థలో బీఈడీ, ఎంఈడీ కోర్సుల్లో తాత్కాలిక పద్ధతిన బోధించేందుకు గెస్ట్ లెక్చరర్లను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ఒక ప్రకటనలో తెలిపారు. ఫిలాసఫీ, సైకాలజీ, సోషియాలజీ, రీసెర్చ్ మెథడాలజీ, స్టాటిస్టిక్స్, ఇంగ్లిష్, ఐసీటీ/కంప్యూటర్, ఫిజికల్ ఎడ్యుకేషన్, విజువల్ ఆర్ట్స్ పెర్మార్మింగ్ ఆర్ట్స్‌లో బోధించేందుకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. పోస్టు గ్రాడ్యుయేషన్, ఎంఈడీలో కనీసం 55 శాతం మార్కులు సాధించి ఉండాలని, ఇంగ్లిష్‌లో బోధనలు చేయాల్సి ఉంటుందని చెప్పారు. అర్హత కలిగిన ఈనెల 21న సాయంత్రం 4.30 గంటలలోపు మాసబ్‌ట్యాంక్‌లోని ప్రభుత్వ ఉన్నత అధ్యయన సంస్థలో దరఖాస్తులు అందజేయాలని, మరిన్ని వివరాలకు 9963119534 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

సంక్షేమ హాస్టళ్ల సిబ్బంది సమయపాలన పాటించాలి


కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ప్రభాకర్‌రెడ్డి

అంబర్‌పేట, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లోని బీసీ, ఎస్సీ, ఎస్టీ సంక్షేమ హాస్టళ్ల సిబ్బంది సమయపాలన పాటించేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ ఎకానమికల్లి వీకర్స్ సెక్షన్(ఈడబ్ల్యూఎస్) రాష్ట్ర అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి, నేతలు అనిల్, కృష్ణలు కలెక్టర్ అనుదీప్ దురిశెట్టికి శనివారం వినతిపత్రం అందజేశారు. అన్ని హాస్టళ్లలో ఆకస్మిక తనిఖీలు చేయాలని కలెక్టర్‌ను కోరారు. చాలా మంది వార్డెన్‌లు వారానికి, నెలకు ఒకసారి హాస్టల్‌కు వస్తున్నారని ఆరోపించారు.

హామీల అమలులో కాంగ్రెస్ విఫలం

- బీజేపీ రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి అశోక్‌గౌడ్

రాజేంద్రనగర్, ఆగస్టు17(ఆంధ్రజ్యోతి): ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీల అమలులో కాంగ్రెస్ విఫలం అయిందని బీజేపీ రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి దేవులపల్లి అశోక్‌గౌడ్ ఆరోపించారు. శనివారం జరిగిన మైలార్‌దేవుపల్లి డివిజన్ బీజేపీ నాయకులు, కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. నాయకులు, కార్యకర్తలు నిరంతరం ప్రజల మధ్య ఉంటూ కాంగ్రెస్ ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేసే వరకు పోరాటం చేయాలన్నారు. కార్యక్రమంలో మైలార్‌దేవుపల్లి కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు పి.సంతోష్‌గౌడ్, ఎన్. మురళీధర్‌రెడ్డి, సేడెం వెంకటరమణ గుప్తా, బొమ్మరాజు నర్సింహ, నేరుట్ల జగన్, అడికె జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.

హిందువులపై దాడులను వెంటనే ఆపాలి

- శివాజీ మెమోరియల్ యూత్ క్లబ్ ఆధ్వర్యంలో నిరసన

గోషామహల్, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): బంగ్లాదేశ్‌లో హిందువులపై దాడులు, హత్యలు, అత్యాచారాలను వెంటనే ఆపేయాలని శివాజీ మెమోరియల్ యూత్ క్లబ్ అధ్యక్షులు చిట్టెం శైలేందర్ కురుమ విజ్ఞప్తి చేశారు. లేనిపక్షంలో బంగ్లాదేశ్‌కు.. భారత్ తగిన రీతిలో బుద్ధిచెబుతుందని ఆయన హెచ్చరించారు. శనివారం శివాజీ మెమోరియల్ యూత్ క్లబ్ ఆధ్వర్యంలో గోషామహల్ చౌరస్తా వద్ద సేవ్ హిందూస్ ఆఫ్ బంగ్లాదేశ్ ప్లకార్డులతో నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమానికి బీజేపీ గోల్కొండ జిల్లా అధ్యక్షులు వి.పాండు యాదవ్, సీనియర్ నాయకులు చీలంపల్లి సురేశ్ ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు.

కూల్చిన స్థలంలోనే మసీదును పునరుద్ధరించాలి

- సీఎం రేవంత్‌రెడ్డికి ఎంబీటీ లేఖ

హైదరాబాద్,ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): సంఘవిద్రోహులు మొయినాబాద్‌లో కూల్చివేసిన మసీదును యధావిధిగా అదే స్థలంలో నిర్మించేందుకు చర్యలు తీసుకోవాలని మజ్లిస్ బచావో తహ్రీక్(ఎంబీటి)అధికార ప్రతినిధి అంజదుల్లాఖాన్ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు శనివారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి లేఖ రాశారు. కాంగ్రెస్‌పాలిత రాష్ట్రంలో మసీదుల కూల్చివేత సంఘటనలపై ముస్లింలు ఆందోళన చెందుతున్నారని లేఖలో వివరించారు. మసీదు కూల్చివేత సంఘటనపై స్థానిక పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి బాధ్యులపై కఠినచర్యలు తీసుకుంటామని పోలీసులు, వక్ఫ్‌బోర్డు అధికారులు హామీ ఇచ్చినట్టు ఆయన గుర్తుచేశారు. యధాతథంగా కూల్చిన స్థలంలోనే మసీదును నిర్మిస్తామని వక్ఫ్‌బోర్డు అధికారులు హామీ ఇచ్చి మూడు వారాలు గడిచినా ఎలాంటి చర్యలు తీసుకోలేదని పేర్కొన్నారు. గత బీఆర్ఎస్ పాలనలో తొమ్మిది మసీదులు కూల్చివేతకుగురయినా బాధ్యులపై చర్యలు తీసుకోలేదన్నారు. సెక్యులర్ సీఎంగా రేవంత్ రెడ్డి చొరవ తీసుకుని మొయినాబాద్‌లో కూల్చిన స్థలంలోనే మసీదును పునరుద్ధరించాలని లేఖలో కోరారు. ఈ విషయంలో ముస్లిం మత ప్రతినిధులతో చర్చించేందుకు తగిన సమయాన్ని కేటాయించాలని అంజదుల్లాఖాన్ లేఖలో సీఎం రేవంత్‌రెడ్డికి విజ్ఞప్తి చేశారు.

అనుమానంతో భార్యపై కత్తితో దాడి

నిందితుడి అరెస్ట్

కార్వాన్, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): కట్టుకున్న భార్యను కత్తితో పొడవగా తీవ్రంగా గాయాలయ్యాయి. ఆసిఫ్‌నగర్ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు తెలిపిన వివరాల ప్రకారం... అసిఫ్‌నగర్ హుడా కాలనీకి చెందని వసంత్(55) ఆటో డ్రైవర్. అతడి భార్య అనారోగ్యంతో మృతిచెందగా, రెండేళ్ల క్రితం మరో మహిళను రెండో వివాహం చేసుకున్నాడు. కొంతకాలంగా భార్యాభర్తల మధ్య గొడవలు జరుగుతున్నాయి. భార్య ప్రవర్తనపై అనుమానం పెంచుకున్న వసంత్, శుక్రవారం అర్ధరాత్రి కత్తితో పొడిచాడు. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వగా, వారు అక్కడికి వచ్చి గాయపడిన మహిళను ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.


గంజాయితో పట్టుబడిన నిందితులు, స్వాధీనం చేసుకున్న ద్విచక్ర వాహనాలు

ఆన్‌లైన్‌లో గంజాయి విక్రయం

- ఇద్దరి అరెస్ట్ ● 1,632 గ్రాములు గంజా స్వాధీనం

మంగళ్‌హాట్, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): ఆన్‌లైన్‌లో గంజాయి విక్రయిస్తున్న ఇద్దరిని ధూల్‌పేట ఎక్సైజ్ పోలీసులు అరెస్ట్ చేశారు. వారి నుంచి 1.632 గ్రాముల గంజాయి, రెండు బైక్‌లు, సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... గోషామహల్ జీస్సీచౌరాయికి చెందిన సునీల్‌సింగ్, రాజ్ కుమార్ కొంతకాలంగా గంజాయిని అవసరమైన వారికి ఆన్‌లైన్‌లో విక్రయిస్తున్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు శనివారం ఇరి ఇళ్లపై దాడులు చేయగా 1.632 గ్రాముల గంజాయి పట్టుబడింది. సునీల్‌సింగ్, రాజ్‌కుమార్‌ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించామన్నారు. వారికి గంజాయి సరఫరా చేస్తున్న నిందితుడి కోసం గాలిస్తున్నామని పోలీసులు తెలిపారు.

'మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి'

మదీన, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): మత్తు పదార్థాలు, మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని ఎన్‌సీసీ 5వ బెటాలియన్‌కు చెందిన విద్యార్థులు అన్నారు. కిషన్‌బాగ్‌లోని రాయల్ ఇండియన్ హైస్కూల్‌కు చెందిన విద్యార్థులు 'మత్తు పదార్థాలు, మాదక ద్రవ్యాల వాడకం వలన కలిగే అనర్థాలపై బస్తీలలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో పాఠశాల కరస్పాండెంట్ డాక్టర్ మహ్మద్ సిబ్‌గతుల్లా షరీఫ్, వైస్‌ప్రిన్సిపాల్ జియావుల్లా, అర్షద్‌హుస్సేన్, అఫ్రీన్ పాల్గొన్నారు.

32 లీటర్ల మద్యం, 12 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

రాజేంద్రనగర్, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): అత్తాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని హసన్‌నగర్‌లో శుక్రవారం రాత్రి పోలీసులు కార్డెన్ సెర్, నాకా బంధీ కార్యక్రమాన్ని రాజేంద్రనగర్ డీసీపీ సీహెచ్ శ్రీనివాస్, రాజేంద్రనగర్ ఏసీపీ తుల శ్రీనివాస్, అత్తాపూర్ ఇన్‌స్పెక్టర్ వెంకట్రామిరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. నాలుగు బెల్టు దుకాణాలపై దాడి చేసి 39 లీటర్ల మద్యం బాటిళ్లను, ఆటోలో తరలిస్తున్న 12 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని పట్టుకున్నారు. వాహన తనిఖీలో నెంబర్ ప్లేట్లు సరిగాలేని 17 మందిపై కేసులు చేశారు. 15 మంది రౌడీషీటర్లకు కౌన్సిలింగ్ ఇచ్చామని పోలీసులు తెలిపారు.

సంపూర్ణ ఆరోగ్యానికి కోడిగుడ్డు ఉత్తమ ఔషధం

● ఏఐజీ ఆస్పత్రి కార్డియాలజిస్ట్ సత్యనారాయణ



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న డాక్టర్ పీవీ సత్యనారాయణ, ఇతర వైద్యులు

వనస్థలిపురం, ఆగస్టు 17(ఆంధ్ర జ్యోతి): సంపూర్ణ ఆరోగ్యానికి కోడిగుడ్డు దివ్య ఔషధమని ఏఐజీ ఆస్పత్రి కార్డియాలజిస్ట్, ప్రముఖ వైద్యుడు పీవీ సత్యనారాయణ అన్నారు. నేషనల్ ఎగ్ కో-ఆర్డినేషన్ కమిటీ ఆధ్వర్యంలో గుడ్డుపై అవగాహన సదస్సును వనస్థలిపురంలోని ఓ కాన్ఫరెన్స్ హాల్లో శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డాక్టర్ పీవీ సత్యనారాయణ హాజరై మాట్లాడారు. రోజూ ఆరు గుడ్లు తింటూ పిండి పదార్థాలను తగ్గించుకుంటే వ్యాధుల నుంచి మనకు మనమే రక్షించుకోవచ్చన్నారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ 2019 కొవిడ్ సందర్భంలో రోగ నిరోధక శక్తిని పెంపొందించుకోవడానికి ప్రతి ఒక్కరూ గుడ్లు తినాలని, అందులో అధికంగా ఉన్న ప్రొటీన్స్, ఫ్యాట్, కాపర్, జింక్, సెలీనియం, మాంగనీసుతో పాటు విటమిన్ డీ, విటమిన్ 12, ఐరన్, ఫోలిక్ ఆమ్లాలతో కొవిడ్‌ను సమర్థవంతంగా ఎదుర్కొవచ్చని తెలిపిందని గుర్తు చేశారు. భారత పోషక ఆహార సంస్థ (ఎన్ఐఎన్) తెలిపిన ప్రకారం.. మనిషి ఉపయోగించే 450 ఆహార పదార్థాల్లో తల్లి పాల తర్వాత గుడ్డు అతి ముఖ్యమైనదన్నారు. అందుకే ఆరు నెలల వయస్సు పిల్లల నుంచి ఆహారంతో పాటు గుడ్డును ఆహారంగా ఇవ్వవచ్చునని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా పచ్చసొనతో కూడిన గుడ్లను తిని చూపించారు. అనంతరం నవంబర్‌లో జరిగే పౌల్ట్రీ ఇండియా ఎగ్జిబిషన్ బ్రోచర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో డాక్టర్లు వీఆర్‌కే నీలకంఠ దుర్గాప్రసాద్, ఎన్.అరులప్ప, మలిందర్ స్వామి, భరత్‌రెడ్డి, జానకీశ్రీనాథ్, దుర్గాప్రసాద్, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.


ఎర్రగడ్డ మానసిక ఆస్పత్రిలో కొద్దిమంది వైద్యులతో కొనసాగిన ఓపీ..

కోల్‌కతా ఘటనపై కదంతొక్కిన వైద్యులు

(5వ పేజీ తరువాయి)

జూనియర్ డాక్టర్లు పెద్దఎత్తున భైఠాయించారు. మెహిదీపట్నం సరోజినిదేవి ఆస్పత్రి, గోల్కొండ ప్రభుత్వాస్పత్రిలో ధర్నా, ర్యాలీ చేపట్టారు. ఫీవర్ ఆస్పత్రిలో వైద్యులు విధులను బహిష్కరించి నిరసన తెలిపారు. నిమ్స్‌లో వైద్యుల ఆందోళనకు సిబ్బంది, ఉద్యోగులు, యూనియన్ నాయకులు మద్దతు తెలిపారు.

రోగులకు తప్పని ఇబ్బందులు

ఓపీ సేవలు పూర్తిగా నిలిచిపోవడంతో వివిధ అనారోగ్య సమస్యలతో ఆస్పత్రులకు వచ్చిన వారు అవస్థలు పడ్డారు. కేవలం ఎమర్జెన్సీ కేసులు, కుక్క కాటు, ఇతర బాధితులకు వ్యాక్సిన్ వేశారు. ఫీవర్ ఆస్పత్రిలో జ్వరంతో వచ్చిన కొంతమంది రోగుల కుటుంబసభ్యులు ఓపీని మూసివేయడంతో సెక్యూరిటీ సిబ్బందితో ఘర్షణ పడ్డారు. వైద్యుల ఆందోళనతో గాంధీ ఆస్పత్రి ఓపీలో సేవలు పూర్తిగా స్తంభించాయి. కొందరు జూనియర్ డాక్టర్లు వైద్యం చేసి పంపించారు. సరోజినిదేవి ఆస్పత్రికి వచ్చిన వందలాదిమంది బాధితులు నిరాశగా వెనుదిరిగారు. నిమ్స్ ఓపీ వద్ద వందలాదిమంది రోగులు పడిగాపులు కాశారు. దూర ప్రాంతాల నుంచి వచ్చిన వారు వైద్యులు లేకపోవడంతో చేసేది లేక తిరిగి వెళ్లిపోయారు.

డెంగీతో పగిలిన తిత్తి..
లాప్రోస్కోపిక్ సర్జరీతో తొలగింపు

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): డెంగీ వచ్చిన ఓ మహిళ సకాలంలో సరైన వైద్యం చేయించుకోకపోవడంతో కడుపులో రక్తస్రావమై స్పృహతప్పి పడిపోయింది. దీంతో ఆమెను కిమ్స్ ఆస్పత్రికి తరలించి చికిత్స అందించి ప్రాణపాయం నుంచి కాపాడారు. శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కిమ్స్ యూరో గైనకాలజిస్టు డాక్టర్ ఎస్.బిందుప్రియ వివరాలు వెల్లడించారు. తీవ్రజ్వరంతో పాటు విపరీతమైన కడుపునొప్పితో బాధపడుతున్న కూకట్‌పల్లికి చెందిన 37ఏళ్ల మహిళను కిమ్స్ ఆస్పత్రికి వెళ్లారు. ఆమెకు మొదట వైద్య పరీక్షలు చేసి డెంగీగా నిర్ధారించారు. ఆమెను సాధారణ స్థితికి తీసుకురావడానికి పది యూనిట్ల రక్తంతో పాటు ప్లేట్‌లెట్స్ ఎక్కించారు. అయినా, కడుపునొప్పి తగ్గకపోతుండటంతో మరిన్ని వైద్య పరీక్షలు చేయగా ఆమె కడుపులో తిత్తి(ఒవేరియన్ సిస్ట్) పగిలిపోయి, అంతర్గత రక్తస్రావం బాగా ఎక్కువగా ఉందని గుర్తించారు. ఆమెకు అత్యవసరంగా లాప్రోస్కోపిక్ సర్జరీ చేశారు. ఆమె ఉదరభాగంలో పగిలిపోయిన తిత్తి నుంచి బయటకు వచ్చి పేరుకుపోయిన నాలుగు లీటర్ల రక్తాన్ని శుభ్రం చేసి, తిత్తిని తొలగించినట్లు వైద్యులు తెలిపారు. ఈ శస్త్రచికిత్సలో వైద్యులు శివరాజు, ఎంటీవీ ప్రసాద్, పవన్, అనస్థీషియా బృందంతో పాటు ఎమర్జెన్సీ వైద్యులు పాల్గొన్నారు.



స్టేట్‌కాన్-2024 బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న క్రెడాయ్ తెలంగాణ ప్రతినిధులు

20న క్రెడాయ్ తెలంగాణ స్టేట్‌కాన్-2024

● హెచ్ఐసీసీలో ప్రారంభించనున్న సీఎం

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): ఈనెల 20న మాదాపూర్‌లోని హెచ్ఐసీసీలో తెలంగాణ గోయింగ్ గ్లోబల్ నేపథ్యంతో స్టేట్‌కాన్-2024 సదస్సును నిర్వహిస్తున్నట్లు క్రెడాయ్ తెలంగాణ చైర్మన్ మురళీకృష్ణారెడ్డి, అధ్యక్షుడు ప్రేమ్‌సాగర్‌రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమాన్ని సీఎం రేవంత్‌రెడ్డి ప్రారంభిస్తారని తెలిపారు. శనివారం నగరంలోని ఓ హోటల్‌లో స్టేట్‌కాన్-2024 బ్రోచర్‌ను క్రెడాయ్ తెలంగాణ ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా 900మంది డెవలపర్లు ఈ కార్యక్రమానికి హాజరవుతారని తెలిపారు. రియల్‌ఎస్టేట్ రంగంలో వినూత్న వ్యూహాలు, అభివృద్ధి చెందుతున్న తీరు.. సహకార అవకాశాల గురించి చర్చించడానికి ఈ కార్యక్రమం దోహదపడుతుందని తెలిపారు. కార్యక్రమంలో క్రెడాయ్ తెలంగాణ ప్రెసిడెంట్ ఎలెక్ట్ కె.ఇంద్రసేనారెడ్డి, సెక్రటరీ జి.అజయ్‌కుమార్, ఉపాధ్యక్షులు గోవర్ధన్‌రెడ్డి, పురుషోత్తంరెడ్డి, పాండురంగారెడ్డి, యూత్ విభాగ కోఆర్డినేటర్ ఆదిత్యరెడ్డి తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో అభివాదం చేస్తున్న కాంట్రాక్ట్ అధ్యాపకులు

కాంట్రాక్ట్ అధ్యాపకులకు
బేసిక్ పే స్కేలు అమలు చేయాలి

తార్నాక, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ వ్యాప్తంగా అన్ని యూనివర్సిటీలలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ అధ్యాపకులకు డీఏ, హెచ్ఆర్ఏతో కూడిన బేసిక్ పే స్కేలును అమలు చేయాలని కాంట్రాక్ట్ అధ్యాపకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు కాంట్రాక్ట్ అధ్యాపకుల రాష్ట్రస్థాయి జనరల్ బాడీ సమావేశాన్ని శనివారం ఓయూ ఆర్ట్స్ కాలేజీ సెమినార్ హాల్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా కాంట్రాక్టు అధ్యాపకులు మాట్లాడుతూ తమకు డీఏ, హెచ్ఆర్ఏతో కూడిన బేసిక్ పే స్కేలును అమలు చేయడంతో పాటు, ఉద్యోగ భద్రతను కల్పించి విశ్వవిద్యాలయాల అభివృద్ధికి తోడ్పాటునందించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం స్పందించని పక్షంలో అన్ని విశ్వవిద్యాలయాల రిజిస్ట్రార్ ఆఫీసులు, ప్రజాభవన్ ముందు ధర్నా చేపట్టడంతో పాటు, ఇందిరాపార్క్ వద్ద సామూహిక దీక్షలు చేపట్టాలని తీర్మానం చేశారు. కార్యక్రమంలో కాంట్రాక్ట్ అధ్యాపకులు విజయేందర్‌రెడ్డి, ధర్మతేజ, ఉపేందర్, దత్తాత్రేయ, శ్రీధర్‌లోథ్, వెంకటేశ్, ఉపేందర్, కృష్ణయ్య, దత్తహరి తదితరులు పాల్గొన్నారు.


రాంనారాయణ్ అగర్వాల్ అంతిమయాత్ర

ముగిసిన రాంనారాయణ్ అగర్వాల్ అంత్యక్రియలు

సంతోష్‌నగర్/రాయదుర్గం, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): భారత రక్షణ వ్యూహాత్మక అగ్ని మిస్సైల్ రూపకర్త, శాస్త్రవేత్త డాక్టర్ రాంనారాయణ్ అగర్వాల్(84) అంత్యక్రియలను రాయదుర్గంలోని మహాప్రస్థానంలో శనివారం ప్రభుత్వ లాంఛనాలతో నిర్వహించారు. అశ్రునయనాల మధ్య సంతోష్‌నగర్‌లోని తన నివాసం నుంచి మహాప్రస్థానం వరకు అంతిమయాత్ర కొనసాగింది. సీనియర్ శాస్త్రవేత్తలు, పలువురు డీఆర్‌డీఓ శాస్త్రవేత్తలు, అధికారులు, అభిమానులు తదితరులు అంతిమయాత్రలో పాల్గొన్నారు. రాంనారాయణ్ అగర్వాల్ పార్థివదేహానికి కుమారుడు అక్షయ్ అగర్వాల్ దహన సంస్కారాలు నిర్వహించారు.

మాదాపూర్‌లో బోర్డు తిప్పేసిన మరో ఐటీ సంస్థ

● 200 మంది నుంచి రూ.4 కోట్ల వరకు వసూలు

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): బ్యాక్ డోర్ ఉద్యోగాల పేరుతో నిరుద్యోగుల నుంచి డబ్బులు వసూలు చేసిన మాదాపూర్‌లోని ఫ్రైడే ఆఫ్ కన్సల్టెన్సీ ఐటీ సంస్థ బోర్డు తిప్పేసింది. ఐటీ ఉద్యోగం కోసం డబ్బులు కట్టిన దాదాపు 200 మంది రోడ్డున పడ్డారు. ఐటీ సంస్థను స్థాపించిన నిర్వాహకులు శిక్షణ అనంతరం ఉద్యోగాల పేరుతో ఒక్కొక్కరి నుంచి రూ.1.50 లక్షల నుంచి రూ.2.50 లక్షల వరకు మొత్తం రూ.4 కోట్ల వరకు వసూలు చేశారు. రెండు నెలల శిక్షణ పేరుతో కాలక్షేపం చేసి, తర్వాత వారి సంస్థలోనే ఐటీ ఇంజనీర్ పేరుతో ఆఫర్ లెటర్‌లు ఇచ్చారు. నెల వ్యవధిలోనే జీతాలు కూడా ఇవ్వకుండా బోర్డు తిప్పేశారు. మాదాపూర్‌లోని 100 ఫీట్ రోడ్డులో ఉన్న కార్యాలయానికి తాళం వేయడంతో మోసపోయామని గ్రహించిన బాధితులు శనివారం మాదాపూర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.


ట్రాఫిక్ రద్దీపై సమీక్షలో డీజీపీ, ఇతర అధికారులు

ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు డ్రోన్లు వాడండి

హైదరాబాద్, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): రద్దీ ఎక్కువగా ఉండే సమయాల్లో ట్రాఫిక్ విభాగం అధికారులు, సిబ్బంది కచ్చితంగా రోడ్లపై ఉండాల్సిందేనని డీజీపీ డాక్టర్ జితేందర్ స్పష్టం చేశారు. నగర రోడ్లపై ట్రాఫిక్ పరిస్థితి, రద్దీకి గల కారణాలు, రద్దీని తగ్గించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై డీజీపీ సమీక్షించారు. కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో హైదరాబాద్, సైబరాబాద్ పోలీసు కమిషనర్లు కె.శ్రీనివాస్‌రెడ్డి, అవినాశ్ మహంతి, ట్రాఫిక్ విభాగం డీసీపీలు ఈ సమీక్షలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా డీజీపీ మాట్లాడుతూ... ముఖ్యమైన కార్యక్రమాలు జరిగినప్పుడు ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు డ్రోన్లను ఉపయోగించి వాహనాల రద్దీ గుర్తించాలని అధికారులకు చెప్పారు. ట్రాఫిక్ ఇంజనీరింగ్ వింగ్‌ను బలోపేతం చేయాలని, ఈ-చలాన్ నిధులను ఉపయోగించి జిల్లాల వారీగా ట్రాఫిక్ పరికరాల సేకరణకు చర్యలు చేపట్టాలని చెప్పారు. వర్షాకాలంలో తలెత్తే సమస్యల పరిష్కారానికి జీహెచ్ఎంసీతో సమన్వయం చేసుకోవాలని సూచించారు. కాగా, గురుకుల విద్యాలయాల్లో ప్రవేశం పొందిన 68 మంది నిరుపేద విద్యార్థులను తన కార్యాలయంలో డీజీపీ అభినందించారు. కొన్ని సంవత్సరాలుగా నిరుపేదల విద్యకోసం అక్షయ విద్య ఫౌండేషన్ చేస్తున్న కృషిని ఈ సందర్భంగా డీజీపీ అభినందించారు. విద్యార్థులకు దిశానిర్దేశం చేసిన ట్యూటర్లు, వాలంటీర్లకు ప్రశంసా పత్రాలు అందజేశారు.

రాఖీ కారు


రాఖీ ఆకారంలో తయారైన కారు

మదీన, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): రాఖీ పౌర్ణమిని పురస్కరించుకుని బహదూర్‌పురాలోని 'సుధా కార్స్' మ్యూజియం నిర్వాహకులు రాఖీ ఆకారంలో ఒక కారును తయారు చేశారు. మోటార్ వాహనాల విడిభాగాలను ఉపయోగించి ఈ 'రాఖీ కారు'ను తయారు చేసినట్లు తయారీదారుడు సుధాకర్ 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు. ఇంజన్ కెపాసిటీ 55 సీసీ ఉంటుందని, ఒకరు మాత్రమే కూర్చుండే వీలున్న ఈ కారు గంటకు 25 కి.మీ వేగంతో ప్రయాణించగలదని తెలిపారు. ఈ వినూత్నమైన కారును ఆదివారం సాయంత్రం 3గంటలకు సందర్శకులు తిలకించడానికి మ్యూజియంలో ప్రదర్శించనున్నట్లు తెలిపారు.


రిటైల్ అసెట్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న ఐడీబీఐ బ్యాంకు ఈడీ సుమిత్ ఫక్కా, తదితరులు

కుత్బుల్లాపూర్‌లో ఐడీబీఐ రిటైల్ అసెట్ సెంటర్

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): ఐడీబీఐ బ్యాంకు రిటైల్ అసెట్ సెంటర్ నాలుగో శాఖను కుత్బుల్లాపూర్ శాఖ కార్యాలయంలో బ్యాంకు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సుమిత్ ఫక్కా శనివారం ప్రారంభించారు. ఈ సెంటర్ ద్వారా హోమ్‌లోన్, మార్ట్‌గేజ్ లోన్, ప్లాట్ లోన్లు, హౌసింగ్ కన్‌స్ట్రక్షన్ లోన్, కన్‌స్ట్రక్షన్ లోన్, కంపోజిట్ లోన్, హోమ్‌లోన్, మార్ట్‌గేజ్ బ్యాలెన్స్ ట్రాన్స్‌ఫర్ వంటి సేవలు అందుబాటులో ఉంటాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో జోనల్ సీజీఎం శరత్ కామత్, జీఎం సంతోష్ కుమార్‌తోపాటు సిబ్బంది పాల్గొన్నారు.


తనికెళ్ల భరణిని సత్కరిస్తున్న అతిథులు, నిర్వాహకులు

తనికెళ్ల భరణికి ఘన సన్మానం

రవీంద్రభారతి, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): ఎస్.ఆర్.యూనివర్సిటీ నుంచి గౌరవ డాక్టరేట్ అందుకున్న సందర్భంగా ప్రముఖ నటుడు, రచయిత తనికెళ్ల భరణిని శనివారం రవీంద్రభారతిలో ఘనంగా సన్మానించారు. సంగమం ఫౌండేషన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి ప్రముఖ దర్శకుడు రాంగోపాల్‌వర్మ, నటి ఝాన్సీ, నర్తకీమణి మంజుభార్గవి, గేయ రచయిత సుద్దాల అశోక్‌తేజ, దర్శకుడు శివనాగేశ్వరరావు, రచయిత జనార్దన్, సంజయ్ కిషోర్ తదితరులు హాజరై తనికెళ్ల భరణిని ఘనంగా సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా తనికెళ్ల భరణి మాట్లాడుతూ అక్షరమే తనకు జీవితాన్ని ఇచ్చిందని అన్నారు. రచన, నటన తనను పరిపూర్ణ వ్యక్తిగా తయారు చేశాయని తెలిపారు. ఎస్.ఆర్.వర్సిటీ డాక్టరేట్ బహూకరించడం ఆనందకరమని ఆయన అన్నారు. కార్యక్రమంలో పెద్దిరెడ్డి గణేష్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

● రాష్ట్రపతితో హెచ్‌పీఎస్ విద్యార్థిని


స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో భాగంగా రాష్ట్రపతితో విందులో పాల్గొన్న హెచ్‌పీఎస్ విద్యార్థిని ఆకర్షణ సతీష్
- సనత్‌నగర్, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి)

ఆదివారం



అలనాటి కథ

ఆఫ్రికాలో ఫ్రెంచ్ కవిత్వం!

ఆఫ్రికా అనగానే మనకు నల్ల జాతీయులు.. దట్టమైన అడవులు.. జంతువులు గుర్తుకు వస్తాయి. కానీ గొప్ప ఫ్రెంచ్ రచయితలలో చాలా మంది ఆఫ్రికా నుంచి వచ్చారని చాలా తక్కువ మందికి తెలుసు. అంతే కాదు.. ఇప్పటికి ఆఫ్రికాకు చెందిన చాలా దేశాల్లో ఇప్పటికీ ఫ్రెంచ్ మాట్లాడతారు.. కొన్ని వందల సంవత్సరాలు అనేక ఆఫ్రికా దేశాలపై ఫ్రెంచ్ జాతీయుల ఆధిపత్యమే దీనికి కారణం.. మడ్గాస్కర్.. ఒక అందమైన దేశం. ఆ దేశంలో ఒక సమావేశానికి హాజరు కావటానికి నాకు ఆహ్వానం వచ్చినప్పుడు- అక్కడి పరిస్థితు లేమీ నాకు తెలియవు. కానీ ఆఫ్రికా ఖండంలో అనేక మంది గొప్ప రచయితలు రాజకీయ నాయకులుగా మారారని మాత్రం తెలుసు. నాకు నచ్చిన పుస్తకాల్లో కెన్యాకు చెందిన జోమో కెన్యెట్టా రాసిన - 'ఏ ఫెస్ ది మౌంటెన్' ఒకటి. కెన్యెట్టా మంచి గొప్ప రచయితే కాదు ప్రజల ఆదరణ పొందిన రాజకీయ నాయకుడు కూడా! అందుకే ఆయనను ఆ దేశ ప్రజలు ప్రధానిని చేశారు. నేను మడ్గాస్కర్‌కు వెళ్లిన సమయంలో - ఆ దేశ విదేశాంగ మంత్రి రబంబమినజర్- ఆఫ్రికాలోనే ఒక గొప్ప కవి. డేవిడ్ డాప్, ఎమ్మి సిజైర్‌లతో కలిసి ఆయన ఒక సాహితీ ఉద్యమాన్నే నిర్మించాడు. అలాంటి- రబంబమినజర్‌ను నేరుగా కలిసే అవకాశం రావటంతో నా ఉత్సాహానికి అవధులు లేవు. ఇక్కడ ఒక విషయం చెప్పాలి. మడ్గాస్కర్ అధికారిక భాష ఫ్రెంచ్. స్థానిక భాష మలగాసే. ప్రజల్లో చాలా మంది ఈ రెండు భాషలతో పాటు- ఇంగ్లీషు కూడా మాట్లాడతారు. నేను మడ్గాస్కర్‌లో దిగిన వెంటనే ఆ దేశ ప్రభుత్వ ప్రతినిధి ఒకరు మమల్ని ఎయిర్‌పోర్టులో రిసీవ్ చేసుకున్నారు. హోటల్‌కు తీసుకువెళ్లారు. ఆ మర్నాడు- మమల్ని రబంబమినజర్- డిన్నర్‌కు ఆహ్వానించారని చెప్పారు.

ఈ మర్నాడు రాత్రి నేను రబంబమినజర్ ఇంటికి డిన్నర్‌కు వెళ్లాను. ఆయన ఇంటి పేరు క్వింట్. చుట్టు అందమైన గార్డెన్లు. మధ్యలో కళాత్మకంగా కట్టుకున్న ఇల్లు అది. కాసేపు పిచ్చాపాటి మాట్లాడుకున్న తర్వాత మేము డిన్నర్ టేబుల్ దగ్గరకు వెళ్లాం. ఆ డిన్నర్ టేబుల్ మీద అందమైన పువ్వులు.. తాజా పళ్ల ఉన్నాయి. మొత్తం టేబుల్‌నంతా ఎంబ్రైడరీ క్లాత్‌తో అలంకరించారు. నేను చూసిన అది అందమైన డిన్నర్ టేబుల్స్‌లో అది ఒకటి. సాధారణంగా యూరప్‌లోని ప్రజలు తమ సంస్కృతి గొప్పదని భావిస్తూ ఉంటారు. అలాంటి వారందరూ ఆ టేబుల్‌ను చూస్తే- ఆఫ్రికాలో ఒక చిన్నదేశం సంస్కృతి సంప్రదాయాల పరంగా ఎంతగొప్పగా

మడ్గాస్కర్ వెళ్లిన వారు తప్పనిసరిగా చూడాల్సిన వాటిలో అండాపియవర్రట్రా ప్యాలెస్ మ్యూజియం ఒకటి. దీనిలో మడ్గాస్కర్ చరిత్రను చెప్పే 1466 ఎగ్జిబిట్స్ ఉంటాయి. ఇవి మనకు మడ్గాస్కర్ చరిత్రను కళ్లకు కట్టినట్లు చూపిస్తాయి.




ఎదిగిందో అర్థమవుతుందనిపించింది. రబంబమినజర్- భార్య ఒక ఫ్రెంచ్ జాతీయురాలు. ఆ రోజు నాపై ఆమె చూపించిన ఆదరణ, అభిమానం నేను మర్చిపోలేను. మా డిన్నర్ పూర్తయింది.. మేమందరం డ్రాయింగ్ రూమ్‌కు వచ్చాం. "మీరు ఏదైనా ఒక కవిత్వాన్ని వినిపిస్తారా?" అని ఆయనను అడిగాను. ఆయన వెంటనే అంగీకరించి- ఒక ఫ్రెంచ్ కవితను మెలాగిస్ భాషలో చదవటం మొదలుపెట్టారు. ఆయన గొంతు సెక్సాఫోన్‌లా మోగుతోంది. నాకు ఫ్రెంచ్ భాష రాదు. మెలాగిస్ భాష కూడా రాదు. కానీ ఆ కవిత్వంలో ఏదో తెలియని తియ్యదనం ఉంది. కొద్ది సేపు మేమందరం తన్మయత్వంలో మునిగిపోయాం! ఆ కవిత పూర్తి అయిన తర్వాత- "ఈ కవితను ఇంతకు ముందు ఎప్పుడు చదివారు?" అని అడిగాను. ఆయన ఒక నిమిషం ఆలోచించారు. "నా భార్య ఫ్రాన్స్‌లో ఉండేది. తనను మడ్గాస్కర్‌కు వచ్చి ఉండమని అభ్యర్థిస్తూ రాసిన కవిత్వం ఇది. ఎనిమిదేళ్ల క్రితం తన ముందు చదివా. ఇంత కాలం తర్వాత మళ్లీ చదివా!" అన్నారు. కొన్ని సార్లు భాష తెలియక పోయినా - భావం దానంతట అదే వ్యక్తమవుతుంది. అలాంటి అరుదైన సంఘటన అది. ఇప్పటికీ నా కళ్ల ముందు మెదులుతూనే ఉంటుంది.


● రాజకుమారి ఇందిరాదేవి ధన్‌రాజ్‌గిర్



సండే సెలబ్రిటీ

హీరో కొత్తవాడైనా, సూపర్‌స్టార్ రజనీకాంత్ అయినా... తన సిద్ధాంతాలకు అంగుళం కూడా పక్కకు జరగకుండా కథ నడిపించే విలక్షణ దర్శకుడు పా.రంజిత్. 'తంగలాన్'తో సరికొత్త ప్రపంచాన్ని వెండి తెరపై ఆవిష్కరించిన ఆయన 'నవ్య'తో పంచుకున్న సినీ విశేషాలు...





సినిమాలెవ్వరూ తీయలేదు

'తంగలాన్'కు ఎలాంటి రెస్పాన్స్ వస్తోంది?

మేము ఊహించిన దానికన్నా ఎక్కువ రెస్పాన్స్ వస్తోంది. మన సమాజంలోని అన్ని వర్గాల వారు ఈ సినిమాను చూసి ప్రశంసిస్తున్నారు. మేము చెప్పాలనుకున్న విషయాన్ని వారు అర్థం చేసుకుంటున్నారు. నా ఉద్దేశంలో ఇలాంటి సినిమాను ఇప్పటిదాకా ప్రేక్షకులు చూడలేదు. ఇదొక కొత్త తరహా సినిమా.

మీరు తీసే సినిమాలు, వాటిలో. చెప్పే కథలు భిన్నంగా ఉంటాయి. మీరు ఈ తరహా కథలను ఎంచుకోవటానికి కారణమేదైనా ఉందా?

నేను ఒక సినిమాను 'ఎందుకు తీయాలనుకుంటున్నాను' అని ప్రశ్న వేసుకున్నప్పుడు - 'నా కథను నేను ప్రేక్షకులకు చెప్పాలనుకుంటున్నాను' అనే సమాధానం వస్తుంది. 'నా కథను ఎందుకు చెప్పాలనుకుంటున్నాను?' అని మళ్లీ ప్రశ్న వేసుకుంటే - 'ఇతరులు ఎవరు నా కథను సినిమా రూపంలో తీయరు కాబట్టి...' అనే సమాధానం లభిస్తుంది. సుమారు వందేళ్ల సినిమా చరిత్రలో- ఈ తరహా సినిమాలను ఎవరు తీయలేదు. అందువల్ల సినిమాల దర్శకత్వ విషయంలో 'నా పాత్ర ఏమిటి?' అనే విషయాన్ని ఎప్పటికప్పుడు బేరీజు వేసుకుంటాను.

నిర్మాణాత్మకమైన విమర్శను నేను ఎప్పుడూ కోరుకుంటాను. దాని నుంచి నేర్చుకుంటాను. విమర్శ నన్ను తీర్చిదిద్దుతుంది. అయితే బాధ్యత లేకుండా చేసే విమర్శలను నేను పట్టించుకోను. ఎవరైనా నన్ను అన్నప్పుడు బాధపడతాను.

మీ సినిమా ప్రస్థానం ఎలా మొదలైంది?

నేను కాలేజీలో చదువుకొనే రోజుల్లో పెయింటర్ అవ్వాలనుకొనేవాడిని. ఆ సమయంలో నేను కొన్ని ఫిల్మ్ ఫెస్టివల్స్‌కు వెళ్లాను. అక్కడ అనేక విదేశీ సినిమాలు చూశాను. అవి ఆ దేశ సంస్కృతి సంప్రదాయాలను, రాజకీయ సిద్ధాంతాలను, సమాజంలోని వాతావరణాన్ని కళ్లకు కట్టినట్లు చూపించేవి. అయితే అవి నేను చూసిన తమిళ సినిమాలకు భిన్నంగా ఉండేవి. 'ఈ సినిమాలు భిన్నంగా ఎందుకు ఉన్నాయి?' అనే ప్రశ్న నన్ను తొలిచివేయటం మొదలెట్టింది. నా దేశం గురించి, ప్రజల గురించి, సంస్కృతి గురించి పుస్తకాలు, కథలు చదవటం ప్రారంభించాను. రకరకాల రాజకీయ సిద్ధాంతాల గురించి తెలుసుకున్నాను ఈ క్రమంలో నన్ను బాబా సాహెబ్ అంబేడ్కర్ సిద్ధాంతాలు, కమ్యూనిస్టు సిద్ధాంతాల పట్ల అమితంగా ప్రభావితుడినయ్యాను. అంబేడ్కర్ నాకు చాలా నేర్పారు. ఆయన సిద్ధాంతాలలో ఉన్న సారాన్ని, నా జీవితాన్ని ప్రజలకు సినిమా రూపంలో చెప్పాలని నిర్ణయించుకున్నా. అంబేడ్కర్ అప్పటి దాకా ఉన్న దారి నుంచి బయటకు వచ్చి... ఒక కొత్త పంథాను చూపించారు. రకరకాల పద్ధతులను అనుసరించారు. ఆయన రాజకీయాలను నేను అవగాహన చేసుకున్నాను. ఇక్కడ ఇంకో విషయాన్ని కూడా చెప్పాలి. కళలు, ప్రజలు ఎందుకు కలసి పనిచేయాలనే విషయంపై మావో అనేక పుస్తకాలు రాశారు.

నా ఆలోచనలను ఎటువంటి ఫిల్టర్స్ లేకుండా చెప్పగలటమే స్వేచ్ఛ అంటే! అయితే అది చాలా కష్టమైన విషయం. అన్నిసార్లు నేను అనుకున్నది చెప్పలేను.

తొలి రోజుల్లో మీరు అనుకున్న రీతిలో సినిమా తీయటం సులభమయిందా? ఏవైనా కష్టాలు ఎదురయ్యాయా?

నేను సినిమా రంగానికి రాక ముందు 'సినిమా తీయటం ఇంత సులభమా?' అనిపించేది. నాకు అనేక ఆలోచనలు ఉండేవి. సినీ రంగానికి వచ్చిన తర్వాత సినిమా తీయటం ఎంత కష్టమో అర్థమయింది. తొలి రోజుల్లో నేను వెంకట ప్రభు అనే డైరక్టర్ దగ్గర పనిచేశా. ఆయన నాకు విపరీతమైన స్వేచ్ఛను ఇచ్చారు. నేను అనేక విషయాలు ఆయనతో చర్చించేవాడిని. అప్పుడే నేను సినిమాలు చేయగలననే నమ్మకం వచ్చింది. నా తొలి సినిమా - నా కథే! ఆ తర్వాత 'అట్టకత్తి', 'మద్రాసు' సినిమాలు తీశాను.



మీ తరహా కథలను చెప్పి స్టార్స్‌ను ఒప్పించటం కష్టమయిందా?

మొదట్లో చాలా కష్టమయ్యేది. వాస్తవానికి మొదట్లో నాకు పెద్ద నటులతో సినిమా తీయాలని ఉండేది కాదు. ఎందుకంటే వారు నా కథల్లో కలగజేసుకొనే అవకాశం ఉంది. అంతే కాకుండా నా దగ్గర మాస్ మసాలా స్టోరీలు కూడా ఏవీ లేవు. అందువల్లే మొదట్లో నేను ఒక మంచి ప్రొడ్యూసర్ కోసం వెతికేవాడిని. అదృష్టవశాత్తు నాకు సి. కుమార్ దొరికారు. ఆయనకు కూడా సినీ రంగం కొత్తే! మేమిద్దరం కలిసి 'అట్టకత్తి' తీశాం. దీనితో నాకు మంచి పేరు వచ్చింది. ఆ తర్వాత 'మద్రాసు' స్క్రిప్ట్ తయారుచేసుకున్నా. ఇది పూర్తిగా పొలిటికల్ ఫిల్మ్. ముందు కార్తీతో చేద్దామనుకున్నాం.

కానీ ఆయన బిజీగా ఉండటం వల్ల డేట్స్ కుదరలేదు. ఇతర హీరోలకు చెప్పాను. ఇక్కడ ఒక విషయం చెప్పాలి. పెద్ద హీరోలతో చేయాలంటే- కాంబినేషన్స్ కుదరాలి. హీరోలకు టెక్నీషియన్స్ విషయంలో కొన్ని చాయిస్‌లు ఉంటాయి. వాటినే కోరుకుంటారు. కానీ నేను నా టీమ్‌తోనే చేయాలని అనుకునేవాడిని. చివరకు మళ్లీ కార్తీనే పెట్టుకున్నాం. ఇక్కడ అర్థం చేసుకోవాల్సిన విషయం ఒకటుంది. నా తరహా సినిమాలకు ఒక మోడల్ లేదు. అంటే అవి ఆడుతాయో లేదో, వాటిని ఎన్ని డబ్బులు వస్తాయో తెలీదు. కాబట్టి అందరూ భయపడేవారు. 'మద్రాసు' ఒక మోడల్‌ను క్రియేట్ చేసింది. ఆ తర్వాత నాతో పనిచేయటానికి అనేకమంది ముందుకు వచ్చారు.

'కాలా', 'కబాలి' - ఈ రెండు సినిమాలలో- సూపర్‌స్టార్ రజనీకాంత్‌తో పనిచేశారు కదా! మీ అనుభవాలేమిటి?

రజనీకాంత్ సార్‌తో పనిచేయటం భిన్నంగా ఉంటుంది. నేను ఆయన సినిమాలు చాలా చూశాను. కానీ ఆయనతో సినిమా చేసే ముందు ఆయనను ఒక స్టార్ అనుకోలేదు. ఒక ఆర్టిస్టు అనుకున్నానంతే! 'కబాలి'లో నేను ఎలా అనుకున్నానో ఆయన అలా చేశారు. నేను తొలిసారి ఆయనకు 'కబాలి' స్క్రిప్ట్ చెప్పినప్పుడు ఆయన చాలా ఎగ్జైట్ అయ్యారు. "దీనిలో నాకు వయస్సు ఎక్కువ. నాకు ఎలాంటి డ్యూయెట్స్ లేవు. ఎక్కువ ఫైట్స్ లేవు. పైగా నాకో కూతురు ఉంది. వాస్తవానికి దగ్గరగా ఉంది. నేను ఫ్రెష్‌గా చేద్దామనుకుంటున్నా. ఈ కథ తప్పకుండా చేస్తా" అన్నారు. అయితే అక్కడ ఆయనకు నేను ఒక షరతు పెట్టాను. "సర్... ఇది నా స్క్రిప్ట్. దీనిలో ఎలాంటి మార్పులు చేయను. మీకు ఇష్టమయితే చేద్దాం. లేకపోతే ఇక్కడితో వదిలేద్దాం" అన్నాను. ఆయన నా షరతుకు అంగీకరించారు. ఆ సినిమాలో ఆయన నాకు పూర్తిగా సహకరించారు. 'కబాలి' తర్వాత ఆయన పేరు మరింత పెరిగింది. సినిమా హిట్ అయిన తర్వాత ఆయన దగ్గరకు వెళ్తే- "నీతో తొమ్మిది సినిమాలు చేయాలనుంది. చేద్దామా" అన్నారు. నేను షాక్ తిన్నా. 'కాలా' తర్వాత కూడా ఆయన అదే మాట మీద ఉన్నారు. ఆయనకు నా రాజకీయ సిద్ధాంతాలు, పనితీరు అర్థమయ్యాయి.

"హైరార్కీని తొలగించాలనుకుంటాను. మానవ వ్యవస్థ నన్ను నిలవనివ్వదు. దీని నుంచి బయటకు వెళ్లిపోవాలనుకుంటాను. ఎటువంటి హైరార్కీని నేను సహించలేను. కొన్నిసార్లు మనకు తెలియకుండానే హైరార్కీలో నివసిస్తూ ఉంటాం. అలాంటి సమయాల్లో నన్ను నేను సరిచేసుకుంటూ ఉంటా. ఇది జీవితాంతం నిరంతరంగా జరిగే ప్రక్రియ. దీన్ని ప్రాక్టీస్ చేయటం చాలా కష్టం.

"ప్రస్తుత పరిస్థితుల్లో భారత దేశానికి అంబేడ్కర్ దృష్టి కోణం చాలా అవసరం. అంబేడ్కర్ ఒక ఆధునిక భారత దేశాన్ని నిర్మించాలని అనుకున్నాడు. కుల వ్యవస్థను కూకటి వేళ్లతో సహా పెకిలించాలనుకున్నాడు. వ్యవస్థను సంపూర్తిగా మార్చాలనుకున్నాడు. ఆయన నిర్మించాలనుకున్న ఆధునిక భారతంలో ఎటువంటి అసమానతలు ఉండవు. 'క్యాస్ట్ ఇన్ ఇండియా' లాంటి పుస్తకాలు చదివితే మనకు ఆయన దృష్టి కోణం అర్థమవుతుంది. "మేము ఆధునికులం" అని చెప్పుకొనేవారిలో ఎక్కువమంది ఆయన పుస్తకాలను చదవరు. చాలామంది ఆయన దళితుల కోసం మాత్రమే అనుకుంటారు. అది చాలా తప్పు, ఆయన ఆధునిక భారత దేశ ప్రజలందరివాడు."

"కులం ఆధునికతను అల్లుకుపోతోంది. కులం అనేది మనకు పల్లెటూర్లలో కనిపిస్తుంది. పట్టణాలలో పైకి కనిపించదు. మన దేశంలో నివసించే ప్రతి వ్యక్తిలోను ఈ కుల భావన ఉంటుంది. చాలామందికి కులం ఒక సంపద లాంటిది. ఇది హోదా ఇస్తుంది. అందువల్లే దాన్ని వదులుకోవటానికి ఎవరు ఇష్టపడరు. నా ఉద్దేశంలో అంబేడ్కర్ సిద్ధాంతాలను అనుసరిస్తే- దీన్ని సమూలంగా నిర్మూలించగలం.

త్వరలో ఏ సినిమాలు చేయబోతున్నారు?

'తంగలాన్' విజయాన్ని ఆస్వాదిస్తున్నా. తమిళంలో ఒకటి, హిందీలో ఒకటి సినిమాలు చేయాలి. హిందీలో 'బిర్సా ముండా' జీవిత కథను తీస్తున్నా.

● సీవీఎల్ఎన్ ప్రసాద్

అలాంటప్పుడే... ఇక్కడ నిలబడగలం!

ఈ బాలీవుడ్ బ్యూటీ కథానాయికగానే కాదు పలు బ్రాండ్ల అంబాసిడర్‌గా కూడా బిజీనే. ఆమే అనన్య పాండే. తొంభైల్లో బాలీవుడ్‌లో వెలుగొందిన నటుడు చుంకీ పాండే కూతురీమె. అనన్య పాండే గురించి కొన్ని విశేషాలు..

అనన్య పాండేకి పెద్దగా హిట్స్ లేవు. అయినా సరే ఈ సినిమా నేపథ్యముండే ఈ బాలీవుడ్ భామ ఎక్కడా తగ్గట్లేదు. ముఖ్యంగా ఆమెకి సోషల్ మీడియాలో ఉండే హవా అంతా ఇంతా కాదు. రెండున్నర కోట్ల మంది ఆమెను ఫాలో అవుతున్నారు. చిన్ననాటి ఫొటోలనుంచి.. ఎండోర్స్‌మెంట్స్ విశేషాలు, ప్రయాణాలు, వ్యక్తిగత జీవితాన్ని ఇన్‌స్టాలో షేర్ చేస్తుంటుంది. బాలీవుడ్ కథానాయికగానే ట్యాగ్ వేసుకోవటానికి ఆమె ఇష్టపడుతుంది.

వారినుంచే నేర్చుకున్నా..

అనన్యపాండే తండ్రి నటుడు. ఇక తల్లి భావన ఎంటర్‌ప్రూనర్. 'ఏ రిలేషన్‌షిప్ అయినా నిలబడాలంటే వారి మధ్య స్నేహం ఉండాలి. అమ్మానాన్నలను చూస్తే ప్రేమ, పెళ్లి గొప్పతనం అర్థం అవుతుంది. మా అమ్మమ్మ,తాతయ్య.. ఇలా పెద్దవారినుంచి ఎలా ఉండాలో నేర్చుకున్నా. వారిదగ్గరే స్ట్రాంగ్ మెంటాలిటీ ఏర్పడింది. నా చెల్లెలు రైసాతో చిన్నప్పుడు భలే గొడవపడేదాన్ని. ఇప్పుడు తనే మంచి స్నేహితురాలైంది. స్టార్స్‌కి చప్పట్లు కొట్టేవాళ్లెక్కువ. నిజమైన విషయాలు తెలీవు. నా చెల్లెలు ముఖం మీదనే చెబుతుంది. ఇకపోతే అమ్మానాన్న కూడా అంతే. చిన్నప్పటినుంచి ఒకేలా పెంచారు మా ఇద్దరినీ. ఏదైనా సినిమా బాగాలేకున్నా మా పేరెంట్స్ క్రిటిక్స్ అవతారమెత్తుతారు. నేను యాక్టింగ్‌లో ప్రూవ్ చేసుకుంటే ప్రశంసిస్తారు. ఇట్లాంటి వాతావరణంలో ఉన్నా కాబట్టే హాయిగా ఉన్నా.

సులువుగా నటినయ్యాను..

'నాలుగేళ్ల వయసులో ధీరుభాయ్ అంబానీ ఇంటర్నేషనల్ స్కూల్‌లో చేర్పించారు. సుహానా ఖాన్(షారుఖ్ ఖాన్ కూతురు), షనయా కపూర్(సంజయ్ కపూర్ కూతురు).. నా స్నేహితులే. వారితో కలిసి చదివా. మేం ఆరుమంది గ్యాంగ్. ఇప్పటికీ స్కూల్‌మేట్స్ నా స్నేహితులు. వారి దగ్గర పాపులర్ హీరోయిన్ అనే గర్వం నాకుండదు. నేను హీరోయిన్ అని వారు గర్వంగా చెబుతారు. ఇప్పటికీ ఆ స్నేహం అలానే కొనసాగుతోంది. కొత్తగా ఉండటం.. కొత్త విషయాలు తెల్సుకోవటం ఇష్టం. ఫ్యాషన్ వాల్డ్ అంటే పిచ్చి. ఒకసారి ఇటలీలో ఫ్యాషన్ షూట్‌కు వెళ్లాను. ఆ షూట్‌లో పాస్తా బాగా లాగించేదాన్ని. అప్పుడే కరణ్ జోహార్ గారి నుంచి పిలుపొచ్చింది. ఆ చిత్రమే 'స్టూడెంట్ ఆఫ్ ది ఇయర్ 2'. సినిమా నేపథ్యం ఉండటం వల్ల ఈ అవకాశం వచ్చింది. అయితే నటన రాకుంటే అంతటితో ఆగిపోయేదాన్ని కదా! ప్రతిభ ఉందని అవకాశం ఇచ్చారు. అలా తొలి చిత్రానికే ఫిల్మ్‌ఫేర్‌లో బెస్ట్ ఫిమేల్ డెబ్యూట్ అవార్డు వచ్చింది. ఇక్కడ సినిమా బ్యాక్‌గ్రౌండ్ లాంచింగ్‌కే ఉపయోగపడుతుంది. ఆ తర్వాత పని చేయాల్సిందే' అంటుంది అనన్య.



విలువైన జ్ఞాపకాలను...

'పతి పత్నీ ఔర్ వో', 'ఖాలీ పీలీ', 'లైగర్' చిత్రాలు ఆమెను నిరాశ పరిచాయి. 'డ్రీమ్ గాళ్ 2' తో విజయం అందుకుంది. ఆ తర్వాత నటించిన రెండు చిత్రాలు ఆడలేదు. దీంతో సోషల్ మీడియాలో ఆమెను ఐరన్‌లెగ్ అంటూ.. అంత స్థాయి లేదంటూ దుయ్యబట్టారు. చాలా రియాక్టయ్యింది. అయితే నెగటివిటీ ఎక్కువ ఉండే చోటు ఉండకూడదని.. అన్‌ఫాలో చేసింది. బ్లాక్ చేసింది. మ్యూట్ చేసింది. 'ఎందుకో సోషల్ మీడియాలో ఎక్కువ సమయం గడపటం వల్ల నన్ను నేను కోల్పోతున్నాననే భావన వచ్చింది. అందుకే కొన్నాళ్లు దూరం ఉన్నా. కోపం తగ్గాక మరీ ఎక్కువగా సోషల్ మీడియాలో లేను. నటిని కాబట్టి తప్పదు. సింగిల్‌గా ఎంజాయ్ చేయటం, స్నేహితులతో ఛిల్ అవ్వటం.. మాల్దీవ్స్ లాంటి ప్రాంతాల్లో తాబేళ్లతో కలసి ఈత కొట్టడం.. ఇలా నాకంటూ నేను విలువైన జ్ఞాపకాలను పోగు చేసుకుంటాను' అంటుందీమె. 'సోషల్ మీడియాలో ఏం రాసినా.. మాట్లాడినా లక్షల మందికి చేరువవుతుంది. అందుకే తక్కువగా మాట్లాడుతా. నెగటివిటీని స్ప్రెడ్ చేయకుండా ఉండటమే మంచిదని నా అభిప్రాయం. జనాల ఆలోచనలు ఎలా ఉన్నాయనే దాని కంటే కెరీర్‌లో ఎలా మెరుగవ్వాలి.. మంచి అవకాశాలను ఎలా చేజిక్కించుకోవాలని ఆలోచించటమే నా ముందున్న టాస్క్. ఇదే పెద్ద బాధ్యత నా జీవితానికి!' అంటుంది అనన్య.

అదే నా లక్ష్యం..


'మహిళల్ని సినిమాల్లో ప్రాజెక్ట్ చేసే విధానంలో తప్పుంది. దాదాపు ఎక్కువ చిత్రాల్లో బేకార్ పాత్రలను క్రియేట్ చేసేవారు. ఎప్పుడైతే జనాలు కొత్త కథలు చూడాలనుకున్నారో అప్పుడే కథలు మారాయి. యూట్యూబ్, ఓటీటీ.. లాంటి డిజిటల్ రెవల్యూషన్ తర్వాత అనేక భాషల సినిమాలను చూస్తున్నారు. అందుకే మంచి మహిళా పాత్రలను రాస్తున్నారిప్పుడు. ఓటీటీల్లో మంచి చిత్రాలొస్తున్నాయి. ఏదేమైనా హిట్ ఉంటేనే ఇక్కడ నిలబడగలం. ప్రేక్షకుల మెప్పు ఉంటేనే రాణించగలం. లేకుంటే కష్టమే! ఇంకో విషయం ఏంటంటే ఫేమ్ శాశ్వతం కాదు. అందుకే ఇవ్వన్నీ పట్టించుకోను. ఫేమ్ అనేది నటనకు వచ్చే బై ప్రొడక్ట్ మాత్రమే. సరిగా నటించకపోతే ప్రేక్షకుల నుంచి తిరస్కరణకు గురవుతాం. నేను సంతోషంగా సినీ కెరీర్‌ను ఎంచుకున్నా కాబట్టి సినిమాలు చేస్తున్నా. షూటింగ్ సమయంలో కొత్త డ్రెస్‌లు, ఆభరణాలు వేసుకున్నాక ఫొటోలకి ఫోజివ్వటం ఆనందాన్నిస్తుంది. ఈతరంలో నటిని కావటం అదృష్టమే. మంచి పాత్రలు వస్తున్నాయి. ప్రేక్షకులకు నామీద అభిమానం ఉన్నంత వరకే మేం ఇక్కడ నిలబడగలం. అందుకే కష్టపడాలి. ప్రేక్షకుల అభిమానం పొందాలి. లక్ష్యమిదే!'

ఈ వారమే విడుదల

ఈ ఆదివారం నుంచి వచ్చే శనివారంలోగా విడుదలవుతున్న సినిమాలు, వెబ్‌సిరీస్‌ల వివరాలు




ఓటీటీ వేదిక	సినిమా/సిరీస్	విడుదల తేదీ	ఓటీటీ వేదిక	సినిమా/సిరీస్	విడుదల తేదీ
నెట్‌ఫ్లిక్స్ ఇన్‌కమింగ్ ది ఫ్రాగ్	హాలీవుడ్ మూవీ కొరియన్ సిరీస్	ఆగస్టు 23 ఆగస్టు 24	లయన్స్ గేట్ ప్లే ఇన్ ది ల్యాండ్ ఆఫ్ సెయింట్స్ అండ్ సిన్నర్స్	తెలుగు డబ్బింగ్	ఆగస్టు 23
అమెజాన్ ప్రైమ్ యాంగ్రీ యంగ్‌మెన్ ది సలీమ్-జావేద్ స్టోరీ ఫాలో కర్ లో యార్ కల్కి 2898 ఏడీ రాయన్	హిందీ సిరీస్ రియాలిటీ షో తెలుగు చిత్రం తెలుగు డబ్బింగ్	ఆగస్టు 20 ఆగస్టు 23 ఆగస్టు 23 ఆగస్టు 23	జియో సినిమా డ్రైవ్ ఎవే డాల్స్	హాలీవుడ్ మూవీ	ఆగస్టు 23
			ఆపిల్ టీవీ ప్లస్ పాచింకో	కొరియన్ సిరీస్	ఆగస్టు 23
హెచ్‌బీవో మ్యాక్స్ జీజీ ప్రిసిక్ట్	కొరియన్ సిరీస్	ఆగస్టు 22	డిస్నీ ప్లస్ హాట్‌స్టార్ గర్ర్...	మలయాళ చిత్రం	ఆగస్టు 20



సలీం-జావేద్ స్టోరీ

ప్రముఖ బాలీవుడ్ సినీ రచయితలు సలీంఖాన్, జావేద్ అక్తర్ జీవితం ఆధారంగా యాంగ్రీ యంగ్ మెన్ పేరుతో డాక్యుమెంటరీ రూపొందించారు. సల్మాన్‌ఖాన్, పర్హాన్ అక్తర్ నిర్మించారు. నమ్రతారావ్ దర్శకత్వం వహించారు. సెలబ్రిటీ స్టేటస్ సాధించిన తొలి తరం భారతీయ స్క్రీన్ రైటర్‌లుగా ఖ్యాతి గడించిన ఈ ఇరువురు అగ్నిపథ్, జంజీర్, షోలే, డాన్ లాంటి ఎన్నో బ్లాక్‌బస్టర్‌లు ఇచ్చారు. తమ శక్తిమంతమైన రచనల ద్వారా ఎన్నో విప్లవాత్మక మార్పులతో హిట్ ఫార్ములాకు పర్యాయపదంగా నిలిచారు. వారి సినీ ప్రస్థానాన్ని ఈ డాక్యుమెంటరీలో ఆవిష్కరించనున్నారు.



దిక్సూచి DIKSUCHI

నేషనల్ లా స్కూల్లో లీగల్ ప్రోగ్రామ్‌లు



బెంగళూరులోని నేషనల్ లా స్కూల్ ఆఫ్ ఇండియా యూనివర్సిటీ(ఎన్ఎల్ఎస్ఐయూ)- మాస్టర్ ఆఫ్ బిజినెస్ లాస్(ఎంబీఎల్), పీజీ డిప్లొమా ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. వీటిని ప్రొఫెషనల్ అండ్ కంటిన్యూయింగ్ ఎడ్యుకేషన్(పీపీసీఈ) కింద బ్లెండెడ్ లెర్నింగ్ ఫార్మాట్‌లో నిర్వహిస్తారు. ఆన్‌లైన్ సెషన్స్, హైబ్రిడ్ ప్రోగ్రామ్స్ ఉంటాయి.

మాస్టర్ ఆఫ్ బిజినెస్ లాస్(ఎంబీఎల్): ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. ఇందులో పది కోర్సులు ఉంటాయి. మొదటి ఏడాది కాంట్రాక్ట్ లా, బ్యాంకింగ్ లా, కార్పొరేట్ లా, ఇండస్ట్రియల్ రిలేషన్స్ లా, ఎన్విరాన్‌మెంటల్ లా కోర్సులు; రెండో ఏడాది ఇన్వెస్ట్‌మెంట్ లాస్, ఇన్సూరెన్స్ లాస్, ఇంటర్నేషనల్ కమర్షియల్ ట్రాన్సాక్షన్స్ అండ్ ఫారిన్ ట్రేడ్, ఇంటెలెక్చువల్ ప్రాపర్టీ లాస్, టాక్సెస్ ఆన్ కార్పొరేషన్స్ కోర్సులు ఉంటాయి. ఈ ప్రోగ్రామ్ పూర్తిచేసిన అభ్యర్థులు లా ఆఫీసర్, లీగల్ అసిస్టెంట్, లీగల్ అడ్వైజర్‌గా రాణించవచ్చు.

పీజీ డిప్లొమా: ప్రోగ్రామ్ వ్యవధి ఏడాది. ఇందులో ఆర్బిట్రేషన్ లా, చైల్డ్ రైట్స్ లా, కన్జ్యూమర్ లా అండ్ ప్రాక్టీస్, సైబర్ లా అండ్ సైబర్ ఫోరెన్సిక్స్, ఎన్విరాన్‌మెంటల్ లా, హ్యూమన్ రైట్స్ లా, ఇంటెలెక్చువల్ ప్రాపర్టీ రైట్స్ లా, మెడికల్ లా అండ్ ఎథిక్స్, టాక్సేషన్ లా స్పెషలైజేషన్‌లు అందుబాటులో ఉన్నాయి. స్పెషలైజేషన్‌ను అనుసరించి ఈ ప్రోగ్రామ్ జర్నలిస్టులు, అడ్వకేట్‌లు, రైట్స్ యాక్టివిస్టులు, డాక్టర్‌లు, నర్స్‌లు, హాస్పిటల్ అడ్మినిస్ట్రేటర్‌లు, హెల్త్ వర్కర్‌లు, ఎన్విరాన్‌మెంటల్ ప్రొఫెషనల్స్, ఎన్‌జీఓలు, లీగల్-ఎడ్యుకేషనల్-రీసెర్చ్ విభాగాలకు చెందిన ప్రొఫెషనల్స్‌కు ఉపయుక్తంగా ఉంటుంది. పూర్తి సమాచారం కోసం వెబ్‌సైట్ చూడవచ్చు.

అర్హత: గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి ఏదేని డిగ్రీ ఉత్తీర్ణులు దరఖాస్తు చేసుకోవచ్చు. సీఏ, సీఎస్, ఐసీడబ్ల్యూఏఐ కోర్సులు పూర్తిచేసినవారు; ఓపెన్ యూనివర్సిటీలలో చదివినవారు; డిస్టెన్స్ ఎడ్యుకేషన్ ద్వారా డిగ్రీలు పొందిన వారు కూడా అప్లయ్ చేసుకోవచ్చు. వయోపరిమితి నిబంధనలు లేవు.

- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** సెప్టెంబరు 10
- **వెబ్‌సైట్:** https://pace.nls.ac.in/

ఐఐఎఫ్‌టీలో సర్టిఫికెట్ కోర్సు

ఢిల్లీలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫారిన్ ట్రేడ్(ఐఐఎఫ్‌టీ)- 'సర్టిఫికెట్ ప్రోగ్రామ్ ఇన్ ఎక్స్‌పోర్ట్ ఇంపోర్ట్ మేనేజ్‌మెంట్'లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. దీని వ్యవధి నాలుగు నెలలు. ఇది ఆన్‌లైన్ వీకెండ్ ప్రోగ్రామ్. ఇందులో ఆరు మాడ్యూల్స్ ఉంటాయి. ప్రోగ్రామ్‌లో భాగంగా ఎక్స్‌పోర్ట్/ఇంపోర్ట్ డాక్యుమెంటేషన్, లాజిస్టిక్స్ ఫైనాన్స్, ఇంటర్నేషనల్ మార్కెటింగ్, లీగల్ యాస్పెక్ట్స్ ఆఫ్ ట్రేడ్ తదితర అంశాలు వివరిస్తారు. ఆన్‌లైన్ అసెస్‌మెంట్స్, అసైన్‌మెంట్స్, ప్రజంటేషన్స్, ప్రాజెక్ట్ వర్క్ ఉంటాయి. లెర్నింగ్ వెబ్ పోర్టల్‌కు లైఫ్ టైం యాక్సెస్, కోర్సు మెటీరియల్ ఇస్తారు. కోర్సు చివరలో ఫైనల్ ఎగ్జామ్‌ను ఆన్‌లైన్‌లో నిర్వహిస్తారు. ప్రతి సబ్జెక్టులో కనీసం 50 శాతం మార్కులు వస్తేనే సర్టిఫికెట్ ఇస్తారు. ఎంట్రీ/మిడిల్/సీనియర్ లెవెల్ ఎగ్జిక్యూటివ్‌లు, ఆంత్రప్రెన్యూర్స్ వర్కింగ్ ప్రొఫెషనల్స్‌కు ఈ ప్రోగ్రామ్ ఉపయోగకరంగా ఉంటుంది.

కోర్సు వివరాలు: వారాంతాల్లో ఉదయం తొమ్మిది గంటల నుంచి మధ్యాహ్నం పన్నెండు గంటల పదిహేను నిమిషాల వరకు మరల సాయంత్రం రెండు గంటల నుంచి అయిదు గంటల పదిహేను నిమిషాల వరకు ఆన్‌లైన్ సెషన్స్ నిర్వహిస్తారు. కనీసం 75 శాతం అటెండెన్స్ తప్పనిసరి.

మాడ్యూల్స్: గ్లోబల్ బిజినెస్ ఎన్విరాన్‌మెంట్ 30 గంటలు, ఇంటర్నేషనల్ ట్రేడ్ ఆపరేషన్స్ అండ్ డాక్యుమెంటేషన్ 30 గంటలు, ఇంటర్నేషనల్ మార్కెటింగ్ మేనేజ్‌మెంట్ 20 గంటలు, ఇండియాస్ ఫారిన్ ట్రేడ్ పాలసీ 20 గంటలు, ఇంటర్నేషనల్ ట్రేడ్ లాజిస్టిక్స్ 30 గంటలు, ఎగ్జిమ్ ఫైనాన్స్ 20 గంటలు సెషన్స్ నిర్వహిస్తారు.

అర్హత: గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి ఏదేని డిగ్రీ/తత్సమాన కోర్సు పూర్తిచేసినవారు దరఖాస్తు చేసుకోవచ్చు.

- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** ఆగస్టు 31
- **వెబ్‌సైట్:** iift.ac.in

టీజీ నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ స్కీమ్



తెలంగాణ స్టేట్ డైరెక్టర్ ఆఫ్ గవర్నమెంట్ ఎగ్జామినేషన్ కార్యాలయం- 'నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ స్కీమ్ 2024' నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. తొమ్మిదో తరగతి నుంచి ఇంటర్ వరకు చదివే పేద విద్యార్థులకు ఆర్థిక సహకారాన్ని అందించేందుకు ఈ స్కీమ్‌ను ఉద్దేశించారు. రాత పరీక్ష ద్వారా విద్యార్థులను ఎంపిక చేస్తారు.

అర్హత: విద్యార్థులు ప్రభుత్వ, ఎయిడెడ్, స్థానిక సంస్థల పాఠశాలల్లో ఎనిమిదో తరగతి చదువుతూ ఉండాలి. ఏడో తరగతిలో జనరల్ విద్యార్థులకు 55 శాతం మార్కులు; ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు 50 శాతం మార్కులు ఉండాలి. ఎనిమిదో తరగతిలో కూడా ఇలాగే మార్కులు తెచ్చుకోవాలి. కుటుంబ వార్షికాదాయం రూ.3,50,000 మించకూడదు. తెలంగాణ రెసిడెన్షియల్ స్కూల్స్, తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్స్, తెలంగాణ ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ హై స్కూల్స్, తెలంగాణ మైనారిటీ రెసిడెన్షియల్ స్కూల్స్, గవర్నమెంట్ ఆశ్రమ్ హై స్కూల్స్, కస్తూర్బా రెసిడెన్షియల్ స్కూల్స్, రెసిడెన్షియల్ మోడల్ స్కూల్స్, జవహర్ నవోదయ విద్యాలయాలు, కేంద్రీయ విద్యాలయాలు, ప్రైవేట్ అన్ ఎయిడెడ్ స్కూల్స్, సైనిక్ స్కూల్స్, ఇతర రెసిడెన్సియల్ ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులు దరఖాస్తుకు అనర్హులు.

రాత పరీక్ష: ఇందులో రెండు పార్టులు ఉంటాయి. మొదటిది మెంటల్ ఎబిలిటీ టెస్ట్(ఎంఏటీ), రెండోది స్కాలస్టిక్ ఆప్టిట్యూడ్ టెస్ట్(ఎస్ఏటీ). ఒక్కో పార్టులో 90 చొప్పున మొత్తం 180 మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలు ఇస్తారు. ఏడు, ఎనిమిది తరగతుల సిలబస్ ఆధారంగా సైన్సెస్, మేథమెటిక్స్, సోషల్ స్టడీస్ అంశాల నుంచి ప్రశ్నలు అడుగుతారు. ప్రశ్నకు ఒక మార్కు చొప్పున మొత్తం మార్కులు 180. పరీక్ష సమయం మూడు గంటలు. ఈ పరీక్షలో అర్హత పొందాలంటే జనరల్ కేటగిరీ విద్యార్థులకు 40 శాతం మార్కులు; ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు 32 శాతం మార్కులు రావాలి.

స్కాలర్‌షిప్: రాత పరీక్షలో అర్హత పొందిన విద్యార్థులకు తొమ్మిది నుంచి ఇంటర్ పూర్తిచేసేవరకు నెలకు రూ.1000 చొప్పున ఏడాదికి రూ.12000 ఇస్తారు.

- **పరీక్ష ఫీజు:** జనరల్, బీసీ విద్యార్థులకు రూ.100; దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు రూ.50
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** సెప్టెంబరు 11
- **ఆన్‌లైన్ దరఖాస్తు ప్రింట్ కాపీని పాఠశాలలో సబ్మిట్ చేసేందుకు చివరి తేదీ:** సెప్టెంబరు 13
- **డైరెక్టర్ ఆఫ్ గవర్నమెంట్ ఎగ్జామినేషన్స్‌కు దరఖాస్తులు చేరాల్సిన తేదీ:** సెప్టెంబరు 18
- **రాత పరీక్ష తేదీ:** నవంబరు 24
- **వెబ్‌సైట్:** http//bse.telangana.gov.in

'దిక్సూచి' వెబ్ పేజీలో.. సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/fwlR6Kkలో చదవండి.

నవ్య | చిత్రజ్యోతి



పవన్ కల్యాణ్ కథానాయకుడిగా నటిస్తున్న పీరియాడిక్ యాక్షన్ డ్రామా 'హరిహర వీరమల్లు'. నిధి అగర్వాల్ కథానాయిక. శనివారం ఆమె పుట్టిన రోజు సందర్భంగా చిత్రబృందం ప్రత్యేక పోస్టర్‌ను విడుదల చేసింది.



హిస్టారికల్ బ్యాక్‌డ్రాప్‌లో వారియర్ స్టోరీ

ప్రభాస్ కొత్త చిత్రం శనివారం ఉదయం మొదలైంది. హను రాఘవపూడి దర్శకత్వంలో మైత్రీ మూవీ మేకర్స్ సంస్థ అధినేతలు నవీన్ యర్నేని, రవిశంకర్ వై నిర్మిస్తున్నారు. ఇన్‌స్టాలో తన వీడియోలతో అందరినీ ఆకట్టుకొన్న ఇమాన్వీ ఎస్మాయిల్ ఈ సినిమాలో హీరోయిన్‌గా నటిస్తున్నారు. ఈ సినిమా కాన్సెప్ట్ పోస్టర్‌ను చిత్ర బృందం విడుదల చేసింది. ఇందులో 'పరిత్రాణాయ సాధూనాం' అంటూ భగవద్గీత శ్లోకాన్ని ప్రచురించారు. 'ఆపరేషన్ జెడ్' అని మరొక చోట పేర్కొన్నారు. అలాగే ఈ సినిమా క్లాప్ బోర్డ్ మీద కోల్‌కతా హౌరా బ్రిడ్జ్, సుభాష్ చంద్రబోస్ 'ఆజాద్ హింద్ ఫౌజ్' పతాకం, చార్మినార్.. ఉండడం ఆసక్తిరేకెత్తిస్తోంది. 1940 బ్యాక్‌డ్రాప్‌లో జరిగే ఈ చిత్రకథలో ప్రభాస్ వారియర్‌గా ఓ పవర్‌ఫుల్ పాత్ర పోషిస్తున్నారు. మిథున్ చక్రవర్తి, జయప్రద కీలక పాత్రలు చేస్తున్నారు. భారీ బడ్జెట్‌తో ప్రతిష్ఠాత్మకంగా రూపుదిద్దుకుంటున్న ఈ చిత్రానికి సంగీతం: విశాల్ చంద్రశేఖర్, ఫొటోగ్రఫీ: సుదీప్ ఛటర్జీ, ఎడిటింగ్: కోటగిరి వెంకటేశ్వరరావు.

మెల్‌బోర్న్‌లో మువ్వన్నెల రెపరెపలు



మెల్‌బోర్న్‌లో జరుగుతున్న ఇండియన్ ఫిల్మ్ ఫెస్టివల్ ఆఫ్ మెల్‌బోర్న్‌కు రామ్‌చరణ్ గౌరవ అతిథిగా హాజరైన విషయం తెలిసిందే. సినీ పరిశ్రమకు ఆయన అందించిన సేవలకు గుర్తింపుగా ఆర్ట్ అండ్ కల్చర్ బ్రాండ్ అంబాసిడర్ పురస్కారాన్ని శనివారం అందుకున్నారు. ఏటా ఈ పురస్కారం అందుకున్న వ్యక్తులు భారత జాతీయ పతాకాన్ని ఎగురవేయడం ఆనవాయితీగా వస్తోంది. ఈ నేపథ్యంలో శనివారం ఫెడరేషన్ స్క్వేర్‌లో ఘనంగా జరిగిన వేడుకల్లో రామ్‌చరణ్ త్రివర్ణ పతాకాన్ని ఎగురవేశారు.

ఐఎఫ్ఎఫ్ఎం పురస్కారాల ప్రదానం

ఐఎఫ్ఎఫ్ఎం చిత్రోత్సవాల్లో విజేతలకు పురస్కారాలను ప్రదానం చేశారు. చందు ఛాంపియన్ చిత్రానికి గాను కార్తిక్ ఆర్యన్ ఉత్తమ నటుడి పురస్కారం స్వీకరించారు. ఉత్తమ దర్శకుడి పురస్కారాన్ని కబీర్‌ఖాన్, నిథిలన్ స్వామినాథన్ (మహారాజా)తో కలసి అందుకున్నారు. ఉత్తమ నటిగా పార్వతి తిరువోతు, ఉత్తమ చిత్రంగా 'ట్వల్త్ ఫెయిల్' పురస్కారాలను దక్కించుకున్నాయి. క్రిటిక్స్ విభాగంలో ఉత్తమ నటుడి పురస్కారం విక్రాంత్‌మాసేకు దక్కింది. సంగీత దర్శకుడు ఏ. ఆర్ రెహమాన్ విశిష్ట పురస్కారం స్వీకరించారు.

ప్రేక్షకులు దూరమైంది అందుకే

- దిల్‌రాజు



'ప్రేక్షకుల్ని చెడగొట్టింది మేమే.'మీరు ఇంట్లోనే కూర్చోండి.. నాలుగు వారాల్లో సినిమాను ఓటీటీలో చూపిస్తాం' అని వారిని థియేటర్‌కు రాకుండా చేసుకున్నాం' అని నిర్మాత దిల్‌రాజు కీలక వ్యాఖ్యలు చేశారు. 'రేవు' చిత్రం ఈ నెల 23న విడుదల కానుంది. ఈ నేపథ్యంలో శుక్రవారం జరిగిన ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌లో దిల్ రాజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'సినిమా తీయడం గొప్ప కాదు. ప్రేక్షకుడిని థియేటర్‌కు తీసుకురావడం ముఖ్యం' అన్నారు. 'రేవు' సినిమా కాన్సెప్ట్ బాగుంది. ఈ చిత్రాన్ని చూసి 'నేనూ రివ్యూ రాస్తా' అన్నారు దిల్ రాజు. నిర్మాతల్లో ఒకరైన మురళి మాట్లాడుతూ 'ఒక మంచి చిత్రంతో నా సినీ జర్నీ మొదలైంది. మా సినిమాను చూసి ఆదరించండి' అని కోరారు. తక్కువ బడ్జెట్‌లోనే ఎంత అద్భుతంగా సినిమా తీయవచ్చో దర్శకుడు హరినాథ్ నిరూపించారు' అని ప్రభు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ నిర్మాత పర్వతనేని రాంబాబు పాల్గొన్నారు.

గాయని పి. సుశీలకు అస్వస్థత



ప్రముఖ గాయని పి. సుశీల శనివారం అస్వస్థతకు గురయ్యారు. కడుపు నొప్పితో ఆమె చెన్నైలోని కావేరి ఆస్పత్రిలో చేరారు. ప్రస్తుతం ఆమెకు చికిత్స అందుతోంది. ఆరోగ్యం నిలకడగా ఉన్నట్టు వైద్యులు వెల్లడించారు. కొంతకాలంగా సుశీల అనారోగ్యంతో బాధపడుతున్నారు.

ఇన్ ప్రోగ్రెస్



'ఆయ్' టీమ్‌కు ఎన్టీఆర్ అభినందనలు

నార్నే నితిన్, నయన్ సారిక జంటగా రూపొందిన 'ఆయ్' చిత్రం ఇటీవల విడుదలై సూపర్ హిట్ టాక్ సాధించింది. ఈ సినిమాకు పాజిటివ్ రివ్యూలు కూడా రావడంతో టీమ్‌ను అందరూ ప్రశంసిస్తున్నారు. శనివారం యూనిట్ సభ్యులు జూనియర్ ఎన్టీఆర్‌ను కలుసుకుని ఆయన అభినందనలు పొందారు. బాక్సాఫీసు దగ్గర గట్టి పోటీ ఉన్నప్పటికీ 'ఆయ్' హిట్ కావడంతో ఎన్టీఆర్ వారిని అభినందించారు. నార్నే నితిన్, నయన్ సారిక, అంకిత్ కొయ్య, నిర్మాతలు బన్నీ వాసు, ఎస్.కె.ఎన్. శనివారం ఎన్టీఆర్‌ను కలిశారు.

రోషన్ హీరోగా 'ఛాంపియన్'



నటుడు శ్రీకాంత్ తనయుడు రోషన్ హీరోగా నటించే కొత్త చిత్రం 'ఛాంపియన్' షూటింగ్ శనివారం మొదలైంది. నేషనల్ అవార్డ్ విన్నింగ్ డైరెక్టర్ ప్రదీప్ అద్వైతం ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తున్నారు. పీరియాడికల్ బ్యాక్‌డ్రాప్‌లో రూపుదిద్దుకొనే ఈ చిత్రం షూటింగ్ ను దర్శకుడు నాగ్‌అశ్విన్ తొలి క్లాప్ ఇచ్చి ప్రారంభించారు. సరికొత్త పాత్రలో రోషన్‌ను ప్రజెంట్ చేయడానికి ఓ విభిన్నమైన స్ర్కిప్ట్‌ను దర్శకుడు ప్రదీప్ సిద్ధం చేశారు. ఈ చిత్రానికి ఛాయాగ్రహణం: ఆర్. మది, కళా దర్శకుడు: తోట తరణి, నిర్మాణం: స్వప్న సినిమా, ఆనంది ఆర్ట్స్, కాన్సెప్ట్ ఫిల్మ్స్.

భయపెట్టేందుకు సిద్ధం



అరుల్ నిధి, ప్రియా భవానీ శంకర్ జంటగా నటించిన హారర్ థ్రిల్లర్ 'డిమోంటి కాలనీ 2'. ఈ చిత్రం విడుదల తేదీ ఖరారైంది. ఈ నెల 23న విడుదల చేస్తున్నట్లు చిత్రబృందం తెలిపింది. అజయ్ ఆర్ జ్ఞానముత్తు దర్శకత్వంలో విజయ్ సుబ్రహ్మణ్యన్, ఆర్. సి రాజ్‌కుమార్ ఈ చిత్రాన్ని నిర్మించారు.

అప్పటి ప్రజాప్రతినిధులకు త్వరలో సమన్లు!

- గడువు ముగిసినా అఫిడవిట్ ఇవ్వని మాజీ ఐఏఎస్
- సీరియస్‌గా పరిగణిస్తున్న జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్

హైదరాబాద్, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): కాళేశ్వరం ఎత్తిపోతల పథకం నిర్మాణంలో కీలక భూమిక పోషించిన అప్పటి ప్రజాప్రతినిధులకు సమన్లు జారీ చేయాలని జస్టిస్ పినాకి చంద్రఘోష్ కమిషన్ నిర్ణయించింది. ఇప్పటికే ఇంజనీర్లు, మేధావులు, ఐఏఎస్‌లతో పాటు మాజీ ఐఏఎస్‌ల నుంచి వాంగ్మూలాలు సేకరించడంతోపాటు వారి నుంచి అఫిడవిట్లు స్వీకరించిన కమిషన్.. ఆ అఫిడవిట్లలో ఉన్న సమాచారం ఆధారంగా కొందరికి సమన్లు జారీ చేయనుంది. ఇప్పటిదాకా 57మంది అఫిడవిట్లు దాఖలు చేయగా, ఆయా అంశాలపై వచ్చే వారం నుంచే క్రాస్ ఎగ్జామినేషన్ చేపట్టాలని కమిషన్ భావిస్తోంది. ఇందుకోసం తెలంగాణ, ఏపీ, పశ్చిమబెంగాల్‌తో సంబంధం లేని న్యాయవాదిని నియమించుకోనుంది. ఇప్పటికే నియామక ప్రక్రియ ప్రారంభించాలని ప్రభుత్వాన్ని కోరింది. క్రాస్ ఎగ్జామినేషన్ పూర్తికాగానే ఆర్థిక అవకతవకలపై కమిషన్ దృష్టి సారించనుంది. కాగా, అఫిడవిట్ దాఖలుకు ఇచ్చిన గడువు ముగిసినా... కీలక మాజీ ఐఏఎస్ స్పందించకపోవడం కలకలం రేపుతోంది. ఆయన తీరుపై సీరియస్‌గా ఉన్న కమిషన్.. త్వరలోనే చర్యలు తీసుకోవాలని యోచిస్తున్నట్లు సమాచారం. మరోవైపు కీలక మాజీ ప్రజాప్రతినిధి ఒకరు అనారోగ్యంతో ఉన్నారని సమాచారం అందించగా.. సమన్లు జారీ చేశాక కూడా రాకుంటే నేరుగా ఆయన నివసించే ప్రాంతానికే వెళ్లి వివరాలు సేకరించాలని కమిషన్ యోచిస్తోంది. కాగా, కాళేశ్వరంపై విచారణకు తనను పిలవాలని స్వయంగా అభ్యర్థించుకున్న తెలంగాణ జలవనరుల అభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ వి.ప్రకాశ్‌ను శనివారం కమిషన్ విచారించింది. తుమ్మిడిహెట్టి కోణంలో కాకుండా, మూడు తరాలుగా తెలంగాణకు జరిగిన అన్యాయాన్ని సవరించేందుకే చేపట్టారన్న కోణంలో కాళేశ్వరాన్ని చూడాలని ఆయన నివేదించారు. తుమ్మిడిహెట్టి వద్ద బ్యారేజీ నిర్మాణం సాధ్యం కాదని, ఈ బ్యారేజీని 152 మీటర్ల ఎత్తుతో కడితే 5 టీఎంసీల దాకా నిల్వ చేసే అవకాశం ఉంటుందని, అదే మహారాష్ట్ర అనుమతించిన విధంగా 148 మీటర్ల ఎత్తుతో కడితే కేవలం 1.8 టీఎంసీలు మాత్రమే నిల్వ చేయడానికి అవకాశం ఉంటుందని తెలిపారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కేంద్ర జలశక్తి శాఖ సలహాదారుడు వెదిరే శ్రీరామ్ కమిషన్‌ను తప్పుదోవ పట్టిస్తున్నారని ఆరోపించారు. వార్ధా-వెన్‌గంగా కలిసే చోట 'వీ' ఆకారంలో బ్యారేజీ సాధ్యం కాదని స్పష్టం చేశారు. రూ.7500 కోట్లు వెచ్చించినా తుమ్మిడిహెట్టితో ఆశించిన ప్రయోజనం రాదన్నారు. కాగా, మేడిగడ్డ బ్యారేజీ కుంగడానికి కారణాలేంటి? అనే కోణంలో ఈనెల 26వ తేదీలోగా అఫిడవిట్ దాఖలు చేయాలని కమిషన్ ఆదేశించగా.. సాక్ష్యాధారాలతో నివేదిక ఇస్తానని ప్రకాశ్ ప్రకటించారు.

వైద్యులకు నాయకత్వ పాఠాలు

- ఐఎస్‌బీ సాయంతో ఆరోగ్యశాఖ వినూత్న కార్యక్రమం

హైదరాబాద్, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వైద్య, ఆరోగ్య కుటుంబ సంక్షేమ కమిషనర్(సీహెచ్‌ఎఫ్‌డబ్ల్యూ) పరిధిలోని సీనియర్ అధికారులు, వైద్యుల్లో నాయకత్వ లక్షణాలు పెంచే దిశగా వైద్యశాఖ కసరత్తు చేస్తోంది. అందుకు ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్(ఐఎస్‌బీ) సహకారం తీసుకుంటోంది. నిపుణుల చేత వైద్యులకు శిక్షణ ఇప్పిస్తోంది. ఏడాదిపాటు ఈ కార్యక్రమం కొనసాగుతుందని ఐఎస్‌బీ ప్రకటించింది. ఈ కార్యక్రమం ద్వారా ఆరోగ్య సంరక్షణాభివృద్ధికి బలమైన పునాదులు వేశామని కుటుంబ సంక్షేమ కమిషనర్, నేషనల్ హెల్త్ మిషన్ డైరెక్టర్ ఆర్వీ కర్ణన్ తెలిపారు.

నాలుగున్నరేళ్లు కోమా.. చివరికి మృత్యుఒడిలోకి

తల్లాడ, ఆగస్టు 17: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి కోమాలోకి వెళ్లిన ఓ వ్యక్తి దాదాపు నాలుగున్నర ఏళ్ల పాటు మృత్యువుతో పోరాడి చివరికి శనివారం తుదిశ్వాస విడిచాడు. ఖమ్మం జిల్లా తల్లాడ మండలం మల్లవరం గ్రామానికి చెందిన బెల్లంకొండ వెంకటేశ్వరరావు(49)... 2020 మార్చి 7వ తేదిన బాలపేట గ్రామంలో ఉన్న పొలం వద్దకు స్కూటీపై వెళ్లి ఇంటికి తిరిగి వస్తుండగా ఆయన వాహనాన్ని మరో బైక్ ఢీకొంది. ఈ ప్రమాదంలో వెంకటేశ్వరరావు తలకు తీవ్రంగా గాయమవడంతో మెదడు దెబ్బతింది. దాంతో అపస్మారక స్థితిలోకి వెళ్లిన వెంకటేశ్వరరావుకు ఖమ్మం, కరీంనగర్, హైదరాబాద్‌ల్లోని కార్పొరేట్ ఆసుపత్రులకు తీసుకువెళ్లి చికిత్స చేయించినప్పటికీ ఆరోగ్య పరిస్థితిలో ఎటువంటి మార్పు లేకుండా పోయింది. వైద్యం కోసం కుటుంబసభ్యులు ఎకరం పొలం అమ్మి సుమారు 40 లక్షల వరకు ఖర్చు చేశారు. అయినప్పటికీ, అచేతన స్థితిలో ఉండటంతో వైద్యులు వెంకటేశ్వరరావు అన్నవాహికకు సర్జరీ చేసి రంధ్రాన్ని చేశారు. ఇంటి వద్దనే దాని ద్వారా పండ్ల రసాలు అందిస్తూ అతని భార్య శివకుమారి నిత్యం సపర్యలు చేసేది.

రేవంత్ రాజీనామా చేయాలి

54 శాతం మంది రైతులకు రుణమాఫీ కాలేదు.. పాలనలో పూర్తిగా విఫలమైన ముఖ్యమంత్రి

- తొండి చేయడంలో తోపు.. బూతులు తిట్టడంలో టాప్
- దేవుళ్లపై ప్రమాణాలు చేసి మాట తప్పారు
- నా క్యాంపు ఆఫీసుపై దాడి చేయించారు
- భౌతిక దాడులూ చేయొచ్చు : హరీశ్‌రావు

హైదరాబాద్, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం గొప్పగా చెప్పుకొంటున్న రూ.2 లక్షల రుణమాఫీ.. రాష్ట్రంలో 54 శాతం మంది రైతులకు అందలేదని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. ఇందుకు సీఎం రేవంత్‌రెడ్డి.. ప్రజలను క్షమాపణ కోరడంతోపాటు ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. రూ.2 లక్షల రుణమాఫీపై శ్వేతపత్రం విడుదల చేయాలని, రాష్ట్రంలో ఎంత మంది రైతులున్నారు, వారిలో ఎంత మందికి ఎన్ని కోట్లు అందించారు, ఎన్ని నిధులు రైతుల ఖాతాల్లో జమ అయ్యాయనే విషయాలను బహిర్గతం చేయాలని అన్నారు. ఈ మేరకు శనివారం తెలంగాణ భవన్‌లో హరీశ్‌రావు విలేకరులతో మాట్లాడారు. అధికారంలోకి రాగానే 2023 డిసెంబరు 9నాడే రుణమాఫీ అమలు చేస్తామని చెప్పి.. 2024 ఆగస్టు వరకు పొడిగించారని, అయినా 54 శాతం మంది రైతులకు రుణమాఫీ అందలేదని మండిపడ్డారు. నిజంగా రుణమాఫీ అందరికీ జరిగిందని సీఎం భావిస్తే.. నేరుగా రైతుల వద్దకే వెళ్లి తెలుసుకుందామని, తేదీ, సమయం చెప్పాలని సవాల్ చేశారు. ఏ నియోజకవర్గంలోని ఏ గ్రామమైనా పర్వాలేదని, కొడంగల్‌కైనా వెళదామని అన్నారు. రుణమాఫీ పూర్తి చేశామంటూ తనను రాజీనామా చేయాలంటున్నారని, కానీ.. ఆగస్టు 15లోపు రూ.2 లక్షల రుణమాఫీతో పాటు ఎన్నికల్లో ఇచ్చిన ఆరు గ్యారెంటీల్లోని 13 హామీలను సంపూర్ణంగా అమలు చేస్తే రాజీనామా చేస్తానని తాను స్పష్టంగా చెప్పానని గుర్తు చేశారు. రేవంత్‌రెడ్డిలాగా తాను మాట తప్పే వ్యక్తిని కాదని, కొడంగల్‌లో ఓడిపోతే రాజకీయ సన్యాసం తీసుకుంటానని చెప్పి, పార్టీలు మారిన చరిత్ర తనది కాదని వ్యాఖ్యానించారు.



మాఫీపై ఒక్కోసారి ఒక్కో రకంగా చెప్పారు..

రుణమాఫీపై కాంగ్రెస్ పార్టీ ఒక్కో సందర్భంలో ఒక్కో రకంగా చెప్పిందని హరీశ్‌రావు అన్నారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో రూ.40 వేల కోట్లు అన్నారని, జూన్ 21న కేబినెట్ భేటీ అనంతర రంప్రెస్‌మీట్‌లో రూ.31 వేల కోట్లు అన్నారని, బడ్జెట్‌లో రూ.26 వేల కోట్లు కేటాయించారని, చివరకు 22 లక్షల మంది రైతులకు రూ.17 వేల కోట్లే మాఫీ చేశారని విమర్శించారు. ఇది కూడా అందరికీ అందలేదన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రూ.లక్ష రుణమాఫీ ప్రక్రియలో 36 లక్షల మంది రైతులకు రూ.17 వేల కోట్ల ప్రయోజనం అందిందని తెలిపారు. మరి ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం రూ.2 లక్షల చొప్పున మాఫీ చేస్తే.. లబ్ధిదారుల సంఖ్య పెరగాల్సింది పోయి ఎందుకు తగ్గిందో చెప్పాలన్నారు. రుణమాఫీ అందనివారి వివరాలను తమకు తెలియజేయాలంటూ తెలంగాణ భవన్‌లో కాల్ సెంటర్ ఏర్పాటుచేస్తే.. ఈ నెల 6 నుంచి ఇప్పటివరకు 1,16,441 ఫిర్యాదులు వచ్చాయన్నారు. తొండి చేయడంలో రేవంత్‌రెడ్డి తోపు అని, బూతులు తిట్టడంలో టాప్ అని హరీశ్‌రావు ఎద్దేవా చేశారు. పరిపాలనలో మాత్రం ఫెయిలయ్యారని అన్నారు. పార్లమెంటు ఎన్నికల సమయంలో ప్రచారానికి వెళ్లిన ప్రతి చోటా రుణమాఫీ చేస్తామంటూ అక్కడి దేవుళ్లపై ప్రమాణాలు చేశారని గుర్తు చేశారు. వాటిని నెరవేర్చకపోతే ఆ కీడు రాష్ట్రానికి ఎదురుకొడుతుందేమోనని తనకు భయమేస్తోందన్నారు. రాష్ట్రానికి, ప్రజలకు ఎలాంటి కీడు జరగకుండా చూడాలని సీఎం ఒట్టు పెట్టిన అన్ని ఆలయాలు, మసీదులు, చర్చిలకు వెళ్లి మొక్కుకుని, పాప పరిహారం చేస్తానని ప్రకటించారు.

నీ గాడ్‌ఫాదర్‌కే భయపడలేదు..

రుణమాఫీ విషయంలో రేవంత్‌రెడ్డి రైతుల నెత్తిన కాంగ్రెస్ టోపీ పెట్టారని హరీశ్‌రావు విమర్శించారు. దానిని పక్కదారి పట్టించేందుకే సీఎం పదవి స్థాయిని దిగజార్చుతూ మాట్లాడుతున్నారని మండిపడ్డారు. ఇప్పటివరకు రైతులకు జరిగిన రుణమాఫీ కూడా తమ పోరాటం వల్లనే సాధ్యమైందన్నారు. రైతుల తరఫున పోరాడుతున్నందుకు తమపై గూండాలతో దాడులు చేయిస్తున్నారని ఆరోపించారు. సిద్దిపేటలోని తన క్యాంపు కార్యాలయంపై దాడి చేయించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నానన్నారు. ఇలా దాడులు చేయిస్తే రాష్ట్రానికి పెట్టుబడులు ఎలా వస్తాయని ప్రశ్నించారు. పరిస్థితులు చూస్తుంటే భౌతిక దాడులకు దిగుతారేమోనన్న అనుమానం కలుగుతోందన్నారు. తమ పదేళ్ల పాలనలో ఎప్పుడూ ఇలా దాడులు చేయలేదని చెప్పారు. తాటిచెట్టులా ఉన్నావంటూ తన శారీరక వ్యవహారాల గురించి (బాడీ షేమింగ్) వ్యక్తిగత వ్యాఖ్యలు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. "మిస్టర్ రేవంత్.. నీ తాటాకు చప్పుళ్లకు భయపడేది లేదు. నీ గాడ్‌ఫాదర్‌కే భయపడలేదు. రుణమాఫీ విషయంలో మాట తప్పావ్.. రైతులందరికీ మాఫీ అయ్యేంతవరకు కాంగ్రెస్‌ను, నిన్ను వదిలేది లేదు. బీఆర్ఎస్ పక్షాన పోరాటం చేస్తాం. మరో రైతాంగ ఉద్యమానికి శ్రీకారం చుడతాం"అని హరీశ్‌రావు హెచ్చరించారు.

బీజేపీ రాష్ట్ర ఇన్‌చార్జిగా అభయ్ పాటిల్!

- తెలుగు రాష్ట్రాల్లో సభ్యత్వ నమోదు ఇన్‌చార్జిగా అరవింద్ మీనన్
- ఏపీలో పార్టీ అధ్యక్షురాలు పురంధేశ్వరికి తమిళనాడు, కేరళ, పుదుచ్చేరి బాధ్యతలు



హైదరాబాద్, న్యూఢిల్లీ, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్రంలో సంస్థాగతంగా పార్టీని బలోపేతం చేయడం, స్థానిక సంస్థల ఎన్నికలే లక్ష్యంగా బీజేపీ నాయకత్వం కీలక నిర్ణయం తీసుకుంది. పార్టీ రాష్ట్ర ఇన్‌చార్జిగా తరుణ్ ఛుగ్ స్థానంలో అభయ్ పాటిల్‌ను నియమించింది. కర్ణాటకలోని దక్షిణ బెల్గాం నుంచి ఆయన ఎమ్మెల్యేగా ప్రాతినిధ్యం వహిస్తున్నారు. తన నియామకాన్ని పాటిల్, ఎక్స్ ఖాతా ద్వారా వెల్లడించారు. శనివారం ఢిల్లీలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో జరిగిన సభ్యత్వ నమోదు వర్క్‌షాప్‌లో అభయ్ పాటిల్, తెలంగాణ రాష్ట్ర ఇన్‌చార్జి హోదాలో హాజరయ్యారని పార్టీవర్గాలు తెలిపాయి. బీజేపీ ఆంధ్రప్రదేశ్, తెలంగాణ సభ్యత్వ నమోదు ఇన్‌చార్జిగా అరవింద్ మీనన్ నియమితులయ్యారు. ఆంధ్రప్రదేశ్ బీజేపీ అధ్యక్షురాలు దగ్గుబాటి పురంధేశ్వరికి తమిళనాడు, కేరళ, పుదుచ్చేరి రాష్ట్రాల్లో సభ్యత్వ నమోదు ఇన్‌చార్జిగా బాధ్యతలు అప్పగించారు. శనివారం ఢిల్లీలోని బీజేపీ కేంద్ర ప్రధాన కార్యాలయంలో నడ్డా అధ్యక్షతన జరిగిన సమావేశంలో పార్టీ సభ్యత్వ నమోదు, రానున్న సంస్థాగత ఎన్నికలు, కొన్ని రాష్ట్రాల్లో అసెంబ్లీ ఎన్నికలపై, ఈ నెల 31న కేరళలోని పాలక్కాడ్‌లో జరగున్న బీజేపీ, ఆర్ఎస్ఎస్ సంయుక్త సమావేశంపైనా చర్చించారు. మరోవైపు సెప్టెంబరు 1 నుంచి బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టాలని పార్టీ సీనియర్ నేత, కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా పిలుపునిచ్చారు.

రేవంత్ బీజేపీలో చేరడం ఖాయం!

- త్వరలోనే కమలం గూటికి
- 40% మందికి కూడా రుణమాఫీ కాలేదు
- వివరాలు సేకరించి ఉద్యమం చేపడతాం
- మీడియాతో ఇష్టాగోష్ఠిలో కేటీఆర్



హైదరాబాద్, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): సీఎం రేవంత్‌రెడ్డి త్వరలోనే తన బృందంతో కలిసి బీజేపీలో చేరతారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్యే కేటీఆర్ అన్నారు. రేవంత్ తదుపరి రాజకీయ మజిలీ బీజేపీతోనేనని చెప్పారు. ముఖ్యమంత్రే పార్టీ మారి.. కొత్త చరిత్రకు నాంది పలుకుతారేమోనన్నారు. తాను పుట్టింది బీజేపీలోనే.. చివరి రాజకీయ ప్రస్థానం కూడా బీజేపీతోనే ముగుస్తుందంటూ ప్రధాని మోదీతో, అమిత్‌షాతో రేవంత్ చెప్పారని తెలిపారు. కాషాయ జెండాతోనే ఏబీవీపీలో రాజకీయ ప్రస్థానాన్ని ప్రారంభించానని, అదే జెండా కప్పుకొని చనిపోతానని మోదీతో చెప్పినమాట వాస్తవమో, కాదో రేవంత్ స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. శనివారం తెలంగాణ భవన్‌లో మీడియాతో కేటీఆర్ ఇష్టాగోష్ఠిగా మాట్లాడారు. రైతులకు రూ.2 లక్షల వరకు రుణమాఫీ చేశామని ప్రభుత్వం చెబుతోందని, కానీ.. 40% మంది రైతులకు కూడా మాఫీ కాలేదన్నారు. సోమ లేదా మంగళవారం నుంచి రుణమాఫీ పొందని వారి వివరాలు సేకరిస్తామని, అనంతరం కలెక్టర్ నుంచి రాష్ట్రస్థాయిలో మంత్రులు, సీఎం వరకు వినతులు అందజేస్తామని చెప్పారు. అప్పటికీ మాఫీ చేయకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన చేపడతామని, అవసరమైతే రైతాంగ ఉద్యమానికి శ్రీకారం చుడతామని ప్రకటించారు.

ప్రభుత్వ ఆస్తులపై దాడులు దేనికి సంకేతం?

సిద్దిపేటలో హరీశ్‌రావు క్యాంపు కార్యాలయంపై దాడి ఘటనపై కేటీఆర్ స్పందిస్తూ.. ప్రభుత్వంలో ఉన్నవారే ప్రభుత్వ ఆస్తులపై దాడులు చేయించడం దేనికి సంకేతమని ప్రశ్నించారు. ఈ దాడికి పాల్పడిన వారిపై ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం బాధాకరమన్నారు. ముఖ్యమంత్రికి చెందిన ఓ మీడియా సంస్థ ఆలిండియా సర్వీస్‌లో ఉన్న అధికారుల వద్దకు వెళ్లి.. వారిపై దాడి చేసేలా వ్యవహరిస్తోందని, ఇది ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. కాగా, తమ ప్రభుత్వ హయాంలో లక్ష ఉద్యోగాల కల్పనతో ప్లాంటు నెలకొల్పేలా ఫాక్స్‌కాన్ కంపెనీ ఒప్పందం కుదుర్చుకుందని కేటీఆర్ తెలిపారు. అయితే ఇప్పుడు ఆ కంపెనీ 40 వేల ఉద్యోగాలతో బెంగళూరులో క్యాంపస్ ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించిందన్నారు. ఫాక్స్‌కాన్ పెట్టుబడులు, విస్తరణపై నిజానిజాలను ప్రభుత్వం బయటపెట్టాలని డిమాండ్ చేశారు. కాగా, ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణం చేస్తున్న మహిళల పట్ల అభ్యంతరకర వ్యాఖ్యలు చేశారంటూ రాష్ట్ర మహిళా కమిషన్ నోటీసులు జారీ చేసిన నేపథ్యంలో ఈ నెల 24న కమిషన్ ఎదుట హాజరవుతానని కేటీఆర్ చెప్పారు. రాష్ట్రంలో మహిళలపై జరుగుతున్న ఘటనల వివరాలను కమిషన్‌కు అందజేస్తానని తెలిపారు.

సిద్దిపేటలో బీఆర్ఎస్ వర్సెస్ కాంగ్రెస్

- హరీశ్ రాజీనామా చేయాలంటూ ఫ్లెక్సీలు
- వాటిని చింపివేసిన బీఆర్ఎస్ శ్రేణులు
- క్యాంపు కార్యాలయంలో కేసీఆర్, హరీశ్ ఫ్లెక్సీలను చింపివేసిన కాంగ్రెస్ శ్రేణులు
- ఇరువర్గాల ఆందోళనతో ఉద్రిక్తత

సిద్దిపేట టౌన్/హైదరాబాద్ సిటీ, ఆగస్టు 17: రుణమాఫీ అంశం.. కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్య ఘర్షణకు దారి తీసింది. సిద్దిపేట జిల్లా కేంద్రంలో శుక్రవారం రాత్రి నుంచి శనివారం మధ్యాహ్నం వరకు ఫ్లెక్సీల వార్ నడిచింది. దీంతో పట్టణంలో హైడ్రామా నెలకొంది. రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ అమలు చేసి చూపామని, హరీశ్‌రావు రాజీనామా ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయాలని శుక్రవారం అర్ధరాత్రి పట్టణంలోని పలు ప్రాంతాల్లో కాంగ్రెస్ నాయకులు ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. దీంతో బీఆర్ఎస్ నేతలు బీజేఆర్ చౌరస్తాకు వచ్చి ఆ ఫ్లెక్సీలను వెంటనే తొలగించాలని డిమాండ్ చేస్తూ ఆందోళనకు దిగారు. మరోపక్క కాంగ్రెస్ నేతలు హరీశ్‌రావు క్యాంపు కార్యాలయంలోనికి చొచ్చుకుని వెళ్లి కేసీఆర్, హరీశ్ ఫ్లెక్సీలను చింపివేశారు. విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ నాయకులు, విద్యార్థి.. యువజన విభాగం నాయకులు, హరీశ్ అభిమానులు శనివారం ఉదయం క్యాంపు కార్యాలయానికి భారీగా చేరుకున్నారు. అక్కడి నుంచి అంబేడ్కర్ చౌరస్తా వరకు ర్యాలీగా వెళ్లి రాస్తారోకో చేశారు. ఈ క్రమంలోనే కాంగ్రెస్ కార్యకర్తలు బీజేఆర్ చౌరస్తాకు చేరుకుని.. ఎమ్మెల్యే హరీశ్ క్యాంపు కార్యాలయంలో సీఎం రేవంత్‌రెడ్డి ఫ్లెక్సీ ఏర్పాటు చేస్తామంటూ కార్యాలయం వైపు వెళ్తుండగా పోలీసులు అడ్డుకుని, వారిని అరెస్టు చేశారు. కాంగ్రెస్ నాయకులు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీని బీఆర్ఎస్ నాయకులు చింపివేయగా, పోలీసులు వారిని అదుపులోకి తీసుకున్నారు. ఈ క్రమంలో పోలీసులకు, బీఆర్ఎస్ నాయకులకు మధ్య తోపులాట జరిగింది. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో పోలీసులు స్వల్ప లాఠీచార్జి చేసి బీఆర్ఎస్ నాయకులను చెదరగొట్టారు. ఆయా ఘటనలపై ఇరువర్గాలు పరస్పరం పోలీసులకు ఫిర్యాదులు చేశాయి. దీంతో రెండు వర్గాలపై కేసులు నమోదు చేసినట్లు ఏసీపీ మధు తెలిపారు. మరోవైపు.. ఎమ్మెల్యే హరీశ్‌రావు శనివారం సాయంత్రం సిద్దిపేటకు వచ్చారు. ఈ సందర్భంగా పార్టీ కార్యకర్తలు వచ్చారు. వారిని ఉద్దేశించి హరీశ్ మాట్లాడుతూ.. 'మీరు చూపిస్తున్న ప్రేమాభిమానాలు ఎనలేనివని, ఏమిచ్చినా మీ రుణం తీర్చుకోలేనని' అన్నారు. తానెప్పుడూ దాడులను ప్రోత్సహించలేదని, పదేళ్ల మంత్రిగా ప్రజలకు సేవ చేశానని చెప్పారు.



హైదరాబాద్‌లో సీఎం రేవంత్ రెడ్డికి వ్యతిరేకంగా బీఆర్ఎస్ అభిమానులు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు

హైదరాబాద్‌లోనూ ఫ్లెక్సీల వార్

హరీశ్‌రావు ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయాలంటూ మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు అభిమానులు శుక్రవారం హైదరాబాద్‌లోని వివిధ ప్రాంతాల్లో ఫ్లెక్సీలు, హోర్డింగ్‌లను ఏర్పాటు చేశారు. దీనికి కౌంటర్‌గా శనివారం బీఆర్ఎస్ అభిమానుల పేరుతో నగరంలోని వివిధ ప్రాంతాల్లో బస్టాప్‌ల వద్ద బ్యానర్లు కట్టారు. రుణమాఫీ మాట తప్పి మోసం.. రైతాంగం పాలిట కాంగ్రెస్ శాపం.. అంటూ బ్యానర్లు వెలిశాయి. కాగా, హరీశ్ క్యాంపు కార్యాలయంపై దాడి హేయమైన చర్య అని, ఇది కాంగ్రెస్ గూండాలు చేసిన పని అని ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి ఆరోపించారు.

ఆస్తి కోసం కన్న తండ్రినే కడతేర్చింది

- భర్తతో కలిసి కుమార్తె దారుణం
- రాడ్డుతో దాడిచేయడంతో తీవ్రంగా గాయపడిన తండ్రి
- చికిత్స పొందుతూ ఆయన మృతి

కృష్ణకాలనీ (భూపాలపల్లి), ఆగస్టు 17: ఆస్తి కోసం ఓ కుమార్తె తండ్రినే పొట్టన పెట్టుకుంది. భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని కారల్‌మార్క్స్ కాలనీలో ఈ ఘటన చోటుచేసుకుంది. పోలీసులు, స్థానికుల వివరాల ప్రకారం... కాటారం మండలం గంగారం గ్రామానికి చెందిన బొమ్మన లచ్చిరెడ్డి(79) భూపాలపల్లిలోని కారల్‌మార్క్స్‌కాలనీలో ఉంటున్నాడు. సింగరేణి కార్మికుడిగా పనిచేసి రిటైరైన ఆయనకు ఇద్దరు కుమార్తెలు. పెద్ద కుమార్తె రాజేశ్వరి, అల్లుడు జగన్మోహన్‌రెడ్డి భూపాలపల్లి గాంధీనగర్‌లో, చిన్న కుమార్తె మల్లేశ్వరి, అల్లుడు లక్ష్మారెడ్డి కుందూరుపల్లిలో ఉంటున్నారు. లచ్చిరెడ్డికి ఉన్న ఆస్తి విషయంలో ఆయనకు, ఇద్దరు కూతుళ్ల మధ్య తరచూ గొడవలు జరిగేవి. పెద్ద కుమార్తెకే తన ఆస్తినంతా రాసిస్తానని లచ్చిరెడ్డి అనేవాడు. దీంతో మల్లేశ్వరి తండ్రిపై కోపం పెంచుకుంది. తండ్రి అనుకున్న పనిచేస్తే తనకేమీ మిగలదని భావించి ఎలాగైనా ఆయన్ను కడతేర్చాలనుకుంది. ఇందుకోసం తమకు పరిచయస్తులైన కాటారం మండలం బూడిదిపల్లికి చెందిన శనిగరం ముత్తయ్య, కాల్వల మహేష్, శనిగరం పులిరాజు, లింగాల శ్రీకృష్ణ సహాయం తీసుకుంది. పథకం ప్రకారం ఈ నెల 12న ఆ నలుగురు భూపాలపల్లికి చేరుకున్నారు. లచ్చిరెడ్డిని కారులో బాంబులగడ్డకు తీసుకెళ్లారు. అక్కడ మద్యం తాగించి, ఆ మత్తులోనే మల్లేశ్వరి ఉండే కుందూరుపల్లికి తీసుకెళ్లారు. అక్కడికి చేరే సరికి తేరుకున్న లచ్చిరెడ్డి కూతురి ఇంట్లోకి వెళ్లేందుకు ససేమిరా అన్నాడు. అయితే మల్లేశ్వరి తన భర్తతో కలిసి తండ్రిని బలవంతంగా వారి ఇంటి మేడపైకి తీసుకెళ్లింది. ఇద్దరూ కలిసి లక్ష్మారెడ్డిపై రాడ్డుతో దాడి చేశారు. తీవ్రంగా గాయపడిన ఆయన్ను ఎవరికీ అనుమానం రాకుండా భూపాలపల్లి వంద పడకల ఆస్పత్రికి తీసుకెళ్లారు. మెట్ల పైనుంచి జారి పడటంతో గాయపడినట్టు వైద్యులకు చెప్పారు. అనుమానించిన వైద్యులు పోలీసులకు సమాచారం ఇవ్వగా అక్కడికి వచ్చిన పోలీసులకు లచ్చిరెడ్డి జరిగిందంతా చెప్పాడు. లచ్చిరెడ్డి చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. దీంతో మృతుడి చిన్న కుమార్తె మల్లేశ్వరి, ఆమె భర్త లక్ష్మారెడ్డితోపాటు వారికి సహకరించిన ముత్తయ్య, మహేష్, పులి రాజు, కృష్ణను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్టు సీఐ నరేష్‌కుమార్ తెలిపారు.

పోలవరం ఫైళ్లకు నిప్పు!

- 'మరో మదనపల్లి' దహనం?
- ధవళేశ్వరం భూసేకరణ కార్యాలయంలో కీలక ఫైళ్లు బుగ్గి
- వాటిలో భూసేకరణ,ఆర్‌అండ్ఆర్ చెల్లింపు వివరాలు
- ఎడమ కాలువ కింద నాడు భూసేకరణలో భారీ స్కామ్
- రూ.19 కోట్లు కాజేసిన అప్పటి స్పెషల్ కలెక్టరు
- నకిలీ రైతుల పేరిట దందా.. కోర్టుల్లో కేసులు
- ఆ దందా బయటకు రాకూడదనే నిప్పు పెట్టారా?

రాజమహేంద్రవరం, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి) : పోలవరం ప్రాజెక్టు ఫైళ్లు శుక్రవారం రాత్రి తగలబడిపోయాయి. కొత్త బీరువాలు కొని పాతవన్నీ క్లీన్ చేస్తూ వేస్ట్ పేపర్లను దహనం చేసినట్టు అధికారులు చెబుతున్నా, ఇది మరో మదనపల్లి ఘటనా? అనే అనుమానాలు పొగలా కమ్ముకుంటున్నాయి. తమ భూదందాలు బయటకు వస్తాయని వైసీపీ నేతలు మదనపల్లి ఆర్డీవో కార్యాలయంలోని ఫైళ్లు తగలబెట్టిన విషయం తెలిసిందే. పోలవరం ప్రధాన ఎడమ కాలువ పనుల కోసం చేపట్టిన భూసేకరణ చెల్లింపుల్లో భారీ స్కామ్ జరిగినట్టు ఆరోపణలు ఉన్నాయి. మొత్తం రూ. 19 కోట్లు దాకా మింగేశారని చెబుతున్నారు. ఇప్పుడు తగలబడింది సరిగ్గా ఆ ప్రధాన ఎడమ కాలువ భూసేకరణ కార్యాలయంలోని ఫైళ్లే! ఇంకా.. రైతులు, లబ్ధిదారుల ఆధార్ కార్డులు, కాకినాడ కలెక్టరేట్ నుంచి ఇక్కడకు వచ్చిన లెటర్లు, పోలవరం ఎడమ ప్రధాన కాలువకు సబంధించిన అవార్డు పత్రాలు, ఫొటోలు కూడా దహనమైన వాటిలో శనివారం మధ్యాహ్నం 2.30గంటల సమయంలో సమాచారం తెలిసి విలేకరులు అక్కడకు చేరేలోపే... సగం కాలిన ఫైళ్లను, పత్రాలను అక్కడి అధికారులు లోపలకు తీసుకుని వెళ్లి దాచేశారు. దీంతో ఈ ఘటనపై మరిన్ని అనుమానాలు ముసురుకున్నాయి. ఆ తర్వాతి పరిణామాలు కూడా సందేహాలను మరింత పెంచేలా ఉన్నాయి. ఫైళ్లను బయట పడేసినట్టు చెబుతున్న శ్రావణి అనే స్వీపరు..ఆకస్మికంగా విశాఖపట్నం వెళ్లారని చెప్పడం అనుమానాలకు తావిస్తోంది.

భూముల రక్షణకు జియో రెఫరెన్సింగ్ మ్యాపింగ్

» రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ చిన్నారెడ్డి

రాష్ట్ర ప్రభుత్వ భూముల పరిరక్షణకు 'జియో రెఫరెన్సింగ్ మ్యాపింగ్' విధానాన్ని తీసుకురానున్నట్లు రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ జి.చిన్నారెడ్డి తెలిపారు. ప్రభుత్వ శాఖల భూములు, ఇతర స్థిరాస్తులు ఆక్రమణల పాలవుతున్నాయని, వీటి పరిరక్షణకు అక్షాంశాలు, రేఖాంశాల ఆధారంగా మ్యాపింగ్ చేసే జియో రెఫరెన్సింగ్ మ్యాపింగ్ విధానాన్ని అమలు చేయాలని నిర్ణయించామన్నారు. ఇప్పటికే పైలట్ ప్రాజెక్టు కింద పోలీసు శాఖ, ఆర్టీసీ భూములకు ఈ విధానాన్ని అమలు చేస్తున్నామని తెలిపారు.

రుణ మాఫీపై చర్చకు సిద్ధమేనా?: ఏలేటి

హైదరాబాద్, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో వంద శాతం రైతులకు రుణమాఫీ జరిగిందని కాంగ్రెస్ నిరూపిస్తుందా? చర్చకు సిద్ధమేనా? అని బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి సవాల్ చేశారు. వందశాతం రుణమాఫీ జరిగినట్లు నిరూపిస్తే రాజకీయాల నుంచి తప్పుకొంటానని ప్రకటించారు. రుణమాఫీ పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను మోసం చేసిందని దుయ్యబట్టారు. రుణమాఫీ కాని రైతుల నుంచి దరఖాస్తులు కోరడం కూడా మోసంలో భాగమేనని ఆయన ధ్వజమెత్తారు.

వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్‌దే అధికారం: కేటీఆర్

కాంగ్రెస్ ఎనిమిది నెలల పాలనపై ప్రజల్లో తీవ్ర అసంతృప్తి ఉందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లా పార్టీ నాయకులు, శ్రేణులు, కార్యకర్తలతో కేటీఆర్ మాట్లాడుతూ పార్టీ శ్రేణులు నిత్యం ప్రజలతోనే ఉండాలని సూచించారు. బీఆర్ఎస్ శ్రేణులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్ అధికారంలోకి రావటం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ఈ నాలుగేళ్ల కాలంలో పార్టీని బలోపేతం చేసుకుందామని చెప్పారు. కాగా, డిసెంబరు 9లోపు రుణాలు తీసుకున్న రైతులందరికీ రుణమాఫీ చేస్తామని చెప్పి గద్దెనెక్కిన కాంగ్రెస్ ప్రభుత్వం రైతాంగాన్ని నట్టేట ముంచిందని ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ ఆరోపించారు. శనివారం గండిమైసమ్మ చౌరస్తాలోని హైదరాబాద్ జిల్లా కో-ఆపరేటివ్ సెంట్రల్ బ్యాంక్ లిమిటెడ్ బ్యాంక్ ముందు రుణమాఫీపై ప్రభుత్వ విధానాలను నిరసిస్తూ రైతులు నిరసన చేపట్టారు. వారికి మద్దతుగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఈ బ్యాంక్‌లో 632 మంది రైతులు రుణం పొందగా కేవలం 14మంది రైతులకు రూ.4.30 లక్షల రుణమాఫీ అయిందన్నారు. మిగతా 618మంది రైతులకు రూ.2.95 కోట్ల రుణాలను మాఫీ చేయాలని డిమాండ్ చేశారు.

ఆర్థిక ఇబ్బందులతో రైతు ఆత్మహత్య

తొగుట, ఆగస్టు 17: అప్పుల బాధతో పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన రైతు చికిత్స పొందుతూ శుక్రవారం మృతిచెందాడు. సిద్దిపేట జిల్లా తొగుట మండలం లింగాపూర్ గ్రామానికి చెందిన అక్కరాజు ముత్తయ్య(55) తనకున్న 11 గుంటల భూమితో పాటు.. మరో ఎకరం భూమిని కౌలుకు తీసుకుని వ్యవసాయం చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. అయితే తన పొలంలో బోరు మోటార్ చెడిపోవడంతో ఈ నెల 7న మెకానిక్‌ల సహాయంతో బయటకు తీయడానికి ప్రయత్నిస్తుండగా ప్రమాదవశాత్తు మోటార్ జారి బోరుబావి లోపల పడిపోయింది. మోటార్ బయటకు తీయడానికి డబ్బులు ఎక్కువ అవుతాయని, కూతురు వివాహం కోసం అప్పటికే రూ.5 లక్షల వరకు అప్పు చేసిన ముత్త య్య... మళ్లీ అప్పు ఎక్కడ తీసుకోవాలో తెలియక అదేరోజు సాయంత్రం ఇంట్లో ఎవరూ లేని సమయంలో గడ్డి మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. కుటుంబీకులు, వెంటనే హైదరాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ముత్తయ్య మృతిచెందాడు.

కాంగ్రెస్ లీగల్ సెల్ చైర్మన్‌గా అభిషేక్ సింఘ్వీ

న్యూఢిల్లీ, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ లీగల్ సెల్ చైర్మన్‌గా అభిషేక్ మను సింఘ్వీని ఆ పార్టీ అధ్యక్షుడు ఖర్గే నియమించారు. ఈ మేరకు శనివారం ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ ఒక ప్రకటన విడుదల చేశారు. తెలంగాణలో ఇటీవల ఖాళీ అయిన రాజ్యసభ స్థానానికి తమ పార్టీ అభ్యర్థిగా అభిషేక్ సింఘ్వీని కాంగ్రెస్ ప్రకటించిన సంగతి తెలిసిందే. మహారాష్ట్ర అసెంబ్లీకి త్వరలో ఎన్నికలు జరుగనున్న దృష్ట్యా అక్కడ ఆ పార్టీ వార్‌రూం చైర్మన్‌గా చల్లా వంశీచంద్‌రెడ్డిని నియమించారు.

ఆన్‌లైన్ ట్రేడింగ్ పేరిట రూ.5.4 కోట్ల మోసం

» బాధితుడి ఫిర్యాదుతో ఇద్దరిని అరెస్టు చేసిన సీఎస్‌బీ

హైదరాబాద్, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): ఆన్‌లైన్ ట్రేడింగ్‌లో పెట్టుబడులు పెడితే మంచి లాభాలు వస్తాయని నమ్మించిన సైబర్ నేరగాళ్లు ఏకంగా రూ.5.4 కోట్లు కొట్టేశారు. హైదరాబాద్ చిక్కడపల్లిలో నివసించే వ్యక్తి ట్రేడింగ్ నిర్వహిస్తుంటాడు. అయితే జూన్ 8న తన వాట్సా‌ప్‌కు వచ్చిన ఆన్‌లైన్ పెట్టుబడుల లింక్ ఓపెన్ చేసి గ్రూపులో చేరాడు. 'బీ6/స్టాక్ విజనరీస్' పేరుతో ఉన్న గ్రూప్‌లో లైదియ శర్మ అనే మహిళ గోల్డ్‌మెన్ స్కీం గురించి అతడికి వివరించింది. పెట్టుబడులు పెట్టి లాభాలు ఆర్జించాలంటే రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించింది. పాన్‌కార్డు, ఆధార్ కార్డుతోపాటు ఇతర వివరాలతో ఆమె చెప్పిన వెబ్‌సైట్‌లో లాగిన్ అయ్యి ట్రేడింగ్ మొదలుపెట్టాడు. జూలై 10న మొదటగా రూ.30 వేలు పెట్టుబడి పెట్టగా మంచి లాభాలు వచ్చాయి. అయితే కేరళలో తాను నిర్వహిస్తున్న స్వచ్ఛంద సంస్థకు రూ. 8.5 కోట్లు అప్పు ఉందని అతడు చెప్పడంతో.. లైదియా ట్రేడింగ్‌తో మంచి లాభాలు వస్తాయని, అప్పు సులువుగా తీర్చవచ్చని నమ్మించింది. దీంతో అతడు నెల రోజుల్లో పలు దఫాలుగా రూ. 5.4 కోట్లు పెట్టుబడిగా పెట్టాడు. వెబ్‌సైట్‌లో బాధితుడికి రూ.15.58 కోట్లు లాభం వచ్చినట్లు చూపిస్తున్నా.. విత్‌డ్రా చేసుకునేందుకు ప్రయత్నించగా ఫలితం లేకుండా పోయింది. దీంతో వారిని సంప్రదించగా.. విత్‌డ్రా చేసుకోవాలంటే మరికొంత చెల్లించాలని డిమాండ్ చేశారు. మోసపోయానని గుర్తించిన అతడు.. సైబర్ క్రైం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు దర్యాప్తు చేపట్టిన పోలీసులు.. ఏపీలోని విజయవాడలో రాంపల్లి కొండల్ రావు, అతని సోదరుడు చంద్రశేఖర్ ఆజాద్‌ను అరెస్ట్ చేశారు.

మంత్రి సీతక్కపై అనుచిత వ్యాఖ్యలు!

» బీఆర్ఎస్ సోషల్ మీడియా కార్యకర్తలపై చర్యలు తీసుకోండి

» పటాన్‌చెరు డీఎస్పీకి కాంగ్రెస్ నేత ఫిర్యాదు

పటాన్‌చెరు, ఆగస్టు 17: మంత్రి సీతక్క, రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ నేరెళ్ల శారదపై బీఆర్ఎస్ సోషల్ మీడియా కార్యకర్తలు సామాజిక మాధ్యమాల్లో చేస్తున్న అనుచిత వ్యాఖ్యలపై పోలీసులు కఠిన చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ నేత, ఐఎన్‌టీయూసీ మెదక్ జిల్లా అధ్యక్షుడు నర్సింహారెడ్డి శనివారం పటాన్‌చెరు డీఎస్పీకి ఫిర్యాదు చేశారు. ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణిస్తున్న మహిళలపై అనుచిత వ్యాఖ్యలు చేసిన బీఆర్ఎస్ నేత కేటీఆర్.. మహిళలకు బహిరంగ క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు.

రైతుల పేరుతో రుణాలు స్వాహా

» రెబ్బెన పీఏసీఎస్‌లో అక్రమాలు వెలుగులోకి

రెబ్బెన, ఆగస్టు 17: రైతుల పేరు మీద పీఏసీఎస్ సిబ్బంది రుణాలు కాజేసిన వ్యవహారం ఆసిఫాబాద్ జిల్లా రెబ్బెన మండలంలో వెలుగు చూసింది. మరణించిన వారి వివరాలతోనూ లోన్లు తీసుకున్నట్టు తేలింది. గత కొన్నేళ్లుగా జరుగుతున్న ఈ వ్యవహారం తాజాగా బహిర్గతమైంది. బాధిత రైతులు తెలిపిన వివరాల ప్రకారం.. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, గ్రామీణ బ్యాంకు, యూనియన్ బ్యాంకుల్లో మాత్రమే పలువురు లోన్లు తీసుకున్నారు. వారి పేర్ల మీద సహకార సంఘంలో కూడా లోన్లు ఉన్నట్లు తెలియడంతో ఆందోళనకు గురయ్యారు. దీంతో శనివారం రైతులంతా సహకార సంఘం కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. విషయం తెలుసుకున్న జిల్లా సహకారం సంఘం అధికారి రబ్బానీ అక్కడికి వచ్చి విచారణ ప్రారంభించారు. ఈ సందర్భంగా పలు విషయాలు ఆయన దృష్టికి వచ్చినప్పటికీ.. వాటిని దాట వేసే ప్రయత్నం చేయడంతో రైతులు ఆగ్రహించి అంతర్రాష్ట్ర రహదారిపై రాస్తారోకో చేశారు. తహసీల్దార్, పోలీసులు వచ్చి రైతులతో మాట్లాడారు. విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేస్తామని చెప్పి రాస్తారోకోను విరమింపజేశారు.

యూఎస్ హెచ్1బీ వీసాలకు రెండో దఫా లాటరీ

వాషింగ్టన్, ఆగస్టు 17: ఆర్థిక సంవత్సరం 2025కుగాను హెచ్1బీ వీసాల కోసం 2వ దఫా లాటరీని తీయనున్నట్లు అమెరికా ప్రకటించింది. మొదటి లాటరీని ఈ ఏడాది మార్చిలో నిర్వహించారు. 2025ఆర్థిక సంవత్సరానికి కేటాయించిన వీసాల సంఖ్యను పూర్తి చేసేందుకు రెండవ దఫా లాటరీ తీయనున్నట్లు యూఎస్ సిటిజన్‌షిప్ అండ్ ఇమిగ్రేషన్ సర్వీసెస్ (యూఎస్‌సీఐఎస్) ప్రకటించింది.

బాలికను చిదిమేసిన లారీ!





కంటైనర్ లారీ ఢీకొట్టడంతో బస్సు కింది భాగంలోకి చొచ్చుకుపోయిన ఆటో; సాత్విక (ఫైల్)

» సిగ్నల్ వద్ద ఆగిన ఆటోను ఢీకొట్టిన లారీ

» తీవ్రగాయాలతో విద్యార్థిని దుర్మరణం

» చావుబతుకుల్లో ఆటో డ్రైవర్

» హబ్సిగూడ వద్ద ఘోర ప్రమాదం

తార్నాక, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): కంటెయినర్ లారీ డ్రైవర్ నిర్లక్ష్యం పదో తరగతి చదువుతున్న విద్యార్థిని నిండు ప్రాణాలను బలిగొంది. బాలికను బడి వద్ద దిగబెట్టేందుకు వెళుతూ రెడ్ సిగ్నల్ పడటంతో ఆగిన ఆటోను.. వెనుక నుంచి వేగంగా దూసుకొచ్చిన కంటెయినర్ లారీ ఢీకొట్టింది. ఆ వేగానికి ఆటో.. ముందు ఆగివున్న బస్సు కిందికి చొచ్చుకెళ్లింది. ఈ ప్రమాదంలో ఆటో పూర్తిగా నుజ్జునుజ్జయింది. ఆటోలో ఉన్న రంగ సాత్విక (16) అనే బాలిక తీవ్ర గాయాలతో మృతిచెందింది. ఆటో డ్రైవర్ ఎల్లయ్య (50) పరిస్థితి విషమంగా ఉంది. కుమార్తె మృతిచెందడంతో ఆ తల్లిదండ్రులు కంటికీమంటికి ధారగా రోదిస్తున్నారు. విద్యార్థులను ప్రైవేటు వాహనాల్లో బడికి పంపుతున్న తల్లిదండ్రులను తీవ్ర ఆందోళనలోకి నెట్టిన ఈ ఘటన హబ్సిగూడ చౌరస్తాలో జరిగింది. ఓయూ ఏసీపీ జగన్ వెల్లడించిన వివరాల ప్రకారం.. చంగిచర్లకు చెందిన రంగ గోవింద్ గౌడ్ సౌత్ సెంట్రల్ రైల్వేలో ఉద్యోగి., భార్య లత, కూతురు సాత్విక, ఇద్దరు కుమారులతో కలిసి తార్నాకలోని కీర్తి కాలనీలో ఉంటున్నారు. సాత్విక హబ్సిగూడలోని ఓ ప్రైవేటు స్కూల్లో పదో తరగతి చదువుతోంది. రోజూ ఆమెను తార్నాక నుంచి హబ్సిగూడలోని బడి వద్ద దిగబెట్టేందుకు తల్లిదండ్రులు, ఎల్లయ్య (50) అనే ఆటోవాలాను మాట్లాడుకున్నారు. రోజు మాదిరిగానే శనివారం ఉదయం 7:30కు ఇంటి నుంచి సాత్విక ఆటో ఎక్కి బడికి బయలుదేరింది. కొద్ది నిమిషాల్లో ఆటో బడి వద్దకు చేరుకునేదే! అయితే హబ్సిగూడ చౌరస్తా వద్ద రెడ్ సిగ్నల్ పడటంతో ఆటోను ఎల్లయ్య ఆపాడు. గ్రీన్ సిగ్నల్ పడటం కోసం ఎదురుచూస్తుండగా ఆటోను వెనుక నుంచి మితిమీరిన వేగంతో దూసుకొచ్చిన కంటెయిన్ లారీ ఢీకొట్టింది. ఈ తీవ్రతకు ఆటో.. ముందు ఆగివున్న బస్సు కిందికి చొచ్చుకెళ్లింది. ఈ ఘటనలో ఆటో డ్రైవర్ ఎల్లయ్య, లోపల కూర్చున్న సాత్విక తీవ్రంగా గాయపడ్డారు. ఓయూ పోలీసులు ఘటనా స్థలికి చేరుకొని.. క్రేన్ సాయంతో ఆటోను బయటకు తీశారు. సాత్విక, ఎల్లయ్యను దగ్గర్లోని ఆస్పత్రికి తరలించారు. చికిత్స మొదలు పెట్టిన కొద్దిసేపటికే సాత్విక మృతిచెందింది. ఎల్లయ్య పరిస్థితి విషమంగా ఉండటంతో ఆయన కుటుంబసభ్యులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. ప్రమాదానికి కారణమైన కంటెయినర్ లారీ డ్రైవర్‌ను సూరజ్ సింగ్ (32)గా గుర్తించినట్లు తెలిసింది. అతడిని అరెస్టు చేశారు. లారీని స్టేషన్‌కు తరలించారు. పోస్టుమార్టం అనంతరం బాలిక మృతదేహాన్ని తల్లిదండ్రులకు అప్పగించారు.

తుంగభద్రలో 'స్టాప్‌లాగ్' సక్సెస్!

విజయవంతంగా ఐదు ఎలిమెంట్ల అమరిక.. డ్యామ్ వద్ద పండగ వాతావరణం

» క్రస్ట్ గేట్లు దించేసిన అధికారులు

» 72 టీఎంసీలు దాటిన నీటి నిల్వలు

(రాయదుర్గం/బళ్లారి/కర్నూలు - ఆంధ్రజ్యోతి)

'తుంగభద్ర'కు నీటి భరోసా దక్కింది. 'ఆపరేషన్ స్టాప్‌లాగ్' వందశాతం విజయవంతమైంది. కరువు సీమ రైతుల ఖరీఫ్ ఆశ సజీవంగా నిలిచింది. హోస్పేటలోని తుంగభద్ర జలాశయంలో కొట్టుకుపోయిన 19వ గేటు స్థానంలో.. స్టాప్‌లాగ్ ఏర్పాటు ప్రక్రియ శనివారం విజయవంతంగా పూర్తయింది. క్రస్ట్‌గేట్ నిపుణుడు కన్నయ్యనాయుడు నేతృత్వంలో ఇంజనీర్లు, కార్మికులు మూడు రోజులపాటు పడిన శ్రమ ఫలించింది. శుక్రవారం రాత్రి అత్యంత ఉత్కంఠ నడుమ.. స్టాప్‌లాగ్ తొలి ఎలిమెంట్‌ను డ్యామ్ స్పిల్‌వే బెడ్ మీద కూర్చోబెట్టిన సంగతి తెలిసిందే. శనివారం ఉదయం నుంచి మిగిలిన ఎలిమెంట్‌లను అమర్చే ప్రక్రియ మొదలుపెట్టారు. తొలి బ్లాక్ అమరికలో ఎదురైన అవాంతరాలను దృష్టిలో ఉంచుకుని రెండో ఎలిమెంట్ విషయంలో మరిన్ని జాగ్రత్తలు తీసుకున్నారు. నీళ్లలో 1617 అడుగుల వరకు ఉన్న ఫస్ట్ ఎలిమెంట్‌పై రెండో ఎలిమెంట్‌ను జాగ్రత్తగా కూర్చోబెట్టారు. దీని ప్రయాణం ఏడు అడుగులు నీళ్లలో సాగింది. ఈ మొత్తం ప్రక్రియకు మూడు గంటల సమయం పట్టింది. మధ్యాహ్నం 12 గంటలకు 3వ ఎలిమెంట్‌ను 19వ క్రస్ట్‌గేట్ వద్దకు తరలించి, నీటిలో దించడం ప్రారంభించారు. అప్పటికి నీటి ప్రవాహ ఒత్తిడి తగ్గిపోవడంతో దీనిని కొంత సులువుగానే అమర్చారు. సాయంత్రం మూడు గంటల సమయానికి మూడో ఎలిమెంట్ అమరిక పూర్తయింది. దీంతో క్రస్ట్‌గేట్ వద్ద నీటి నిల్వ సామర్థ్యం 1625 అడుగులకు పెరిగింది. నీటి నిల్వలు అంతకంటే దిగువనే ఉండటంతో 19వ క్రస్ట్ గేట్ గ్యాప్ నుంచి దిగువకు నీటి ప్రవాహం ఆగిపోయింది. మధ్యాహ్న భోజన విరామం తర్వాత నాలుగు, ఐదు ఎలిమెంట్లను రెండు గంటల వ్యవధిలో అమర్చారు. నాలుగో ఎలిమెంట్ అమర్చగానే డ్యాం నీటి నిల్వ సామర్థ్యం 1629 అడుగులకు చేరింది. ఆ వెంటనే 32 క్రస్ట్‌గేట్లను దించేసి.. నదిలోకి వెళుతున్న 65 వేల క్యూసెక్కుల ప్రవాహాన్ని నిలిపివేశారు. 5 స్టాప్‌లాగ్ ఎలిమెంట్ అమరిక ప్రక్రియ శనివారం సాయంత్రం 6.30 గంటలకు పూర్తయ్యింది. స్టాప్‌లాగ్ ఎలిమెంట్‌లను అమర్చేందుకు తొలగించిన కౌంటర్ వెయిట్, హాయిస్ట్ ప్లాట్‌ఫాంను ఆదివారం ఉదయం యథాస్థానానికి చేరుస్తామని అధికారులు తెలిపారు. స్టాప్‌లాగ్‌ను ఐదు భాగాలుగా అమర్చడంతో.. జాయింట్‌ల వద్ద 50 క్యూసెక్కుల నీరు లీక్ అవుతోంది. దీనిని కూడా ఆదివారం పూర్తిగా కట్టడి చేసి, లీకేజీ లేకుండా చేస్తామని తెలిపారు. కాగా, తుంగభద్ర జలాశయంలోకి శనివారం రాత్రికి ఎగువ నుంచి 84వేల క్యూసెక్కులు వచ్చి చేరుతోంది. డ్యామ్‌లో నీటి నిల్వ 72 టీఎంసీలు దాటాయి. దీంతో వారం రోజుల్లో జలాశయం నీటి నిల్వలు 105.78 టీఎంసీలకు చేరుకునే అవకాశం ఉందని ఇంజనీరింగ్ అధికారులు అంచనావేశారు.



గేటు కొట్టుకుపోయిన చోట తుది ఎలిమెంట్‌ను అమర్చుతున్న ఇంజనీరింగ్ సిబ్బంది

సత్కరించిన టీబీ బోర్డు

నీటి పరిరక్షణ కోసం శ్రమించిన నిపుణులు కన్నయ్య నాయుడు, ఇంజనీరింగ్ అధికారులు, స్టాప్ లాగ్‌లను తయారు చేసిన జిందాల్, హిందూస్థాన్, నారాయణ ఇంజనీరింగ్ వర్క్ నిపుణులు, కార్మికులు, క్రేన్ ఆపరేటర్లు, డ్యాం వద్ద శ్రమించిన కార్మికులు.. మొత్తంగా ఈ ప్రక్రియలో పాల్గొన్న ప్రతి ఒక్కరినీ తుంగభద్ర బోర్డు అధికారులు సత్కరించారు. డ్యాం మొత్తం ఫ్లడ్ లైట్ల వెలుతురులో పండుగ వాతావరణం నెలకొంది. కొట్టుకుపోయిన గేటు స్థానంలో వరద ప్రవాహ ఒత్తిడిలోనే స్టాప్‌లాగ్ ఎలిమెంట్లను విజయవంతంగా అమర్చడంలో కీలకపాత్ర పోషించిన ఎన్.కన్నయ్య నాయుడు రియల్ హీరో అంటూ ఇంజనీర్లు పొగడ్తలతో ముంచెత్తారు. చిత్తూరు జిల్లాకు చెందిన కన్నయ్య నాయుడు గతంలో నాగార్జునసాగర్ ప్రాజెక్టులో క్రేన్ తయారీలో ప్రతిభ చూపారు. ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, తమిళనాడు, మహారాష్ట్ర, గుజరాత్, రాజస్థాన్ తదితర రాష్ట్రాల్లో 260 పైగా ప్రాజెక్టులకు క్రస్ట్ గేట్లను డిజైన్ చేసి అమర్చిన అనుభవం ఆయన సొంతం. 80 ఏళ్ల వయస్సులో మండుటెండను సైతం లెక్క చేయకుండా... స్టాప్‌లాగ్ ఎలిమెంట్లను అమర్చడంలో కీలక పాత్ర పోషించారు.

మార్గదర్శిపై విచారణ జరగాల్సిందే

» క్వాష్ పిటిషన్‌ను వ్యతిరేకించిన ఆర్బీఐ

» హైకోర్టులో కౌంటర్ దాఖలు

హైదరాబాద్, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): నిబంధనలకు వ్యతిరేకంగా డిపాజిట్లు సేకరించిన మార్గదర్శి ఫైనాన్షియర్స్‌పై విచారణ జరగాల్సిందేనని రిజర్వు బ్యాంకు(ఆర్బీఐ) హైకోర్టును కోరింది. మార్గదర్శి ఫైనాన్షియర్స్‌పై 2008లో నమోదైన కేసును కొట్టేయరాదని విజ్ఞప్తి చేసింది. అందువల్ల 2011లో మార్గదర్శి దాఖలు చేసిన క్వాష్ పిటిషన్‌ను కొట్టేయాలని నివేదించింది. మార్గదర్శి క్వాష్ పిటిషన్‌ను వ్యతిరేకిస్తూ ఇటీవల కౌంటర్ దాఖలు చేసింది. మార్గదర్శి చట్టవిరుద్ధంగా డిపాజిట్లు సేకరించిందని పేర్కొంటూ 2008లో అప్పటి ఉమ్మడి ఏపీ ప్రభుత్వం కేసు నమోదు చేసింది. ఈ కేసును కొట్టేయాలని మార్గదర్శి హైకోర్టులో క్వాష్ పిటిషన్ దాఖలు చేసింది. 2018లో ఉమ్మడి ఏపీ హైకోర్టు రెండుగా విడిపోవడానికి చివరిరోజు అయిన డిసెంబర్ 31 రోజున మార్గదర్శికి అనుకూలంగా హైకోర్టు తీర్పు ఇచ్చింది. మార్గదర్శికి వ్యతిరేకంగా ఎవరూ ఫిర్యాదు చేయకపోవడంతోపాటు డిపాజిట్లను పూర్తిగా తిరిగి ఇచ్చినందున కేసును కొట్టివేసింది. దీనిపై మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్‌కుమార్ సుప్రీంకోర్టులో అప్పీల్ దాఖలు చేశారు. ఆర్బీఐ సహా రెండు రాష్ట్ర ప్రభుత్వాలు, ఇతరుల వాదనలు తాజాగా వినాలని పేర్కొంటూ సుప్రీంకోర్టు ఈ కేసును మళ్లీ తెలంగాణ హైకోర్టుకు బదిలీ చేసింది. జస్టిస్ సుజోయ్‌పాల్, జస్టిస్ నామవరపు రాజేశ్వర్‌రావు ధర్మాసనం ఈ పిటిషన్‌పై విచారణ చేపడుతోంది. హైకోర్టు ఆదేశాల మేరకు ఆర్బీఐ కౌంటర్ దాఖలు చేసింది. పిటిషనర్ చర్య నిబంధనలకు విరుద్ధంగా ఉందని ప్రాథమికంగా నిర్ధారణకు వచ్చినప్పుడు క్వాష్ పిటిషన్‌ను అనుమతించే అవకాశం ఉండదని అనేక సుప్రీంకోర్టు, హైకోర్టు తీర్పుల ద్వారా స్పష్టమైందని తెలిపింది. అందువల్ల మార్గదర్శి దాఖలు చేసిన క్వాష్ పిటిషన్‌ను కొట్టేయాలని కోరింది. ఈ పిటిషన్ ఈనెల 20న మరోసారి విచారణకు రానుంది.

డెంగీతో తొమ్మిదేళ్ల బాలుడి మృతి

» డెంగీ లక్షణాలతో మరో మహిళ మృతి



గౌతమ్ గౌడ్ (ఫైల్)

శంకర్‌పల్లి, కోనరావుపేట, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి) : రంగారెడ్డి జిల్లాలో డెంగీతో తొమ్మిదేళ్ల బాలుడు మృతి చెందగా రాజన్న సిరిసిల్ల జిల్లాలో డెంగీ లక్షణాలతో మహిళ మృతి చెందింది. రంగారెడ్డి జిల్లా శంకర్‌పల్లి మండలం టంగటూరు గ్రామానికి చెందిన అబ్బగోని మహేష్‌గౌడ్, సంధ్యల కుమారుడు గౌతమ్ గౌడ్(9) శంకర్‌పల్లిలోని నారాయణ ఉన్నత పాఠశాలలో 4వ తరగతి చదువుతున్నాడు. ఐదు రోజుల క్రితం అతడికి జ్వరం రావడంతో తల్లిదండ్రులు శంకర్‌పల్లిలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చూపించగా డెంగీ వచ్చినట్లు వైద్యులు ధ్రువీకరించి చికిత్స అందించారు. అప్పటి నుంచి ఆరోగ్యం బాగానే ఉంది. శుక్రవారం సాయంత్రం మళ్లీ జ్వరం రావడంతో తల్లిదండ్రులు నగరంలోని నానక్‌రామ్‌గూడలో గల ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గం మధ్యలో మృతి చెందాడు. రాజన్నసిరిసిల్ల జిల్లా కోనరావుపేట మండలం మామిడిపల్లి గ్రామానికి చెందిన బడుగు ఇందిర(43) అనే మహిళ డెంగీ లక్షణాలతో శనివారం మృతి చెందారు. ఈమె వారం రోజులుగా జ్వరంతో బాధపడుతోంది. శుక్రవారం జ్వరం ఎక్కువ కావడంతో వేములవాడలోని ఆసుపత్రికి తరలించగా వైద్యులు పరీక్షించి రక్తహీనత ఉందని, రక్త కణాలు తగ్గాయని కరీంనగర్‌కు పంపించారు. అక్కడ ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స అందిస్తున్న సమయంలోనే శ్వాస ఆడక మృతి చెందింది.

ఆడవాళ్లపై జరుగుతున్న ఘోరాలపై మహిళా కమిషన్ స్పందించదేం?

» కేటీఆర్ వ్యాఖ్యలపై చర్యలు.. ఆశ్చర్యకరం

» మాజీ మంత్రులు సబిత, సత్యవతి రాథోడ్

హైదరాబాద్, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): పొరపాటున మాట్లాడిన మాటలపై కేటీఆర్ హుందాగా క్షమాపణ చెప్పినా... కొందరు కాంగ్రెస్ మహిళా నేతలు ఇంకా విమర్శలు చేస్తున్నారని మాజీ మంత్రులు సబితా ఇంద్రారెడ్డి, సత్యవతి రాథోడ్ అన్నారు. ఈ మేరకు తెలంగాణ భవన్‌లో ఎమ్మెల్సీ సురభి వాణీదేవితో కలిసి శనివారం మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో 8 నెలల్లో మహిళలపై 1800 అత్యాచారాలు జరిగాయని ఆరోపించారు. మహిళలపై ఇన్ని నేరాలు, ఘోరాలు జరుగుతున్నా స్పందించని మహిళా కమిషన్ కేటీఆర్ పొరపాటున మాట్లాడిన వ్యాఖ్యలపై అంత వేగంగా చర్యలు తీసుకోవడం ఆశ్చర్యంగా ఉందన్నారు. ఇద్దరు మహిళా మంత్రులు రాజకీయం కోసం మాట్లాడుతున్నారని విమర్శించారు. తమని అసెంబ్లీలో సీఎం, డిప్యూటీ సీఎం అనకూడని మాటలు అంటే మహిళా కమిషన్, మంత్రులు ఎక్కడికెళ్లారని ప్రశ్నించారు. హరీశ్‌రావు క్యాంపు కార్యాలయంపై కాంగ్రెస్ దాడులను ప్రజాస్వామ్యవాదులు ఖండించాలని, హరీశ్‌రావును రాజీనామా కోరే అర్హత సీఎంకు లేదని పేర్కొన్నారు.

రోడ్డెక్కి.. పురుగు మందు చేతపట్టి!

రుణమాఫీ కాలేదంటూ పలు జిల్లాల్లో రైతుల ఆందోళనలు

» పలుచోట్ల బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ధర్నాలు

» ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు..

» షరతుల్లేకుండా రుణమాఫీకి డిమాండ్

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్)

ప్రభుత్వం ప్రకటించిన రుణమాఫీ తమకు అందలేదని పలు జిల్లాల్లో రైతులు ఆందోళనలకు దిగారు. రోడ్లపై బైఠాయించి.. పురుగు మందు చేతపట్టి నిరసనలు చేపట్టారు. బ్యాంకులు, వ్యవసాయశాఖ, సహకార సంఘాల కార్యాలయాల ముందు ధర్నాలు నిర్వహించి అధికారులను నిలదీశారు. పలుచోట్ల సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మలు దహనం చేసి.. సర్కారుకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఎటువంటి షరతుల్లేకుండా రైతులందరికీ రుణమాఫీ చేయాలంటూ డిమాండ్ చేశారు. పలుచోట్ల బీఆర్ఎస్ నేతృత్వంలో ధర్నాలు చేశారు. శనివారం ఉమ్మడి కరీంనగర్, నిజామాబాద్, మెదక్ తదితర జిల్లాల్లో రైతుల ఆందోళనలు కొనసాగాయి. నిజామాబాద్ జిల్లాలో వేల్పూర్ క్రాస్ రోడ్డు వద్ద బాల్కొండ నియోజకవర్గం రైతులతో కలిసి మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి పెద్ద ఎత్తున రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎలాంటి షరతులు, కటింగ్ లేకుండా బేషరతుగా రైతులందరికీ రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. ఆ జిల్లాలోని ఆలూర్ మండల కేంద్రంలోని కెనరా బ్యాంకు ఎదుట రైతులు బైఠాయించి ధర్నా నిర్వహించారు. బ్యాంకులో సుమారు 2,500 మంది రైతులకు ఖాతాలుండగా, అధికారుల నిర్లక్ష్యం వల్ల కేవలం 500 మంది రైతులకే రుణమాఫీ జరిగిందని మండిపడ్డారు. కామారెడ్డి జిల్లా భిక్కనూర్ మండలం జంగంపల్లిలో రుణమాఫీ కాలేదని ఆవేదనతో రాజంపేట మండలం ఆరేపల్లి తండాకు చెందిన కేతావత్ రవి సెల్‌టవర్ ఎక్కి నిరసన వ్యక్తం చేశాడు. ఆదిలాబాద్ జిల్లా తలమడుగు, తాంసి, జైనథ్, బోథ్ మండలాల్లో రైతులు రోడ్డెక్కి నిరసనలు చేపట్టారు. తలమడుగు మండలంలో సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మతో రైతులు ఊరంతా ఊరేగింపు నిర్వహించారు. బోథ్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అనిల్‌జాదవ్ ధర్నాలో పాల్గొని మద్దతు తెలిపారు. జైనథ్ మండలం గిమ్మా బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్రను ముట్టడించిన రైతులు గిమ్మా ఎక్స్ రోడ్డు సమీపంలోని 44వ జాతీయ రహదారిపై ధర్నాకు దిగారు. పోలీసులు, వ్యవసాయ శాఖాధికారులు సర్దిచెప్పడంతో రైతులు ఆందోళనను విరమింపజేశారు. నిర్మల్ జిల్లాలోని మామడ మండలంలోని పొన్కల్‌లో బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర జోనల్ మేనేజర్ అభిషేక్, సిబ్బందిని రైతులు నిలదీశారు. అన్ని బ్యాంకుల్లో రుణమాఫీ జరుగుతుంటే.. బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్రలో ఎందుకు జరగలేదని ప్రశ్నించారు. కరీంనగర్ జిల్లా శంకరపట్నం మండలం మొలంగూరులో కరీంనగర్-వరంగల్ రహదారిపై రైతులు ధర్నా చేశారు. గంగాధర మండల కేంద్రంలో బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. జగిత్యాల జిల్లా మల్లాపూర్ మండల కేంద్రంలోని రైతు వేదికలో నిర్వహించిన సమావేశంలో రైతు ఏలేటి రాజారెడ్డి పురుగు మందు డబ్బాతో నిరసన వ్యక్తం చేశాడు. మెట్‌పల్లి మండలంలోని వేంపేటలో కెనరా బ్యాంకు ఎదుట రైతులు బైఠాయించారు. జన్నారం మండలం కవ్వాల గ్రామపంచాయతీ కార్యాలయం ఎదుట రైతు జక్కుల లచ్చన్న పురుగు మందు తాగేందుకు యత్నించగా తోటి రైతులు అడ్డుకున్నారు. రైతు రుణమాఫీ వివరాలు బహిర్గతం చేయాలంటూ సంగారెడ్డి జిల్లాలోని హత్నూర మండలంలో వ్యవసాయశాఖ కార్యాలయానికి రైతులు వెళ్లగా.. అక్కడి అధికారులు వివరాలు తెలుపకపోవడంతో ఆగ్రహించిన రైతులు ఆందోళన చేపట్టారు. సిద్దిపేట జిల్లా చిన్నకోడూరు మండలంలో రాజీవ్ రహదారిపై రైతులు బైఠాయించి ధర్నా చేశారు. 'అయ్యా రేవంత్‌రెడ్డి.. రూ.2లక్షల రుణమాఫీ అని చెప్పి, రేషన్‌కార్డులున్నవారికే చేశావు. రైతుబంధు వేయలేదు. రుణమాఫీ చేస్తావా.. పురుగుల మందు తాగి చనిపోవాలా?' అంటూ పురుగు మందు డబ్బాతో సిద్దిపేట జిల్లాలోని ఓ గ్రామానికి చెందిన యువరైతు సెల్ఫీ వీడియో విడుదల చేయగా.. సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.



జగిత్యాల జిల్లా వేంపేటలో రోడ్డుపై బైఠాయించిన రైతులు

కువైత్ నుంచే భర్త నిఘా!

» భార్యపై అనుమానంతో ఇంటిచుట్టూ సీసీ కెమెరాలు

» వేధింపులు తాళలేక ఇద్దరు పిల్లలతో కలిసి తల్లి ఆత్మహత్య

» గ్యాస్ సిలిండర్ పేల్చుకుని సజీవ దహనం

రాయచోటి టౌన్, ఆగస్టు 17: కువైత్ వెళ్లిన భర్త అక్కడి నుంచే నిఘా పెట్టి, వేధిస్తుండడాన్ని భరించలేని ఓ తల్లి తన ఇద్దరి పిల్లలతో కలిసి ఆత్మహత్యకు పాల్పడింది. ఈ విషాద ఘటన శనివారం ఉదయం అన్నమయ్య జిల్లా కేంద్రమైన రాయచోటి పట్టణంలో చోటు చేసుకుంది. రాయచోటి అర్బన్ సీఐ చంద్రశేఖర్ కథనం మేరకు.. లక్కిరెడ్డిపల్లె మండలం బి.యర్రగుడి హరిజనవాడకు చెందిన యర్రగుడి రాజా, రమాదేవి దంపతులకు కుమారుడు ప్రభువ మనోహ (8), కుమార్తె మన్విత (6) ఉన్నారు. వీరు ఐదేళ్లుగా రాయచోటి పట్టణంలో నివాసం ఉంటున్నారు. రాజా టైలరింగ్ చేసేవాడు. సంపాదన చాలకపోవడంతో భార్యభర్తలు కువైత్ వెళ్లారు. పిల్లలను రాజా తల్లిదండ్రులు చూసుకునేవారు. ఈ క్రమంలో రాజా తల్లి అనారోగ్యంపాలవడంతో వారు స్వగ్రామమైన బి.యర్రగుడి హరిజనవాడకు వెళ్లి అక్కడే ఉంటున్నారు. పిల్లలను చూసుకోవడానికి వారికి ఇబ్బందిగా ఉండడంతో భార్యాభర్తలు కువైత్ నుంచి ఇండియాకు వచ్చారు. రమాదేవి పిల్లలతో పాటు తిరిగి రాయచోటిలో ఉండగా రాజా సంవత్సరం క్రితం కువైత్ వెళ్లాడు. అయితే అతడు భార్యపై అనుమానం పెంచుకున్నాడు. ఈ నేపథ్యంలో కువైత్ వెళ్లడానికి ముందే ఇంట్లో, ఇంటి చుట్టూ సీసీ కెమెరాలు ఏర్పాటు చేశాడు. అతడు కువైత్ వెళ్లినప్పటి నుంచి ఆమెకు రోజూ ఫోన్ చేసి వేధించేవాడు. భర్త వేధింపులు ఎక్కువయ్యాయని రమాదేవి తరచూ తమ కుటుంబ సభ్యులకు చెప్పేది. ఈ క్రమంలో శుక్రవారం రాత్రి కూడా రాజా ఫోన్ చేసి రమాదేవితో గట్టిగా మాట్లాడాడు. ఇద్దరి మధ్యా వాగ్యుద్ధం నడిచిన విషయం సీసీ కెమెరాల్లో ఉందని సమాచారం. శనివారం ఉదయం 6 గంటల 5 నిమిషాలకు రమాదేవి తన అన్న గాలివీటి నారాయణకు ఫోన్ చేసి.. తన భర్త ఇంటిచుట్టూ సీసీ కెమెరాలు ఏర్పాటు చేశాడని, రోజూ ఫోన్ చేసి వేధిస్తున్నాడని, ఈ వేధింపులు భరించలేకుండా ఉన్నానని, మిమ్మల్ని వదిలి వెళుతున్నాను అంటూ వాయిస్ మేసెజ్ పంపింది. ఆయన వెంటనే తెలిసిన వారికి ఫోన్ చేసి తమ చెల్లెలి ఇంటికి వెళ్లి చూడమని చెప్పారు. ఆ లోగానే రమాదేవి కిచెన్‌లోంచి గ్యాస్ సిలిండర్ బెడ్‌రూంలోకి తీసుకొచ్చి.. గ్యాస్ లీక్ చేసి అగ్గిపుల్ల వెలిగించేసింది. సిలిండర్ పేలడంతో ఇద్దరు పిల్లలు నిద్రలోనే కన్నుమూశారు. రమాదేవి కూడా సంఘటన స్థలంలోనే చనిపోయారు. అగ్నిమాపకశాఖ శకటం వచ్చేసరికి తల్లీబిడ్డలు మంటల్లో సజీవ దహనమయ్యారు. విషయం తెలుసుకున్న మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి అక్కడకు చేరుకుని ఈ దుర్ఘటనపై ఆరాతీశారు. రాయచోటి డీఎస్పీ రామచంద్రరావు, అర్బన్ సీఐ చంద్రశేఖర్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

లిథియం నిల్వల వెలికితీతపై దృష్టి పెట్టాలి

» సింగరేణి ఇతర మైనింగ్ రంగాల్లోకీ అడుగుపెట్టాలి: భట్టి



హైదరాబాద్, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): భవిష్యత్తు అంతా ఎలక్ట్రిక్ వాహనాలదేనని, ఈ నేపథ్యంలో బ్యాటరీల కోసం వినియోగించే లిథియంతోపాటు ఇతర మూలకాల అన్వేషణ, వెలికితీతపై సింగరేణి దృష్టి సారించాలని ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క కోరారు. ఎంతో నిష్ణాతులైన సిబ్బంది, తిరుగులేని నైపుణ్యం ఉన్న సింగరేణి సంస్థ ఇతర మైనింగ్ రంగాల్లోకీ అడుగుపెట్టాలని ఆయన సూచించారు. శనివారం సచివాలయంలో సింగరేణి సంస్థ అభివృద్ధి, భవిష్యత్తు ప్రణాళికలపై ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. మనుగడను సాగిస్తూనే ఆస్తులను, సంపదను సృష్టించుకోవాలని సూచించారు. గ్రీన్ ఎనర్జీలో భాగంగా ఫ్లోటింగ్ సోలార్‌తోపాటు పంప్డ్ స్టోరేజీ పవర్ ప్లాంట్‌ల ఏర్పాటుకు సన్నాహకాలు చేస్తున్నామని, దీనికి సంబంధించి డీపీఆర్‌లను రూపొందించి త్వరలోనే ప్రభుత్వానికి సమర్పిస్తామని సింగరేణి సీఎండీ ఎన్.బలరామ్ తెలిపారు. ఒడిశాలోని నైనీ బ్లాకులో బొగ్గు ఉత్పత్తి ఎప్పటి నుంచి ప్రారంభిస్తారని భట్టి ఆరా తీయగా, త్వరలోనే చేపడతామని ఆయన చెప్పారు.

త్వరలోనే ప్రతి ప్రభుత్వ బడికి ఉచిత విద్యుత్

» శానిటేషన్ సిబ్బందికి ప్రతి నెల నిధులు: మంత్రి పొన్నం

హైదరాబాద్ సిటీ/కార్వాన్, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని సర్కారు బడుల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం ఎంతో కృషి చేస్తోందని, రూ. 1100 కోట్లతో 25 వేల పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పించామని మంత్రి పొన్నం ప్రభాకర్ చెప్పారు. కార్వాన్‌లోని కుల్సుంపూర ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలను శనివారం మంత్రి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా తరగతి గదులు, విద్యార్థుల హాజరుశాతాన్ని పరిశీలించి విద్యార్థులతో ముచ్చటించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ.. త్వరలో ప్రతి ప్రభుత్వం పాఠశాలకు ఉచిత విద్యుత్ ఇవ్వడంతో పాటు శానిటేషన్ సిబ్బంది, స్కావెంజర్ల కోసం ప్రతినెల నిధులు విడుదల చేస్తామని హామీ ఇచ్చారు. రాష్ట్ర వ్యాప్తంగా ఇటీవల 30వేల మంది టీచర్లకు పదోన్నతులు కల్పించామని గుర్తుచేశారు. ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకుని విద్యార్థులు పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించాలని సూచించారు.

స్కిల్ వర్సిటీలో దసరానుంచి 6 కోర్సులు

» తొలుత స్కూల్ ఆఫ్ ఈ-కామర్స్, లాజిస్టిక్స్ రిటైల్‌లో సర్టిఫికెట్ కోర్సులు: సీఎస్

హైదరాబాద్, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ఏర్పాటు చేసిన యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీలో దసరా పండుగ నుంచి కోర్సులను ప్రారంభిస్తామని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి తెలిపారు. స్కిల్ యూనివర్సిటీ ద్వారా అందించే కోర్సుల్లో ఇప్పటి వరకు 20 కోర్సులను గుర్తించడం జరిగిందన్నారు. వీటిలో ఆరు కోర్సులను దసరా పండుగ నుంచి ప్రాథమికంగా ప్రారంభించాలని నిర్ణయించినట్లు ఆమె వివరించారు. స్కిల్ యూనివర్సిటీ ప్రారంభం, విధివిధానాల ఖరారు, కోర్సుల ప్రారంభం తదితర అంశాలపై శనివారం సచివాలయంలో ఆమె ఉన్నత స్థాయి సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ముచ్చర్ల వద్ద స్కిల్ యూనివర్సిటీ పనులు పూర్తయ్యేవరకు తాత్కాలిక భవనంలో నిర్వహిస్తామని చెప్పారు. ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజీ ఆఫ్ ఇండియాలోగానీ, నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్(న్యాక్)లోగానీ లేదా నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టూరిజం అండ్ హాస్పిటాలిటీ మేనేజ్‌మెంట్(నిథమ్)లోగానీ నిర్వహిస్తామన్నారు. దాదాపు 140 కంపెనీలు యూనివర్సిటీలో భాగస్వాములుగా చేరడానికి ఆసక్తి చూపుతున్నాయని, తొలుత స్కూల్ ఆఫ్ ఈ-కామర్స్, లాజిస్టిక్స్ రిటైల్ విభాగంలో సర్టిఫికెట్ కోర్సులను ప్రారంభించనున్నామని చెప్పారు. వివిధ విభాగాల్లో శిక్షణ ఇచ్చేందుకు ఎస్‌బీఐ, ఎస్ఏపీ, డా.రెడ్డీస్ ల్యాబ్, అదానీ వంటి సంస్థలు అంగీకరించాయని అన్నారు. కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ(సీఐఐ) కూడా ముందుకు వచ్చిందన్నారు.

'అస్కి' డైరెక్టర్ జనరల్‌గా నిమ్మగడ్డ రమేశ్‌కుమార్



హైదరాబాద్, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లోని అడ్మినిస్ట్రేటివ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా(అస్కి) డైరెక్టర్ జనరల్‌గా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎన్నికల మాజీ కమిషనర్ నిమ్మగడ్డ రమేశ్‌కుమార్ నియమితులయ్యారు. ఐఏఎస్ అధికారిగా రిటైర్ అయ్యాక ఆయన 'సిటిజన్స్ ఫర్ డెమోక్రసీ' సంస్థను ఏర్పాటు చేసి, ఓటర్లలో ఎన్నికల పట్ల అవగాహన కల్పించారు. అస్కి డైరెక్టర్ జనరల్‌గా ఆయన సోమవారం బాధ్యతలు స్వీకరించనున్నారు.

వాటర్ బోర్డు ఈడీ సత్యనారాయణపై వేటు

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): సుంకిశాల ఇన్ టెక్ వెల్ ప్రాజెక్ట్ ప్రమాద ఘటనలో వాటర్ బోర్డు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎం.సత్యనారాయణపై రాష్ట్ర ప్రభుత్వం వేటు వేసింది. వాటర్ బోర్డులో సీనియర్ అధికారిగా కొనసాగుతున్న ఆయన్ను మూసీ నది రివర్ ఫ్రంట్ ప్రాజెక్ట్ లిమిటెడ్ (ఎంఆర్‌డీసీఎల్)కు బదిలీ చేస్తూ మునిసిపల్‌శాఖ ముఖ్య కార్యదర్శి ఎం.దానకిశోర్ శనివారం ఆదేశాలిచ్చారు. వాటర్ బోర్డులో రిటైర్డ్ అధికారిగా కొన్నేళ్లుగా కొనసాగుతున్న సత్యనారాయణకు ఈ నెల ఒకటో తేదీ నుంచి 2025 జూలై 31 వరకు ఈడీగా కొనసాగేందుకు ఇటీవల ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. తాజాగా వాటర్ బోర్డు నుంచి తప్పించిన నేపథ్యంలో మిగిలిన సేవలను మూసీ నది రివర్ ఫ్రంట్ ప్రాజెక్ట్ లిమిటెడ్‌లో వినియోగించుకునేందుకు తగు చర్యలు తీసుకోవాలని ఎంఆర్‌డీసీఎల్ ఎండీకి ఆదేశాలిచ్చింది. సుంకిశాల ప్రమాద ఘటనలో ఇప్పటికే ప్రాజెక్టు డైరెక్టర్‌ను బదిలీ చేయగా మరో నలుగురు ఇంజనీర్లను రాష్ట్ర ప్రభుత్వం సస్పెండ్ చేసింది.



విద్యార్థులకు డిగ్రీలు ప్రదానం చేస్తున్న విశ్వనాథన్, కిషన్‌రెడ్డి

సవాళ్లను అధిగమించి

సంపన్న దేశంగా మార్చండి

» యువ పట్టభద్రులకు కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి పిలుపు

» ఘనంగా 'వీఐటీ చెన్నై' స్నాతకోత్సవం

చెన్నై, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి) : దేశ భవిష్యత్ యువ పట్టభద్రుల పైనే ఆధారపడి ఉందని, స్వాతంత్ర్యదిన శత వార్షికోత్సవాల్లోపు దేశాన్ని సంపన్న దేశంగా మార్చే బాధ్యత యువతపైనే ఉందని కేంద్ర బొగ్గు, గనులశాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి అన్నారు. 'వీఐటీ చెన్నై' క్యాంపస్‌లో శనివారం ఉదయం జరిగిన స్నాతకోత్సవంలో ఆయన పాల్గొని సందేశమిచ్చారు. నాణ్యమైన విద్యనందించడంలో వీఐటీ విద్యాసంస్థలు ముందంజలో ఉన్నాయన్నారు. యువకులు ఉద్యోగాల కోసం వెంపర్లాడకుండా పలువురికి ఉద్యోగాలిచ్చే స్థాయికి ఎదగాలని ఆయన పిలుపునిచ్చారు. వీఐటీ వ్యవస్థాపక చాన్స్‌లర్ డాక్టర్ జి.విశ్వనాథన్ అధ్యక్షోపన్యాసం చేస్తూ.. విద్యను రాష్ట్ర జాబితా నుంచి ఉమ్మడి జాబితాకు మార్చేటప్పుడు తాను ఆ నిర్ణయానికి మద్దతుగా ఓటు వేశానని, ప్రస్తుతం విద్యకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆశించినంతమేరకు నిధులు విడుదల చేయడం లేదని విచారం వ్యక్తం చేశారు. ముందుగా 3.55 లక్షల చదరపుటడుగుల విస్తీర్ణంలో 17 అంతస్తులతో నిర్మించిన డాక్టర్ ఎంఎస్ స్వామినాథన్ బ్లాక్‌ను కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి ప్రారంభించారు. ఈ స్నాతకోత్సవంలో వివిధ కోర్సులకు సంబంధించిన మొత్తం 3,056 మంది విద్యార్థులు డిగ్రీలు అందుకున్నారు. ఇందులో యూజీ నుంచి 2144 మంది, పీజీ నుంచి 817 మంది పట్టాలు స్వీకరించారు. 38 మంది స్వర్ణపతకాలు అందుకోగా, 95 మంది పీహెచ్‌డీ డిగ్రీలు పొందారు.

క్రీడల వర్సిటీ!

(మొదటిపేజీ తరువాయి)

ముగిసిన పారిస్ ఒలింపిక్స్‌లో భారత్ ఒక్క బంగారు పతకం కూడా సాధించని విషయం తెలిసిందే. దీనిని ప్రస్తావిస్తూ ప్రముఖ పారిశ్రామికవేత్త ఆనంద్ మహీంద్రా శనివారం ట్వీట్ చేశారు. ఒక రజతం, ఐదు కాంస్యాలు.. 6 పతకాలతో భారత్ 71వ స్థానంలో నిలవడంపై ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పందించారు. 'డియర్ ఆనంద్ మహీంద్రా జీ.. ఈ విషయం నేను మీకు ప్రైవేటుగా చెబుదామనుకున్నా.. ఇప్పుడు బహిరంగంగా వెల్లడిస్తున్నా' అంటూ జవాబిచ్చారు. రాష్ట్రంలో ఏర్పాటు చేయబోతున్న స్పోర్ట్స్ యునివర్సిటీకి సంబంధించిన పూర్తి వివరాలను ఆయనకు ఎక్స్‌లో వివరించారు. ఆ తర్వాత అవే వివరాలతో సీఎం కార్యాలయం ప్రకటన విడుదల చేసింది. వర్సిటీ ఏర్పాటుకు అనువైన స్థలంగా ప్రస్తుతం హకీంపేటలో ఉన్న స్పోర్ట్స్ స్కూల్ లేదా గచ్చిబౌలిలోని స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లను పరిశీలిస్తున్నారు. సదరు క్యాంపస్‌ను ఒలింపిక్స్ స్థాయి అంతర్జాతీయ ప్రమాణాలుండేలా అప్‌గ్రేడ్ చేయాలని నిర్ణయించారు. హకీంపేటలోని 200 ఎకరాలు దీని ఏర్పాటుకు అనువుగా ఉందని గుర్తించినట్లు సమాచారం.

దక్షిణ కొరియాలోనే ఆలోచన

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇటీవల దక్షిణ కొరియా పర్యటనలో భాగంగా సియోల్‌లోని కొరియన్ నేషనల్ స్పోర్ట్స్ యూనివర్సిటీని సందర్శించారు. ఇది ప్రపంచంలోనే పేరొందిన స్పోర్ట్స్ యూనివర్సిటీగా ప్రత్యేకత చాటుకుంది. ఇటీవల ముగిసిన పారిస్ ఒలింపిక్స్‌లో దక్షిణ కొరియా మొత్తం 32 పతకాలు గెలుచుకోగా, వాటిలో 16 పతకాలు కొరియన్ నేషనల్ స్పోర్ట్స్ యూనివర్సిటీలో శిక్షణ పొందిన అథ్లెట్లు సాధించినవే! ఇక్కడ శిక్షణ పొంది, పారిస్ ఒలింపిక్స్‌లో ఆర్చరీ విభాగంలో మూడు బంగారు పతకాలు సాధించిన అథ్లెట్ లిమ్ సి-హైయోన్‌ను సీఎం రేవంత్ తన పర్యటనలో కలిసి అభినందించారు. భవిష్యత్తు ఒలింపిక్ చాంపియన్లకు శిక్షణ ఇచ్చేలా తెలంగాణ యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీకి సాంకేతిక భాగస్వాములుగా కొరియన్ నేషనల్ స్పోర్ట్స్ యూనివర్సిటీ సేవలు వాడుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది. మణిపూర్ రాజధాని ఇంఫాల్‌లో మోదీ సర్కారు 2018లో నేషనల్ స్పోర్ట్స్ యునివర్సిటీని ఏర్పాటు చేసింది. దేశంలో ఏకైక జాతీయ క్రీడల విశ్వవిద్యాలయం ఇదే. రాష్ట్రాల్లో మాత్రం మొట్టమొదటిసారి తమిళనాడు ఫిజికల్ ఎడ్యుకేషన్, స్పోర్ట్స్ యునివర్సిటీని అక్కడి రాష్ట్ర ప్రభుత్వం 2004లో ప్రారంభించింది. తర్వాత మహారాజా భూపేందర్ సింగ్ స్పోర్ట్స్ యునివర్సిటీని పంజాబ్ ప్రభుత్వం పటియాలాలో 2019లో ఏర్పాటు చేసింది. మధ్యప్రదేశ్, ఢిల్లీ, అసోంల్లోనూ స్పోర్ట్స్ వర్సిటీలను ఏర్పాటు చేశారు. తాజాగా తెలంగాణ ప్రభుత్వ నిర్ణయంతో క్రీడల కోసం ప్రత్యేకంగా విశ్వవిద్యాలయం స్థాపించిన రాష్ట్రంగా తెలంగాణ పేరు గడించనుంది.

నాలుగో నగరికి రయ్.. రయ్!

ప్రపంచంలోనే అతి పెద్ద రెండంతస్తుల ఫ్లైఓవర్ మెట్రో.. 18 కి.మీ మేర 200 అడుగుల ప్రత్యేక రహదారి నిర్మాణం

» 10 వరుసలుగా రోడ్డు.. దానిపై 8 లేదా 6 వరుసల రోడ్డు

» వీటిపైన మెట్రో రైల్.. పూలింగ్ విధానంలో భూ సేకరణ

» మంత్రి, ఉన్నతాధికారులతో సీఎం సమీక్ష

(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డి జిల్లా ప్రతినిధి)


ఫ్యూచర్ సిటీపై అధికారులతో సీఎం రేవంత్‌రెడ్డి సమీక్ష

దిగ్గజ సంస్థల కార్యాలయాలతో అలరారుతూ.. భవిష్యత్‌లో లక్షలాదిమంది నివసించేలా.. కాలుష్య రహితంగా.. అత్యాధునిక రీతిలో నిర్మించనున్న నాలుగో నగరి (ఫోర్త్ సిటీ)కి అంతే స్థాయిలో ప్రత్యేక రహదారి ఏర్పాటుకు ప్రభుత్వం చురుగ్గా సన్నాహాలు చేస్తోంది. ఔటర్ రింగు రోడ్డుకు అనుసంధానిస్తూ దీనిని నిర్మించేందుకు కసరత్తు సాగిస్తోంది. ముచ్చర్ల బేగరికంచెలో దాదాపు 14 వేల ఎకరాల్లో తలపెట్టిన నాలుగో నగరాన్ని.. న్యూయార్క్, దుబాయ్, సింగపూర్‌లను తలదన్నేలా తీర్చిదిద్దుతామని సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించారు. ఇందులో భాగంగా బహుళ విధ ప్రాజెక్టులను ఏర్పాటు చేయనుంది. ఇప్పటికే స్కిల్ యూనివర్సిటీకి సీఎం శంకుస్థాపన చేశారు. అతిపెద్ద క్రికెట్ స్టేడియం నిర్మించాలనిబీసీసీఐని కోరతామని అసెంబ్లీలో ప్రకటించారు. మరోవైపు పలు పెద్దపెద్ద సంస్థలు కార్యాలయాల స్థాపనకు ఆసక్తిగా ఉన్నాయి. దీంతో కొత్త నగరికి ప్రత్యేక రవాణా వ్యవస్థ ఉండాలని ప్రభుత్వం నిర్ణయించింది. నాగపూర్‌లో ఇటీవల నిర్మించిన డబుల్ డెక్కర్ వయాడక్ట్ మెట్రోను నమూనాగా తీసుకుంది. ఈ క్రమంలో సాధారణ రహదారిని పది వరుసల్లో నిర్మిస్తారు. దానిపైన ఎనిమిది లేదా ఆరు వరుసల రహదారి నిర్మాణం చేపడతారు. ఈ రెండింటిపైన మెట్రో లైన్ వస్తుంది.

రైతులకు న్యాయం చేస్తూ..

రావిర్యాల ఔటర్ రింగ్ రోడ్డుకు అనుసంధానిస్తూ 200 అడుగల వెడల్పుతో 18 కి.మీ. పొడవున రహదారి కోసం ప్రభుత్వం భూ సేకరణ ప్రయత్నాలు ప్రారంభించింది. అయితే, భారీగా సేకరణ చేయాల్సి ఉండడంతో పూలింగ్ విధానాన్ని ఎంచుకున్నారు. ఈ బాధ్యతను మాజీ ఎమ్మెల్యే కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డికి అప్పగిస్తున్నట్లు సీఎం రేవంత్‌రెడ్డి బేగరికంచె సభలో ప్రకటించారు. ఈ మేరకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా రైతుల నుంచి భూమిని తీసుకునే ప్రయత్నాలు మొదలయ్యాయి. మొత్తం 300 ఎకరాలను సేకరించనున్నారు. వాస్తవానికి రహదారి నిర్మాణానికి సుమారు 200 ఎకరాలు అవసరం. ఇందులో 50 ఎకరాలు అటవీ భూమి. 150 ఎకరాలను ప్రైవేటు వ్యక్తుల నుంచి సేకరించాల్సి ఉంది. పూలింగ్ విధానం కాబట్టి.. భూములు కోల్పోయిన రైతులకు రోడ్డుకు ఇరువైపులా అభివృద్ధి చేసిన ప్లాట్లు ఇవ్వాలని సర్కారు భావిస్తోంది. దీంతో రెట్టింపు భూమి.. అంటే 300 ఎకరాల వరకు సేకరించాల్సి ఉంటుంది. భూములు కోల్పోతున్నవారికి పరిహారం కింద 40% భూమిని కొత్తగా నిర్మించే రోడ్డుకు ఇరువైపులా ఇచ్చే విషయాన్ని పరిశీలిస్తున్నారు. దీనిని 50 శాతానికి పెంచాలని కొందరు డిమాండ్ చేస్తున్నట్లు తెలిసింది. ఎక్కువమంది రైతులు సానుకూలంగా ఉన్నట్లు సమాచారం. డబుల్ డెక్కర్ వయాడక్ట్ మెట్రో పూర్తయితే ప్రపంచంలోనే అతిపెద్దదిగా గుర్తింపు పొందుతుంది. నాగపూర్‌లో వార్ధా రోడ్డుపై నిర్మించిన అత్యంత పొడవైన రెండంతస్తుల ఫ్లైఓవర్ ఉన్న మెట్రో పొడవు 3.14 కిలోమీటర్లు. ఇది గిన్నిస్ బుక్‌లోకి ఎక్కింది. ఇక హైదరాబాద్ శివార్లలో నిర్మించే దాని పొడవు 18 కిలోమీటర్లు. తద్వారా ప్రపంచంలోనే అతిపెద్దది అవుతుందని అధికారులు చెబుతున్నారు. రహదారికి ఇరువైపులా స్కైటవర్స్ నిర్మాణాలు చేపట్టేలా ప్రణాళికలు రూపొందిస్తున్నారు. గ్రీన్ జోన్‌ను మల్టీపర్పస్‌గా మార్చాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు తెలిసింది. శంషాబాద్ విమానాశ్రయం నుంచి నిర్మిస్తున్న మెట్రో లైన్‌ను ఓఆర్ఆర్ సర్వీస్ రోడ్డు పక్క నుంచి తీసుకువచ్చి రావిర్యాల వద్ద రెండంతస్తుల ఫ్లైఓవర్ మెట్రో లైన్‌కు కలుపుతారు. ఇందుకోసం రావిర్యాలలో ఓఆర్ఆర్‌పై భారీ ఫ్లైఓవర్ నిర్మించి రింగు రోడ్డు ఎగ్జిట్ రోడ్లకు కూడా అనుసంధానం చేస్తారు. ఈ ప్రత్యేక రవాణా వ్యవస్థ ఏర్పాటైతే విమానాశ్రయం, ఔటర్ రింగు రోడ్డు నుంచి అరగంటలోనే నాలుగో నగరికి చేరుకోవచ్చు.

ఔటర్ నుంచి రీజినల్ రింగ్‌రోడ్డు దాకా కనెక్టివిటీ

హైదరాబాద్, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): కొత్త హైకోర్టు నుంచి శంషాబాద్ విమానాశ్రయం మీదుగా ఫ్యూచర్ సిటీకి మెట్రో మార్గం నిర్మాణానికి ప్రణాళికలు రూపొందించాలని సీఎం రేవంత్ అధికారులను ఆదేశించారు. ఫ్యూచర్ సిటీ అభివృద్ధి ప్రణాళికలపై శనివారం రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, సీఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, పురపాలక శాఖ ముఖ్య కార్యదర్శి దానకిశోర్, మెట్రో రైల్ ఎండీ ఎన్వీఎస్ రెడ్డి, రంగారెడ్డి కలెక్టర్ శశాంకతో సమీక్ష సమావేశం నిర్వహించారు. విమానాశ్రయం నుంచి ఫ్యూచర్ సిటీకి రహదారి అనుసంధానత రూట్ మ్యాప్‌ను అధికారులు వివరించగా సీఎం పలు సూచనలు చేశారు.

దిగజారుడు రాజకీయాలు

(మొదటిపేజీ తరువాయి)

పేర్కొన్నారు. రాష్ట్రంలోని 35 బ్యాంకులకు సంబంధించిన 3,292 బ్రాంచులు, 909 వ్యవసాయ పరపతి సంఘాల శాఖల నుంచి 2018 డిసెంబరు 12 నుంచి 2023 డిసెంబరు 9లోపు తీసుకున్న రుణాలను మాఫీ చేశామని తెలిపారు. రూ.2 లక్షలకు మించి రుణాలు కలిగి ఉన్నవారు.. ఆ పైన ఉన్న మొత్తాన్ని బ్యాంకులో చెల్లిస్తే.. 2 లక్షలు రుణమాఫీ చేయడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. రుణమాఫీ కాని రైతులు మండల వ్యవసాయ అధికారిని కలవాలని.. వారి నుంచి వచ్చిన దరఖాస్తులను నెలలో పరిష్కరిస్తామని తెలిపారు. పథకానికి సంబంధించినవివరాలను తుమ్మల వెల్లడించారు.

- జూలై 18న రూ.లక్షలోపు రుణాలున్న 11,50,193 మందికి రూ.6,098.93 కోట్లు విడుదల చేశాం.
- జూలై 30న రూ.లక్ష నుంచి రూ.1.50 లక్షల దాకా రుణాలు కలిగిన 6,40,823 మందికి రూ. 6,190.01 కోట్లు చెల్లించాం.
- ఆగస్టు 15న రూ.2 లక్షలలోపు రుణాలు కలిగిన 4,46,832 మందికి ఖాతాల్లో రూ.5644.24 కోట్లు జమచేశాం. మొత్తంగా 22,37,848 మంది ఖాతాల్లో రూ.17,933.19 కోట్లు జమ చేశాం.
- రుణమాఫీకి రేషన్ కార్డును ప్రామాణికంగా తీసుకోలేదు. కుటుంబ నిర్ధారణకు రేషన్‌కార్డులోని వివరాలను పరిగణనలోకి తీసుకున్నాం.
- రేషన్ కార్డు లేనివారు, ఆధార్ కార్డు వివరాలు తప్పుగా నమోదైనవారు మరే ఇతర కారణాలతోనైనా రుణమాఫీకి నోచుకోని వారు సమీపంలోని వ్యవసాయ అధికారిని సంప్రదించి, తగిన వివరాలు అందిస్తే,వారికీ త్వరలోనే రుణమాఫీ చేస్తాం.
- దీనిపై వ్యవసాయాధికారులందరికీ ఆదేశాలిచ్చాం.
- మండల పరిధిలో ఉన్న అన్ని బ్యాంకు బ్రాంచులు/వ్యవసాయ పరపతి సంఘాల(పీఏసీఎస్)లకు సంబంధించిన అన్ని సమస్యాత్మక ఖాతాలకు పూర్తి బాధ్యత ఆ మండల వ్యవసాయాధికారినే తీసుకుంటారు.
- కుటుంబ నిర్ధారణ కోసం మండల వ్యవసాయాధికారి రైతు వద్దకు వెళ్లి ఆధార్ వివరాలు తీసుకుని పోర్టల్‌లో అప్‌లోడ్ చేస్తారు.
- ఒకవేళ రుణ ఖాతాలో నమోదైన పేరు, ఆధార్‌లో నమోదైన పేరుతో సరిపోలకపోతే.. ఖాతాదారుని దగ్గర సరైన వివరాలు సేకరించి పోర్టల్‌లో అప్‌లోడ్ చేసి, మాఫీ ప్రయోజనాలు వర్తింపచేస్తారు.
- ఒకవేళ బ్యాంకు సమర్పించిన అసలు, వడ్డీలలో తేడా ఉన్నట్లయితే అధికారికి తెలియజేయాలి.
- రోజువారీ అందిన ఫిర్యాదులను జిల్లా వ్యవసాయాధికారి సాయంత్రం 5లోపు డైరెక్టర్, వ్యవసాయ శాఖ కార్యాలయానికి పంపించాలి.
- మొదటి, రెండో విడత రుణమాఫీలో తప్పులు దొర్లిన 7,925 ఖాతాలను సరిచేసి రూ.44.95 కోట్లు నిధులు ఇప్పటికే విడుదల చేశాం.
- బ్యాంకుల్లో సాంకేతిక సమస్యలతో దాదాపు 22 వేల ఖాతాల్లో వేసిన డబ్బులు వెనక్కి వచ్చాయి. వీటిలో ఉన్న చిన్న చిన్న తప్పులను గుర్తించి వ్యవసాయ శాఖ ఎప్పటికప్పుడు సరిచేస్తోంది. ఇప్పటికే 8 వేల ఖాతాలకు డబ్బులు తిరిగి జమ చేశాం.

రుణమాఫీతో బీఆర్‌ఎస్ నేతల మైండ్ బ్లాంక్: ఎంపీ మల్లు రవి

న్యూఢిల్లీ, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): బీఆర్‌ఎస్ నేతల అసహనం పరాకాష్ఠకు చేరుకుందని, రుణమాఫీతో బీఆర్‌ఎస్ నేతల మైండ్ బ్లాంక్ అయిందని నాగర్ కర్నూల్ ఎంపీ మల్లు రవి ఎద్దేవా చేశారు. ఆ పార్టీలో ఎవరేం మాట్లాడుతున్నారో తెలియని గందరగోళం నెలకొందని పేర్కొన్నారు. ప్రజలు అధికారం ఇవ్వలేదన్న కోపం, అవినీతి పాల్పడ్డ బిడ్డకు బెయిల్ రాలేదన్న ఆక్రోశంతో కేసీఆర్ ఫాంహౌస్‌కే పరిమితమైపోయారని తెలిపారు. రైతులకు రుణమాఫీ చేయడం కేటీఆర్, హరీశ్ రావులకు ఇష్టం లేదా అని కిసాన్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు కోదండరెడ్డి ప్రశ్నించారు.

సీఎం సోదరుడైతే పెట్టుబడులు పెట్టకూడదా..?

కేటీఆర్ సోదరుడు, సోదరి పెట్టినా ఆహ్వానిస్తాం.. అప్పటి ఒప్పందాల అమల్లో సక్సెస్ రేట్ 30 శాతమే

» బీఆర్‌ఎస్ సర్కారు ఫెయిల్.. అంతా ప్రచారార్భాటమే

» త్వరలో అమెజాన్, పెప్సీకో పెట్టుబడులు: మంత్రి దుద్దిళ్ల



హైదరాబాద్, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): "రాష్ట్ర వ్యవసాయ రంగానికి, రైతులకు మేలు చేసేలా పెట్టుబడులు పెట్టేందుకు వస్తే ముఖ్యమంత్రి సోదరుడికి లబ్ధి కలిగిస్తున్నారంటూ విమర్శిస్తున్నారు. ముఖ్యమంత్రి సోదరుడైతే రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టకూడదా..? అమెరికాలో స్థిరపడి.. సొంత రాష్ట్రంలో పెట్టుబడులకు సిద్ధమైతే ఎవరినైనా ఆహ్వానిస్తాం. కేటీఆర్ సోదరుడు, సోదరి పెట్టుబడులు పెడతామంటే కూడా ప్రభుత్వం ఆహ్వానిస్తుంది" అని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. ఇటీవల ముఖ్యమంత్రి నేతృత్వంలోని అధికార బృందం అమెరికా పర్యటనలో ఒప్పందం కుదుర్చుకున్న స్వచ్ఛ బయో కంపెనీలో సీఎం రేవంత్ సోదరుడు ఉండటంపై బీఆర్‌ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ చేస్తున్న విమర్శలకు ఆయన స్పందించారు. స్వచ్ఛ బయో కంపెనీ గత 18 ఏళ్లుగా అమెరికా కేంద్రంగా పరిశోధన, అభివృద్ధి రంగంలో పనిచేస్తోందని, బయో ఫ్యూయల్‌పై 8 పేటెంట్లను సాధించిందని, రాష్ట్రంలో ఇథనాల్ ప్లాంట్ ఏర్పాటుకు సిద్ధమైందని తెలిపారు. పెట్టుబడిదారులను తమ ప్రభుత్వం వ్యాపారవేత్తలుగానే చూస్తుందని, తమకు రాష్ట్ర ప్రయోజనాలే ముఖ్యమని మంత్రి స్పష్టం చేశారు. పదేళ్ల బీఆర్‌ఎస్ ప్రభుత్వం కొత్త పరిశ్రమల స్థాపనలో ఫెయిల్ అయిందని మంత్రి శ్రీధర్ బాబు తెలిపారు. ఐటీ, పరిశ్రమల మంత్రిగా రాష్ట్ర ప్రభుత్వం తరపున కేటీఆర్ కుదుర్చుకున్న ఒప్పందాల్లో కేవలం 30 శాతం మాత్రమే పెట్టుబడులు పెట్టాయని తెలిపారు. "గత ప్రభుత్వం చేసిందంతా ప్రచార ఆర్భాటం తప్ప ఇంకేమీ లేదు. 30 మార్కులు సాధించిన ప్రభుత్వాన్ని ఫెయిల్ ప్రభుత్వమే అంటారు. సీఎంగా కేసీఆర్ 15 రోజులపాటు చైనాలో పర్యటించారు. అప్పుడు రూ.లక్ష కోట్ల ఒప్పందాలు చేసుకున్నా.. పెట్టుబడులు పెట్టింది కేవలం 30 శాతమే. దావోస్, అమెరికా, కొరియా పర్యటనల్లో మా ప్రభుత్వం చేసుకున్న ప్రతీ ఒప్పందాన్నీ వ్యాపారంగా మలిచేందుకు చిత్తశుద్ధితో కృషి చేస్తాం" అని వివరించారు. అమరరాజా గ్రూప్ గత ప్రభుత్వంతో కుదుర్చుకున్న ఒప్పందం అమలు చేస్తుందా అన్న ప్రశ్నకు స్పందిస్తూ.. పెట్టుబడులకు సంబంధించి ఇప్పటికే సీఎం రేవంత్ కంపెనీ ఎండీతో మాట్లాడారన్నారు. అమెరికా పర్యటనలో 19 కంపెనీలతో రూ.31,500 కోట్ల ఒప్పందాలు; దక్షిణ కొరియాలో 6 కంపెనీలతో రూ.4,300 కోట్ల పెట్టుబడులు కలిపి మొత్తం రూ.35,800 కోట్ల ఒప్పందాలు కుదిరాయని తెలిపారు. త్వరలో అమెజాన్, పెప్సీకో, కోంపాస్ట్, అమెరికన్ ఎయిర్ లైన్స్, సిగ్నా లాంటి పెద్ద కంపెనీలు రాష్ట్రంలో పెట్టుబడులకు సిద్ధమవుతున్నాయని చెప్పారు.

సీఎం రేవంత్‌రెడ్డి.. రూ.2 లక్షలు రుణమాఫీ చేస్తే..

కేసీఆర్, కేటీఆర్, హరీశ ఇబ్బంది పడుతున్నరు

» పదేళ్లలో ఒకే కిస్తీలో ఎందుకు మాఫీ చేయలేకపోయామా అని వారికి నిద్ర పట్టట్లేదు

» మైండ్‌బ్లాక్ అయి.. పిచ్చిపిచ్చిగా మాట్లాడుతున్నరు

» రుణమాఫీతో రైతాంగం సంతోషంగా ఉంది

» బీఆర్‌ఎస్ పార్టీ మాత్రం ఓర్చుకోలేకపోతోంది

» రేవంత్‌రెడ్డికి సవాల్ చేయాల్సింది కేసీఆరే కానీ.. కేటీఆర్ కాదు

» వర్కింగ్ ప్రెసిడెంట్‌గా కేటీఆర్ సవాల్‌ను నేను స్వీకరిస్తున్న

» సిద్దిపేట, సిరిసిల్లల్లో రైతు రుణమాఫీ చర్చిద్దామా?: తూర్పు జగ్గారెడ్డి సవాల్

హైదరాబాద్, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): "రాష్ట్రంలోని రైతులకు సీఎం రేవంత్‌రెడ్డి.. ఒకే కిస్తీలో రూ.2 లక్షల మేరకు రుణమాఫీ చేయడంతో కేసీఆర్, కేటీఆర్, హరీశ్ రావులు తెగ ఇబ్బంది పడిపోతున్నరు. ఈ పదేళ్లలో.. ఒకే కిస్తీలో ఎందుకు మాఫీ చేయలేకపోయామా అని చెప్పి వారికి నిద్రపట్టట్లేదు. పదేళ్లు అధికారంలో ఉండి.. రుణమాఫీ పూర్తిస్థాయిలో చేయలేకపోయామన్న అసంతృప్తి, మనోవేద నతో కేటీఆర్, హరీశ్‌లు అబద్ధాలు ప్రచారం చేస్తున్నరు. మైండ్ బ్లాక్ అయిపోయి.. పిచిపిచ్చిగా మాట్లాడుతున్నరు" అని టీపీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షుడు తూర్పు జగ్గారెడ్డి వ్యాఖ్యానించారు. శనివారం గాంధీభవన్‌లో మీడియా సమావేశంలో జగ్గారెడ్డి మాట్లాడుతూ.. ఆగస్టు 15 కల్లా రైతుకు రూ.2 లక్షల మేరకు రుణాన్ని మాఫీ చేస్తామని ప్రకటించిన సీఎం రేవంత్‌రెడ్డి.. చేసి చూపించారని, దీంతో రైతాంగమూ సంతోషంగా ఉందన్నారు. పదేళ్లలో విడతల వారీగా కూడా పూర్తిగా రుణమాఫీ చేయలేకపోయిన బీఆర్‌ఎస్ వాళ్లు.. అధికారంలోకి వచ్చిన 8 నెలల్లోనే రైతుల రుణాన్ని ఒకే కిస్తీలో మాఫీ చేసిన సీఎం రేవంత్‌రెడ్డిని విమర్శించడం సరికాదన్నారు. సాంకేతిక సమస్యలతో రుణమాఫీ కాని వారికి ప్రత్యేకంగా దరఖాస్తు చేసుకునే అవకాశమూ ముఖ్యమంత్రి కల్పించారని చెప్పారు.



వర్కింగ్ ప్రెసిడెంట్ వర్సెస్ వర్కింగ్ ప్రెసిడెంట్

"రుణమాఫీకి సంబంధించి సీఎం రేవంత్‌రెడ్డికి కేటీఆర్ సవాల్ విసిరారు. సీఎం రేవంత్‌కు సవాల్ విసరాల్సింది కేటీఆర్ కాదు.. కేసీఆర్! బీఆర్‌ఎస్ పార్టీకి వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అయితే.. టీపీసీసీకి నేను వర్కింగ్ ప్రెసిడెంట్. కేటీఆర్ సవాల్‌ను నేను స్వీకరిస్తున్న. రైతు రుణమాఫీపైన చర్చకు.. సిద్దిపేట, సిరిసిల్ల నియోజకవర్గాల్లో ఎక్కడికి రమ్మంటారు?" అంటూ కేటీఆర్‌కు జగ్గారెడ్డి సవాల్ విసిరారు. కాదనుకుంటే తమ మంత్రులు తుమ్మల, ఉత్తమ్, పొంగులేటిల్లో ఎవరినైనా రిక్వెస్ట్ చేసి తీసుకువస్తానన్నారు. అధికారం కోల్పోయి.. కాంగ్రెస్ ప్రభుత్వ పథకాలు చూశాక.. కేటీఆర్, హరీశ్‌రావుల పరిస్థితి తెగిన గాలి పటంలాగా మారిందన్నారు.

పదేళ్లలో ప్రజలు బాధలు చెప్పుకునే పరిస్థితి లేదు

"తన క్యాంపు కార్యాలయంపై కాంగ్రెస్ నాయకులు దాడి చేశారని, ఇలాంటివి బీఆర్‌ఎస్ హయాంలో జరగలేదంటూ హరీశ్‌రావు మాట్లాడుతున్నడు. కానీ పదేళ్లలో ఎంత దుర్మార్గపు పాలనను అందించారు? ప్రజలు, ఉద్యోగులు, మహిళలు తమ బాధలు చెప్పుకునే పరిస్థితి కూడా లేదు. ధర్నా చౌక్‌ను లేకుండా చేసి.. నిరసన తెలిపే స్వేచ్ఛ లేకుండా పరిపాలించారు. ఆ రోజులను హరీశ్‌రావు మరిచిపోయిండా? ఇదంతా వారి సంప్రదాయం కాదా?" అంటూ జగ్గారెడ్డి నిలదీశారు. బీఆర్‌ఎస్ పార్టీ వారు చేసిన దాంట్లో కాంగ్రెస్ శ్రేణులు చేసింది గోరంత మాత్రమేనని, జస్ట్ ఝలక్ ఇచ్చారని వ్యాఖ్యానించారు. బీఆర్‌ఎస్ హయాంలో సిద్దిపేటలోని ఓ పోలీ‌స్‌స్టేషన్లో అత్యంత భయానక పరిస్థితులుండేవని, అక్కడ కాంగ్రెస్ కార్యకర్తలను పోలీసులు చిత్రహింసలు పెట్టేవారన్నారు. అప్పటి సీఐ సురేందర్‌రెడ్డి.. హరీశ్‌రావు ఏజెంటుగా పనిచేసేవాడని ఆరోపించారు. నేరెళ్ల బాధితులనైతే సంసారాలకు కూడా పనికి రాకుండా కొట్టారంటూ ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.





హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ వద్ద ఐఎంఏ ఆధ్వర్యంలో ధర్నా చేస్తున్న వైద్యులు, ట్యాంక్‌బండ్‌పై వివేకానంద విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న వైద్యులు

హోరెత్తిన వైద్యుల నిరసన

కోల్‌కతా జూనియర్ డాక్టర్ హత్యాచార ఘటనపై ఆందోళన

- అన్ని ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రుల్లో ఔట్‌పేషెంట్ సేవలు బంద్
- హైదరాబాద్ ఇందిరాపార్క్ వద్ద ఐఎంఏ ఆధ్వర్యంలో ఆందోళన

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్)



కోల్‌కతా ఆర్‌జీ కార్ వైద్య కళాశాలలో జూనియర్ వైద్యురాలిపై హత్యాచారం ఘటనను తీవ్రంగా నిరసిస్తూ రాష్ట్రంలోని వైద్య సంఘాలు శనివారం భారీఎత్తున నిరసన కార్యక్రమాలు నిర్వహించాయి. ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) పిలుపు మేరకు హైదరాబాద్‌లోని కార్పొరేట్, పెద్దాసుపత్రులతో పాటు ప్రభుత్వ బోధనాస్పత్రులు, జిల్లాల్లోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రుల్లో ఔట్ పేషెంట్ సేవలను నిలిపివేశారు. అత్యవసర సేవలను మాత్రం అందించారు. అన్ని ఆరోగ్య కేంద్రాల వైద్యులు, సిబ్బంది రోడ్లపైకి వచ్చి నల్లబ్యాడ్జీలతో ర్యాలీలు నిర్వహించారు. వీరికి, పారా మెడికల్ సిబ్బంది, ఆరోగ్య, ఆశా కార్యకర్తలు, మెడికల్ రిప్రజంటేటివ్‌లు మద్దతు ప్రకటించారు. హత్యాచారానికి పాల్పడ్డ నిందితులను తక్షణమే శిక్షించాలని డిమాండ్ చేశారు. ఐఎంఏ తెలంగాణ ఆధ్వర్యంలో హైదరాబాద్ ఇందిరా పార్క్ ధర్నా చౌక్ వద్ద వైద్యుల నిరసనలో నగరంలోని అన్ని ఆస్పత్రులకు చెందిన వందల మంది వైద్యులు, జూనియర్ వైద్యులు నల్ల బ్యాడ్జీలు ధరించి పాల్గొన్నారు. మల్కాజ్‌గిరి, వరంగల్ ఎంపీలు ఈటల రాజేందర్, డాక్టర్ కడియం కావ్య మద్దతు ప్రకటించారు. ఐఎంఏ తెలంగాణ అధ్యక్షుడు డాక్టర్ పి.కాళీ ప్రసాదరావు ఆధ్వర్యం వహించారు. తెలంగాణ ప్రభుత్వ బోధనాస్పత్రుల వైద్యుల, ప్రభుత్వ వైద్యుల, ప్రజారోగ్య వైద్యుల సంఘాలు, నర్సింగ్ ఆఫీసర్స్, నిమ్స్ ఫ్యాకల్టీ, ఇండియన్ డెంటల్, హెల్త్ కేర్ రిఫార్మ్ డాక్టర్స్ అసోసియేషన్స్‌తో పాటు పలు మహిళా సంఘాలు సంఘీభావం తెలిపాయి. హైదరాబాద్‌లో కిమ్స్ ఆస్పత్రుల వైద్యులు చైర్మన్ డాక్టర్ భాస్కర్‌రావు ఆధ్వర్యంలో నిరసనలు నిర్వహించారు. నానక్‌రామ్‌గూడ, బంజారాహిల్స్‌లోని స్టార్ ఆస్పత్రుల వైద్యులు ఎండీ డాక్టర్ గోపీచంద్ మన్నెం సారథ్యంలో ఆందోళనల్లో పాల్గొన్నారు. యశోద, మెడికవర్, ఏఐజీ, రెయిన్‌బో, మల్లారెడ్డి నారాయణ మల్టీస్పెషాల్టీ, బసవతారకం ఆస్పత్రుల సిబ్బంది ర్యాలీలు తీశారు. వైద్యురాలిపై హత్యాచారానికి పాల్పడిన నిందితులను అరెస్టు చేయాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం ఓ ప్రకటనలో కోరారు. వైద్య కళాశాలల్లో పనిచేసే మహిళా సిబ్బంది, వైద్యులకు రక్షణ కల్పించాలని కోరారు. నేషనల్ మెడికోస్ ఆర్గనైజేషన్ అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ శంకర్, సురేంద్ర ట్యాంక్‌బండ్‌పై వివేకానంద విగ్రహం వద్ద కొవ్వొత్తుల ప్రదర్శనలో పాల్గొన్నారు.

మానవ హారాలు.. కొవ్వొత్తుల ర్యాలీలు

నిజామాబాద్ జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో జూనియర్ వైద్యుల సంఘం నాలుగో రోజూ ఆందోళన కొనసాగించింది. భారత దేశ చిత్రపటంలో వైద్యురాలి చిత్రాన్ని వేసి నివాళులర్పించారు. ఆదిలాబాద్, పాలమూరు, వనపర్తిలో మానవహారాలు నిర్మించారు. కరీంనగర్‌లో కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఉమ్మడి జిల్లాలోని అన్ని ప్రధాన పట్టణాల్లో ర్యాలీలు తీశారు. ఖమ్మంలో పెవిలియన్ గ్రౌండ్ నుంచి సర్దార్ పటేల్ స్టేడియం వరకు అంబులెన్స్‌లతో సహా భారీ ర్యాలీ తీశారు. నల్లగొండ, సూర్యాపేట, కోదాడ, హుజూర్‌నగర్‌లో ర్యాలీలు నిర్వహించారు. వరంగల్ ఎంజీఎం ఆస్పత్రి విద్యార్థులు నిరసన చేపట్టారు. సంగారెడ్డి, మెదక్, సిద్దిపేటలో ఆందోళనలు జరిగాయి. కాగా, మహిళా డాక్టర్‌పై హత్యాచారానికి పాల్పడ్డ వ్యక్తికి మరణ శిక్ష విధించాలని మాజీ ఎంపీ డాక్టర్ బూర నర్సయ్య గౌడ్ డిమాండ్ చేశారు. ఈ ఘటనను కప్పిపుచ్చేందుకు బెంగాల్ సీఎం మమత బెనర్జీ విశ్వ ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు.

తిరుమల శ్రీవారి బ్రేక్ దర్శనాలకు

మా సిఫారసు లేఖలనూ అనుమతించండి

టీటీడీపై తెలంగాణ ప్రజాప్రతినిధుల ఒత్తిడి

తిరుమల, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి వీఐపీ బ్రేక్ దర్శనాలకు తమ సిఫారసు లేఖలనూ అనుమతించాలంటూ తెలంగాణ ప్రజా ప్రతినిధుల నుంచి టీటీడీపై ఒత్తిడి పెరుగుతోంది. కొవిడ్ సమయంలో రద్దయిన కోటాను పునరుద్ధరించాలని వారు కోరుతున్నారు. గతంలో ఏపీ ప్రజాప్రతినిధుల సిఫారసులతో 1,800-2,000 వరకు బ్రేక్ దర్శనం టికెట్లు, తెలంగాణ ప్రజాప్రతినిధుల సిఫారసులపై 600-700 టికెట్లు ఇచ్చేవారు. కానీ, కొవిడ్ తర్వాత వీఐపీ బ్రేక్ దర్శనాల నియంత్రణలో భాగంగా తెలంగాణ నుంచి స్వయంగా వచ్చే ప్రజాప్రతినిధులకు మాత్రమే ప్రొటోకాల్ దర్శనాలు చేయించాలని, సిఫారసు లేఖలపై బ్రేక్ దర్శనాలు ఇవ్వకూడదని టీటీడీ నిర్ణయించింది. నాలుగేళ్లుగా అదే విధానం కొనసాగుతోంది. అయితే, తాజాగా తెలంగాణ, ఏపీలో కొత్త ప్రభుత్వాలు వచ్చాక తెలంగాణ ప్రజాప్రతినిధుల నుంచి టీటీడీ అధికారులపై ఒత్తిడి పెరిగింది. తమ సిఫారసు లేఖలనూ అనుమతించాలని ఇటీవల తిరుమలకు వచ్చిన తెలంగాణ మంత్రి పొన్నం ప్రభాకర్ డిమాండ్ చేశారు. అయితే, ఈ విషయాన్ని ఏపీ సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లి, తుది నిర్ణయం నడుచుకోవాలని టీటీడీ అధికారులు భావిస్తున్నారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., printed at Aamoda Press, H.No.5-9-287/10 & 11, Plot No. 53 & 54, Prasanth Towers, Rajeev Gandhi Nagar, Moosapet, Kukatpally (Mandal), Kukatpally Municipality, Ranga Reddy District and Published at Plot No.76, Ashwini Layout, Huda Heights, Road No.70, Jubilee Hills, Hyderabad-500033. Editor: K. Srinivas. Fax No. 23558288, Phone No: 23558233 / 44 / 55, Regd. No.H/HD 674, RNI No.44903 / 86. Managing Director: Vemuri Radha Krishna, Founder: K.L.N.Prasad.

ఆంధ్రజ్యోతి

దిక్సూచి

హైదరాబాద్ ● ఆదివారం 18 ఆగస్టు 2024

diksuchi@andhrajyothy.co

డా.వైఎస్సార్ఏఎఫ్‌యూలో

బీఆర్క్

కడపలోని డా.వైఎస్సార్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ యూనివర్సిటీ(డా.వైఎస్సార్ఏఎఫ్‌యూ)- బీఆర్క్ డిగ్రీలో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ, ప్రైవేట్, నాన్ మైనారిటీ, మైనారిటీ కళాశాలల్లో నాటా 2024 స్కోర్ ఆధారంగా లోకల్, నాన్ లోకల్ కేటగిరీల్లో అడ్మిషన్స్ ఇస్తారు. ప్రోగ్రామ్ వ్యవధి అయిదేళ్లు.



కళాశాలలు-సీట్లు

- ఆంధ్ర యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్, విశాఖపట్నం-44 కన్వీనర్ కోటా సీట్లు
- డా.వైఎస్సార్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ యూనివర్సిటీ, కడప-44 కన్వీనర్ కోటా సీట్లు
- ఏఎన్‌యూ కాలేజ్ ఆఫ్ ఆర్కిటెక్చర్ అండ్ ప్లానింగ్, గుంటూరు-44 కన్వీనర్ కోటా సీట్లు
- ఎంఆర్‌కే కాలేజ్ ఆఫ్ ఆర్కిటెక్చర్, భీమవరం- 15 కన్వీనర్ కోటా సీట్లు, 6 మేనేజ్‌మెంట్ కోటా సీట్లు
- చదలవాడ అరుణ స్కూల్ ఆఫ్ ఆర్కిటెక్చర్, తిరుపతి-28 కన్వీనర్ కోటా సీట్లు, 12 మేనేజ్‌మెంట్ కోటా సీట్లు

అర్హత: గుర్తింపు పొందిన బోర్డు నుంచి మేథమెటిక్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ/బయాలజీ/టెక్నికల్ ఒకేషనల్ సబ్జెక్ట్/కంప్యూటర్ సైన్స్/ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ/ఇన్ఫర్మాటిక్స్ ప్రాక్టీసెస్/ఇంజనీరింగ్ గ్రాఫిక్స్/బిజినెస్ స్టడీస్ ప్రధాన సబ్జెక్టులుగా ఇంటర్/పన్నెండోతరగతి ఉత్తీర్ణులు దరఖాస్తు చేసుకోవచ్చు. మేథమెటిక్స్ ఒక సబ్జెక్ట్‌గా మూడేళ్ల ఇంజనీరింగ్ డిప్లొమా పూర్తిచేసినవారు కూడా అప్లయ్ చేసుకోవచ్చు. ఏ కోర్సులోనైనా కనీసం 45 శాతం మార్కులు ఉండాలి. నాటా 2024 అర్హత తప్పనిసరి.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు ఫీజు:** జనరల్ అభ్యర్థులకు రూ.1500; బీసీ అభ్యర్థులకు రూ.1300; ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.1,000
- **దరఖాస్తుకు చివరి తేదీ:** ఆగస్టు 19
- **సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌కు చివరి తేదీ:** ఆగస్టు 20
- **ఈ మెయిల్ ద్వారా కరెక్షన్స్:** ఆగస్టు 21 నుంచి 22 వరకు
- **వెబ్ ఆప్షన్స్:** ఆగస్టు 26 నుంచి 27 వరకు
- **ఎంపికైన అభ్యర్థుల జాబితా విడుదల:** ఆగస్టు 29
- **ఎంపికైన అభ్యర్థుల రిపోర్టింగ్:** ఆగస్టు 30 నుంచి సెప్టెంబరు 2 వరకు
- **మిగిలిన సీట్ల వివరాలు వెల్లడి:** సెప్టెంబరు 2
- **వెబ్‌సైట్:** www.ysrafu.ac.in, https://apsche.ap.gov.in/arch/

విజయవాడలోని డా.ఎన్‌టీఆర్ యూనివర్సిటీ ఆఫ్ హెల్త్ సైన్సెస్(డా.ఎన్‌టీఆర్‌యూహెచ్ఎస్)- మెడికల్, డెంటల్ డిగ్రీ ప్రోగ్రామ్‌లలో మేనేజ్‌మెంట్, ఎన్ఆర్ఐ కోటా సీట్ల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది. వర్సిటీకి అనుబంధంగా ఉన్న ప్రైవేట్ అన్ ఎయిడెడ్ నాన్ మైనారిటీ, మైనారిటీ మెడికల్&డెంటల్ కళాశాలల్లో బీ కేటగిరీ, సీ కేటగిరీ(ఎన్ఆర్ఐ) సీట్లు; తిరుపతి స్విమ్స్ ఆధ్వర్యంలోని శ్రీ పద్మావతీ మెడికల్ కాలేజ్ ఫర్ ఉమెన్‌లోని ఎన్ఆర్ఐ సీట్లు; నూతనంగా అనుమతించిన ప్రభుత్వ మెడికల్ కళాశాలల్లోని కాంపిటెంట్ అథారిటీ కోటా(సెల్ఫ్ ఫైనాన్సింగ్/ఎన్ఆర్ఐ) సీట్లు భర్తీ చేయనున్నారు. ప్రభుత్వ/ప్రైవేట్ కళాశాలలు, సీట్ల వివరాల కోసం సంస్థ వెబ్‌సైట్‌లో చూడవచ్చు. వెబ్ కౌన్సెలింగ్ ద్వారా అడ్మిషన్స్ ఇస్తారు.

డా.ఎన్‌టీఆర్‌యూహెచ్ఎస్ అనుబంధ కళాశాలల్లో

మేనేజ్‌మెంట్ కోటా



అర్హత: అభ్యర్థులు గుర్తింపు పొందిన బోర్డు నుంచి కనీసం 50 శాతం మార్కులతో ఫిజిక్స్, కెమిస్ట్రీ, బయాలజీ(బోటనీ, జువాలజీ)/బయోటెక్నాలజీ ఉత్తీర్ణులై ఉండాలి. ఓబీసీ, బీసీ, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 40 శాతం మార్కులు చాలు. నీట్ యూజీ 2024 అర్హత పొంది ఉండాలి. ఇందులో జనరల్/ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు 720-162; బీసీ, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 161-127; జనరల్/ఈడబ్ల్యూఎస్ దివ్యాంగులకు 161-144 స్కోర్‌ను కటాఫ్‌గా నిర్దేశించారు. విద్యార్థుల వయసు 2024 డిసెంబరు 31 నాటికి 17 ఏళ్లు నిండి ఉండాలి.

- ఎన్ఆర్ఐలు, ఎన్ఆర్ఐల రక్త సంబంధీకులు మాత్రమే ఎన్ఆర్ఐ కోటా సీట్లకు అప్లయ్ చేసుకోవాలి. నూతన మెడికల్ కళాశాలల్లోని సెల్ఫ్ ఫైనాన్సింగ్ సీట్లకు స్థానికులు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలి.

- **దరఖాస్తు ఫీజు:** రూ.10,620
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** ఆగస్టు 21
- **వెబ్‌సైట్:** https://drntr.uhsap.in



నేషనల్ లా స్కూల్లో

లీగల్ ప్రోగ్రామ్‌లు

బెంగళూరులోని నేషనల్ లా స్కూల్ ఆఫ్ ఇండియా యూనివర్సిటీ(ఎన్ఎల్ఎస్ఐయూ)- మాస్టర్ ఆఫ్ బిజినెస్ లాస్(ఎంబీఎల్), పీజీ డిప్లొమా ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. వీటిని ప్రొఫెషనల్ అండ్ కంటిన్యూయింగ్ ఎడ్యుకేషన్(పీఏసీఈ) కింద బ్లెండెడ్ లెర్నింగ్ ఫార్మాట్‌లో నిర్వహిస్తారు. ఆన్‌లైన్ సెషన్స్, హైబ్రిడ్ ప్రోగ్రామ్స్ ఉంటాయి.

మాస్టర్ ఆఫ్ బిజినెస్ లాస్(ఎంబీఎల్): ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. ఇందులో పది కోర్సులు ఉంటాయి. మొదటి ఏడాది కాంట్రాక్ట్ లా, బ్యాంకింగ్ లా, కార్పొరేట్ లా, ఇండస్ట్రియల్ రిలేషన్స్ లా, ఎన్విరాన్‌మెంటల్ లా కోర్సులు; రెండో ఏడాది ఇన్వెస్ట్‌మెంట్ లాస్, ఇన్సూరెన్స్ లాస్, ఇంటర్నేషనల్ కమర్షియల్ ట్రాన్సాక్షన్స్ అండ్ ఫారిన్ ట్రేడ్, ఇంటెలెక్చువల్ ప్రాపర్టీ లాస్, టాక్సెస్ ఆన్ కార్పొరేషన్స్ కోర్సులు ఉంటాయి. ఈ ప్రోగ్రామ్ పూర్తిచేసిన అభ్యర్థులు లా ఆఫీసర్, లీగల్ అసిస్టెంట్, లీగల్ అడ్వైజర్‌గా రాణించవచ్చు.

పీజీ డిప్లొమా: ప్రోగ్రామ్ వ్యవధి ఏడాది. ఇందులో ఆర్బిట్రేషన్ లా, చైల్డ్ రైట్స్ లా, కన్జ్యూమర్ లా అండ్ ప్రాక్టీస్, సైబర్ లా అండ్ సైబర్ ఫోరెన్సిక్స్, ఎన్విరాన్‌మెంటల్ లా, హ్యూమన్ రైట్స్ లా, ఇంటెలెక్చువల్ ప్రాపర్టీ రైట్స్ లా, మెడికల్ లా అండ్ ఎథిక్స్, టాక్సేషన్ లా స్పెషలైజేషన్‌లు అందుబాటులో ఉన్నాయి. స్పెషలైజేషన్‌ను అనుసరించి ఈ ప్రోగ్రామ్ జర్నలిస్టులు, అడ్వకేట్‌లు, రైట్స్ యాక్టివిస్టులు, డాక్టర్‌లు, నర్సులు, హాస్పిటల్ అడ్మినిస్ట్రేటర్‌లు, హెల్త్ వర్కర్‌లు, ఎన్విరాన్‌మెంటల్ ప్రొఫెషనల్స్, ఎన్‌జీఓలు, లీగల్-ఎడ్యుకేషనల్-రీసెర్చ్ విభాగాలకు చెందిన ప్రొఫెషనల్స్‌కు ఉపయుక్తంగా ఉంటుంది. పూర్తి సమాచారం కోసం వెబ్‌సైట్ చూడవచ్చు.

అర్హత: గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి ఏదేని డిగ్రీ ఉత్తీర్ణులు దరఖాస్తు చేసుకోవచ్చు. సీఏ, సీఎస్, ఐసీడబ్ల్యూఏఐ కోర్సులు పూర్తిచేసినవారు; ఓపెన్ యూనివర్సిటీలలో చదివినవారు; డిస్టెన్స్ ఎడ్యుకేషన్ ద్వారా డిగ్రీలు పొందిన వారు కూడా అప్లయ్ చేసుకోవచ్చు. వయోపరిమితి నిబంధనలు లేవు.

- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** సెప్టెంబరు 10
- **వెబ్‌సైట్:** https://pace.nls.ac.in/



ఢిల్లీలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫారిన్ ట్రేడ్(ఐఐఎఫ్‌టీ)- 'సర్టిఫికెట్ ప్రోగ్రామ్ ఇన్ ఎక్స్‌పోర్ట్ ఇంపోర్ట్ మేనేజ్‌మెంట్'లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. దీని వ్యవధి నాలుగు నెలలు. ఇది ఆన్‌లైన్ వీకెండ్ ప్రోగ్రామ్. ఇందులో ఆరు మాడ్యూల్స్ ఉంటాయి. ప్రోగ్రామ్‌లో భాగంగా ఎక్స్‌పోర్ట్/ఇంపోర్ట్ డాక్యుమెంటేషన్, లాజిస్టిక్స్, ఫైనాన్స్, ఇంటర్నేషనల్ మార్కెటింగ్, లీగల్ యాస్పెక్ట్స్ ఆఫ్ ట్రేడ్ తదితర అంశాలు వివరిస్తారు. ఆన్‌లైన్ అసెస్‌మెంట్స్, అసైన్‌మెంట్స్, ప్రజంటేషన్స్, ప్రాజెక్ట్ వర్క్ ఉంటాయి. లెర్నింగ్ వెబ్ పోర్టల్‌కు లైఫ్ టైం యాక్సెస్, కోర్సు మెటీరియల్ ఇస్తారు. కోర్సు చివరలో ఫైనల్ ఎగ్జామ్‌ను ఆన్‌లైన్‌లో నిర్వహిస్తారు. ప్రతి సబ్జెక్టులో కనీసం 50 శాతం మార్కులు వస్తేనే సర్టిఫికెట్ ఇస్తారు. ఎంట్రీ/మిడిల్/సీనియర్ లెవెల్ ఎగ్జిక్యూటివ్‌లు, ఆంత్రప్రెన్యూర్స్, వర్కింగ్ ప్రొఫెషనల్స్‌కు ఈ ప్రోగ్రామ్ ఉపయోగకరంగా ఉంటుంది.

ఐఐఎఫ్‌టీలో సర్టిఫికెట్ కోర్సు

కోర్సు వివరాలు: వారాంతాల్లో ఉదయం తొమ్మిది గంటల నుంచి మధ్యాహ్నం పన్నెండు గంటల పదిహేను నిమిషాల వరకు మరల సాయంత్రం రెండు గంటల నుంచి అయిదు గంటల పదిహేను నిమిషాల వరకు ఆన్‌లైన్ సెషన్స్ నిర్వహిస్తారు. కనీసం 75 శాతం అటెండెన్స్ తప్పనిసరి.

మాడ్యూల్స్: గ్లోబల్ బిజినెస్ ఎన్విరాన్‌మెంట్ 30 గంటలు, ఇంటర్నేషనల్ ట్రేడ్ ఆపరేషన్స్ అండ్ డాక్యుమెంటేషన్ 30 గంటలు, ఇంటర్నేషనల్ మార్కెటింగ్ మేనేజ్‌మెంట్ 20 గంటలు, ఇండియాస్ ఫారిన్ ట్రేడ్ పాలసీ 20 గంటలు, ఇంటర్నేషనల్ ట్రేడ్ లాజిస్టిక్స్ 30 గంటలు, ఎగ్జిమ్ ఫైనాన్స్ 20 గంటలు సెషన్స్ నిర్వహిస్తారు.

అర్హత: గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి ఏదేని డిగ్రీ/తత్సమాన కోర్సు పూర్తిచేసినవారు దరఖాస్తు చేసుకోవచ్చు.

ముఖ్య సమాచారం

- **ప్రోగ్రామ్ ఫీజు:** రూ.75,000+18 శాతం జీఎస్‌టీ(దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 50 శాతం వరకు ఫీజు రాయితీ లభిస్తుంది)
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** ఆగస్టు 31
- **ప్రోగ్రామ్ ప్రారంభం:** సెప్టెంబరులో
- **వెబ్‌సైట్:** iift.ac.in



జాబ్ కార్నర్

ఝజ్జర్ ఎయిమ్స్‌లో

డేటా ఎంట్రీ ఆపరేటర్లు

మొత్తం ఖాళీలు **34**

ఝజ్జర్(హరియాణా)లోని ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్(ఎయిమ్స్)... ఒప్పంద ప్రాతిపదికన కింద పేర్కొన్న పోస్టుల భర్తీకి బ్రాడ్‌కాస్ట్ ఇంజనీరింగ్ కన్సల్టెంట్స్ ఇండియా లిమిటెడ్ దరఖాస్తులు కోరుతోంది.

1. డేటా ఎంట్రీ ఆపరేటర్: **7 పోస్టులు**
2. ల్యాబ్ టెక్నీషియన్: **7 పోస్టులు**
3. మల్టీ టాస్కింగ్ స్టాఫ్: **6 పోస్టులు**
4. టెక్నాలజిస్ట్(ఓటీ): **5 పోస్టులు**
5. పేషెంట్ కేర్ మేనేజ్‌మెంట్: **2 పోస్టులు**
6. రేడియోగ్రాఫర్: **7 పోస్టులు**

BECIL
बेसिल

అర్హత: ఇంటర్మీడియట్, పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో బీఎస్సీ(మెడికల్ ల్యాబొరేటరీ టెక్నాలజీ/మెడికల్ ల్యాబొరేటరీ సైన్స్/అనస్తీషియా/ఆపరేషన్ థియేటర్ టెక్నాలజిస్ట్/రేడియోగ్రఫీ) ఉత్తీర్ణతతోపాటు పని అనుభవం ఉండాలి.

వయోపరిమితి: 18-40 ఏళ్లు మించకూడదు

దరఖాస్తు విధానం: ఆఫ్‌లైన్ దరఖాస్తులను ప్రాజెక్ట్ మేనేజర్(హెచ్ఆర్), బ్రాడ్‌కాస్ట్ ఇంజనీరింగ్ కన్సల్టెంట్స్ ఇండియా లిమిటెడ్(బీఈసీఐఎల్), బీఈసీఐఎల్ భవన్, సీ-56/ఏ-17, సెక్టార్-62, నోయిడా చిరునామాకు పంపాలి.

ఆఫ్‌లైన్ దరఖాస్తులకు చివరి తేదీ: ఆగస్టు 27

వెబ్‌సైట్: https://www.becil.com/vacancies

పీజీడీఏవీ కాలేజీలో

అసిస్టెంట్ ప్రొఫెసర్లు

మొత్తం ఖాళీలు **8**

ఢిల్లీలోని పన్నాలాల్ గిరిధర్‌లాల్ దయానంద్ ఆంగ్లో-వేద కళాశాల(పీజీడీఏవీ)... కింద పేర్కొన్న పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

విభాగాలు: ఆర్ట్స్, కామర్స్, లా, సోషల్ సైన్సెస్, లైబ్రరీ సైన్స్, జర్నలిజం అండ్ మాస్ కమ్యూనికేషన్ అండ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ తదితరాలు

అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో కనీసం 55 శాతం మార్కులతో డిగ్రీ, పీజీ, నెట్ లేదా పీహెచ్‌డీ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: ఆగస్టు 24

వెబ్‌సైట్: https://www.pgdavcollege.in/



వెస్ట్రన్ రైల్వేలో

స్పోర్ట్స్ కోటా పోస్టులు

మొత్తం ఖాళీలు **64**

ముంబయిలోని భారత ప్రభుత్వ రైల్వే మంత్రిత్వ శాఖకు చెందిన రైల్వే రిక్రూట్‌మెంట్ సెల్ - వెస్ట్రన్ రైల్వే... స్పోర్ట్స్ కోటాలో గ్రూప్ 'సి'/గ్రూప్ 'డి' పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

1. లెవెల్-4/5: **5 పోస్టులు**
2. లెవెల్-2/3: **16 పోస్టులు**
3. లెవెల్-1: **43 పోస్టులు**

అర్హత: లెవెల్-4/5 పోస్టులకు ఏదైనా డిగ్రీ; లెవల్-2/3 పోస్టులకు ఐటీఐ, పన్నెండో తరగతి; లెవల్-1 పోస్టులకు పదో తరగతి, ఐటీఐ/డిప్లొమా ఉత్తీర్ణతతో పాటు క్రీడాంశాల్లో వివిధ స్థాయుల్లో విజయాలు సాధించి ఉండాలి.

క్రీడాంశాలు: బాస్కెట్‌బాల్, క్రికెట్, రెజ్లింగ్, కబడ్డీ, టేబుల్ టెన్నిస్, వెయిట్ లిఫ్టింగ్, అథ్లెటిక్స్, బాడీ బిల్డింగ్, సైక్లింగ్, హాకీ, ఖో-ఖో, పవర్ లిఫ్టింగ్, స్విమ్మింగ్

వయోపరిమితి: 2025 జనవరి 1 నాటికి 18 నుంచి 25 సంవత్సరాల మధ్య ఉండాలి.

ఎంపిక విధానం: విద్యార్హత, క్రీడా విజయాలు, గేమ్ స్కిల్, ఫిజికల్ ఫిట్‌నెస్, ట్రయల్స్ సమయంలో కోచ్ పరిశీలించే అంశాలు, డాక్యుమెంట్ వెరిఫికేషన్ తదితరాల ఆధారంగా.

దరఖాస్తు రుసుము: రూ.500. ఎస్సీ/ఎస్టీ/ఈఎస్ఎం/దివ్యాంగులు/మహిళలు/మైనార్టీలు/ఈబీసీ అభ్యర్థులకు రూ.250.

ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరి తేదీ: సెప్టెంబరు 14

వెబ్‌సైట్: https://www.rrcwr.com/

లిటిల్స్



తెలివైన నక్క

ఒక అడవిలోని చెరువులో ఉండే మొసలికి చాలా రోజులుగా అదే చెరువులోని చేపలను తినీతినీ విసుగు పుట్టింది. వేరే ఏదైనా జంతువు ఆహారంగా దొరికితే బాగుండు అనుకున్నది. వెంటనే తన మిత్రుడైన పీతను పిలిచి, 'నువ్వు అడవిలోకి వెళ్లి.. అన్ని జంతువులకు మొసలి చనిపోయింది అని చెప్పు. అపుడు అవి భయం లేకుండా ఇక్కడికి నీళ్ల తాగడానికి వస్తాయి. సమయం చూసి, నేను ఏదో ఒక జంతువును పట్టుకుని తింటాను' అని చెప్పింది. పీత వెళ్లి మొసలి చెప్పినట్టే అడవిలో చెప్పింది. దాని మాటలు ఒక నక్క తప్ప మిగతా అన్ని జంతువులు నమ్మాయి.




నక్క మాత్రం 'మిత్రులారా.. దీని మాటలు నమ్మవద్దు. మనమే స్వయంగా చెరువు దగ్గరికి వెళ్లి చూద్దాం పదండి'అని జంతువులను బయల్దేరదీసింది. చెరువు దగ్గరికి చేరగానే, నక్క మిగతా జంతువులతో ఇలా అన్నది. మిత్రులారా.. నేను విన్న దాని ప్రకారం మొసలి చనిపోయినా దాని తోక మాత్రం కదులుతూనే ఉంటుందట. కాబట్టి ఈ మొసలి తోక కదిలితే మనం నమ్మవచ్చుఅన్నది. ఆ మాటలు విన్న తెలివి తక్కువ మొసలి తాను చనిపోయానని నమ్మించడానికి మెల్లగా తన తోకను కదిలించడం మొదలు పెట్టింది. అదిచూసిన నక్క మిత్రులారా.. నేను ఊహించింది నిజమే. ఈ మొసలి చావలేదు నాటకమాడుతుంది. మనం చెరువు దాకా వస్తే మనలో ఎవరినైనా చంపవచ్చని దీని పన్నాగం.అందుకే నా మాట వినగానే తోక కదిలిస్తోంది పదండి ఇక్కడినుండి పోదాం' అంటూ అన్ని జంతువులప్రాణాలు ఆ రోజు తన ఉపాయంతో కాపాడింది తెలివైన నక్క. మిగతా జంతువులన్నీ దానికి ఆ రోజు కృతజ్ఞతలు చెప్పాయి.

దారి కనుక్కోండి



10 తేడాలు గుర్తించండి



సరైన నీడ కనుక్కోండి



ఏవి ఎన్ని



డైలీ సుడోకు - 387

	2				4
			3		
5	4				1
2				4	3
		5			
1				3	

సుడోకు - 386 సమాధానం

3	6	5	2	4	1
2	4	1	3	6	5
1	2	4	6	5	3
5	3	6	4	1	2
6	5	2	1	3	4
4	1	3	5	2	6

ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. ఒక్కో బాక్స్‌ను 1 నుంచి 9 వరకు అంకెలతో పూరించాలి. అన్ని బాక్స్‌లనూ కలిపి చూస్తే నిలువుగా, అడ్డంగానూ ఏ లైనులోనూ ఒకసారి వాడిన అంకెను తిరిగి వాడకూడదు.